
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 190


సోమవారం 30-9-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

శ్రీవారి సేవలో సీజేఐ చంద్రచూడ్



తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ 5లో



హెజ్‌బొల్లా అగ్రనేత హతం

లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హెజ్‌బొల్లా అగ్రనేత నబీల్ కౌక్ హతమయ్యాడని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది.

వివరాలు 6లో ▸



పదేళ్ల 'మన్‌కీబాత్'

మసాలా వార్తలు, ప్రతికూల అంశాలపైనే ప్రజలు ఆసక్తి చూపిస్తారన్నది నిజం కాదని మన్‌కీ బాత్ నిరూపించిందని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



స్పేస్‌ఎక్స్‌లో స్వల్ప సమస్య

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగాములను తిరిగి తెచ్చేందుకు చేపట్టిన స్పేస్‌ఎక్స్ మిషన్‌లో సమస్య తలెత్తింది.

వివరాలు 6లో ▸



మోదీని దించేదాకా పోను

ప్రధాని మోదీని అధికారం నుంచి దించేదాకా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతానని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు.

వివరాలు 6లో ▸

అడ్డగోలు దోపిడీకి అధికారిక సిండికేట్

- అస్మదీయ కన్సల్టెన్సీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై గుత్తాధిపత్యం
- కన్సల్టెన్సీల ఎంపిక మార్గదర్శకాల ముసుగులో కుట్ర
- ఎన్ఐసీఎస్‌లో ఎంపానెల్ అయిన సంస్థలకే అప్పజెప్పాలన్న నిబంధన.. అందులో ఉన్నవి 4 ఐటీ ఆధారిత సేవల సంస్థలే
- కొత్త మద్యం విధానం సహా అన్నింటికీ అవే.. వీటి ద్వారా దోపిడీకి ప్రభుత్వ పెద్దల కుట్ర

3లో

బాబు చారిత్రక తప్పిదం వల్లే..

జీవనాడి.. జీవచ్ఛవం!



పోలవరంలో చంద్రబాబు నిర్వాకాలను మరోసారి నిర్ధారించిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ

అవే అంశాలను పునరుద్ఘాటిస్తూ ఈనెల 20న పీపీఏ, సీడబ్ల్యూసీలకు కమిటీ నివేదిక

- ఆగస్టు 12న ఇచ్చిన నివేదికపై సందేహాలను నివృత్తి చేస్తూ తాజాగా మరోసారి నివేదిక
- బాబు సర్కార్ చారిత్రక తప్పిదాలను బహిర్గతం చేసిన నిపుణుల కమిటీ
- వరదను మళ్లించేలా స్పిల్‌వే పూర్తి చేయకుండానే 2016లోనే కాఫర్ డ్యాం, ప్రధాన డ్యాం పునాదుల పనులు ప్రారంభం
- 2018లో ఎగువ కాఫర్ డ్యాం పునాది జెట్ గ్రౌటింగ్ వాల్, ప్రధాన డ్యాం గ్యాప్-2 పునాది డయాఫ్రం వాల్ మీదుగా వరద ప్రవాహం
- ఆ ప్రభావం పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టని టీడీపీ సర్కారు
- గోదావరి వరద ఉద్ధృతికి కోతకు గురై 27 చోట్ల జెట్ గ్రౌటింగ్ వాల్‌లో చీలికలు.. డయాఫ్రం వాల్ 485 మీటర్లు ధ్వంసం
- ప్రధాన డ్యాం గ్యాప్-2, గ్యాప్-1 నిర్మాణ ప్రాంతంలో కోతకు గురై గరిష్ఠంగా 30 మీటర్ల లోతుతో భారీ అగాధాలు
- ఫర్మియబులిటీని తప్పుగా లెక్కగట్టి.. 40 మీటర్ల లోతు నుంచి నిర్మించాల్సిన జెట్ గ్రౌటింగ్ వాల్‌ను కేవలం 20 మీటర్ల లోతు నుంచే నిర్మించడం వల్లే ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీ

2లో



2018లో జెట్ గ్రౌటింగ్ వాల్‌లో 27 చోట్ల చీలికలు ఏర్పడ్డాయని తేల్చిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ

పాత పద్ధతిలోనే కొత్త డయాఫ్రం వాల్

2లో

దీని అర్థం ఏంటి బాబూ?

దీని కన్నా వేరే సాక్ష్యం కావాలా?

శ్రీవారి లడ్డూ ప్రసాదం, తన పర్యటనపై చంద్రబాబు అబద్ధాలను ఎండగట్టిన మాజీ సీఎం వైఎస్ జగన్

సత్యమేవ జయతే అంటూ ట్వీట్

సాక్షి, అమరావతి: రాజకీయ దుర్బుద్ధితో పరమ పవిత్రమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంపై పచ్చి అబద్ధాలు వల్లె వేసి అపవిత్రం చేస్తూ.. తన తిరుమల పర్యటనపై అవాస్తవాలు చెబుతూ దబాయిస్తున్న సీఎం చంద్రబాబు తీరును ఆదివారం 'ఎక్స్' వేదికగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండగట్టారు. 'నీకు నోటీసు ఇచ్చారా? తిరుమలకు పోవద్దన్నారా? వేంకటేశ్వరస్వామి గుడికి పోనివ్వబోమని ఎవరైనా చెప్పారా...' అంటూ శుక్రవారం సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలను వల్లె వేశారు. మాజీ సీఎం జగన్ తిరుపతి, తిరుమల పర్యటనకు అనుమతి లేదని.. ఆ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలకు శుక్రవారం నోటీసులు ఇచ్చారు. శుక్రవారం సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోనూ.. వైఎస్సార్‌సీపీ నేతలకు పోలీసులు జారీ చేసిన నోటీసులను



జత చేస్తూ 'దీని అర్థం ఏంటి బాబూ?.. దీని కన్నా వేరే సాక్ష్యం కావాలా? సత్యమేవ జయతే' అంటూ మాజీ సీఎం వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

స్వార్థ రాజకీయాల కోసం తిరుమల పవిత్రతను దెబ్బతీస్తావా?

పరమ పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో స్వచ్ఛమైన ఆవు నెయ్యికి

మిగతా 2వ పేజీలో ▶

దీని అర్థం ఏంటి బాబూ?

▶ మొదటి పేజీ తరువాయి

బదులుగా జంతువుల కొవ్వు వాడారంటూ చంద్రబాబు చెబుతోన్న మాటల్లో వీసమెత్తు నిజం లేదంటూ సాక్ష్యాధారాలతో సహా మాజీ సీఎం వైఎస్ జగన్ వివరించారు. జూలై 23న టీటీడీ ఈవో.. సెప్టెంబరు 18న సీఎం చంద్రబాబు.. సెప్టెంబరు 20న టీటీడీ ఈవో.. సెప్టెంబరు 22న సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోలను.. సెప్టెంబరు 27న తాను మీడియాతో మాట్లాడిన మాటల వీడియోలను జత చేసి.. దీని అర్థం ఏంటి బాబూ? దీని కన్నా వేరే సాక్ష్యం కావాలా? సత్యమేవ జయతే అంటూ 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు.


సత్యమేవ జయతే




వైఎస్ జగన్ 'ఎక్స్'లో పెట్టిన పోస్టు

నోటీసు ఇచ్చారా అన్నావుగా బాబూ.. మరి ఇదేమిటి?

27-9-2024



నీకు నోటీసు ఇచ్చారా...
నిన్ను వేంకటేశ్వరస్వామి టెంపుల్‌కు పోవద్దన్నారా...
ఎవరైనా వచ్చి నీకు చెప్పారా?
వాట్ ఆర్ యూ టాకింగ్!
-సీఎం చంద్రబాబు



తిరుమలకు వెళ్లడానికి అనుమతి లేదంటూ నోటీసులు ఇవ్వలేదని చంద్రబాబు చెబుతున్న అబద్ధాలను ఎండగడుతూ 'ఎక్స్'లో వైఎస్ జగన్ పెట్టిన నోటీసు

27-09-2024వ తేదీన మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు తిరుమల తిరుపతి సందర్శన ఉన్నందున సదరు కార్యక్రమానికి అనుమతి లేనందున మీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, మీ సొంత వాహనాలలో బయలుదేరి తిరుపతికి చేరుకుని వారు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని సమాచారం. కావున అనుమతి లేని పైన తెలిపిన కార్యక్రమం యందు పాల్గొనడం చట్టరీత్యా వ్యతిరేకమని తెలియచేస్తూ ఇవ్వబడుతున్న నోటీసు.

- వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేసిన వైఎస్సార్ జిల్లా ఖాజీపేట మండలం దుంపలగట్టు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి పోలీసులు ఇచ్చిన నోటీసు

చంద్రబాబు అబద్ధాలు చెప్పాడనడానికి ఈవో చెప్పిన మాటలే సాక్ష్యం

1 — 23-7-2024 — వనస్పతి కలిసింది.. ట్యాంకర్లు రిజెక్ట్ చేశాం



శాంపిళ్లలో కల్తీ జరిగిందని తేలింది. అందులో వెజిటబుల్ ఫ్యాట్ అంటే వనస్పతి కలిసిందని తేలింది. ఆ సప్లయిర్‌ను బ్లాక్ లిస్ట్ చేసేందుకు షోకాజ్ నోటీసు ఇచ్చాం. రెండు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం
- టీటీడీ ఈవో శ్యామలరావు

2 — 18-9-2024 — నెయ్యికి బదులు జంతువుల కొవ్వు..



శ్రీ వేంకటేశ్వరస్వామి దగ్గర పెట్టే ప్రసాదాన్ని అపవిత్రం చేసే విధంగా నాసిరకమైన ముడిసరుకులు వాడారు. లడ్డూ తయారీలో నెయ్యికి బదులు జంతువుల కొవ్వు వాడారు.
- సీఎం చంద్రబాబు

3 — 20-9-2024 — నాలుగు ట్యాంకర్లు వెనక్కి పంపాం..



కల్తీ నెయ్యి అని రిపోర్టులో తేలడంతో నాలుగు ట్యాంకర్ల నెయ్యిని రిజెక్ట్ చేశాం. నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపాం. ఆ సంస్థ నుంచి సరఫరాను నిలిపేశాం.
- టీటీడీ ఈవో శ్యామలరావు

4 — 22-9-2024 — మళ్లీ అవే కల్తీ మాటలు



నాలుగు ట్యాంకర్లు అప్పటికే వచ్చేశాయి. వాటిలోని కల్తీ నెయ్యిని వాడారు.
- సీఎం చంద్రబాబు

5 — 27-9-2024 — ఆ నెయ్యి ఎక్కడ వాడారో...

నెయ్యి వాడాము కానీ.. ఎక్కడ వాడామో అప్రస్తుతం - చంద్రబాబు



తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీసిన చంద్రబాబు

పచ్చి అబద్ధాలు వల్లె వేసి తిరుమల, తిరుపతి దేవస్థానం ప్రతిష్టను సీఎం చంద్రబాబు అభాసుపాలు చేశారు. పరమ పవిత్రమైన లడ్డూ విశిష్టతను దెబ్బతీశారు. శ్రీవారి ప్రసాదం బాగాలేదని, తింటే మంచిది కాదని భక్తుల్లో అనుమానపు బీజాలు నాటారు. తాను చెబుతున్నది పచ్చి అబద్ధమని తెలిసి కూడా చంద్రబాబు పదే పదే అవాస్తవాలు చెబుతున్నారు. - సెప్టెంబరు 27న మాజీ సీఎం వైఎస్ జగన్




లడ్డూ వివాదంపై టీటీడీ ఈవో, సీఎం చంద్రబాబు చేసిన పరస్పర విరుద్ధ వ్యాఖ్యలను వివరిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఎక్స్'లో పెట్టిన పోస్టు

బాబు చారిత్రక తప్పిదం వల్లే జీవనాడి.. జీవచ్ఛవం!

పోలవరంలో చంద్రబాబు నిర్వాకాలను మరోసారి నిర్ధారించిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ

అవే అంశాలను పునరుద్ఘాటిస్తూ ఈ నెల 20న పీపీఏ, సీడబ్ల్యూసీలకు కమిటీ నివేదిక


సాక్షి, అమరావతి: అవగాహనా రాహిత్యం.. ప్రణాళికా లోపం.. అస్తవ్యస్థ పనులు.. చారిత్రక తప్పిదాలు..! గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా తొలుత స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యాం పునాది డయాఫ్రం వాల్ పనులను చేపట్టడం! ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులు ప్రారంభించి చివరకు వాటిని కూడా పూర్తి చేయలేక చేతులెత్తేయడం! కాఫర్ డ్యాంలకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేయడంతో వాటి గుండా గోదావరి కుచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో ఉధ్ధృతి పెరిగి డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతింది. వెరసి జీవనాడి లాంటి ప్రాజెక్టును జీవచ్ఛవంగా మార్చేశారు!! పోలవరంలో సీఎం చంద్రబాబు నిర్వాకాలపై మరోసారి తేల్చిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక సారాంశం ఇదీ! ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ ధ్వంసం కావడానికి.. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో విధ్వంసం చోటు చేసుకోవడానికి.. ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీ (ఊట నీటి లీకేజ్)కి ముమ్మాటికీ చంద్రబాబు చారిత్రక తప్పిదాలే కారణమని అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక 'సాక్షి'గా మరోసారి నిర్ధారణ అయింది. ఈమేరకు ఈ ఏడాది ఆగస్టు 12న తాము ఇచ్చిన నివేదికపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), రాష్ట్ర జలవనరుల శాఖ వ్యక్తం చేసిన పలు సందేహాలను నివృత్తి చేస్తూ ఈ నెల 20వ తేదీన పీపీఏ, సీడబ్ల్యూసీలకు ఇచ్చిన నివేదికలోనూ గతంలో పేర్కొన్న అంశాలనే అంతర్జాతీయ నిపుణుల కమిటీ పునరుద్ఘాటించింది. పోలవరం నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడంపై సలహాలు, సూచనలు అందించేందుకు డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి. సిస్కో (యూఎస్ఏ), రిచర్డ్ డొన్నెల్లీ, సీస్ హించ్‌బెర్గర్ (కెనడా)లతో కూడిన అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని పీపీఏ, సీడబ్ల్యూసీ ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 29–జూలై 4 మధ్య పోలవరం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి జలవనరులు, సీడబ్ల్యూసీ అధికారులతో చర్చించిన ఈ బృందం జూలై 7న ప్రాథమిక నివేదిక ఇచ్చింది. అనంతరం పూర్తి స్థాయి నివేదికను 12న పీపీఏ, సీడబ్ల్యూసీలకు ఇచ్చింది. అయితే ఆ నివేదికలోని పలు అంశాలపై సందేహాలను వ్యక్తం చేస్తూ ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పటిష్టత, సీపేజీ, డయాఫ్రం వాల్ నిర్మాణం తదితరాలపై మరింత స్పష్టత ఇవ్వాలని అంతర్జాతీయ నిపుణుల కమిటీని సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ కోరాయి. ఈ క్రమంలో వాటిని నివృత్తి చేస్తూ అంతర్జాతీయ నిపుణుల కమిటీ తాజాగా ఇచ్చిన నివేదికలో ప్రధానాంశాలు ఇవీ..



4.8 DIAPHRAGM WALL SCOUR

As noted above, floods were allowed to pass through the site with full water way of the river during 2018 and then in 2019 and 2020 after partially completing the U/S Cofferdam with gaps in front of the Main Channel and Secondary Channel, and a gap in front of Main Channel in the D/S Cofferdam with flood protection works. The passage of these floods caused scouring of both the U/S and D/S Cofferdams and deep scour holes in the Main Dam foundation in Gaps I and II. This scouring damaged the Gap II D-Wall at several locations as was established using electric resistivity tomography, seismic refraction tomography, and cross hole seismic tomography. The locations of the damaged areas of the D-Wall are shown in Figure 4-11.

2018లో గోదావరి వరదల ఉధ్ధృతికి ప్రధాన డ్యాం గ్యాప్‌–2లో డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతిందని తేల్చిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ



- The JG-Wall is visible in the Main Channel (see points 1, Insert). However, there are gaps in the wall (see points 2, Insert) indicating it may have been damaged during the 2018 monsoon season.
- River flows through the Main Channel were significant. Even in March 2019, there was evidence of ongoing scour and erosion (see points 3 indicating sediment transport).
- Rock and sand fill spurs were being used to manage flows, i.e., See the spur up stream

ఆగస్టు 12న ఇచ్చిన నివేదికలో 2018 వరదల సమయంలోనే జెట్ గ్రౌటింగ్ వాల్, డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతిన్నాయని, ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతం కోతకు గురైందని స్పష్టం చేసిన అంతర్జాతీయ నిపుణుల కమిటీ




Figure 4-5: Site during March 2019

Floods were allowed to pass through the site for a 3rd time during the 2020 monsoon season. However, before the 2019 Monsoon, significant scour protection had been implemented in the U/S Cofferdam gaps (see Figure 4-6). Notably, on the right side, the end of the cofferdam had been covered with rockfill and rip rap. On the left side, the base of the cofferdam, i.e., the working platform and JG Wall were covered with rockfill and rip rap (see Figure 17, WAPCOS, March 2024). The PoE believes the following sequence occurred (see Figure 4-6):

2019లో వరదలు రాక ముందే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపు ఖాళీ ప్రదేశాలను వదిలిన నేపథ్యంలో కోతకు గురి కాకుండా సమర్థవంతంగా రక్షణాత్మక చర్యలు చేపట్టారని తేల్చిచెప్పిన కమిటీ

2018 నాటికే జెట్ గ్రౌటింగ్ వాల్‌కు 27 చోట్ల భారీ చీలికలు

- గోదావరిపై గ్యాప్‌–2లో ప్రధాన డ్యాం నిర్మాణానికి వీలుగా 2,450 మీటర్ల పొడవున ఎగువ కాఫర్ డ్యాం నిర్మించాలి. వరద ఉధ్ధృతి (పర్మియబులిటీ)ని పక్కాగా లెక్క వేస్తే.. ఎగువ కాఫర్ డ్యాం పునాది జెట్ గ్రౌటింగ్ వాల్‌ను ఏ స్థాయి నుంచి తవ్వాలన్నది నిర్ణయించవచ్చు. కానీ ఎగువ కాఫర్ డ్యాం వద్ద పర్మియబులిటీని సెకనుకు కనిష్ఠంగా $5x10^{-2}$ మీటర్లు ఉండగా.. $5x10^{-4}$ నుంచి $5x10^{-5}$గా లెక్కగట్టారు.
- పర్మియబులిటీని తప్పుగా లెక్కించడం వల్ల జెట్ గ్రౌటింగ్ వాల్‌ను 20 మీటర్ల లోతు నుంచే నిర్మించారు. వాస్తవంగా ఆ వాల్‌ను 40 మీటర్ల లోతు నుంచి నిర్మించాలి. దీన్ని బట్టి చూస్తే ఇందులో కమీషన్ల దాహం స్పష్టమవుతోంది.
- 2018లో గోదావరి ప్రవాహం జెట్ గ్రౌటింగ్ వాల్ మీదుగానే ప్రవహించింది. ఆ వరద ఉధ్ధృతికి జెట్ గ్రౌటింగ్ వాల్‌లో చెయినేజ్ 1,040 మీటర్ల నుంచి 1,330 మీటర్ల మధ్య 27 చోట్ల భారీగా చీలికలు ఏర్పడ్డాయి. వాటిలో బ్లాక్ కాటన్ సాయిల్ (నల్ల బంక మట్టి) వేసి మరమ్మతు చేసి 2018 డిసెంబర్‌లో ఎగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించారు.
- పర్మియబులిటీని తప్పుగా లెక్కించి తక్కువ లోతు నుంచి జెట్ గ్రౌటింగ్ వాల్‌ను నిర్మించడం వల్లే ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీ (ఊట నీరు) అధికంగా ఉందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ పునరుద్ఘాటించింది.

పాత పద్ధతిలోనే కొత్త డయాఫ్రం వాల్

- పాత దానికి ఎగువన కొత్తది నిర్మించాలి..
- నవంబర్ నుంచి 2025 జూలైలోగా పూర్తి చేయాలి
- ఒకే సీజన్‌లో నిర్మించేందుకు అదనంగా గ్రాబర్లు, కట్టర్లు, నిపుణులు అవసరం
- అక్టోబర్‌లోగా 3 మీటర్ల ఎత్తుతో ప్లాట్‌ఫాం సిద్ధం చేయాలి
- పటిష్టంగా ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు
- పీపీఏ, సీడబ్ల్యూసీలకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం గ్యాప్‌–2లో దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు ఎగువన సమాంతరంగా కొత్తగా పాత పద్ధతిలోనే డయాఫ్రం వాల్ నిర్మించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)కి అంతర్జాతీయ నిపుణుల కమిటీ మరోసారి స్పష్టం చేసింది. పాత డయాఫ్రం వాల్‌ను 15 నెలల్లో నిర్మించారని గుర్తు చేస్తూ.. కొత్త డయాఫ్రం వాల్‌ను ఈ ఏడాది నవంబర్ నుంచి 2025 జూలైలోగా పూర్తి చేయాలని పేర్కొంది. ఒకే సీజన్‌లో ఆ పనులు చేసేందుకు అదనంగా గ్రాబర్లు, కట్టర్లు, అనుబంధ యంత్ర పరికరాలు, నిపుణులైన సిబ్బందిని సమకూర్చుకోవాలని సూచించింది. డయాఫ్రం వాల్ డిజైన్, నిర్మాణంపై చర్చించేందుకు తక్షణమే వర్క్ షాప్ నిర్వహించాలని పేర్కొంది. ఈ మేరకు సీడబ్ల్యూసీ, పీపీఏలకు ఈనెల 20న అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చింది. అందులో కమిటీ సిఫార్సులు ఇవీ..

- ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు పటిష్టంగా ఉన్నాయి. వాటి భద్రతకు ఎలాంటి ముప్పు లేదు. ఎగువ కాఫర్ డ్యాంలో సీపేజీకి అడ్డుకట్ట వేయడానికి టోయ్ (అడుగు భాగం)లో ఫిల్టర్లు వేయాలి.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యాం మధ్య సముద్ర మట్టానికి 3 మీటర్ల లోపు ఎత్తు ఉండేలా సీపేజీ నీటిని గ్రావిటీతో పంపడంతోపాటు పంపులతో ఎత్తిపోయాలి.
- ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో గోదావరి నదీ గర్భం సముద్ర మట్టానికి సగటున 13 మీటర్ల ఎత్తులో ఉంటుంది. దానిపై ఇసుకతో నింపి వైబ్రో కాంపాక్షన్ చేసి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి వీలుగా ప్లాంట్‌ఫామ్ సిద్ధం చేయాలి. పూర్తిగా పొడి వాతావరణంలోనే డయాఫ్రం వాల్‌ను నిర్మించాలి.
- కొత్త డయాఫ్రం వాల్‌ను పాత పద్ధతిలోనే నిర్మించాలి. గ్రాబర్లు, కట్టర్లతో రాతి పొర తగిలే వరకూ నదీ గర్భాన్ని తవ్వుతూ వాటిలో బెంటనైట్ మిశ్రమాన్ని పంపాలి. ఆ తర్వాత కాంక్రీట్ మిశ్రమాన్ని అధిక ఒత్తిడితో పంపితే బెంటనైట్ మిశ్రమం బయటకు వస్తుంది. కాంక్రీట్, ఒకింత బెంటనైట్ మిశ్రమం కలిసి ప్లాస్టిక్ కాంక్రీట్‌గా మారుతుంది. అదే డయాఫ్రం వాల్. గత 40 ఏళ్లుగా డయాఫ్రం వాల్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఈ వాల్ ఎక్కడా విఫలమైన దాఖలాలు లేవు.

ఆ చారిత్రక తప్పిదం వల్లే..

- పోలవరం వద్ద భూభౌగోళిక పరిస్థితుల రీత్యా నదికి అవల కుడివైపున స్పిల్‌వే నిర్మించి ప్రవాహాన్ని మళ్లించి.. నదికి అడ్డంగా నీటిని నిల్వ చేసే ప్రధాన డ్యాం(ఎర్త్ కమ్‌రాక్ ఫిల్ డ్యాం)ను నిర్మించేలా సీడబ్ల్యూసీ డిజైన్‌ను ఆమోదించింది.
- సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం తొలుత నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పూర్తి చేసి వాటి మధ్యన ప్రధాన డ్యాం పనులు చేపట్టి పూర్తి చేయాలి.
- కానీ.. 2016 డిసెంబర్‌లో చంద్రబాబు హయాంలో ఒకేసారి స్పిల్ వే, స్పిల్ ఛానల్, ప్రధాన డ్యాం డయాఫ్రం వాల్ పనులను ప్రారంభించారని నిపుణుల కమిటీ ఆక్షేపించింది. గోదావరికి అడ్డంగా 2016 డిసెంబర్ నుంచి 2017 జూలై వరకు చెయినేజ్ 1485.7 నుంచి 480 మీటర్ల వరకూ 1006 మీటర్లు.. 2017 డిసెంబర్ నుంచి 2018 జూన్ వరకూ చెయినేజ్ 480 నుంచి 89 మీటర్ల వరకూ 390.6 మీటర్ల పొడవున మొత్తం 1,396.6 మీటర్ల మేర ప్రధాన డ్యాం గ్యాప్‌–2లో డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారని పేర్కొంది.
- నదీ ప్రవాహాన్ని పూర్తి స్థాయిలో మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకపోవడంతో 2018లో గోదావరి ప్రవాహాన్ని డయాఫ్రం వాల్ మీదుగా వదిలేశారని నిపుణులు కమిటీ గుర్తు చేసింది. ఆ ప్రభావం డయాఫ్రం వాల్‌పై పడకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రస్తావించింది. దాంతో డయాఫ్రం వాల్ నాలుగు చోట్ల 485 మీటర్ల పొడవున కోతకు గురై దెబ్బతిందని పునరుద్ఘాటించింది.

ప్రణాళికాబద్ధంగా పనులు..

- నాడు చంద్రబాబు సర్కార్ హయాంలో గాడి తప్పిన పోలవరం పనులను 2019 మే 30న అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చక్కదిద్దింది. 2020లో ఎగువ, దిగువ కాఫర్ డ్యాం, డయాఫ్రం వాల్‌పై వరద ప్రభావం పడకుండా పూర్తి స్థాయిలో రక్షణాత్మక చర్యలు చేపట్టిందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ గుర్తు చేసింది.
- 2019 వర్షాలు ప్రారంభానికి ముందే ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలలో ఖాళీ ప్రదేశాలు వదలడం వల్ల కోతకు గురికాకుండా గత ప్రభుత్వం సమర్థంగా రక్షణాత్మక చర్యలు చేపట్టింది. దీన్ని బట్టి చూస్తే 2018 వరదలలోనే డయాఫ్రమ్ వాల్ జెట్ గ్రౌటింగ్ వాల్ దెబ్బతిన్నట్లు స్పష్టమవుతోంది.
- గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేసింది. స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనుల నాణ్యత ప్రమాణాల మేరకు ఉంది.
- ఎగువ కాఫర్ డ్యాంను 42.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసి 2021 జూన్‌లోనే గోదావరి ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించింది. గోదావరికి గరిష్ఠ స్థాయిలో వరద వచ్చినా తట్టుకునేలా ఎగువ కాఫర్ డ్యాం ఎత్తును 44 మీటర్లకు పెంచుతూ 2022లో పనులు చేపట్టి పూర్తి చేసింది.
- దిగువ కాఫర్ డ్యాంలో కోతకు గురైన ప్రాంతాన్ని జియో బ్యాగ్‌లలో ఇసుక నింపి పూడ్చింది. 2023 ఫిబ్రవరి నాటికి దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసింది.
- ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు రెండూ పటిష్టంగా ఉన్నాయి. వాటి భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదని అంతర్జాతీయ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది.

నిజాలను ప్రతిబింబించిన నివేదిక..

ప్రపంచంలో ఎక్కడైనా ఏదైనా ప్రాజెక్టు కట్టాలంటే తొలుత నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేస్తారు. ఆ తర్వాత కాఫర్ డ్యాంలు నిర్మించి నదీ ప్రవాహాన్ని స్పిల్ మీదుగా మళ్లిస్తారు. అప్పుడు ప్రధాన డ్యాం నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. తద్వారా వరదల్లోనూ పనులు కొనసాగించి ప్రధాన డ్యాం పనులను పూర్తి చేస్తారు. కానీ.. పోలవరంలో మాత్రం చంద్రబాబు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యాం పునాది డయాఫ్రం వాల్‌ను పూర్తి చేసి చారిత్రక తప్పిదం చేశారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులు ప్రారంభించి వాటిని పూర్తి చేయలేక చేతులెత్తేశారు. కాఫర్ డ్యాంలకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు. వాటి గుండా గోదావరి కుచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో ఉధ్ధృతి పెరిగి డయాఫ్రం వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటుచేసుకుంది. ఈ పాపం చంద్రబాబుదేనని నీటిపారుదల రంగ నిపుణులు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆదినుంచి స్పష్టం చేస్తుండగా.. అదే అంశాన్ని ఈ ఏడాది ఆగస్టు 12న ఇచ్చిన నివేదికలో అంతర్జాతీయ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. తాజాగా ఇచ్చిన నివేదికలోనూ అదే అంశాలను పునరుద్ఘాటించడం గమనార్హం.

సకాలంలో కాఫర్ డ్యాంలు పూర్తి చేయకపోవడంతో..

- ఎగువ కాఫర్ డ్యాం పనులను 2018 డిసెంబర్‌లో ప్రారంభించిన టీడీపీ సర్కారు 100 నుంచి 1,780 మీటర్ల మధ్య 35 మీటర్ల ఎత్తుతో 2019 మార్చి నాటికి చేసి ఇరు వైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసింది.
- దిగువ కాఫర్ డ్యాం పునాది జెట్ గ్రౌటింగ్ వాల్‌ను 10 మీటర్ల లోతు నుంచి వేసి.. 540 మీటర్ల పొడవున పనులు చేపట్టి 2019 మార్చి నాటికి సకాలంలో పనులు పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసింది.
- కాఫర్ డ్యాంలు, నిర్వాసితులకు పునరావాసం పనులు నత్తనడక సాగుతుండటం.. రుతు పవనాల కాలం సమీపిస్తుండటంతో కాఫర్ డ్యాంలలో వదిలిన ఖాళీ ప్రదేశాలను భర్తీ చేయకుండా వదిలేయాలని 2019 మే 27న పీపీఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.
- 2019లో గోదావరి వరద ఎగువ కాఫర్ డ్యాం ఖాళీ ప్రదేశాల గుండా ప్రవహించడంతో వరద ఉధ్ధృతి మరింత అధికమై ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురయ్యాయి. 30 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయని అంతర్జాతీయ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది.

క్లుప్తంగా...

ఖజానాలో డబ్బుల్లేవు.. ఇప్పుడేమీ చేయలేం

మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ



పాలకొల్లు సెంట్రల్: ఖజానాలో డబ్బుల్లేవని.. ఇప్పట్లో పనులేవీ చేయలేమని మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరి నారాయణ వ్యాఖ్యానించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా పెంకుళ్లపాడు టిడ్కో గృహాల సముదాయంలో మీడియాతో మాట్లాడుతూ.. పాలకొల్లులో నిర్మించిన టిడ్కో ఇళ్లు గందరగోళంగా ఉన్నాయన్నారు. వీటిని సరిచేద్దామంటే ఖజానాలో నిధులు లేవని, ఇప్పట్లో ఏమీ చేయలేమని తేల్చి చెప్పారు. నిధులు లేనందున ఈ విషయమై ముఖ్యమంత్రితో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. డబ్బులుంటే అన్ని పథకాలూ ఒకేసారి అమలు చేసేవాళ్లమని, డబ్బులు లేకపోవడంతో చంద్రబాబు చాణక్యంతో ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. దీపావళికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తామన్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 7,150 మంది టిడ్కో లబ్ధిదారుల్లో 640 మంది బ్యాంకు రుణాలు తీసుకోలేదని, వారికి ఉచితంగా ఇళ్లు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ ఆదాకు డీప్



అశోక్ కుమార్

సాక్షి, అమరావతి: పరిశ్రమల్లో ఇంధన ఆదా కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన డిమానిస్ట్రేషన్ ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రాజెక్ట్ (డీప్)ను రాష్ట్రంలో అమలు చేయనున్నట్టు బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఇంకొల్లు, యడ్లపాడుల్లో ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, తాండూరులో సీసీఐ పరిశ్రమలను ఇందుకోసం ఎంపిక చేశామన్నారు. పెర్ఫార్మ్ అచీవ్ అండ్ ట్రేడ్ (పాట్) పథకానికి కొనసాగింపుగా విద్యుత్ ఆదాకు ఆధునిక సాంకేతికతలతో ప్రయోగాత్మకంగా డీప్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి బీఈఈ ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) కార్యాచరణ అమలు బాధ్యతలు నిర్వర్తిస్తుందని చెప్పారు. ఈ మేరకు బీఈఈ దక్షిణాది రాష్ట్రాల సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు.


విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ పోస్టుల భర్తీ

దరఖాస్తుకు గడువు అక్టోబర్ 14

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల్లో ఎట్టకేలకు డైరెక్టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)లో ఇద్దరు, ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీఎల్)లో ముగ్గురు, ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్), ఏపీ ట్రాన్స్‌కోలో ఒక్కొక్కరు, ఏపీ జెన్‌కోలో ముగ్గురు చొప్పున పది మంది డైరెక్టర్లతో బలవంతంగా రాజీనామా చేయించింది. వారి స్థానంలో కొత్తవారిని నియమించేందుకు తాజాగా ప్రభుత్వం అనుమతిచ్చింది. దీంతో రాష్ట్రంలోని రెండు డిస్కంలు ఐదు డైరెక్టర్ పోస్టుల భర్తీకి ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేశాయి. ఏపీఈపీడీసీఎల్.. ప్రాజెక్టులు, ఆపరేషన్స్ విభాగాలకు, ఏపీఎస్పీడీసీఎల్.. ప్రాజెక్టులు, టెక్నికల్, ఫైనాన్స్ విభాగాలకు డైరెక్టర్లను నియమించనున్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ అక్టోబర్ 14. పూర్తి వివరాలకు తమ సంస్థల వెబ్‌సైట్లను సందర్శించాలని డిస్కంలు కోరాయి.

వరదల్లో సైనికుల సేవలు అభినందనీయం

మేజర్ జనరల్ రాకేశ్ మనోచాతో సీఎం చంద్రబాబు



గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత సైనికులు అందించిన సేవలను సీఎం చంద్రబాబునాయుడు కొనియాడారు. సైన్యానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఆంధ్ర–తెలంగాణ సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ రాకేశ్ మనోచా సీఎం చంద్రబాబును ఆదివారం కలిశారు. విజయవాడ, కాకినాడలో ఇండియన్ ఆర్మీ సైనికులు చేపట్టిన వరద సహాయక చర్యలపై చర్చించారు. సహాయం కోరిన వెంటనే సైన్యం యుద్ధప్రాతిపదికన సహాయక చర్యల్లో పాల్గొందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా బుడమేరు గండ్లు పూడ్చడంలో సైన్యం చేసిన కృషిని అభినందించారు. వరదల్లో సైన్యం అందించిన వైద్య సేవలు, సహాయక చర్యలను ప్రశంసించారు.



సాక్షి, అమరావతి

అడ్డగోలు దోపిడీకి

అధికారిక సిండికేట్

- అస్మదీయ కన్సల్టెన్సీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై గుత్తాధిపత్యం
- కన్సల్టెన్సీల ఎంపిక మార్గదర్శకాల ముసుగులో కుట్ర

ఎన్ఐసీఎస్‌లో ఎంపానెల్ అయిన సంస్థలకే అప్పజెప్పాలన్న నిబంధన

- అందులో ఉన్నవి నాలుగు ఐటీ ఆధారిత సేవల సంస్థలే
- ఏ శాఖ అయినా.. ఏ పనికైనా వాటి సేవలను పొందాల్సిందే
- కొత్త మద్యం విధానం సహా అన్నింటికీ అవే
- వీటిద్వారా దోపిడీకి రాచబాట వేసుకుంటున్న ప్రభుత్వ పెద్దలు

చంద్రబాబు కూటమి ప్రభుత్వం అడ్డగోలు దోపిడీ కోసం అధికారిక సిండికేట్‌కు తెరతీసింది. అస్మదీయ కన్సల్టెన్సీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలపై గుత్తాధిపత్యం కట్టబెట్టింది. టెండర్లు లేకుండానే ఏకపక్షంగా కన్సల్టెన్సీల నియామకానికి విధివిధానాలను ఖరారు చేసింది. ఇప్పటికే కొత్త మద్యం విధానం రూపకల్పనకు ఏకపక్షంగా కన్సల్టెన్సీ నియామకం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని అన్ని శాఖలకూ వర్తింపజేస్తూ ఏకీకృత దోపిడీ వ్యవస్థను రూపొందిస్తోంది. వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కన్సల్టెన్సీల నియామకానికి మార్గదర్శకాలతో ఇటీవల జారీ చేసిన జీవో–86 ప్రభుత్వ పెద్దల దోపిడీ పన్నాగానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ శాఖలు ఏవైనా ప్రాజెక్టులు, ప్రొక్యూర్‌మెంట్, కొత్త విధానం, మాస్టర్ ప్లాన్ రూపకల్పన, సాంకేతిక సేవలు, పౌర సేవలు వంటి వాటి కోసం కన్సల్టెన్సీల నియామకంలో పారదర్శక టెండర్లకు ఈ జీవో ద్వారా ప్రభుత్వం దారులు దాదాపుగా మూసివేసింది. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ సర్వీసెస్ (ఎన్ఐసీఎస్ఐ)లో ఎంపానెల్ అయిన కన్సల్టెన్సీలనే ఎంపిక చేయాలని షరతు విధించింది. ఎన్ఐసీఎస్ఐ జాబితాలో ఈ అండ్ వై, కేపీఎంజీ, డెలాయిట్, పీడబ్ల్యూసీ అనే నాలుగు కంపెనీలే ఉన్నాయి. ఏ శాఖ అయినా ఈ సంస్థలకు తమ ప్రాజెక్టుకు అర్హత లేదని భావిస్తే టెండర్ల కోసం ప్రభుత్వ అనుమతి కోరాలి. అయితే, అసలు టెండర్ల ప్రక్రియ నిర్వహించేందుకే వీల్లేదని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. అంటే.. ఏ శాఖ అయినా టెండర్లు పిలుస్తామని కోరినా ప్రభుత్వం తిరస్కరిస్తుందనే సంకేతాలిచ్చింది. మరోపక్క వివిధ శాఖలకు సేవలందిస్తున్న కన్సల్టెన్సీలను తక్షణం వైదొలగాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది. తద్వారా అన్ని శాఖలు ఈ నాలుగు కంపెనీల తోనే సేవలు పొందేలా రాచబాట వేసింది.

పారదర్శకతకు పాతర

ఈ నాలుగూ ప్రధానంగా ఐటీ కంపెనీలు. ఐటీ ఆధారిత సేవలను మాత్రమే అందించగలవు. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోకుండా ఎక్సైజ్, పర్యాటక, పట్టణాభివృద్ధి, వ్యవసాయ, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం.. ఇలా అన్ని శాఖల కన్సల్టెన్సీ సేవలను వీటికే కట్టబెట్టాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక శాఖ 2021లో జారీ చేసిన ప్రొక్యూర్‌మెంట్–ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాల ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించే కన్సల్టెన్సీలకు సాంకేతిక అర్హతలు 30 శాతం మించకూడదు. ఆర్థికపరమైన అర్హతలు ఎక్కువ ఉండాలి. బాబు ప్రభుత్వం ఈ నిబంధనను కూడా ఉల్లంఘించి, కన్సల్టెన్సీ సంస్థల సాంకేతిక అర్హతలు 70 శాతం లేదా 60 శాతం ఉండొచ్చని పేర్కొంది. అంటే ఆర్థిక అర్హతలు 30 లేదా 40 శాతం ఉంటే సరిపోతుందని చెప్పింది. సిండికేట్‌లోని నాలుగు కంపెనీలు ఐటీ ఆధారిత సేవల సంస్థలైనందున, వాటికి సాంకేతిక అర్హతలే ఎక్కువ ఉంటాయనే చంద్రబాబు ప్రభుత్వం ఈ నిబంధన విధించింది.

భారీ దోపిడీకి పక్కా పన్నాగం

ప్రభుత్వ విధానాలు, ప్రాజెక్టుల్లో భారీ దోపిడీకి మార్గం సుగమం చేసేందుకే కూటమి ప్రభుత్వ పెద్దలు ఈ ఎత్తుగడ వేశారు. ప్రభుత్వ పెద్దలు ముందుగానే తమకు అనుకూలమైన విధివిధానాలను అనధికారికంగా రూపొందిస్తారు. అనంతరం అస్మదీయ కన్సల్టెన్సీ సంస్థను నియమించి, తాము రూపొందించిన విధానాన్నే దాని ద్వారా ప్రభుత్వానికి సమర్పిస్తారు. ప్రభుత్వం దానిని ఆమోదిస్తుంది. తద్వారా యథేచ్ఛగా దోపిడీకి పాల్పడి ప్రజాధనాన్ని కొల్లగొడతారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు దోపిడీ తరహాలోనే..

రాష్ట్ర విభజన అనంతరం 2014–19లో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో దోపిడీకి పన్నిన వ్యూహాన్నే ఇప్పుడు ఏకంగా అన్ని శాఖలకు వర్తింపజేస్తోంది. అప్పట్లో ఏకంగా రూ.5 వేల కోట్ల భూదోపిడీకి ప్రభుత్వ పెద్దలు వేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు స్కెచ్ పెను సంచలనం సృష్టించింది. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఠా ముందుగానే ఓ ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అనధికారికంగా ఖరారు చేసింది. చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాలు అప్పటికే భారీగా కొన్న భూములను ఆనుకుని ఆ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్ రూపొందించారు. తరువాత ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ రూపకల్పనకు ఓ అస్మదీయ కన్సల్టెన్సీని నియమించారు. తాము రూపొందించిన అలైన్‌మెంట్‌నే ఆ కన్సల్టెన్సీ ద్వారా ప్రభుత్వానికి సమర్పించారు. దాంతో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాలు ఆ అలైన్‌మెంట్‌కు అటూ ఇటూ కొన్న భూముల విలువ అమాంతం పెరిగింది. తద్వారా ఏకంగా రూ.5 వేల కోట్లు కొల్లగొట్టారు. అదే దోపిడీ విధానాన్ని ఇప్పుడు అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కాగా పన్నిన వ్యూహమే ఈ కన్సల్టెన్సీల సిండికేట్ జీవో అనేది స్పష్టమవుతోంది.

భారీగా తగ్గిన...


నూనె గింజల సాగు

సాధారణ సాగు విస్తీర్ణం 20 లక్షల ఎకరాలు.. సాగైంది 8.45 లక్షల ఎకరాలే

- సగానికి తగ్గిన వేరుశనగ పంట
- నువ్వులు, సన్‌ఫ్లవర్ సాగు పరిస్థితి అంతే

ఆహార పంటల తర్వాత అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే నూనె గింజల సాగు ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. ఖరీఫ్‌లో ఈ పంటల సాధారణ విస్తీర్ణమే 20 లక్షల ఎకరాలు. దాంట్లో వేరుశనగ, 18.30 లక్షల ఎకరాలుండగా, ఆముదం, నువ్వులు, సన్‌ఫ్లవర్, సోయాబీన్ వంటి ఇతర నూనెగింజల పంటలన్నీ కలిపి 1.77 లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఖరీఫ్-2024 సీజన్‌లో 17.25 లక్షల ఎకరాల్లో వేరుశనగ, ఇతర పంటలన్నీ కలిపి సాగు చేయాలని నిర్దేశించగా.. కేవలం 8.45 లక్షల ఎకరాలే సాగయ్యింది. - సాక్షి, అమరావతి

గత ఐదేళ్లలో సాగైన నూనె గింజల పంటల వివరాలు



ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసినా..

రికార్డు స్థాయిలో వర్షాలు కురవడంతో కృష్ణ, గోదావరి, వంశధార, నాగావళి నదులకు వరదలు పోటెత్తాయి. దీంతో ప్రాజెక్టులన్నీ నిండుకుండలను తలపించాయి. భూగర్భ జలాలన్నీ ఎగసి పడుతున్నాయి. వాస్తవానికి నూనె గింజల పంటలు కూడా రికార్డు స్థాయిలో సాగవ్వాలి. కానీ ఊహించని రీతిలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు తోడు భారీ వర్షాలు ఈ పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. మరొకపక్క ప్రభుత్వ అలసత్వం తోడవడంతో నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా సాగవని పరిస్థితి నెలకొంది.

సాగుకు దూరమైన వేరుశనగ రైతు

రాష్ట్రంలో ఏటా 18 లక్షల ఎకరాలకు పైగా సాగయ్యే వేరుశనగ ఈసారి కేవలం 7.17 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. వేరుశనగ పంట అత్యధికంగా రాయలసీమ జిల్లాల్లోనే సాగవుతుంది. ఈ జిల్లాల్లో 13.50 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, కేవలం 6.95 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఇతర నూనె గింజల పంటలను పరిశీలిస్తే సన్‌ఫ్లవర్ సాధారణ విస్తీర్ణం 13వేల ఎకరాలు కాగా, 3785 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఆ తర్వాత నువ్వులు సాధారణ విస్తీర్ణం 50వేల ఎకరాలు కాగా, సాగైంది కేవలం 20వేల ఎకరాలే. ఆముదం సాధారణ విస్తీర్ణం 92వేల ఎకరాలు కాగా, 88వేల ఎకరాల్లోనే సాగయ్యింది.

సీమలో సగానికి తగ్గిన సాగు

వర్షాభావ పరిస్థితుల వలన రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ స్థానంలో సుమారు 3 లక్షల ఎకరాలకు పైగా ప్రత్యామ్నాయ పంటలు సాగవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్క రాయలసీమ జిల్లాలోనే 3.50లక్షల ఎకరాలు వేరుశనగ పంట వేయలేని పరిస్థితి ఏర్పడింది. వేరుశనగ కనీస మద్దతు ధర రూ.6,783 కాగా, ప్రస్తుతం కనిష్ఠ ధర రూ.3,300 ధర ఉండగా, గరిష్ఠంగా రూ.7వేల వరకు పలుకుతోంది. వర్షాభావ పరిస్థితులకు తోడు ధర లేకపోవడం, తెగుళ్ల బారిన పడడం, పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోవడం ఈసారి వేరుశనగ విస్తీర్ణం తగ్గడానికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల పంటల సాగును ప్రోత్సహించేలా రాయితీపై మినీ కిట్స్ ఇచ్చేవారు. ఆర్బీకేల ద్వారా అన్ని రకాలుగా అవసరమైన చేయూతనిచ్చేవారు. సాగులో అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ ప్రోత్సహించే వారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి మచ్చుకైనా కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు.

ముడుపులు తేలక మల్లగుల్లాలు

- జోన్–4 ఎక్సైజ్ సీఐల బదిలీల్లో ప్రతిష్టంభన
- చినబాబు 'సైగ' కోసం కమిషనర్ కార్యాలయం నిరీక్షణ
- 'సీమ' బదిలీలు పూర్తయితేనే కొత్త మద్యం పాలసీ ప్రకటన
- మూడు జోన్లలో ఇప్పటికే బదిలీలు పూర్తి



తిరుపతి ఎక్సైజ్ అర్బన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త మద్యం పాలసీ అటు సర్కారు ఖజానా నింపడమే కాదు.. కూటమి నేతలకూ కాసుల వర్షం కురిపిస్తోంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో జరుగుతున్న సీఐ బదిలీలే ఇందుకు కారణం. ఈ వారంలోనే నూతన మద్యం పాలసీ తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అంతకు ముందే ఎక్సైజ్ సీఐల బదిలీలు పూర్తిచేయాలని భావిస్తోంది. దీంతో మద్యం అమ్మకాల్లో రాష్ట్రస్థాయిలోనే పేరున్న సర్కిళ్ల కోసం అధికారులు పోటీ పడుతున్నారు. ఎందుకంటే.. మద్యం అమ్మకాలు బాగా జరిగితేనే సిండికేట్ల ఏర్పాటు, ఎమ్మార్పీకి గండి కొట్టడం సాధ్యమవుతుంది. ఈ పనులన్నీ జరగాలంటే తాము చెప్పిన సీఐ ఉంటేనే సాధ్యమని ప్రజాప్రతినిధులు ఈ బదిలీల్లో తలదూరుస్తున్నారు. కానీ, రాయలసీమలోని జోన్–4 పరిధిలో ఉన్న నాలుగు జిల్లాల సీఐల బదిలీలు కొలిక్కిరాలేదు. నాయకులకు ముట్టాల్సిన ముడుపులు ముట్టకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఈ పంచాయతీ తేలకపోవడంతో రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం బదిలీల ఉత్తర్వులు ఇచ్చేయడానికి సిద్ధపడింది. అయితే, సీమలోని కూటమి నేతల నుంచి కమిషనర్ కార్యాలయానికి హెచ్చరికలు వెళ్లినట్లు ఎక్సైజ్ శాఖలో చర్చించుకుంటున్నారు.

తేలని సీఐల పోస్టింగ్‌లు

ఇక రాష్ట్రంలోని విశాఖ, నెల్లూరు, కృష్ణాలోని మూడు జోన్లలో శనివారం రాత్రి బదిలీల ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలింది జోన్–4 మాత్రమే. మూడు జోన్లతో పాటు చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం ఉమ్మడి జిల్లాల్లో సీఐల బదిలీల ఉత్తర్వులు సైతం శనివారమే విడుదల కావాల్సింది. కానీ, కూటమి నేతలు తమకు అనుకున్న స్థాయిలో ముడుపులు రాలేదన్న కారణంతో సీఐల పోస్టింగులపై తేల్చలేదు. ప్రధానంగా తిరుపతి అర్బన్, చంద్రగిరి, డిస్టిలరీ, పలమనేరు, నగరి, గూడూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు భారీ ధర పలుకుతోంది. ఇక కడప అర్బన్, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, కర్నూలు అర్బన్, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, డోన్, అనంతపురం అర్బన్, హిందూపురం, కదిరి, ధర్మవరం, ఉరవకొండ సర్కిళ్లకు సైతం డిమాండ్ నెలకొంది. ఈ ప్రాంతాల్లో పనిచేయడానికి పలువురు సీఐలు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. ఫలితంగా స్థానిక ఎమ్మెల్యేలు వాళ్లకు కావాల్సింది తీసుకుని రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్‌కు సిఫార్సు లేఖలపరంగా.. కొన్నిచోట్ల మంత్రులు వాటికి అడ్డుకట్ట వేస్తూ తమ సిఫార్సు లేఖలు ఇచ్చేశారు. దీంతో ఎవర్ని ఎక్కడ వేయాలో తెలీక కమిషనర్ కార్యాలయం తల పట్టుకుంటోంది. ఇప్పటికే అనంతపురంలోని ఓ ఎమ్మెల్యేను కమిషనర్ కార్యాలయంలోని ఓ అధికారి సంప్రదించి, మంత్రి చెప్పిన వాళ్లకు పోస్టింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. అగ్గిమీద గుగ్గిలమైన ఆ నేత, తన నియోజకవర్గంలో మంత్రి పెత్తనం ఏంటని చీవాట్లు పెట్టినట్లు సమాచారం. దీంతో.. రాయలసీమలోని బదిలీల వ్యవహారం తేల్చడం తమవల్ల కాదంటూ కమిషనర్ కార్యాలయం చేతులెత్తేసినట్లు తెలుస్తోంది. ఇదే విషయం ఆబ్కారీ శాఖ మంత్రి దృష్టికి వెళ్లినా ఆయన మాట కూడా కూటమి ఎమ్మెల్యేలు కొందరు వినడంలేదని తెలుస్తోంది. మరికొన్ని సర్కిళ్లలో నేతల రేటుకు సీఐలు సరితూగకపోవడంతో బదిలీల్లో సందిగ్ధత నెలకొంది. ఆదివారం ఈ పంచాయతీ చినబాబు వద్దకు చేరనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సర్కిళ్లకు నిర్ణయించిన ధరలు తగ్గుతాయా, ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సు లేఖల్లో ఎవరివి చెల్లుతాయో అన్న దానిపై ఎక్సైజ్ శాఖలో ఆసక్తి నెలకొంది.

విశాఖలో షాపింగ్ మాల్

- రాష్ట్రంలో పెట్టుబడులపై 'ఎక్స్'లో లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో హైపర్ మార్కెట్లు, ఆహార శుద్ధి, లాజిస్టిక్స్ రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నట్లు లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ ప్రకటించారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్‌తోపాటు ఎనిమిది స్క్రీన్ల ఐమాక్స్ మల్టీప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. శనివారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబుతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయని తెలిపారు. విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాల్లో సరికొత్త హైపర్ మార్కెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఆధునిక ఆహార శుద్ధి, లాజిస్టిక్స్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నట్లు యూసఫ్ అలీ ట్వీట్ చేసిన వెంటనే నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు. మూడేళ్ల క్రితం ఇదే విధంగా చెన్నైలో లులూ మాల్ పెడుతున్నట్లు ప్రకటించారని, ఇంతవరకు అతీగతీ లేదని గుర్తు చేశారు. 2014 నుంచి ఏపీలో మాల్ అంటూ కబుర్లతో కాలక్షేపం చేస్తున్నావని.. కట్టేదెప్పుడు.. పెట్టేదెప్పుడు అంటూ మరో నెటిజన్ నిలదీశాడు. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో చేతిలో భూమి పెట్టుకొని కూడా చాలాకాలం పనులు ప్రారంభించకుండా కూర్చున్నారని ధ్వజమెత్తాడు.

బియ్యం.. మరింత ప్రియం

- బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత
- పారా బాయిల్డ్ బియ్యంపై ఎగుమతుల సుంకం 10 శాతానికి తగ్గింపు



సాక్షి, హైదరాబాద్: బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేతతో సన్నబియ్యం ధరలు మరింత ప్రియం కాబోతున్నాయి. ప్రస్తుతం అధికంగా వినియోగించే సన్న బియ్యం రకాలైన సోనా మసూరి, హెచ్ఎంటీ, జైశ్రీరాం, బీపీటీ రకాలు, తెలంగాణ సోనా వంటి మేలిమి బియ్యం ధరలు ఏకంగా కిలో రూ. 60 నుంచి రూ. 70కి చేరుకున్నాయి. బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేస్తూ, కనీస ఎగుమతి ధరను విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారమే నోటిఫికేషన్ విడుదల చేసింది. పారా బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం), బ్రౌన్ రైస్‌పై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఉత్పత్తి అయ్యే సన్నరకాలు భారీ ఎత్తున విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశముంది. అమెరికాతో పాటు బంగ్లాదేశ్, యూరోప్ వంటి 140 దేశాలకు భారత్ నుంచి బియ్యం ఎగుమతులు పెరుగుతాయి. ఈ ప్రభావం దేశీయ బియ్యం మార్కెట్‌పై పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

గత ఏడాది జూలైలో బియ్యంపై సర్కార్ ఆంక్షలు

2022–23లో ధాన్యం ఉత్పత్తి కొంత తగ్గింది. అదే సమయంలో విదేశాల్లో బియ్యం డిమాండ్ పెరిగి, దేశీయంగా బియ్యం ధరలు భారీగా పెరిగే పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కేంద్రం గత సంవత్సరం జూలైలో బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. పారా బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం), బ్రౌన్ రైస్‌లపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం విధించింది. భారత్ నుంచి బియ్యం ఎగుమతి ఆగిపోవడంతో థాయ్‌లాండ్, వియత్నాం, పాకిస్తాన్‌ల నుంచి ఎగుమతులు పెరిగాయి. అయితే భారత్‌లో ఉత్పత్తి అయిన బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కేంద్రం నిర్ణయంతో ఒక్కసారిగా దేశీయ బియ్యం ఎగుమతులు పెరుగుతాయని భావిస్తున్నారు.



హింస ద్వారా శాంతిని సాధించలేము.
దాన్ని అవగాహన ద్వారా మాత్రమే పొందగలం.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 30 సెప్టెంబర్ 2024

నింద భోజనం

కొన్ని నైతిక బోధలు అన్నిచోట్లా కనబడతాయి. అబద్ధము ఆడరాదు. జీవహింస చేయరాదు... ఇలా! కానీ, వారణాసిలోని కబీర్ జన్మస్థలైన కబీర్ మఠ్‌కు వెళ్లినప్పుడు అక్కడ కనిపించే మొదటి నైతిక బోధ 'నిందలు వేయరాదు' అని! కబీర్ దాస్ తన ప్రబోధాలలో ఎక్కువగా అప్రమత్తం చేసింది నిందలు వేసే వారి గురించే!! 'వేయిమంది పాపులను కలిసినా ఫరవాలేదు నిందలు వేసే ఒక్కణ్ణి తప్ప. నిందలు వేసే వాని శిరము వేయి పాపాల పుట్ట' అన్నాడాయన.

సిసలైన వేటగాడు ఉత్త చేతులతో ఇంటికొచ్చి నింద అడవి మీద వేయడు. ఆహార సేకరణ కాలంలో అనునిత్యం చెమటోడ్చి, రక్తం చిందించి ఆహారం సేకరించుకోవాల్సి వచ్చినప్పుడు ప్రతి బలహీన పురుషుడు నోటికి నేర్చిన మాట నింద. వేటే దొరకలేదు... నది పొంగింది... తేనెటీగలు తరుముకున్నాయి... బాణం దిగినా సరే పారిపోయింది. తర్వాతి కాలంలో సకల చేతగానితనాలకీ, అగణిత అప్రయోకత్వాలకీ చవటలు వెతుక్కునే అన్ని నిందలకూ కనిపెట్టుకున్న అడ్రస్ ఒకటి ఉంది. దాని పేరు ఖర్మ. నింద ఖర్మ మీద వేస్తే ఆ తర్వాత మన దేశంలో వేరే ఏమీ చేయనక్కర్లేదు. 'ఏం చేస్తామండీ ఖర్మ' అని తడవకోసారి అంటూ ఉంటే చాలు. సాఫల్య కర్మల కోసం కాదా కర్మ?

అప్రయోజకత్వం అక్కసుకు సింహద్వారం. వైఫల్యం అహంకారానికి గొడ్డుకారం. కళ్లెదుట కష్టపడి పని చేసేవాడు, భార్యాపిల్లలను చక్కగా చూసుకునేవాడు, డబ్బు జాగ్రత్త చేసుకునేవాడు, తెలివిగా మసలుకునేవాడు, వ్యసనాలకు దూరంగా ఉండేవాడు, వచ్చిన విద్యను అంటిపెట్టుకుని ఉండేవాడు, తెగించి కొత్తదారులు కనిపెట్టేవాడు... వీళ్లంతా ముందుకు వెళుతుంటే విజేతలై అధిగమిస్తుంటే ఇవన్నీ చేయలేని, చేయరాని, చేసేందుకు కనీసం ప్రయత్నించి చూడని ప్రతి గాడిదకూ చేతికి అందే మారణాయుధం నింద. గెలిచినవాడిని ఓడించేందుకు ధర్మబద్ధమైన ఏ ఆయుధమూ లేని పరాజితుడు అంతిమంగా ప్రయోగించే పాశుపతాస్త్రం నింద. ఇది టీకా లేని క్రిమి. నాల్కల ద్వారా వ్యాపించే మహమ్మారి.

పాఠశాల విద్య తద్వారా తెలుగు భాష ముందుకు సాగడానికి చిన్నయ సూరి ఆవిష్కృతం చేసిన అతి ముఖ్యమైన కృషి 'బాల వ్యాకరణం' వేలాదిగా అమ్ముడుపోవడం మొదలుపెట్టాక ఆయన మీద పడ్డ నింద– అది కాపీ రచన అని... అది వేరెవరో పండితుడు రాశాడు అని. చిన్నయ సూరి ఈ గండం నుంచి గట్టెక్కడానికి గురు సమానులైనవారి వైపు ఆశగా చూస్తే వారూ చేసిన పని 'అవును.. కాపీయే' అని నిందించడం. ఐదారేళ్లు చిన్నయ సూరి నిందను మోశాక నింద ఓడిపోయింది. చిన్నయ సూరి మిగిలాడు. ఒక వేశ్య రచన చేయుటయా... ఆస్థానాలలో ఆడే దేవదాసి కవిత్వం చెప్పుటయా అని నాటి పెద్దలకు ముద్దు పళని మీద ఆగ్రహం వచ్చింది. 'లోపల ఏముందో తర్వాత.. ముందు అశ్లీలం అని నింద వేయండి' అన్నారు. ఆ నిందను జయించి తెలుగు సారస్వతంలో తన స్థానం దక్కించుకోవడానికి 'రాధికా సాంత్వనం' ఎంత సాంత్వనం కోల్పోయిందని?

తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పురాణాలూ ఈ సందర్భాలను ఎత్తి చూపాయి. రాముణ్ణి మాయలేడి వెంట పంపి సీత తప్పు చేసింది. ఆ తప్పు వల్ల ఆమెలో ఆందోళన జనించింది. ఆ ఆందోళన ఇంగితం కోల్పోయేలా చేసింది. ఎంతకూ రాని రాముని గురించి పరితపిస్తూ, రక్షణకు వెళ్లమని, 'నా మీద కన్నేసి నువ్వు కదలడం లేదు కదూ' అని లక్ష్మణుడి మీద నింద వేసే సరికి అతడు హతాశుడయ్యాడు. తర్వాతి కాలంలో ఈ సీతమ్మే ఘోర నిందను ఎదుర్కొంది. అగ్నిపునీతగా నిలిస్తే తప్ప నింద వదల్లేదు. సకల లీలా మాధవుండైన శ్రీకృష్ణుడు కూడా నిందచేసే లీలకు చకితుడయ్యి జాంబవంతుడితో యుద్ధానికి దిగాడు శమంతకమణి కోసం! ఆ మాటకొస్తే ఆడిన మాట తప్పాడన్న నింద వస్తుందన్న భయం లేకపోతే హరిశ్చంద్రుడు పడేవాడా అన్ని కష్టాలు? దేనికీ జడవనివాణ్ణి జడిసేలా చేయగలదు నింద.

నిందలు ఎందుకు వేస్తారు అంటే అది చాలా సులభమైన పని కనుక అంటారు మనస్తత్వ శాస్త్రవేత్తలు. గుచ్చుకుంటున్న స్వీయ వైఫల్యాలకు కాసింత మలాము రాసుకోవడానికి ఎదుటివారికి మలం పూస్తారు ఇట్టివారు. అక్కసును, ద్వేషాన్నీ గెలుపుగా మార్చుకునేందుకు దేశాలపై, జాతులపై, మతాలపై, కులాలపై, వ్యక్తులపై, సార్థకులపై నిందలు వేస్తారు. నిందకు దండన అనుమతి ఉంది. చేతబడి చేస్తున్నారన్న నింద వేశాక ఊరంతా కలిసి వారిని చంపుతుంటారు. నింద బలిగోరుతుంది. విడిపోయి తమ దారి తాము చూసుకుందామనుకునే తోబుట్టువులు ఇవాళ సుపారీ ఇస్తున్నది నిందకే.

నిందలు వేసేవారు పదేపదే నెగెటివ్ ఆలోచనల్లో చిక్కుకుని ఏమీ సాధించలేక చరిత్రహీనులుగా మిగులుతారనడానికి ఆధారాలున్నాయి. నేటి సోషల్ మీడియా అంతా నిందలు వేసే మందబుద్ధులతో ఎంతగా నిండి ఉందంటే రోజూ వేల కొలది పోస్టుల పాపపుకూడు ఉడికి వడ్డనవుతున్నది. ఈ భోజనానికి ఎగబడుతున్న అమాయకులు ఎందరో. కవులు, రచయితలు ఎప్పుడైనా ఈ దారి తొక్కుతున్నారా ప్రయివేటు సంభాషణలను నిందలతో నింపుతున్నారా, చెక్ చేసుకోవాలి. మొదట నింద వేసినవారు సచ్చీలురు అయిపోవడం నింద సమకూర్చే అతి పెద్ద లాభం. అంత మాత్రం చేత నింద వేసిన వారు గెలిచినట్టు కాదు. మోసినవారు ఓడినట్టు కాదు. సదుద్దేశంతో సద్విమర్శ చేసేవారిని ఇంటిలో నాటే చెట్టంత దగ్గరగా ఉంచుకోమన్నాడు కబీర్ దాస్. సమాజం సద్విమర్శతో నిర్మితమవుతుంది. నిందతో కాదు. నింద నిందపడి పాడుగానూ!

సమాఖ్యకు 'జమిలి' సవాళ్లు!

కామెంట్



కరణ్ థాపర్

జమిలి ఎన్నికల వల్ల దేశానికీ, ప్రజాస్వామ్యానికీ ఎంతవరకు ఉపయుక్తం అనే దానిపై చర్చ జరుగుతోంది. లోక్‌సభ నుంచి అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'కు అనుకూలంగా ఎన్ని వాదనలున్నాయో, వ్యతిరేకంగా అన్ని వాదనలున్నాయి. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలకు అయ్యే ఖర్చు, వేర్వేరు సమయాల్లో జరిగే అనేక ఎన్నికల ఖర్చు కంటే తక్కువగా ఉంటుంది. కానీ అలా పొదుపు చేసే మొత్తం భారత్ లాంటి పెద్ద దేశానికి ఒక లెక్కలోకే వస్తుందా? అలాంటి ఎన్నికల వల్ల స్థానిక సమస్యల కంటే జాతీయ సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యం లభించదా? బహుళ పార్టీ వ్యవస్థను ఒకే పార్టీ గల దేశం వైపు నెట్టదా? ఇవన్నీ ఆలోచించాల్సిన విషయాలు.

నాకు తెలిసిన చాలామంది లాగే మీరు కూడా 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'ను అర్థం చేసుకోవటానికి తన్నుకులాడుతుంటే కనుక మీకు సహాయం చేయటానికి నన్ను ప్రయత్నించనివ్వండి. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే భావనను ప్రతిపాదించినవారు, దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ అనుకూల, ప్రతికూల వాదనలతో మనల్ని ముంచెత్తారు. కానీ లాభ నష్టాల నడుమ దీనిపై మనమెలా ఒక తీర్పుకు రాగలం? ఈ వాదోపవాదాలన్నీ సముచితమైనవేనా? లేదా కొన్ని మాత్రమే మిగతా వాటి కంటే ప్రాముఖ్యమైనవా?

ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే ఈ భావనకు మద్దతు లభించటానికి గల కారణాలతో విషయాన్ని ప్రారంభిద్దాం. మొదటిది – డబ్బు ఖర్చు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలకు అయ్యే ఖర్చు, వేర్వేరు సమయాల్లో జరిగే అనేక ఎన్నికలకు అయ్యే ఖర్చు కంటే తక్కువగా ఉంటుందనటంలో సందేహం లేదు. అయితే అలా పొదుపు చేసే మొత్తం ఏడాదికి రూ. 5000 కోట్ల కన్నా తక్కువేనన్నది శశి థరూర్, ప్రవీణ్ చక్రవర్తిల వాదన. ఇండియా వంటి భారీ ఆర్థిక వ్యవస్థకు ఇదేమంత తేడా చూపే మొత్తం అవుతుందని?

రెండవ కారణం – ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఆంక్షలు పరిమిత కాలానికి మాత్రమే వర్తింపులో ఉంటాయి కనుక రాజకీయ నాయకులు తమను తాము పాలనా వ్యవహారాలలో నిమగ్నం చేసుకోవచ్చు. అయితే ప్రవర్తనా నియమావళి అన్నది జాతీయ స్థాయిలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే అమలులో ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో అదొక పెద్ద విషయమే అవదు. మళ్లీ ప్రశ్న, ఇదేమంత ముఖ్యమైన కారణం అవుతుందని?

నిజమేమిటంటే, పై రెండూ కూడా చెప్పుకోదగిన కారణాలు కావు. ప్రజాస్వామ్యపు అత్యంత ముఖ్యమైన వ్యక్తీకరణ... ఎన్నికలు. వాటి నిర్వహణకు అయ్యే వ్యయాన్ని బట్టి, లేదా అవి సజావుగా జరిగేందుకు అవసరమైన నియమావళిని బట్టి ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే భావనలోని లాభనష్టాలను చర్చించకూడదు.

ఇప్పుడు మనం వ్యతిరేక వాదనల్లోకి వద్దాం. మొదటిది – ఇది మన దేశ విలక్షణతకు విరుద్ధం అవుతుందా? మనది ఒకే దేశం–ఒకే మతం కాదు. ఒకే దేశం–ఒకే భాష కాదు. ఒకే దేశం–ఒకే సంస్కృతి కాదు. ఒకే దేశం–ఒకే విధమైన మరేదీ కాదు. మన వ్యత్యాసాలనే మన సంపదలుగా మలుచుకున్న రాష్ట్రాల సమాఖ్య మన దేశం. ఆ



వ్యత్యాసాలు, సంపదలే మనల్ని ప్రత్యేకంగా ఉంచుతాయి. మనకు ప్రాముఖ్యం కల్పిస్తాయి. మరి ఒకే దేశం–ఒకే ఎన్నిక అన్నది ఆ ప్రత్యేకతలు, ప్రాముఖ్యాల నుంచి మన దేశాన్ని దూరం చేయదా? దీని గురించి జాగ్రత్తగా ఆలోచించండి.

రెండవది – ఒకే దేశం–ఒకే ఎన్నిక వల్ల స్థానిక సమస్యల కంటే జాతీయ సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యం లభించే ప్రమాదం ఉంటుందా? అలా జరిగితే – జరుగుతుందనే నా అనుమానం – అది దేశ సమాఖ్య నిర్మాణాన్ని ఏకీకృత వ్యవస్థగా మార్చే ధోరణి కలిగి ఉండదా? వెంటనే కాకపోయినా, కాలక్రమేణా అలా జరిగే అవకాశం అయితే ఉంటుంది.

దీనివల్ల చిన్న రాష్ట్రాల ప్రాంతీయ ఆందోళనలు కేంద్ర స్థాయి జాతీయ డిమాండ్లలో కొట్టుకుని పోతాయి. గోవా, సిక్కిం, ఉత్తరాఖండ్, హిమాచల్, పుదుచ్చేరి, ఈశాన్య రాష్ట్రాల నిరసన గళాలు ఢిల్లీ రణగొణ ధ్వనుల్లో తేలిపోతాయి.

మూడవది – పార్లమెంటరీ ఎన్నికలు క్రమంగా అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారినప్పుడు ఒకే దేశం–ఒకే ఎన్నిక అన్నది ఆ ధోరణిని మరింత తీవ్రతరం చేసే ప్రమాదం లేదా? అదే జరిగితే, అది మన బహుళ పార్టీ వ్యవస్థను ఒకే పార్టీ గల దేశం వైపు నెట్టదా? ఇది అర్థవంతమైన భయమే అయితే దీనిని తేలిగ్గా తీసుకోవలసిన అవసరం లేదు.

ఇదంతా కూడా మన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఉల్లంఘనకు గురి చేయగలిగినదే. ఇది ఎంతవరకు జరుగుతుంది అనేది ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే భావనలోని పర్యవసానాలపై ఆధారపడి ఉంది.

అయితే మరొక విషయం కూడా ఉంది. మనం మన ప్రజాస్వామ్యాన్ని మరింత విస్తృతంగా, వేళ్లూను కునేలా చేసుకోవలసిన అవసరం అది. నిజానికి 50 ఏళ్ల క్రితమే అటల్ బిహారీ వాజ్‌పేయి 'రైట్ టు రీకాల్' (పదవుల్లో ఉన్నవారిని తొలగించే హక్కు)ను కోరు కున్నారు. దానికి పూర్తి భిన్నమైనది ఈ 'ఒకే దేశం – ఒకే ఎన్నిక'. ఓటు వేసే అవకాశాన్ని పరిమితం చేయటం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని ఇది కురచబారుస్తుంది. ఇంకోలా చెప్పాలంటే, వెళ్లవలసిన మార్గాన్ని వెనక్కి తిప్పుతుంది.

ఇంకొక సమస్య ఉంది. వాస్తవంలో ఎదురుకాగల సమస్య అది. ఒకవేళ ప్రభుత్వం ఐదేళ్ల కాల పరిమితి కంటే ముందుగానే తన మెజారిటీని కోల్పోతే ఏం జరుగుతుంది? మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలను నిర్వహించాలని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ సూచిస్తోంది. కానీ అది ఐదేళ్ల కాలానికి ఓటరు ఇచ్చిన తీర్పును పలుచబార్చదా? కొన్నిసార్లు వాళ్లు ఐదేళ్ల ప్రభుత్వానికి ఓటు వేస్తారు. మరికొన్ని సార్లు ఒకటీ లేదా రెండేళ్ల ప్రభుత్వానికి ఓటేస్తారు. ఈ విధంగా మనం ఓటు విలువను యథేచ్ఛగా తగ్గించటం లేదా?

ఉప ఎన్నిక అవసరమైన ప్రతిసారీ నిస్సందేహంగా ఇలాగే జరుగుతుంది కానీ... వ్యక్తికి ఓటేయటానికి, మొత్తం అసెంబ్లీకో, పార్లమెంటుకో ఓటేయటానికి తేడా లేదా? ఆలోచించదగిన ప్రశ్నే ఇది.

నిజానికి, మధ్యంతర ఎన్నికలకు కారణమయ్యేవి ఏవీ లేకుండా పోవు. ఇంకా అనేక కారణాల వల్ల కూడా ముందస్తు ఎన్నికలు రావచ్చు. ఈ విధంగా ఎన్నికైన ప్రభుత్వాలు ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'కు వీలుగా తక్కువ కాల పరిమితిని కలిగి ఉంటాయి. ఈ కోణంలోంచి చూస్తే 'ఒకే దేశం–ఒకే' ఎన్నిక వల్ల ఏం తేడా కనిపిస్తున్నట్లు? చెప్పాలంటే మనం మరిన్ని ఎన్నికలకు వెళ్లటం అవుతుంది తప్ప, తక్కువ ఎన్నికలకేం కాదు.

కనుక, అంతిమంగా నేను చెబుతున్నదేమిటి? అది మీతో చెప్పటానికి సంకోచిస్తున్నాను. ఏమైనా, నా అభ్యంతరాలన్నీ ఇక్కడ స్పష్టంగానే వ్యక్తం అయ్యాయి. మీరు నా మార్గదర్శకత్వాన్ని కోరుకుంటే కనుక అందుకు చాలినంతగానే రాసేశాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చవకైతే మేలు



షాపింగ్ అనేది దారుణంగా తయారైంది. ఇప్పుడు ప్రతిదీ 'ట్రెండీ'యే. కానీ నాణ్యత మాత్రం ఘోరం. 120 డాలర్లకు కొన్న స్వెటర్ కూడా రెండు ఉతుకులకే ఎందుకు పాడవుతోంది? మధ్య–శ్రేణివి కూడా ఇలాగే ఉన్నప్పుడు, జనాలందరూ 'ఫాస్ట్ ఫ్యాషన్' (లేటెస్ట్ ఫ్యాషన్‌తో కూడిన చవక దుస్తులు) ధరిస్తేనేం?

– అర్నేసా బుల్జుస్మిక్ కుస్తూరా, పరిశోధకురాలు

మనుషులుగా గుర్తిస్తేనే...



ప్రతి జీవితమూ విలువైనదే. ఎవరూ 'ఆనుషంగిక నష్టం' కాదు. ప్రతి మనిషికీ ఒక పేరుంది, కథుంది – లేదా ఉండేది. 'అన్ని యుద్ధాలూ క్రూరమైనవే' లాంటి మాటలు నాకూ తెలుసు. కానీ ప్రతిఒక్కరూ ఎదుటివాళ్లను సంపూర్ణ మానవులుగా గుర్తించనంత వరకూ ఇలాంటి ఘోరాలు ఆగవని కూడా తెలుసు.

– ఎమీ దార్, శాంతి కార్యకర్త

ఎన్నడూ చూడనిది...



మా అంకుల్ భార్య లెబనీస్. ఆయనతో మాట్లాడితే దాదాపుగా వెక్కి వెక్కి ఏడుస్తూ, ఎప్పుడూ చూడనంత ఘోరాన్ని చూస్తున్నట్టుగా చెప్పారు. మా అంటీ అయితే ఉద్వేగంతో ఫోన్లో కనీసం ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయింది. నేను ఒక పది నిమిషాల్లో క్లాసుకు వెళ్లాలి. ఎటు వెళ్తున్నాం మనం? మన రోజు మామూలుగా ఎలా ఉండగలదు?

– హెబా గోవయేద్, సోషియాలజిస్ట్ (న్యూయార్క్)

ఐకమత్యమా? నైతికతా?



ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నేను హిజ్బొల్లాకు మద్దతిస్తాను. కానీ సిరియన్లకు మద్దతుగా హిజ్బొల్లాను వ్యతరేకిస్తాను. ఐకమత్యం అనే పేరుమీద నైతిక సూత్రం విస్మరణకు గురికాకూడదు. నా సిరియా జనాల మీద హిజ్బొల్లా చేసిన నేరాలను తక్కువ చేయకూడదు.

– మహమ్మద్ హిజాబ్, యూట్యూబర్

అసలుకే మోసం



పెళ్లి కాబోతున్న ఒక యువకుడికి జుట్టు రాలుతోందన్న ఆందోళన మొదలైంది. ఒక సీనియర్ మిత్రుడిని అడిగితే ఏదో ఆయింట్‌మెంట్ సూచించాడు. కొన్ని విటమిన్ మాత్రలు చెప్పాడు. పెళ్లయింది. కానీ యాంటీ క్లైమాక్స్. అంగస్తంభన సమస్యలొచ్చాయి. నీతి ఏమిటంటే, షేరింగ్ ఈజ్ కేరింగ్; కానీ ఔషధాల విషయంలో కాదు. కొన్ని వైద్యుల పర్యవేక్షణలోనే జరగాలి.

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

చేయాల్సింది!



మీరు కోరుకుంటున్న జీవితం గడపడానికి ఉన్న అతిపెద్ద అడ్డంకి: మీరు ప్రస్తుతం చేస్తున్న దానికీ, అక్కడికి చేరుకోవడానికి చేయాల్సిన దానికీ మధ్య ఉన్న అంతరాన్ని గుర్తించడంలో విఫలం కావడం.

– సాహిల్ బ్లూమ్, అంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

వరదల తీవ్రతను తగ్గించవచ్చు!

ఇటీవల వరదలు తెలుగు రాష్ట్రాల్లోనే కాక మొత్తం భారతదేశంలో తీవ్ర నష్టాన్ని కలగజేశాయి. ఈ వరదలకు ముఖ్య కారణం గ్లోబల్ వార్మింగ్. భూమిపై పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సముద్రంలోని నీరు ఆవిరై ఆకాశంలో మేఘాలుగా ఏర్పడి చల్లని ప్రాంతానికి వెళ్లే క్రమంలో క్లౌడ్ బరస్ట్ అనే ప్రక్రియకు గురై భారీ వరదలు సంభవిస్తాయి. వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను నిలువరించే సామర్థ్యం మానవుని వద్ద లేదు. కాని, వాటి తీవ్రతను తగ్గించి వాటి వల్ల కలిగే ప్రాణ నష్టాన్నీ, ఆర్థిక నష్టాన్నీ నివారించే సామర్థ్యం మానవునికి ఉంది. భూమిపై వేడి పెరగకుండా చూసుకోవడం ద్వారా వాతావరణంలో అనూహ్య మార్పులను నివారించవచ్చు.

ముఖ్యంగా వరదలను నివారించడంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయి. క్లౌడ్ బరస్ట్‌కు మూలకారణమైన వాతావరణ మార్పును ఇవి తగ్గిస్తాయి. భారీవర్షాల సమయంలో చెట్లు గొడుగుల్లా పని చేస్తాయి. వాటి ఆకులు... వర్షపు నీరు నేరుగా నేలపై పడకుండా అడ్డుకొని ఆ నీరు భూమికి చేరటాన్ని ఆలస్యం చేస్తాయి. అందువలన భూమిపై పోగయ్యే వర్షపు నీటి పరిమాణం తగ్గడం వలన వరద తీవ్రత తగ్గుతుంది. చెట్ల వేర్లు ప్రకృతి ఇచ్చిన సహజ స్పాంజ్‌లు. ఇవి వర్షపు నీటిని పీల్చుకుని భూమిలో నిల్వ చేస్తాయి. చెట్లు నేలపై నీటి ప్రవాహ వేగాన్ని ఒక 'స్పీడ్ బ్రేకర్' లాగా తగ్గిస్తాయి. 'మడ అడవులు' తీర ప్రాంతాలలో వరదల ప్రమాదాన్ని తగ్గించగలవు. అలాగే భూమి మీద గడ్డి పెంచడం వలన వరద నీటి ప్రవాహ వేగం తగ్గి, నేల వరద నీటిని పీల్చుకుంటుంది. కాలనీలలో సిమెంట్ రోడ్స్, డాంబర్ రోడ్స్ వలన వరద నీరు ఇంకదు. అందువల్ల వరద తీవ్రత పెరుగుతుంది. చెరు వులు, నదులు, ఇతర ఉపరితల నీటి వ్యవస్థలు మంచి స్థితిలో ఉన్నాయో లేదో క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలి. నాళాలు, చెరువుకు నీరు ప్రవహించే మార్గాలపై నిర్మాణాలు చేపట్టకుండా ఉండాలి.

వరదలు సంభవించినప్పుడు సెల్ ఫోన్ సిగ్నల్స్ సరిగ్గా ఉండక పోవటం వల్ల సెల్‌ఫోన్లు సరిగ్గా పనిచేయవు. విద్యుత్ ఉండక పోవటం వలన టెలివిజన్ వంటివి పనిచేయవు. కాబట్టి ప్రజలకు వరదలకు సంబంధించి 'తాజా సమాచారం' తెలుసుకోవడం కష్టం. కావున బ్యాటరీలతో పనిచేసే రేడియోలను ఉపయోగించి వరదలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవడం క్షేమకరం. అందరూ వాతావరణ శాఖ ఇచ్చే సూచనలను పాటిస్తూ ఉండాలి. ఈ విధంగా వరదలను, వాటి వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు.

– శ్రీదరాల రాము । 94411 84667

ఐదు దశాబ్దాల అలుపెరుగని పోరాటం

సందర్భం



ఎస్.ఎల్. పద్మ

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవాన్ని జరుపుకొంటోంది. 1974 అక్టోబర్ 12, 13 తేదీలలో హైదరాబాదులో ప్రథమ మహాసభను జరుపుకొని ప్రణాళికను రూపొందించుకుంది. విద్యార్థి హక్కుల రక్షణకై, పోరాట దారులు వేసుకున్నది. ప్రజాస్వామిక హక్కుల పట్ల చైతన్యం కలిగించింది. ఏ రాజకీయాల్లో విద్యార్థులు ప్రయాణించాలో దిశా నిర్దేశం చేసింది. శాస్త్రీయ విజ్ఞానం ద్వారానే సమాజాన్ని సరిగా అర్థం చేసుకుంటామనీ, సమస్యల పరిష్కారాలను కనుగొనగలుగుతామని అనుభవపూర్వకంగా రుజువు చేసింది. తన ఆశయాల సాధనలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, శ్రీపాద శ్రీహరి, చేరాలు, కోలా శంకర్ వంటి ఆణిముత్యాలను కోల్పోయింది.

ఉమ్మడి రాష్ట్రంలో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా 'విప్లవ విద్యార్థి సంఘం' పురుడు పోసుకున్నది. కామ్రేడ్ జార్జి రెడ్డి నాయకత్వాన 'ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థు'ల పేరుతో యూనివర్సిటీలో అనేక రాజకీయ చర్చలు జరిపేవారు. దీంతో మేధాపరమైన ఆలోచనల సంఘర్షణ కేంద్రంగా యూనివర్సిటీ మారింది. ఈ క్రమంలో ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ చేతుల్లో హత్యగావించబడ్డాడు జార్జి రెడ్డి. ఆయన మరణానంతరం తెలుగు రాష్ట్రాల్లో వివిధ జిల్లాల్లో, వివిధ పేర్లతో కొనసాగుతున్న ప్రగతిశీల విద్యార్థి భావాలు కలిగిన సంస్థలనూ, విద్యార్థులను ఏకం చేస్తూ... కామ్రేడ్ జేసీఎస్ ప్రసాద్ నేతృత్వంలో జార్జి స్ఫూర్తితో పీడీఎస్‌యూ స్థాపన జరిగింది. నిరు ద్యోగ సమస్య పరిష్కారం కావాలని, ప్రజల ఆకలి బాధలు తీరాలని, అసమానతలు పోవాలని ఆనాటి ఉద్యమ నాయకత్వం ఆలోచించింది. ఆ తరంలోని మెరికల్లాంటి యువ కిశోరాలు నేటి వరకు విప్లవోద్యమంలో, ప్రజా సంఘాల్లో పనిచేస్తున్నారు. ఐదు దశాబ్దాల కాలంలో నూతన ఆర్థిక విధానాలకు, గాట్ ఒప్పందాలకు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసిన పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడింది. ర్యాగింగ్‌కు, ప్రేమ పేరుతో అమ్మాయిలపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఉద్యమాలు నిర్వహించింది. ఉస్మానియా యూనివర్సిటీలో 2000లో తీసుకు వచ్చిన విద్యార్థి వ్యతిరేక సంస్కరణలపై అలుపెరగని పోరాటాన్ని నిర్వహించింది. వేసవి



సెలవుల్లో హాస్టల్స్ మూసివేతకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించింది. యూనివర్సిటీ అధికారులు నియంతృత్వంతో ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాయాలని విధించిన నిబంధనకు వ్యతిరేకంగా పోరాడింది. పుస్తకాలు లేకుండా సెమిస్టర్ విధానాన్ని పెట్టడాన్ని ఎందుకు వద్దనుకుంటున్నామో తెలుపుతూ సుదీర్ఘ పోరాటాన్ని నిర్వహించింది.

సెమిస్టర్ వ్యతిరేక పోరాటంలో విద్యార్థినులు సాహసోపేతమైన ఉద్యమాన్ని నడిపించారు. 'బాయ్‌కాట్ ది ఎగ్జామ్స్' అని నినదిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కాలేజీ, సైఫాబాద్ పీజీ కాలేజీ, సికింద్రాబాద్ తదితర క్యాంపస్‌లలో పీజీ ఎగ్జామ్స్ బహిష్కరణతో పీడీఎస్‌యూ నాయకత్వంలో అమ్మా యిలు సాహసవంతమైన పోరాటాన్ని నిర్వహించారు. ఫలితంగా నేటి వరకు ఉస్మానియా యూనివర్సిటీలో జాతీయస్థాయి నెట్ ఎగ్జామ్ రాసే విద్యార్థులకు, పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు.

1999లో నిరుద్యోగ సమస్యపై జరిగిన ఆందోళన రాష్ట్రవ్యాప్త ఆందోళనగా మారడంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల పాత్ర ముఖ్యమైనది. ఇందులో పీడీఎస్‌యూ క్రియాశీలంగా పనిచేసింది. ఈ ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని విశ్వవిద్యాలయాలకు పాకింది. హైదరాబాద్ నగరంలో 14 విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణతో భిక్షాటనలు, ధర్నాలు, ర్యాలీలు, ముళ్ళ కంచెలను ఛేదించుకొని చేసిన ఉద్యమం హర్షణీయం. ఫలితంగా నాలుగు నెలల కాల వ్యవధిలోనే చంద్రబాబు ప్రభుత్వం నోటిఫికేషన్ వేయవలసి వచ్చింది.


ఉస్మానియా యూనివర్సిటీలో 33 శాతం మహిళా రిజర్వేషన్లలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా జరిపిన పోరాటం ఫలితంగా అన్ని కళాశాలల్లో ప్రతి డిపార్ట్‌మెంట్‌లో 33 శాతం మహిళలు ఉండే విధంగా విజయం సాధించగలిగింది. దానికి అనుగుణంగా గరల్స్ హాస్టల్స్ పెంచాలని పోరాడిన ఫలితంగా ఉస్మానియా యూనివర్సిటీలో 5 హాస్టల్స్ నిర్మాణం అయ్యాయి.

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి ఉద్యమానికి సహకరిద్దాం. 50 ఏళ్ళ పీడీఎస్‌యూ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించే ఉద్యమకారుల మవుదాం.

వ్యాసకర్త పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి
(నేడు ఓయూలో పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలు)

ఉత్తమ ఫలములు

పంచతంత్రం కావ్యం, మిత్రభేదంలోని ఒక కథలో 'అనుభవతకు రాని యర్థంబు గల్గియు, లేని ఫలమె కాని లేదు సుఖము' అన్నాడు దూబగుంట నారాయణ కవి. మనసులో ఏ సంకోచమూ లేకుండా సంతోషంగా అనుభవించడానికి పనికి రానటువంటి డబ్బు ఎంత కలిగి ఉన్నప్పటికీ ఆ డబ్బు వలన ఏమిటి ప్రయోజనం? డబ్బులేనితనమే గాని ఆ స్థితి వలన ఏ సుఖమూ వుండదు– అని ఆ మాటల భావం. అయితే, అందులోని 'అనుభవత' అనే మాటకు 'ఏది హద్దు?' అనే ప్రశ్న వేసుకుంటే 'ఇదిగో ఇంతవరకు!' అని తేల్చి చెప్పగలిగే అవకాశం లేదు. విచ



క్షణ కలిగిన వ్యక్తికి, సంపాదించడంలోని కష్టం తెలిసిన వ్యక్తికి, ఆ హద్దు ఏదో తెలిసే ఉంటుంది. అది తెలియని వ్యక్తికి చివరికి 'అనుభవత'కు సంబంధించిన జ్ఞాపకాలు మాత్రం మిగిలి, డబ్బు మాయమవడం జరుగుతూ ఉంటుంది. అదలా ఉండగా, ఒక వ్యక్తి సంపాదించిన డబ్బుకు, అతడికి దైవవశాత్తూ కలిగిన ఇతర సంపదలకు 'నిజమైన ఫలములు ఏవి?' అనే ప్రశ్నకు 'సింహాసన ద్వాత్రింశిక' కథాకావ్యం, తృతీయాశ్వాసంలోని ఈ కింది కంద పద్యంలో ఒక మంచి వివరణ ఇచ్చాడు ఆ కావ్యకర్త కొఱవి గోపరాజు.

ధనమునకు దానమును దప
మున కాచారమును రాజ్యమున కాజ్ఞయు జీ
వనమునకు యశము విద్యకు
వినయంబును నీతులకు వివేకము ఫలముల్.

సంపదకు దానం ఉత్తమమైన ఫలం. తపస్సు వలన సదాచార సంపన్నత ప్రయోజనం. రాజ్యపాలనాధికారానికి పలువురిచే పాటించబడే ఆజ్ఞను ఇవ్వగలగడమనేది ఫలం. జీవించామనడానికి నిదర్శనంగా, మరణించిన తరువాత కూడా తాను తెలిసిన వారందరి జ్ఞాపకాలలో నిలిచి ఉండేలా చేసే కీర్తిని సంపాదించి యశఃకాయుడు కావడం ప్రయోజనం. విద్యకు వినయంతో కూడిన నడవడి, చెప్పబడిన నీతికి వివేకంతో కూడిన బుద్ధి లభించడం ప్రయోజనాలు. ఆ ప్రయోజనాలు నెరవేరినప్పుడు మాత్రమే అవి సార్థకాలవుతాయి. నెరవేరనప్పుడు ఆ సంపదకు, తపస్సుకు, అధికారానికి, జీవితానికి, విద్యకు, నీతులకు ఆశించిన ప్రయోజనం సమకూరినట్లు కాదు. ఆ యా వ్యక్తులలో అవి ఎవరికీ ఉపయోగం లేని వృథా సంపదలుగా మిగిలుండి, కాలం తీరాక ఏ ప్రయోజనం లేనివిగా, నిష్ఫలంగా అంతరించిపోతాయి అని భావం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** బ.త్రయోదశి సా.6.59 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** మఖ ఉ.7.46 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.4.31 నుండి 6.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.15 నుండి 1.03 వరకు, తదుపరి ప.2.39 నుండి 3.27 వరకు, **అమృతఘడియలు:** రా.2.56 నుండి 4.43 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.53, **సూర్యాస్తమయం:** 5.49.

క్లుప్తంగా...

కార్యాలయ నిర్వహణ గ్రాంట్స్ విడుదల చేయండి

ప్రభుత్వానికి ఎంఈవో–1 అసోసియేషన్ విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: ఏపీలోని మండల విద్యాశాఖ కార్యాలయాల నిర్వహణకు గ్రాంట్స్ విడుదల చేయాలని మండల విద్యాశాఖాధికారులు (ఎంఈవో)–1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బి.రవినాయక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఆదివారం కోరారు. కార్యాలయాల నిర్వహణ నిధులు లేకపోవడంతో ఎంఈవోలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో నిర్వహణ గ్రాంట్‌ను రూ.2 లక్షలకు పెంచాలని కోరారు.

నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా రాంబాబు



ఏపీ ప్రభుత్వ కాలేజీల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం

ఒంగోలు: ఏపీ ప్రభుత్వ కాలేజీల నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా దేగ రాంబాబు ఎంపికయ్యారు. స్థానిక ప్రైవేటు ఫంక్షన్‌హాలులో ఆదివారం నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికకు పరిశీలకులుగా ఎన్.ఏడుకొండలు, డాక్టర్.ఎస్.తిరుపతిస్వామి వ్యవహరించారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా గడ్డం శ్రీనివాసరావు, కె.సులక్షణ, కె.సుశీల, కోశాధికారిగా జి.ప్రభాకరరావు ఎంపికయ్యారు.

'లడ్డూ'పై కూటమి నేతల తీరు ఆక్షేపణీయం

కాన్వ విద్యా పీఠాధిపతి అనిపెద్ది



కొయ్యలగూడెం: తిరుమల శ్రీవారి లడ్డూ విషయంలోను, మాజీ సీఎం వైఎస్ జగన్ డిక్లరేషన్ విషయంలోను కూటమి నాయకుల తీరు ఆక్షేపణీయంగా ఉందని కాన్వ విద్యా పీఠాధిపతి బ్రహ్మశ్రీ అనిపెద్ది వేంకట నరసింహ శర్మ మూర్తి అన్నారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలోని పీఠంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూను వివాదాస్పదం చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని చెప్పారు. నిజంగా లడ్డూల్లో కల్తీ గుర్తిస్తే అందుకు బాధ్యులైన వారిని ప్రభుత్వం శిక్షించి తీరాలన్నారు. కానీ ఈ విషయంలో టీటీడీ ఈవో, సీఎం, ఉప ముఖ్యమంత్రుల ప్రకటనలు పొంతన లేని విధంగా ఉన్నాయని తెలిపారు. శ్రీవారి లడ్డూ కల్తీ అనేది సామాన్యమైన విషయం కాదని, దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నాగశయనం



నాగశయనంను సత్కరిస్తున్న సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఉట్టి నాగశయనం ఎన్నికయ్యారని సంఘ అసోసియేట్ అధ్యక్షుడు తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు దేవాంగ కర్ల నాగరాజు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో సంఘం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఆదివారం సమావేశమై రాయలసీమ ప్రాంతానికి చెందిన నాగశయనంను రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని పేర్కొన్నారు. ఈ పదవిలో ఆయన ఏడాదిపాటు కొనసాగుతారని తెలిపారు.

పోరాట ఫలం అఖిల భారత గిరిజన ఉద్యోగ సంఘం

జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హుస్సేన్ నాయక్, పక్కన రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయ స్వామి

ఒంగోలు సబర్బన్: ఎంతోమంది పోరాటాల ఫలితంగానే అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నిలబడిందని జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డైమండ్ జూబ్లీ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్రంలోని మైదాన ప్రాంతాల గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు. సభాధ్యక్షునిగా సంఘం సీనియర్ నాయకుడు డాక్టర్ బాలాజీ నాయక్ వ్యవహరించారు.



శ్రీవారి సన్నిధిలో సీజేఐ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, ఏఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఆలయ రంగనాయకుల మండపంలో సీజేఐకు వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఈవో తీర్థప్రసాదాలు అందజేశారు. – తిరుమల

తిరుమలేశుని చెంత.. ప్రకృతి పరవశం



తిరుపతి అలిపిరి మార్గం నుంచి ఏడుకొండల వ్యూ ఆకట్టుకుంటోంది. మేఘాలకు పచ్చ తోరణం కట్టినట్టుగా భక్తులకు స్వాగతం పలుకుతోంది. ఈ ఆధ్యాత్మిక నగరాన ప్రకృతి సోయగాన్ని ఆదివారం ఉదయం 'సాక్షి' కెమెరా ఒడిసిపట్టింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



బ్రహ్మోత్సవ శోభ

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. శ్రీవారి ఆలయంపై విద్యుత్ అలంకరణలు పూర్తికావచ్చాయి. ఆదివారం సాయంత్రం లైటింగ్ వేసి అధికారులు పరిశీలించారు. తిరుమల వ్యాప్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భక్తులను ఆహ్వానిస్తూ కటౌట్లు ఏర్పాటుచేశారు. – తిరుమల

కనుడు కనుడు రామాయణ గాథ



శ్రీరామనారాయణం ప్రాంగణంలోని రీసెర్చ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలు (ఇన్‌సెట్) వాల్మీకి చిత్రం

- విజయనగరంలో ఏర్పాటైన వాల్మీకి రీసెర్చ్ సెంటర్
- ప్రపంచంలోనే తొలి రీసెర్చ్ సెంటర్ ఇదే
- మానవత్వ విలువల్ని భావితరాలకు అందించడమే లక్ష్యం

విజయనగరం రూరల్: రామాయణంలోని మానవత్వ విలువలను భావితరాలకు అందించడం కోసం ప్రముఖ వ్యాపారవేత్త నారాయణం నరసింహమూర్తి పన్నెండేళ్ల క్రితం బృహత్ సంకల్పం చేసి శ్రీరామ నారాయణం ప్రాంగణం నెలకొల్పారు. నరసింహమూర్తి మొదటినుంచీ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. నరసింహమూర్తి మరణానంతరం ఆయన సంకల్పానికి తోడుగా వాల్మీకి రామాయణంలోని వివిధ కోణాలపై పరిశోధనల్ని ప్రోత్సహించడంతోపాటు రామాయణాన్ని భావితరాల జీవన మార్గంగా మలిచేందుకు ఆయన కుటుంబ సభ్యులు శ్రీవాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. ఇప్పటివరకూ శ్రీరామ నారాయణం ఒక ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే. వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో రామాయణంపై పరిశోధనలకు మరో అడుగు ముందుకు పడింది.

12 వేల గ్రంథాలు ఏర్పాటు

వాల్మీకి రామాయణం రీసెర్చ్ కేంద్రంలో రామాయణానికి సంబంధించిన 12 వేల గ్రంథాలను అందుబాటులో ఉంచారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్యను లక్షకు పైగా పెంచే ఆలోచనతో ఉన్నామని నరసింహమూర్తి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ గ్రంథాలు తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లంతో పాటు ఇతర ప్రముఖ భాషల్లో అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, యువత, ఆధ్యాత్మిక వేత్తలు, పండితులు, ప్రవచనకర్తలు, గురూజీలు, నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలుగా రీసెర్చ్ కేంద్రం లోనే ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా పీహెచ్‌డీ చేసే వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని నరసింహమూర్తి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

యువత రావాలి



ఈ కేంద్రానికి ప్రధానంగా యువత ముందుకు వచ్చి రీసెర్చ్ చేయాలి. రామాయణం ప్రబోధించే విలువలు, సీతారాముల కథను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి. ఇంతటి అద్భుతమైన కేంద్రాన్ని ప్రారంభించి సమాజానికి అవకాశం కల్పించిన నారాయణం కుటుంబ సభ్యులు అభినందనీయులు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సందర్శించి జీవన మార్గాన్ని సుగమం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.వైష్ణవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి

పూర్వజన్మ సుకృతం



మా తండ్రి ఆశయం మేరకు శ్రీరామనారాయణం ప్రాంగణంలో వాల్మీకి రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. దేశంలో పలు మార్గాల్లో ఉన్న ఆధ్యాత్మిక గురువుల సలహాలు, ఆశీస్సులతో ఈ కేంద్రం ఏర్పాటుచేసి సమాజ శ్రేయస్సుకు మా వంతు కృషి చేస్తున్నాం

– నారాయణం శ్రీనివాస్, ఫౌండర్, శ్రీరామనారాయణం ప్రాంగణం

తిరుమలలో భారీ కొండ చిలువ



తిరుమల: తిరుమలలో 14 అడుగుల భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. టీటీడీ అటవీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక శంకరమఠం సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి భారీ కొండచిలువ మఠంలోకి ప్రవేశించింది. మఠం నిర్వాహకులు భాస్కర్‌నాయుడుకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని అవ్వాచ్చారి కోనలో విడిచిపెట్టారు.

శ్రీవారి సేవలో ఐసీసీ అధ్యక్షుడు జైషా



తిరుమల శ్రీవారిని ఐసీసీ అధ్యక్షుడు జైషా దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి నైవేద్య విరామం అనంతరం ప్రత్యేక ప్రత్యేక ప్రవేశ దర్శనంలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే 'కల్తీ' డ్రామాలు

బహుజన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే 'కల్తీ' డ్రామాలు ఆడుతోందని ఆంధ్రప్రదేశ్ బహుజన కులాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి గురుప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. తిరుమలను అపవిత్రం చేసేలా సీఎం చంద్రబాబు మత రాజకీయాలు చేస్తుంటే.. తమకు పరిహారం అందలేదని విజయవాడ వరద బాధితులు కలెక్టరేట్‌పై తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. వరుస వైఫల్యాలను డైవర్ట్ చేసేందుకు సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రోజుకో డ్రామా ఆడుతున్నారని విమర్శించారు.

పిల్లలను తోసి కాలువలోకి దూకిన తల్లి

- నాలుగు నెలల చిన్నారి మృతదేహం లభ్యం
- మరో పాప, తల్లి గల్లంతు
- గాలిస్తున్న పోలీసులు



జాస్వీతో సుధారాణి(ఫైల్)

పటమట(విజయవాడతూర్పు): ఓ తల్లి తన ఇద్దరు కుమార్తెలను కాలువలోకి నెట్టి, తానూ దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనలో ఓ చిన్నారి మృతదేహం లభించగా.. తల్లి, మరో కుమార్తె ఆచూకీ లభించలేదు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని స్క్రూబ్రిడ్జి వద్ద ఆదివారం ఈ ఘటన జరిగింది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలే దీనికి కారణమని తెలిసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. గుంటూరు శారద కాలనీకి చెందిన తిరుపతిరావు రోజువారీ పనులకు వెళ్తుంటాడు. అతనికి సుధారాణి(25)తో ఐదేళ్ల కిందట వివాహమైంది. వారికి జాస్వీ (16 నెలలు), బ్లెస్సీ(4 నెలలు) సంతానం. శనివారం గుంటూరులో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. విజయవాడ కృష్ణలంకలోని కళానగర్‌లో నివసించే తిరుపతిరావు బావ కోటేశ్వరరావు ఇంటికి భార్యాభర్తలు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఫోను వచ్చిందని తిరుపతిరావు బయటకు వెళ్లాడు. ఆ వెంటనే సుధారాణి తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వచ్చి స్క్రూబ్రిడ్జికి చేరుకుని ఇద్దరు పిల్లలను బందరు కాలువలో పడేసి ఆమె కూడా దూకింది. స్థానికులు దీనిని గమనించి వారిని కాపాడే ప్రయత్నం చేయగా బ్లెస్సీ మృతదేహం దొరికింది. విషయం తెలుసుకున్న పటమట సీఐ పవన్‌కిషోర్ ఎన్‌డీఆర్ఎఫ్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో జాస్వీ, సుధారాణిల ఆచూకీ లభించలేదు. పోలీసులు తిరుపతిరావును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జన్యు మార్పిడి పంటలతో ప్రజారోగ్యానికి ముప్పు

- ఆయా పంటలపై విధాన రూపకల్పనకు కేంద్రం సంప్రదింపులు జరపాలి
- కేంద్రానికి దక్షిణ భారత రైతు సంఘాల నాయకుల విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: జన్యు మార్పిడి పంటల మూలంగా ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జన్యు మార్పిడి పంటలపై దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నాయకులతో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ జాతీయ నాయకులు కోదండరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రైతు స్వరాజ వేదిక సంఘం ప్రతినిధులు కవిత, కె.రవి, తమిళనాడు రైతు సంఘం ప్రతినిధులు పీఎస్ పాండ్యన్, సుందర విమల నందన్, కర్ణాటక రైతు సంఘం ప్రతినిధి బాలకృష్ణన్, కేరళ రైతు సంఘం ప్రతినిధులు కేవీ బిజు, ఉష, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రైతు సంఘం నాయకులు సాగర్, భారతీయ కిసాన్ సంఘం ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాదాపు 40 రైతు సంఘాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. మన ఆహారం, వ్యవసాయంలో జన్యు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించవద్దని వారు కోరారు. ప్రజలందరితో, వివిధ వర్గాలతో, ప్రత్యేకంగా రైతులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి జన్యుమార్పిడి పంటలపై జాతీయ విధానాన్ని రూపొందించాలని భారత ప్రభుత్వానికి ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిన దరిమిలా ఈ సదస్సు జరిగింది. ఈ జన్యు మార్పిడి విత్తనాల వలన రైతు విత్తన స్వాతంత్రం కోల్పోవడంతో పాటు విత్తనం కార్పొరేట్ రంగాల చేతుల్లోకి వెళ్తుందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై దేశవ్యాప్తంగా రైతులతోపాటు వినియోగదారులను సైతం కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జన్యు మార్పిడి పంటల ఆలోచన విధానానికి స్వస్తి పలికేలా ముందుకు సాగుతామని నిర్ణయించారు. స్వావలంబన, ఆర్థిక నష్టాలు, రైతుల పైన భారం, పర్యావరణ విధ్వంసం కలిగించే జన్యుమార్పిడి పంటలను అనుమతించబోమని ఏకగ్రీవంగా తీర్మానించారు.

అక్టోబర్ 1నాటికి దసరా ఏర్పాట్లు పూర్తి: మంత్రి ఆనం



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి ఆనం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): అక్టోబర్ 1 సాయంత్రం నాటికి దసరా ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేస్తామని దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి ఆనం, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సత్యనారాయణ, కలెక్టర్ సృజన, పోలీస్‌కమిషనర్ రాజశేఖరబాబు, ఎమ్మెల్యే సుజనా చౌదరి, దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి ప్రారంభమయ్యే క్యూలైన్‌లో తాగునీటి కోసం ప్రత్యేక పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఉత్సవాల్లో రూ.500 వీఐపీ టికెట్ కొనుగోలు చేసిన భక్తులకు బంగారు వాకిలి దర్శనం కల్పిస్తామని చెప్పారు.

తాతయ్య ప్రోత్సాహమే నడిపించింది

- తెలుగు ఇండియన్ ఐడల్–3 విజేతగా నిలిచిన మెకానిక్ కొడుకు
- తాతయ్య వద్ద నేర్చుకున్న సరిగమలే ఆధారం
- 15 వేల మందితో పోటీపడి.. టాప్–12కు ఎంపిక
- వారితో పోటీపడి సంగీత సంగ్రామంలో గెలిచిన తాడేపల్లిగూడెం కుర్రోడు
- సంగీత సంచలనం నజీరుద్దీన్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ



తాతయ్య షేక్ ఖాసింతో నజీరుద్దీన్ షేక్

సాక్షి, అమరావతి: మెకానిక్ కొడుకు.. సరిగమలలో చెలరేగిపోతుంటే సంగీత సరస్వతి పులకించింది. 'ఈ పేటకు నేనే మేస్త్రీరి.. నిరుపేదల పాలిట పెన్నిది' అంటూ ఓ పేదింటి కుర్రాడు పాడుతుంటే.. సంగీత దర్శకులు, గాయకులు, వీక్షకుల మనస్సులు చిందులు వేశాయి. తాత ఇచ్చిన ప్రోత్సాహం.. అమ్మ లేని ఆ యువకుడి అకుంఠిత దీక్ష.. ప్రతిష్టాత్మక తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్–3లో విజేతగా నిలిపింది. కష్టాలే మెట్లుగా, కన్నీళ్లే ఇంధనంగా మలుచుకుని తన అద్భుత స్వరంతో సంగీత ప్రియుల హృదయాలను గెలిచిన యువ సంచలనం నజీరుద్దీన్ షేక్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ. ఆ విశేషాలు నజీర్ మాటల్లోనే..

అమ్మ లేని బాధ నుంచి బయటపడటానికి..

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మా ఊరు. మా నాన్న షేక్ బాజీ మోటర్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవారు. అమ్మ మదీనా గతేడాది అనారోగ్యంతో మాకు దూరమయ్యారు. ఆ బాధ నుంచి బయటపడటానికి తెలుగు ఇండియన్ ఐడల్ సీజన్–3ని ఉపయోగించుకున్నా. మా తాతయ్య షేక్ ఖాసిం దాదాపు 47 ఏళ్లుగా ఘంటసాల గాన సభ పేరుతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. తాడేపల్లిగూడెంలో ఘంటసాల విగ్రహం కూడా పెట్టించారు. రాగమయి ఆర్కెస్ట్రా స్థాపించి గాన కచేరీలు నిర్వహించేవారు. నాకు సంగీతంపై మక్కువ కలగడానికి.. ఆయనే కారణం. నా ఆసక్తిని గమనించి నాలుగేళ్ల వయసు ఉన్నప్పుడే షణ్ముకి ఆంజనేయులు కుమారుడు షణ్ముకి వినయ్ వద్ద కీ బోర్డు నేర్పించారు. ఐదేళ్లకే పాటలు పాడేందుకు శిక్షణ ఇచ్చారు. తొమ్మిదేళ్లు వచ్చేసరికి నేను వేదికలపై పాటలు పాడే స్థాయికి చేరా. తాతయ్య చెల్లెలు షేక్ ఫాతిమా కూడా ఓ ప్రైవేటు స్కూల్‌లో సంగీత ఉపాధ్యాయురాలిగా పనిచేసేవారు. ఆమె నుంచి సంగీతంలో మెళకువలు నేర్చుకున్నా.

రూ.పది లక్షల కన్నా.. ప్రపంచ గుర్తింపే గొప్ప

హైదరాబాద్‌లో తెలుగు ఇండియన్ ఐడల్ కార్యక్రమం కోసం ఆడిషన్లు జరుగుతున్నాయని తెలిసి వెళ్లాను. సంగీత దర్శకుడు తమన్ మెచ్చుకుని పోటీకి ఎంపిక చేశారు. దాదాపు 15 వేల మంది ఆడిషన్లకు వస్తే.. 12 మందికి మాత్రమే పోటీచేసే అవకాశం లభించింది. 'ఆహా' ఓటీటీ వేదికగా దాదాపు 28 వారాల పాటు పోటీ జరిగింది. అందులో విజేతగా నిలవడం జీవితంలో అతి పెద్ద విజయంగా భావిస్తున్నా. పవన్‌కళ్యాణ్ 'ఓజీ'తో పాటు నాని, సుధీర్‌బాబు సినిమాల్లో పాటలు పాడే అవకాశం దక్కింది. బహుమతిగా వచ్చిన రూ.10 లక్షలకన్నా.. నా కష్టాన్ని, టాలెంట్‌ను ప్రపంచం గుర్తించిందనే సంతోషం ఎక్కువగా ఉంది. ప్రముఖ గాయకులతో కలిసి విదేశాల్లో త్వరలో సంగీత ప్రదర్శన ఇవ్వబోతున్నానంటే నన్ను ఆదరించి ప్రోత్సహించిన ప్రతి ఒక్కరి ఆశీర్వాదం వల్లే. తెలుగు ఇండియన్ ఐడల్ వల్ల సంగీత దర్శకుడు తమన్, గాయకులు కార్తీక్, గీతామాధురితో పాటు సహ గాయకుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. సీఏ పూర్తి చేసి చదువులోనూ, సినీ గాయకుడిగానూ రాణించాలనుకుంటున్నా. ఏఆర్ రెహ్మాన్ సినిమాల్లో పాడటం నా కల. ఆ అవకాశం కోసం ఎదురుచూస్తుంటా.

కుల గణన కోసం అక్టోబర్ 9న మహాధర్నా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్ణచంద్రరావు, నేతలు

సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో అక్టోబర్ 9న విజయవాడలో మహాధర్నా చేపట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), బీసీ సంఘాల సమావేశం తీర్మానించింది. విజయవాడలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కుల గణన కోసం మహా ధర్నా పోస్టర్, రాష్ట్రంలో కుల రాజకీయాలపై బుక్‌లెట్‌లను బీఎస్పీ, బీసీ నేతలు ఆవిష్కరించారు. బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ బీసీల పార్టీ అని చెప్పుకొనే టీడీపీ అధికారం కోసం ఓట్లు దండుకోవడం మినహా వెనుకబడిన వర్గాలకు చేసిన మేలేంటో చెప్పాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్రంలో కుల జనగణన (లెక్కలు) తేల్చకపోతే ప్రజలే కూటమి ప్రభుత్వ లెక్క తేలుస్తారని హెచ్చరించారు.

స్పేస్‌ఎక్స్ మిషన్‌లో... స్వల్ప సమస్య

వాషింగ్టన్: స్పేస్‌ఎక్స్ సంస్థ క్రూ–9 డ్రాగన్ అంతరిక్ష ప్రయోగంలో చిరు వైఫల్యం చోటుచేసుకుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌ను క్షేమంగా వెనక్కి తీసుకొచ్చేందుకు నాసాతో కలిసి స్పేస్ ఎక్స్ శనివారం ఈ మిషన్ చేపట్టడం తెలిసిందే. అమెరికాలో ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ నుంచి ఫాల్కన్9 రాకెట్ ద్వారా క్రూ–9 డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగించింది. ఇది విజయవంతమైనట్టు ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. అయితే, ''డ్రాగన్ వ్యోమనౌక రాకెట్ నుంచి విజయవంతంగా విడిపోయి ఐఎస్ఎస్ వైపు సాగింది. అనంతరం ఫాల్కన్9 రాకెట్ క్షేమంగా భూమిపైకి తిరిగి



వచ్చింది. అందులోని రెండో దశ మాత్రం సముద్రంలో పడాల్సిన చోటికి కాస్తంత దూరంలో పడిపోయింది'' అని స్పేస్‌ఎక్స్ వెల్లడించింది. ఇందుకు కారణాలపై పరిశోధన చేస్తున్నట్లు పేర్కొంది. ఫాల్కన్9 పునర్వినియోగ రాకెట్. ఇందులోని రెండో దశ విఫలం కావడం ఇది రెండోసారి. ఇది స్పేస్‌ఎక్స్‌కు ఇబ్బందికరంగా మారింది. పొరపాట్లు సరి చేసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆ సంస్థ చెబుతోంది. క్రూ–9 రాకెట్‌లో నాసా వ్యోమగామి నిక్ హేగ్, రోస్కోస్మాస్ కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఐఎస్ఎస్‌కు పయనమయ్యారు. సునీత, విల్మోర్‌లను వెనక్కు తీసుకొచ్చేందుకు వీలుగా రెండు సీట్లను ఖాళీగా ఉంచారు. వారిద్దరూ జూన్‌లో స్టార్‌లైనర్ తొలి ప్రయోగంలో భాగంగా ఐఎస్ఎస్ చేరుకోవడం తెలిసిందే.

ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాది హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో కొనసాగుతున్న ఎదురుకాల్పుల ఘటనలో ఒక ఉగ్రవాది హతమైనట్లు పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం బిల్లావర్ తహశీల్ కొగ్–మండ్లిలో మొదలైన ఈ ఎన్‌కౌంటర్‌లో హెడ్ కానిస్టేబుల్ ఒకరు చనిపోగా డీఎస్పీ, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గాయపడ్డారు. వీరికి ఎటువంటి ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. కనీసం నలుగురు విదేశీ ఉగ్రవాదులు ఓ ఇంట్లో దాగున్న విషయం తెలిసిన బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. రెండో రోజైన ఆదివారం ఒక ఉగ్రవాది చనిపోయాడని అదనపు డీజీపీ ఆనంద్ జైన్ చెప్పారు. సంఘటన ప్రాంతంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

అభినవ రాహు కేతువులు!

జంట ఉపగ్రహాలతో సంపూర్ణ సూర్యగ్రహణ సృష్టి ● 'ప్రోబా–3'కు ఈఎస్ఏ సన్నాహాలు ● త్వరలో ఇస్రో ప్రయోగం

సూర్యగ్రహణం వేళ భానుడిని రాహువు అమాంతం మింగేస్తాడని, చంద్రగ్రహణం కాలంలో నెలరేడును కేతువు కబళిస్తాడని జ్యోతిషం చెబుతుంది. కానీ సూర్యుడికి, భూమికి నడుమ చంద్రుడు అడ్డొస్తే సూర్యగ్రహణం; సూర్యుడికి, చంద్రుడికి మధ్య భూమి అడ్డొస్తే చంద్రగ్రహణం ఏర్పడతాయని సైన్స్ వివరిస్తుంది. తాజాగా శాస్త్రవేత్తలు మాత్రం కృత్రిమ రాహు కేతువుల సాయంతో కావాల్సినప్పుడల్లా సంపూర్ణ సూర్యగ్రహణాలు సృష్టించే పనిలో పడ్డారు. ఎవరా రాహుకేతువులు అనుకుంటున్నారా? యూరోపియన్ అంతరిక్ష సంస్థ (ఈఎస్ఏ) త్వరలో ప్రయోగించనున్న జంట ఉపగ్రహాలు! ఈ స్పేస్ మిషన్ పేరు 'ప్రాజెక్ట్ ఫర్ ఆన్–బోర్డ్ అటానమీ–3 (ప్రోబా–3). ఇందులో రెండు ఉపగ్రహాలుంటాయి. ఇవి కక్ష్యలో పరస్పరం అతి దగ్గరగా మోహరిస్తాయి. మొదటి ఉపగ్రహం సూర్యుడిని పూర్తిగా అడ్డుకుంటుంది. తద్వారా రెండో ఉపగ్రహం నుంచి సూర్యుడు కనబడకుండా చేస్తుంది. అలా కొన్ని గంటలపాటు కృత్రిమ సూర్యగ్రహణాలను ఏర్పరచడం ఈ స్పేస్ మిషన్ లక్ష్యం.

రెండు ఉపగ్రహాలు... ఒకటిగా!

'ప్రోబా–3' రెండేళ్లు పనిచేసే జంట శాటిలైట్ల వ్యవస్థ. ఇది అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానంతో కూడుకున్న మిషన్ అని యూనివర్సిటీ కాలేజీ లండన్ సౌర భౌతిక శాస్త్రవేత్త ఫ్రాన్సిస్కో డీగో తెలిపారు. మిషన్ ప్రణాళికకు పదేళ్లకు పైగా వ్యవధి పట్టిందన్నారు. భూమి చుట్టూ కక్ష్యలో పరిభ్రమించేటప్పుడు ప్రోబా–3లోని జంట ఉపగ్రహాలు ఒకదానికొకటి కేవలం 144 మీటర్లు ఎడంగా ఉంటాయి. మిల్లీమీటరు కూడా తేడా రానంత కచ్చితత్వంతో వాటిని అతి దగ్గరగా లాక్ చేసేందుకు కాంప్లెక్స్ సెన్సర్ల శ్రేణిని అభివృద్ధి చేశారు. ఇవి రెండూ వేర్వేరు ఉపగ్రహాలైనా 144 మీటర్ల పొడవుండే ఒకే అబ్జర్వేటరీలా పనిచేయడం ఈ ప్రయోగంలోని విశేషం. ఇందులో సౌరగోళాకృతితో సూర్యకాంతిని అడ్డుకునే 200 కిలోల బరువైన 'అకల్టర్' ఉపగ్రహం, కరోనాపై అధ్యయనం చేసే 340 కిలోల బరువైన 'కరోనాగ్రాఫ్' ఉపగ్రహం ఉంటాయి. అవి రెండూ భూమి చుట్టూ అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో సరైన ప్రదేశంలోకి వచ్చినప్పుడు అకల్టర్ తన ముందు భాగంలో 1.4 మీటర్ల వ్యాసంలో ఉండే ఓ గోళం లాంటి పరికరాన్ని ఆవిష్కరిస్తుంది. కరోనాగ్రాఫ్ నుంచి చూసినప్పుడు సూర్యుడు కనిపించకుండా ఆ పరికరం సూర్యున్ని పూర్తిగా కప్పేస్తుంది. అంటే కరోనాగ్రాఫ్‌లోని టెలిస్కోప్ మీద సూర్యకాంతి నేరుగా పడదు. అలా రోజులో ఆరు గంటలపాటు కృత్రిమ సూర్యగ్రహణం ఆవిష్కృతమవుతుంది. అప్పుడు అకల్టర్ ఛాయలో సూర్యుడి కరోనాను కరోనాగ్రాఫ్ నిశితంగా పరిశీలిస్తుంది. ఈ విశేషాలతో బ్రిటన్ పత్రిక 'ది అబ్జర్వర్' తాజాగా ఓ కథనం ప్రచురించింది.

– జమ్ముల శ్రీకాంత్

త్వరలో శ్రీహరికోట నుంచి ప్రయోగం!

'ప్రోబా–3 జంట శాటిలైట్ల ప్రయోగం త్వరలో శ్రీహరికోటలోని షార్ వేదిక నుంచి జరగనుంది. పీఎస్ఎల్వీ (ఎక్స్ఎల్) వెర్షన్ రాకెట్ సాయంతో ఇస్రో ఈ ప్రయోగం చేపట్టనుంది. ప్రతి 19.7 గంటలకోసారి భూమి చుట్టూ పరిభ్రమించే ఈ ఉపగ్రహాలను భూమికి 600 X 60,530 కిలోమీటర్ల అతి దీర్ఘవృత్తాకార కక్ష్యలో ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. యూరోపియన్ అంతరిక్ష సంస్థకు చెందిన 'వేగా–సి' రాకెట్‌కు అంత సామర్థ్యం లేకపోవడం, ఏరియన్–6 రాకెట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో ప్రయోగానికి ఇస్రోను ఈఎస్ఏ ఎంచుకుంది. ప్రయోగ తేదీలను ఖరారు చేయాల్సి ఉంది.



ఉపయోగాలేమిటి?

- సూర్యుడిని లోతుగా అధ్యయనం చేయడానికి ప్రోబా–3 ప్రయోగం ఎంతగానో దోహదపడుతుందని పరిశోధకులు అంటున్నారు.
- విద్యుత్ లైన్లు, గ్లోబల్ పొజిషనింగ్ వ్యవస్థ ఉపగ్రహాలు, ఇతరత్రా భూ సంబంధ టెక్నాలజీకి సూర్యుడు కలిగించే సమస్యలు, అంతరాయాలపై అవగాహన పెంచడానికి ఉపకరిస్తుందని భావిస్తున్నారు.
- గురుత్వ తరంగాలు, కృష్ణ బిలాలు, సౌరకుటుంబం వెలుపలి నక్షత్ర వ్యవస్థల్లో గ్రహాలకు సంబంధించి భవిష్యత్తులో చేపట్టే అధ్యయనాలకు ప్రోబా–3 మిషన్ మార్గదర్శి కాగలదని ఈఎస్ఏ శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- కరోనల్ మాస్ ఎజెక్షన్ (సీఎంఈ) ప్రక్రియలో సూర్యుడు అంతరిక్షంలోకి భారీగా ప్లాస్మాను వెదజల్లుతాడు. ఆ విద్యుదావేశిత కణాలతో కూడిన ప్లాస్మా భూ ఎగువ వాతావరణాన్ని ఢీకొని ధ్రువకాంతులైన అరోరాలను సృష్టించడంతో పాటు భూమిపై విద్యుత్ ప్రసారాలకు అవాంతరాలు కలిగిస్తుంది. వీటిపై ప్రోబా–3 అవగాహనను పెంచుతుందని, అది పంపే ఫలితాలు సౌర భౌతికశాస్త్రాన్ని సమూలంగా మార్చేస్తాయని భావిస్తున్నారు.

ఎందుకీ ప్రయోగం?

సంపూర్ణ సూర్యగ్రహణాలు భూమిపై సగటున రెండేళ్లకోసారి మాత్రమే వస్తాయి. వాటి అధ్యయనానికి పరిశోధకులు చాలా దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ''అంత కష్టపడినా వాతావరణం అనుకూలించకుంటే ప్రయత్నాలన్నీ వృథాయే. అనుకూలించినా కొద్ది నిమిషాలు మాత్రమే సంపూర్ణ సూర్యగ్రహణాన్ని అధ్యయనం చేసే అవకాశం లభిస్తుంది. కూలంకషమైన పరిశోధనలకు అది చాలదు. సూర్యగ్రహణాలను అనుకరించేలా టెలిస్కోపులకు కరోనాగ్రాఫ్స్ అమర్చి సౌర కరోనాను అధ్యయనం చేస్తుంటారు. కానీ అంతర కరోనాను అవి క్షుణ్నంగా అధ్యయనం చేయలేవు'' అని 'ప్రోబా–3' ప్రాజెక్టు మేనేజర్ డేమియన్ గలీనో వివరించారు. సూర్యుడి ఉపరితలంపై ఉష్ణోగ్రత 6 వేల డిగ్రీల సెల్సియస్ కాగా బాహ్య పొర అయిన కరోనా ఉష్ణోగ్రత పది లక్షల డిగ్రీల దాకా ఉంటుంది. ''సూర్యుడి నుంచి దూరంగా వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత తగ్గాలి. కానీ కరోనా విషయంలో అలా జరగదు. దీనికి కారణాలు తెలుసుకోవడానికి అంతర కరోనాను దీర్ఘకాలం సవివరంగా పరిశోధిస్తాం'' అని 'ప్రోబా–3' కరోనా ప్రయోగ ప్రధాన పరిశోధకుడు ఆంద్రూ జుకోవ్ తెలిపారు. కొన్ని గంటలపాటు సూర్యగ్రహణాలను సృష్టించడం ద్వారా శాస్త్రవేత్తలు ఈ మిస్టరీని ఛేదించేందుకు అవసరమైన డేటాను ఇది అందిస్తుందని చెప్పారు.

పదేళ్ల మన్‌కీ బాత్

నాకు భావోద్వేగ సందర్భమిది: మోదీ

కార్యక్రమంతో ఎన్నో జ్ఞాపకాలు ముడిపడ్డాయన్న ప్రధాని

న్యూఢిల్లీ: ''మసాలా వార్తలు, ప్రతికూల అంశాలపైనే ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతారన్న వాదనలో నిజం లేదని మన్‌కీ బాత్ నిరూపించింది. సానుకూల కథనాలు, స్ఫూర్తిదాయక అంశాలకు అమితమైన ఆదరణ ఉంటుందని ఈ కార్యక్రమంతో తేటతెల్లమైంది'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి మోదీ మాట్లాడే 'మన్‌కీ బాత్' కార్యక్రమం పదేళ్లు పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం 114వ మన్‌కీ బాత్‌లో మోదీ మాట్లాడారు. దేశ ప్రజల సామూహిక శక్తిని ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమం మారిందంటూ ప్రశంసించారు. దీనికి పదేళ్లు పూర్తయిన సందర్భం తనను భావోద్వేగానికి గురి చేస్తోందన్నారు. ''సరిగ్గా పదేళ్ల క్రితం అక్టోబర్ 3న విజయదశమి రోజున మన్‌కీ బాత్ ప్రారంభమైంది. భారత స్ఫూర్తిని వేడుక చేసుకొనే విశిష్టమైన వేదికగా మారింది. దీనితో నాకెన్నో జ్ఞాపకాలు ముడిపడి ఉన్నాయి. ఈ ప్రయాణంలో శ్రోతలు నాతోపాటు కలిసి నడిచారు. దేశ నలుమూలల నుంచి నాకు సమాచారం చేరవేశారు. మన్‌కీ బాత్ అంటే నా వరకు దైవదర్శనానికి ఆలయానికి వెళ్లడం లాంటిదే. దీనితో అనుసంధానమైన ప్రతి అంశం ద్వారా సామాన్య ప్రజలను దర్శించుకున్నట్లే భావిస్తా. ప్రజలే నాకు దేవుళ్లు. 22 భారతీయ, 12 విదేశీ భాషల్లో ఈ కార్యక్రమం ప్రసారమవుతోంది. ఈ మలుపులో మరోసారి ప్రజల ఆశీస్సులు కోరుతున్నా'' అన్నారు.

స్థానికతకు జై

స్థానిక ఉత్పత్తుల వాడకాన్ని పెంచి ప్రోత్సహిస్తే అంతిమంగా దేశానికే లబ్ధి చేకూరుతుందని మోదీ అన్నారు. ''మన గడ్డపై మన కళాకారులు, కార్మికుల రెక్కల కష్టంతో తయారైన ఉత్పత్తులే మనకు గర్వకారణం. పండుగల వేళ స్థానిక ఉత్పత్తులే కొనుగోలు చేయండి'' అని పిలుపునిచ్చారు. జల సంరక్షణలో నూతన విధానాలు చక్కటి ఫలితాలిస్తున్నాయంటూ హర్షం వెలిబుచ్చారు. ''కొన్నిచోట్ల మహిళా శక్తి జలశక్తిని పెంచుతోంది. మరికొన్నిచోట్ల జలశక్తి మహిళా శక్తికి తోడ్పడుతోంది. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌పురా గ్రామంలో భారీ నీటి కుంట నిర్మించి భూగర్భ జలాలను పెంచారు. డ్వాక్రా మహిళలు అందులో చేపలు పెంచుతూ ఉపాధి పొందుతున్నారు'' అని చెప్పారు.



పుణే మెట్రో తొలి దశ ప్రారంభం

పుణే: ''గత ప్రభుత్వాలు పట్టణాభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. అప్పట్లో ఒక ప్రణాళిక, దార్శనికత లోపించాయి. మేమొచ్చాక వచ్చాక పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. పాత పని సంస్కృతికి చరమగీతం పాడాం'' అని మోదీ చెప్పారు. ఆదివారం మహారాష్ట్రలో పుణే మెట్రో రైలు ప్రాజెక్టు మొదటి దశను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. రూ.11,200 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులు ప్రారంభించారు. కొన్నింటికి శంకుస్థాపన చేశారు. 'క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే స్మారక బాలిక పాఠశాల' నిర్మాణానికి పునాదిరాయి వేశారు. గత ప్రభుత్వాల విధానాలు అమల్లో ఉంటే పుణే మెట్రో ప్రాజెక్టు ఎప్పటికీ పూర్తయి ఉండేది కాదన్నారు. మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే చొరవతో ముంబై–అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు అడ్డంకులు తొలగుతున్నాయని చెప్పారు.

వాటికీ పదేళ్లు

ప్రతిష్టాత్మకంగా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం కూడా పదేళ్లు పూర్తి చేసుకుందని మోదీ గుర్తు చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌కూ అక్టోబర్ 2న పదేళ్లు పూర్తవుతాయన్నారు. ''ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ భారత్ విజయవంతమవుతోంది. జీవితాంతం పరిశుభ్రత కోసం తపించిన మహాత్మా గాంధీకి ఇదో గొప్ప నివాళి. ఇక పారిశ్రామికవేత్తలతో పాటు చిరు వ్యాపారుల కృషితో 'మేకిన్ ఇండియా' విజయవంతమైంది. మన యువశక్తి కృషితో తయారీ రంగానికి భారత్ కేంద్రస్థానంగా మారింది. ఆటోమొబైల్స్ మొదలుకుని రక్షణ దాకా అన్ని రంగాల్లో ఎగుమతులు పెరుగుతున్నాయి.

సీపీఎం సమన్వయకర్తగా కారత్



న్యూఢిల్లీ: సీపీఎం పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ మధ్య సమన్వయకర్త బాధ్యతలను సీనియర్ నేత ప్రకాశ్ కారత్ నిర్వర్తించనున్నారు. ఆదివారం జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఈ నెల 12న మృతి చెందడం తెలిసిందే. ఆయన స్థానంలో మరొకరి ఎన్నిక ఆలస్యమయ్యేలా ఉన్నందున పార్టీ నాయకత్వం ఇలా తాత్కాలిక ఏర్పాటు చేసింది. 2025 ఏప్రిల్‌లో మదురైలో జరిగే సమావేశంలో ప్రధాన కార్యదర్శిని ఎన్నుకునేదాకా కారత్ కొనసాగుతారని వివరించింది. సీపీఎం సీనియర్ మోస్ట్ నేతల్లో కారత్ ఒకరు. 2005–15 మధ్య పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1985లో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1992లో పొలిట్ బ్యూరో సభ్యుడయ్యారు.

మోదీని దించేదాకా పోను: ఖర్గే

- కశ్మీర్ ప్రచారసభలో స్వల్ప అస్వస్థత
- అయినా ప్రసంగించిన కాంగ్రెస్ చీఫ్




జస్‌రోటా (జమ్మూ): ప్రధాని నరేంద్ర మోదీని అధికార నుంచి దింపేదాకా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతానని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జమ్మూ సమీపంలోని జస్‌రోటీ గ్రామంలో సభలో ఆయన మాట్లాడారు. ప్రసంగం మధ్యలో కాస్త అస్వస్థతకు గురయ్యారు. తూలిపడబోతుండగా సీనియర్ నేతలు పట్టుకున్నారు. వారి సాయంతోనే ఖర్గే ప్రసంగాన్ని కొనసాగించారు. ''జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్రా హోదా దక్కేదాకా పోరాటం కొనసాగిస్తా. దీన్ని వదలిపెట్టను. నాకు 83 ఏళ్లు. అయినా అంత త్వరగా చనిపోను. మోదీని దించేదాకా బతికే ఉంటా. కశ్మీరీల బాధలు వింటా. వారి సమస్యల పరిష్కారానికి పోరాడతా. ఇంకా మాట్లాడాలనుంది. కానీ కళ్లు తిరగడంతో మాట్లాడలేకపోతున్నా. నన్ను క్షమించాలి'' అని అన్నారు.

మనకసలు భయమే లేదు

కశ్మీర్‌ను బీజేపీ రిమోట్ కంట్రోల్‌తో పాలిస్తోందని ఖర్గే దుయ్యబట్టారు. ''ఇక్కడ ఎన్నికలు నిర్వహించడమే బీజేపీకి ఇష్టంలేదు. సుప్రీంకోర్టు మొట్టికాయ వేయడంతో ఎన్నికలు నిర్వహిస్తోంది. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వడం బీజేపీకి సుతరామూ ఇష్టంలేదు. ఇక్కడి గనులు, లిక్కర్ కాంట్రాక్టులను అస్మదీయులకు ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. ఎన్నికల వేళ మోదీ కశ్మీర్ యువత భవితపై మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఆయన హయాంలోనే నిరుద్యోగిత గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా పెరిగింది'' అని మండిపడ్డారు. కాగా, ఖర్గేకు అస్వస్థత విషయం తెల్సి ఆయనకు ప్రధాని మోదీ ఫోన్‌చేసి మాట్లాడారు.

రాహుల్ గ్యారెంటీలు అట్టర్ ఫ్లాప్: అమిత్



చండీగఢ్: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఇస్తున్న ఎన్నికల హామీలు అమలే కావడం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటకల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాహుల్ గ్యారెంటీల అమలులో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఆయన ఆదివారం హరియాణాలోని గురుగ్రాంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అమలుకు వీలుకాని ఎలాంటి హామీనీ బీజేపీ ఇవ్వదని మంత్రి అన్నారు. ''కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రాహుల్ బాబా అండ్ కంపెనీ ఎలాంటి అభివృద్ధీ చేయలేదు. హరియాణాలో మా డబుల్ ఇంజన్ ప్రభుత్వం మాత్రమే అభివృద్ధికి హామీ ఇస్తుంది'' అన్నారు. ''సరిహద్దులను రక్షిస్తాం. రిజర్వేషన్లను కాపాడుతాం. ఆర్టికల్ 370ను మళ్లీ రానివ్వం'' అని స్పష్టం చేశారు. వక్ఫ్ నిబంధనల్లో లొసుగులను సరిదిద్దేందుకే పార్లమెంట్‌లో వక్ఫ్ బిల్లు పెడుతున్నట్లు చెప్పారు. రాహుల్‌ను అబద్ధాల మిషన్‌గా అభివర్ణించారు. అగ్నివీర్‌లకు ఉద్యోగాలు రావంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

హెజ్‌బొల్లా అగ్రనేత హతం

క్షిపణి దాడుల్లో నబీల్ మృతి | లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు

జెరూసలేం: లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హెజ్‌బొల్లాకు మరో ఎదురు దెబ్బ తగిలింది. శనివారం ఇజ్రాయెల్ సైన్యం దాడిలో సంస్థ సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ నబీల్ కౌక్ మరణించారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం వెల్లడించింది. కౌక్ మృతిని హెజ్‌బొల్లా ధ్రువీకరించింది. దీంతో గత వారం రోజుల్లో ఇజ్రాయెల్ దాడుల్లో హతమైన హెజ్‌బొల్లా ముఖ్యుల సంఖ్య ఏడుకు పెరిగింది! హెచ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా శుక్రవారం ఇజ్రాయెల్ భీకర బాంబు దాడిలో మృతిచెందడం తెలిసిందే. ఆయనతో పాటు ఇద్దరు అగ్ర శ్రేణి కమాండర్లు కూడా మరణించారు. దాంతో హెజ్‌బొల్లా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌక్ 1980ల నుంచి హెజ్‌బొల్లాలో చురుగ్గా పని చేస్తూ అగ్ర నేతగా ఎదిగారు. 2006లో దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో హెజ్‌బొల్లా మిలటరీ కమాండర్‌గా పనిచేశారు. మీడియాలో తరచుగా కనిపిస్తూ రాజకీయ, భద్రతాపరమైన అంశాలపై అభిప్రాయాలు వెల్లడించేవారు. హెజ్‌బొల్లా చీఫ్‌గా నస్రల్లా బంధువు హాషీం సైపుద్దీన్ దాదాపుగా ఖరారైనట్టు సమాచారం.

దాడుల్లో 69 మంది మృతి

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు పుల్‌స్టాప్ పడటం లేదు. వేర్వేరు ప్రాంతాల్లో ఇజ్రాయెల్ ఆదివారం చేసిన దాడులతో 69 మంది చనిపోగా 76 మంది గాయపడినట్లు లెబనాన్ తెలిపింది. ఒక్క బెకా లోయపై దాడుల్లో 21 మంది మరణించగా 50 మంది వరకు గాయపడ్డారని, అయిన్ అల్ డెల్బ్ గ్రామంపై జరిగిన దాడిలో 24 మంది చనిపోయారు.


నబీల్ కౌక్

జోర్డాన్‌పై మిస్సైల్ దాడి!

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నానాటికీ పెరిగిపోతున్నాయి. జోర్డాన్ పైనా క్షిపణి దాడి జరిగింది. భారీ క్షిపణి ఒకటి బహిరంగ ప్రదేశంలో పడిపోయినట్లు జోర్డాన్ సైన్యం వెల్లడించింది. ఇది లెబనాన్ నుంచి దూసుకొచ్చినట్లు తెలిపింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదని ప్రకటించింది. మధ్య ప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సిసీ ఆందోళన వ్యక్తంచేశారు.

సిరియాపై అమెరికా దాడులు... 37 మంది మిలిటెంట్లు హతం

బీరుట్: సిరియాపై అమెరికా సైన్యం విరుచుకుపడింది. ఆదివారం 2 దఫాలుగా దాడులకు దిగింది. వీటిలో తీవ్రవాద ఇస్లామిక్ స్టేట్ గ్రూపు, అల్ ఖైదా అనుబంధ సంస్థకు చెందిన 37 మంది మిలిటెంట్లు హతమైనట్టు ప్రకటించింది. మృతుల్లో ఇద్దరు సీనియర్ మిలిటెంట్లు ఉన్నారని వెల్లడించింది. అల్ ఖైదా అనుబంధ హుర్రాస్ అల్ దీన్ గ్రూప్‌కు చెందిన సీనియర్ మిలిటెంట్‌తో పాటు మరో ఎనిమిది మందిని లక్ష్యంగా చేసుకుని మంగళవారం వాయవ్య సిరియాపై దాడి చేసినట్లు అమెరికా తెలిపింది. సెంట్రల్ సిరియాలోని మారుమూల అజ్ఞాత ప్రదేశంలో ఉన్న ఐఎస్ శిక్షణా శిబిరంపై ఈ నెల 16న పెద్ద ఎత్తున వైమానిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు సిరియా నేతలతో సహా 28 మంది మిలిటెంట్లు హతమయ్యారు. అమెరికా ప్రయోజనాలతో పాటు తమ మిత్రదేశాలు, భాగస్వాములకు వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించే ఐసిస్ సామర్థ్యాన్ని ఈ వైమానిక దాడి దెబ్బతీస్తుందని సైన్యం పేర్కొంది. 2014లో ఇరాక్, సిరియాలను చుట్టుముట్టి, పెద్ద భూభాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్న అతివాద ఐఎస్ గ్రూపు తిరిగి రాకుండా నిరోధించడానికి సిరియాలో సుమారు 900 మంది అమెరికా దళాలు ఉన్నాయి. ఇవి ఇరాన్ మద్దతు గల మిలిటెంట్ గ్రూపులున్న వ్యూహాత్మక ప్రాంతాలకు కొద్ది దూరంలోనే ఉన్నాయి.

ఇరాన్ గూఢచారి ఇచ్చిన పక్కా సమాచారంతోనే...!

లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఓ భవనం కింద భారీ నేలమాళిగలో దాక్కున్న హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాను ఇజ్రాయెల్ సైన్యం మట్టుబెట్టడం తెలిసిందే. ఇరాన్ గూఢచారి ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే నస్రల్లా జాడను గుర్తించినట్లు ఫ్రెంచ్ పత్రిక లీ పారిసీన్ వెల్లడించింది. అండర్‌గ్రౌండ్‌లో హెజ్‌బొల్లా సీనియర్ సభ్యులతో నస్రల్లా సమావేశం కాబోతున్నట్లు సదరు గూఢచారి ఇజ్రాయెల్‌కు ఉప్పందించాడని తెలిపింది. నస్రల్లా మృతిపై ఇరాన్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం జనం వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. అమెరికాకు, ఇజ్రాయెల్‌కు చావు తప్పదంటూ నినాదాలు చేశారు. పార్లమెంట్ సభ్యులు కూడా నిరసనల్లో పాల్గొన్నారు. 1980వ దశకం నుంచి హెజ్‌బొల్లాకు ఇరాన్ అండగా నిలుస్తున్న సంగతి తెలిసిందే.

రష్యాపై వందల డ్రోన్లతో ఉక్రెయిన్ ముప్పేట దాడి

కీవ్: రష్యా దురాక్రమణతో ఆగ్రహించిన ఉక్రెయిన్ మరోమారు డ్రోన్లతో ముప్పేట దాడికి తెగబడింది. డజన్ల కొద్దీ డ్రోన్లతో ఎదురుదాడిని పెంచింది. అయితే ఈ డ్రోన్లలో చాలావాటిని రష్యా విజయవంతంగా నేలకూల్చడంతో భారీ నష్టం ప్రాణ, ఆస్తినష్టం తప్పింది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ మీదకు రష్యా దండయాత్ర మొదలెట్టాక భారీ స్థాయిలో ఉక్రెయిన్ చేసిన ప్రతిఘటనల్లో ఇదీ ఒకటని రక్షణ రంగ వర్గాలు చెబుతున్నాయి. అయితే అటవీప్రాంతంలో కూలిన డ్రోన్ల నుంచి చెలరేగిన మంటలతో కార్చిచ్చు వ్యాపించింది. ఒక భవనం అగ్నికీలల్లో చిక్కుకుపోయింది. రష్యావ్యాప్తంగా ఏడు రీజియన్‌లలో పెద్దసంఖ్యలో ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించిందని, వాటిలో 125 డ్రోన్లను నేలకూల్చామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఒక్క ఓల్గోగ్రేడ్ రీజియన్‌లోనే 67 శత్రు డ్రోన్లను పేల్చేశామని రష్యా తెలిపింది. ఓరోనెజ్, రస్తోవ్ ప్రాంతాల్లోనూ డ్రోన్ల దాడులు, వాటిని రష్యా గగనతల రక్షణ వ్యవస్థ కూల్చేసిన ఘటనలు నమోదయ్యాయి. డ్రోన్ల మంటలు పడి దాదాపు 50 ఎకరాల్లో అడవి తగలబడిపోయింది.

లెబనాన్ నిరాశ్రయులు... పది లక్షలు!

సిరియా బాట పడుతున్న లక్షలాది మంది

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో లక్షల మంది నిరాశ్రయులవుతున్నారు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల భయంతో సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు. లక్షలాది మంది సరిహద్దులు దాటి సిరియాకు చేరుకుంటున్నారు. ఇప్పటిదాకా ఏకంగా 10 లక్షల మంది ప్రాణ భయంతో పారిపోయినట్టు ప్రధాని నజీబ్ మికాటీ ఆదివారం తెలిపారు. ఆరో వంతు జనభా దేశం దాటుతోంది. లెబనాన్‌లో ఇదే అతి పెద్ద వలస ఇదే'' అని ఆవేదన వెలిబుచ్చారు. గాజా యుద్ధానికి ఏడాది అవుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ తన దృష్టిని లెబనాన్‌పైకి మార్చింది. హమాస్‌కు మద్దతు ఇస్తున్నట్టు హెజ్‌బొల్లా ప్రకటించడంతో ఈ దాడులు తీవ్రమయ్యాయి. హెజ్‌బొల్లా స్థావరాలపై దాడుల తర్వాత ప్రజలు ఇళ్లలో ఉండటం లేదు. చాలా మంది వీధులు, సముద్రతీర కార్నిష్, పబ్లిక్ స్క్వేర్లు, తాత్కాలిక షెల్టర్లలో రాత్రంతా ఉంటున్నారు. కుటుంబాలకు కుటుంబాలు వీధుల్లోనే నిద్రిస్తున్నాయి. దహియాలో ఎక్కడ చూసినా నేలమట్టమైన భవనాలు, శిథిలాలతో నిండిన వీధులు, పొగ, ధూళి మేఘాలు కనిపిస్తున్నాయి. లెబనాన్ రాజధానికి ఎగువన ఉన్న పర్వతాల వరకు ప్రజలు పసిపిల్లలు, కొన్ని వస్తువులను వెంటపెట్టుకుని ర్యాలీగా వెళ్లారు. 50 వేల మందికి పైగా సిరియాకు వెళ్లిపోయారని ఐక్యరాజ్యసమితి శరణార్థుల చీఫ్ ఫిలిప్పో గ్రాండి తెలిపారు.


లెబనాన్ నుంచి తరలిపోతూ రోడ్డుపై నిద్రిస్తున్న చిన్నారులు

సిరియాకే ఎందుకు?

నిరాశ్రయులైన లెబనాన్ ప్రజలు శరణార్థులుగా సిరియాకు వెళ్తున్నారు. లెబనాన్ ప్రజలు సిరియాకు వెళ్లాలంటే డాక్యుమెంట్లు అవసరం లేదు. దీంతో ప్రతి గంటకు వందలాది మంది సిరియాకు వెళ్తున్నారు. పిల్లలు సిరియాలోకి వెళ్తుంటే తండ్రులు ఏడుస్తూ వీడ్కోలు పలుకుతున్న దృశ్యం కంటతడి పెట్టిస్తోంది.

యూకేకు సంపన్నులు

లెబనాన్‌లో దాడుల దృష్ట్యా విమానాశ్రయం చుట్టూ భయానక వాతావరణం నెలకొంది. చాలా విమానాలు రద్దయ్యాయి. దీంతో యూకేకు ఒకే ఒక కమర్షియల్ ఫ్లైట్ రాకపోకలు సాగిస్తోంది. మధ్య తరగతి, సంపన్న వర్గాలకు చెందినవారు లెబనాన్‌ను విడిచి యూకే లాంటి దేశాలకు వెళ్తున్నారు.

మందుపాతర పేల్చిన మావోలు

ఐదుగురు జవాన్లకు తీవ్ర గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి మందుపాతర పేల్చారు. బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నగెల్లూరు– గుండం గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మావోలు పేల్చిన మందుపాతర ధాటికి ఐదుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో సీఆర్‌పీఎఫ్ 153 బెటాలియన్ సభ్యులు కూంబింగ్ చేపట్టారు. కాగా, వీరి రాకను కనిపెట్టిన మావోలు ఆ మార్గంలో మందుపాతరను అమర్చి పేల్చారు. కూంబింగ్‌లో 200 మందికి పైగా జవాన్లు పాల్గొనట్లు తెలుస్తోంది. మందుపాతర పేలుడు తర్వాత పోలీసుల పైకి మావోలు కాల్పులు జరిపారు. వెంటనే తేరుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. దీంతో మావోయిస్టులు ఘటనాస్థలం నుంచి పారిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ఆ ప్రాంతానికి అదనపు బలగాలను తరలించి కూంబింగ్ ముమ్మరం చేశామని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ చెప్పారు.


సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి అర్చకులు పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 588.90 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 43,024 క్యూసెక్కులు ఉండగా అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవుతుందని కలెక్టర్ సృజన తెలిపారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మ ఆలయానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానం, బంగారం తాపడం పనులకు భక్తులు ఆదివారం విరాళాలు అందజేశారు. విజయవాడ కానూరుకు చెందిన డి. కాంతిలక్ష్మి నిత్యాన్నదానానికి రూ.1,01,116, స్వర్ణ తాపడం పనులకు గుంటూరు జిల్లా దుగ్గిరాల బ్రాహ్మణ వీధికి చెందిన కె. శివనాగేశ్వరరావు రూ. లక్ష విరాళంగా అందించారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ




గన్నవరం: గన్నవరంలోని సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా జడ్జి అరుణసారిక ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాన్ ఇండియా కాంపెయిన్‌లో భాగంగా సబ్‌జైలును సందర్శించారు. జైలులో రిమాండ్ ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, వసతులపై ఆరా తీశారు. వంట గది, స్టోర్ రూమ్, ఖైదీల వసతి గదులను తనిఖీ చేశారు. వసతుల కల్పనపై ఖైదీలతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా జడ్జి అరుణసారిక మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి బాబు నాయక్, గన్నవరం మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సబ్‌కోర్టు జడ్జి కె.జయలక్ష్మి, సబ్ జైలర్ రాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, ప్యానల్ అడ్వకేట్ భగీరథీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా కరాటే బెల్ట్ పరీక్షలు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడ రూరల్ నున్న గ్రామ శివారులో ఉన్న ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ హెడ్ క్వార్టర్ క్యాంప్ కార్యాలయంలో కరాటే బెల్ట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేకేఏ ఏపీ) ఈ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షలో ఏఐఎంఈఈ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అక్షితారెడ్డి, స్నేహిత పర్పుల్ బెల్ట్, జేమ్స్ స్కూల్ విద్యార్థులు మనశ్వి, మనోజ్ఞ, దినేష్‌రెడ్డి, జెతిన్‌రెడ్డి ఎల్లో బెల్ట్, ఎన్డీఆర్ఎఫ్ డోజో విద్యార్థులు అయాన్, సాయిసెరన్ బ్లూ బెల్ట్, బ్రహ్మతేజ, అశ్విత ఆరంజ్ బెల్ట్, ధవన్, హిమబిందు, ప్రీతమ్ ఎల్లో బెల్ట్, హర్షిణి జూనియర్ రెడ్ బెల్ట్, ఫయాక్ గ్రీన్ బెల్ట్, ప్రదీప్‌కుమార్ బ్రౌన్ బెల్ట్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు జేకేఏ ఏపీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, సెన్సాయ్ నాగసారిక తెలిపారు. విజేతలకు ఎన్డీఆర్ఎఫ్ డెప్యూటీ కమాండెంట్‌లు జఫ్రుల్ ఇస్లాం, డాక్టర్ ఇ.హరీష్ సర్టిఫికెట్‌లు అందజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆల్ ఇండియా సెంట్రల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సీతారామపురంలోని ప్రైవేటు బ్యాంక్ ఆవరణలో ఆదివారం ఈ ఎన్నిక ప్రక్రియను నిర్వహించామని ఆ సంఘం జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి టి.రాజేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా పి.సి.స్వామి, గౌరవాధ్యక్షుడిగా టి.రాజేష్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడిగా వి.హరినాథ్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ఏడుకొండలు, కార్యదర్శిగా జీఎస్‌బీ సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా ప్రభాకర్‌రావు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నామని పేర్కొన్నారు.

ఆటో రిక్షా.. బతుకు పరీక్ష

- ఇన్సూరెన్స్ కంపెనీల మాయాజాలం
- కాలయాపన చేస్తున్న షోరూంలు
- వన్‌టైం సెటిల్‌మెంట్ అంటూ బాధితులపై ఒత్తిడి
- అధికారుల మాటలు నీటి మూటలు
- అప్పులు చేసి ఆటోల రిపేర్లు చేయించుకుంటున్న కార్మికులు

వరదల దెబ్బ.. ధీమా ఇవ్వని 'బీమా'



విజయవాడలోని ఓ సర్వీస్ సెంటర్ వద్ద రిపేర్లకు బారులు తీరిన ఆటోలు



ఓ ఎలక్ట్రిక్ ఆటో మరమ్మతునకు సర్వీస్ సెంటర్ ఇచ్చిన ఎస్టిమేషన్ కాపీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల కారణంగా నీట మునిగిదెబ్బతిన్న ఆటోలకు బీమా కంపెనీలు ధీమా ఇవ్వడం లేదు. ఫుల్ ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ నానా రకాల కొర్రీలు వేస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ బాధితులపై ఒత్తిడి తెస్తున్నాయి. లేని పక్షంలో క్లయిమ్ చేసేందుకు నెలల సమయం పట్టవచ్చంటూ బెదిరింపులకు దిగుతున్నాయి. దెబ్బతిన్న ఆటోలకు మరమ్మతులు చేయిస్తామని, స్పేర్ పార్ట్స్ సగం రేటుకు అందించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. ఆటో షోరూంలు మరమ్మతులకు రూ. లక్షల్లో ఎస్టిమేట్లు వేస్తున్నాయి. టెక్నీషియన్ల కొరత అంటూ కాలయాపన చేస్తున్నాయి. వరద వచ్చి 30 రోజులు కావస్తోంది. ఫైనాన్స్ కంపెనీలు కిస్తీలు చెల్లించాలని వెంటాడుతున్నాయి. దీంతో ఆటోవాలాలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఇటీవల వచ్చిన బుడమేరు వరదల కారణంగా నగరంలోని అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, ఓల్డ్ అండ్ న్యూ రాజీవ్‌నగర్, ఓల్డ్ అండ్ న్యూ రాజరాజేశ్వరిపేట, కండ్రిక, వాంబేకాలనీ, ఇందిరానాయక్‌నగర్, పశ్చిమంలోని ఊర్మిళానగర్, కబేళా సెంటర్, జక్కంపూడి వైఎస్సార్‌కాలనీలు నీట మునిగాయి. ఈ ప్రాంతాల్లో నివసించే ఆటోవాలాల ఆటోలు వరద నీటిలో మునిగిపోయాయి. కొన్ని వారం రోజులపాటు, మరికొన్ని 12 రోజుల వరకు వరద నీటిలో, బురదలోనే ఉన్నాయి. సుమారు 9వేల ఆటోలు దెబ్బతిన్నాయి. వీటిలో సగానికిపైగా ఆటోలు ఎలక్ట్రిక్ వెహికల్(ఈవీ), బీఎస్-4, బీఎస్-6 మోడల్‌వే ఉన్నాయి. వీటికి సాధారణ మెకానిక్‌ల వద్ద మరమ్మతులు చేయడం సాధ్యపడదు. పూర్తిగా సెన్సార్ కావడంతో షోరూంలలోనే కంప్యూటర్‌పై మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. వీటికి వినియోగించే సామగ్రి అత్యంత ఖరీదైనవి. బీఎస్-6 మోడల్ ఆటో రిపేర్ చేయాలంటే లేబర్ చార్జీలే రూ.9వేలు వేస్తారు. రిపేర్లకు నెలల సమయం పడుతుందని షోరూంల వాళ్లు చెబుతున్నారు. ఆ వాహనాల విడిభాగాల కొరత, టెక్నీషియన్ల కొరత ఉందంటున్నారు. మరమ్మతులకు ఒక్కో వాహనానికి రూ. లక్ష వరకు అంచనా వేస్తున్నారు.



విజయవాడ సింగ్‌నగర్ వద్ద వరద నీటిలో మునిగిన ఆటోలు(ఫైల్)

ముక్కుపిండి వసూలు..

వరదల్లో భారీ నష్టం జరిగిందని, ఆటో స్పేర్ పార్ట్‌లు సగం ధరకే ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఆటోమొబైల్ షోరూంల యజమానులతో సమావేశం నిర్వహించారు. అప్పుడు ఒప్పుకున్న వారు స్పేర్ పార్ట్స్ సగం రేట్లకు ఇవ్వక పోగా ముక్కుపిండి జీఎస్టీ కూడా వసూలు చేస్తున్నారు. మరమ్మతులు చేయిస్తామంటూ నష్టపోయిన ఆటోకార్మికులకు అధికారులు చెప్పిన మాటలు నీటమూటలయ్యాయి.

వన్‌టైం సెటిల్‌మెంట్ అంటూ ఒత్తిడి..

షోరూంల అంచనాలు ఆ విధంగా ఉంటే ఇన్సూరెన్స్ కంపెనీలు మాత్రం క్లయిమ్ చేసేందుకు నానా రకాల కొర్రీలు వేస్తున్నాయి. ఫుల్ ఇన్సూరెన్స్ ఉన్నప్పటికీ కంపెనీలు వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకోండంటూ ఆటోవాలాలపై ఒత్తిడి చేస్తున్నాయి. బీఎస్-4,6 వాహనాలు రూ.10వేలు ఇస్తాం, పాత మోడల్ వాటికి రూ. 5 నుంచి రూ.6వేలు ఇస్తాం సర్దుకోండంటూ ఏకంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. లేదంటే నీటమునిగినట్లు ఫొటోలు అన్నీ చూపాలని, షోరూంలో ఉంచితే ఏజెంట్ వచ్చి అంచనా వేసి క్లయిమ్ పరిష్కారం చేస్తామంటూ తాపీగా చెబుతున్నారు. ఈ ప్రాసెస్ అంతా అయ్యేందుకు రెండు, మూడు నెలలైనా పట్టొచ్చని చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు చెప్పిన మాటలకు, షోరూంల వాళ్లు, ఇన్సూరెన్స్ కంపెనీలు వ్యవహరిస్తున్న తీరుకు పొంతన లేదని మండిపడుతున్నారు. కొందరు గత్యంతరం లేని పరిస్థితుల్లో అప్పులు చేసి ఆటోలకు రిపేర్లు చేయించుకుంటున్నారు.

ఇదేం న్యాయం..



ఇన్సూరెన్స్ కంపెనీలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయి. సర్వం కోల్పోయిన ఆటో కార్మికులను వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నాయి. షోరూంకు వెళితే బీఎస్-6 వాహనం మరమ్మతులకు రూ. 1.09లక్షలు అంచనా వేశారు. ఇన్సూరెన్స్ కంపెనీలు కేవలం రూ. 10వేలు క్లయిమ్ చేస్తామంటున్నాయి. షోరూం లేబర్ చార్జీలకే ఇవి చాలవు. ఇదేం న్యాయం. నెలరోజులుగా ఆటోలన్నీ షోరూంలలోనే ఉన్నాయి. కార్మికులు కోలుకునే పరిస్థితి లేదు. ఇన్సూరెన్స్ మాయాజాలంపై చర్యలు తీసుకోవాలి.

– దాది శ్రీనివాసరావు, నాయకుడు, ఆటోయూనియన్

తాత్కాలిక మరమ్మతులు చేయించా..



వరదల్లో పది రోజులు నీటిలోనే ఉంది. ఆటో పూర్తిగా దెబ్బతింది. 2009 మోడల్ ఆటో. ఎస్‌బీఐ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ చేయించా. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌కు క్లయిమ్ రాదు. పాత ఆటోకే మరమ్మతులకు రూ. 12వేలు ఖర్చయింది. అది కూడా తాత్కాలిక మరమ్మతులే. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నా. ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీల మోసాలను అరికట్టాలి.

– అర్జున్, కండ్రిక

చంద్రబాబే దోషి!

- పవిత్ర తిరుమలపై పచ్చి అబద్ధాలు ఆడి దొరికిపోయారు
- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



విజయవాడ స్పోర్ట్స్: తిరుమల లడ్డూ వ్యవహారంలో సీఎం చంద్రబాబు పచ్చి అబద్ధాలకోరని తేలిపోయిందని, ప్రజలముందు ఆయన దోషిగా నిలబడ్డారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో ఆదివారం మీడియాతో అవినాష్ మాట్లాడారు. సీఎం చంద్రబాబు బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి పదవిలో ఉండి... అత్యంత నీచాతి నీచమైన ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాస్తవం ఇది..

తిరుమల తిరుపతి దేవస్థానం టెండర్ గెలుచుకున్న కంపెనీలు జూన్ 12 నుంచి సరఫరా మొదలుపెట్టాయని, అప్పటికే చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన విషయాన్ని గుర్తు చేశారు. జూన్ 12, జూన్ 21, జూన్ 25, జూలై 4న వచ్చిన నాలుగు ట్యాంకర్లు తిరుమలలో జరిగిన ల్యాబ్ పరీక్షల్లో పాసై ముందుకు కదిలాయని, ఆ తర్వాత జూలై 6న రెండు ట్యాంకర్లు, జూలై 12న మరో రెండు ట్యాంకర్లలో వచ్చిన నెయ్యి, టీటీడీ టెస్టుల్లో ఫెయిల్ కావడంతో, వెనక్కు పంపిన వైనాన్ని వివరించారు. చంద్రబాబు నియమించిన టీటీడీ ఈవో సైతం ఆ నాలుగు ట్యాంకర్లను రిజెక్ట్ చేశాం, షోకాజ్ నోటీస్ ఇచ్చామని, వాటిలో వనస్పతి ఆయిల్ కలిపినట్లు తేలిందని చాలా స్పష్టంగా చెప్పారన్నారు. అయినా సీఎం చంద్రబాబు తన అబద్ధాలను ప్రచారం చేస్తూనే ఉండటం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమన్నారు.

వైఎస్సార్ సీపీ నిజాయతీ ఇది..

వైఎస్సార్ సీపీకి నిజాయతీ ఉంది కాబట్టి, నిజాలు తేల్చమని ఏకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ప్రధాని మోదీకి లేఖ రాశారన్నారు. ఇది సోమవారం పిటిషన్ విచారణకు వస్తున్న సందర్భంలో శనివారం నుంచి చంద్రబాబు సిట్..స్కిట్ ప్రారంభించారని విమర్శించారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం



సమావేశంలో కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు, ఆలయ, పోలీసు అధికారులు

- దుర్గమ్మవారి దర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట
- మీడియా సహకారం అవసరం
- మూడు షిఫ్ట్‌లలో సిబ్బంది విధులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, సీపీ రాజశేఖరబాబు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సేవలందించి, ఉత్సవాలను విజయవంతం చేయడంలో మీడియా సహకారం అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మీడియా ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఆదివారం డీసీపీ గౌతమీశాలి, దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామరావు తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

సంతృప్తికర దర్శనం లక్ష్యం..

సమావేశంలో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దసరా ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు సలహాలు అందజేశారు. దీనిపై కలెక్టర్ సృజన స్పందిస్తూ సామాన్య భక్తులకు సంతృప్తికరంగా ఉండేలా అమ్మవారి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు నిరంతరం తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. భక్తుల దాహార్తిని తీర్చడానికి 27 ప్రాంతాలలో తాగునీటి బాటిల్స్ సరఫరా చేసేందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించామన్నారు. భక్తుల సౌకర్యార్థం లగేజీ, చెప్పులు భద్రపరుచుకునేందుకు 30 క్లాక్ రూములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వీఐపీ, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొండపైన మీడియా సెంటర్..

మీడియా ప్రతినిధులకు అవసరమైన ప్రత్యేక డ్యూటీ పాసులను జారీ జారీ చేయనున్నామని తెలిపారు. ఎప్పటిలాగే కొండపైన రాజగోపురం సమీపంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసి, మీడియా ప్రతినిధుల కోసం కంప్యూటర్లు, ఇంటర్నెట్ వైఫై వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులకు ఎదురయ్యే ఇబ్బందులను సత్వరం పరిష్కరించేలా పోలీస్, దేవదాయ శాఖ అధికారుల సమన్వయానికి సమాచార శాఖ అధికారులను లైజనింగ్ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఇలా.. మూడు షిఫ్టుల్లో సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించామన్నారు.

లోటుపాట్లను సరిచేసుకుంటూ..

పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ గత ఉత్సవాలలో ఎక్కడైతే లోటుపాట్లు జరిగాయో అటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య అధికంగా ఉండవచ్చన్న అంచనాల నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అయితే భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా వాస్తవ సమాచారాన్ని భక్తులకు అందించి దసరా ఉత్సవాల విజయవంతంలో సహకరించాలని మీడియా ప్రతినిధులకు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అనవసర గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు ఈ ఏడాది యూనిఫామ్‌తో పోలీస్ అధికారులు, సిబ్బంది అమ్మవారి దర్శనానికి అనుమతించడం లేదని ఆయన తెలిపారు.

మూడు శాఖల సమన్వయంతో..

రెవెన్యూ పోలీసు, మున్సిపల్ అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సెక్టార్‌లుగా విభజించి అందులో మూడు శాఖల అధికారులు ఉండేలా జాగ్రత్తలు తీసుకొంటున్నామన్నారు. 36 సెక్టార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో 26 శాంతిభద్రతలు, 11 ట్రాఫిక్ సంబంధించి సెక్టార్లుగా విభజించామన్నారు. ఎక్కువ హోల్డింగ్ ఏరియాస్ ఏర్పాటు చేస్తున్నామని, పార్కింగ్ ప్రదేశాలు, పబ్లిక్ అనౌన్సింగ్ సిస్టంను పగడ్బందీగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామన్నారు. సమావేశంలో డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ, కృష్ణకుమార్, శ్రీనివాస్, ఏసీపీలు స్రవంతి రాయ్, బంగారాజు, దామోదరనాయుడు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, తత్వవేత్త ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభం కానుంది. ఈ మేరకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఆదివారం తెలిపారు. 'పద్మ విభూషణ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానంద మూర్తీస్ విజన్ ఆన్ ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్: రిఫ్లెక్షన్స్ ఆన్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ పాలసీ అండ్ ప్లానింగ్ ఇన్ ఇండియా' అంశంపై సదస్సు ఉంటుందన్నారు. ప్రారంభోత్సవానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. స్థానిక మునేరు అవతల అమ్మవారి తోటల్లో నిర్మాణం పూర్తయిన కల్యాణమండపం, మినీ ఫంక్షన్‌హాల్స్, గదుల నిర్మాణాలను ఆదివారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో భక్తులకు కల్యాణమండపం, ఫంక్షన్ హాల్స్ అందుబాటులోకి రానున్నాయన్నారు. అలాగే ఆలయం వద్ద కూడా భక్తులకు అవసరమైన మౌలిక వసతులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని వివరించారు. ఆలయ ఏఈవో ఉమాపతి, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో కిషోర్‌కుమార్

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ

- కిటకిటలాడిన క్యూలైన్లు
- ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు రూ. 500 విఐపీ టికెటు, రూ. 300, రూ.100, సర్వ దర్శనం క్యూలైన్ ద్వారా ఆలయానికి చేరుకున్నారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు కిటకిటలాడాయి. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన నిమిత్తం అరగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. మహానివేదన అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు రద్దీ కనిపించింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవకు ఉభయదాతలు తరలివచ్చారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది.



పవన్ కళ్యాణ్ మాటలు నీటి మూటలేనా ?

- మల్లవల్లి పారిశ్రామికవాడ నిర్వాసితులకు పరిహారం ఇప్పిస్తానని గతేడాది హామీ
- ప్రభుత్వం ఏర్పాటైనా స్పందించని వైనం
- ఎనిమిదేళ్లుగా పరిహారం కోసం ఎదురుచూపులు
- తాజా భూహద్దులు తేల్చిన అధికారులు

మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ నిర్వాసితులకు పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ నీటి మూటగానే మిగిలిందనే విమర్శలు బాధితుల నుంచి వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పారిశ్రామికవాడలో పర్యటించారు. నష్టపరిహారం అందని సాగుదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు దాటినా నేటికీ పరిహారం వ్యవహారం కొలిక్కి రాలేదు. పవన్ కళ్యాణ్ స్వయంగా డెప్యూటీ సీఎం అయినా ఏ విధమైన ప్రయోజనం లేదని బాధితులు వాపోతున్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ నిర్వాసితులు నష్టపరిహారం కోసం ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు చూస్తున్నారు. 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన భూసేకరణకు పరిహారం నేటికీ దక్కకపోవటంతో ఏళ్ల తరబడి సాగుదారుల ఆశలు అడియాసలుగానే మిగులుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకై మల్లవల్లిలోని రీ సర్వే నంబర్ 11లో 1360 ఎకరాల ప్రభుత్వ రెవెన్యూ అటవీ భూమిని సేకరించారు. దశాబ్దాలుగా ఈ భూములు సాగు చేస్తున్న పేదలకు ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. కానీ సాగుదారుల గుర్తింపు కోసం చేపట్టిన ఎంజాయ్‌మెంట్ సర్వేలో కొందరి రైతుల పేర్లు రాజకీయ జోక్యంతో నమోదు చేయకపోవటంతో పరిహారం అందలేదని ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఏపీఐఐసీ ఇప్పటికే ఆ భూములను వివిధ పరిశ్రమలకు కేటాయింపులు చేయటంతో నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయి.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు

అప్పటికే ఆ భూములను సాగు చేస్తున్న రైతులను గుర్తించేందుకు జియోకాన్ అనే సంస్థతో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో 623 మంది సాగుదారులు ఉన్నట్లు నివేదిక ఇవ్వగా, ఆ తర్వాత రెవెన్యూ అధికారులు 716.44 ఎకరాల్లో 490 మంది సాగుదారులు ఉన్నట్లుగా తుది జాబితాను ప్రకటించారు. కానీ వివిధ కారణాలతో చివరికి 443 మంది రైతులకు గానూ 615.6 ఎకరాలకు మాత్రమే రూ. 7.50 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని పంపిణీ చేశారు. దీంతో పరిహారం దక్కని సాగుదారులు ఎనిమిదేళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సాగుదారుల లెక్క తేల్చే విషయంలో రెవెన్యూ అధికారులపై నాటి టీడీపీ నాయకుల ఒత్తిడితోనే పలువురి పేర్లు జాబితాలో గల్లంతయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.



మల్లవల్లి పారిశ్రామికవాడ



గత ఏడాది ఆగస్టులో నిర్వాసితులతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ (ఫైల్)



పవన్‌కల్యాణ్‌ను కలిసిన మల్లవల్లి పారిశ్రామిక వాడ నిర్వాసితులు

నష్ట పరిహారం కోసం ఆందోళనలు...

నష్ట పరిహారం అందని సాగుదారులు అనేసార్లు ఆందోళనలు చేపట్టారు. ఏపీఐఐసీ ఇప్పటికే పరిశ్రమలకు భూకేటాయింపులు చేయటంతో ఆ సంస్థలు చేపట్టిన నిర్మాణాలను సాగుదారులు అడ్డుకుంటూ నిరసనలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే గత ఏడాది ఆగస్టులో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మల్లవల్లి పారిశ్రామికవాడలో పర్యటించారు. నష్టపరిహారం అందని సాగుదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్వయంగా పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీ కూడా కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడుస్తున్నప్పటికీ కనీసం ఒక్క అడుగు ముందుకు పడలేదు. గతంలో రెవెన్యూ అధికారులు రెండో విడత పరిహారం కోసం సాగుదారుల నుంచి పలుమార్లు అర్జీలు స్వీకరించారు. గుడివాడ ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయగా 217 మంది సాగుదారులు 713 ఎకరాలకు నష్టపరిహారం దక్కలేదని అర్జీలు దాఖలు చేశారు.

తాజాగా పారిశ్రామికవాడ భూహద్దుల గుర్తింపు

బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూముల హద్దుల నిర్ధారణ ప్రక్రియ భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఈ నెల 21వ తేదీన నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ మనీషా త్రిపాఠి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ సమక్షంలో పారిశ్రామికవాడ భూములకు హద్దులు గుర్తించారు. మల్లవల్లి రీ సర్వే నంబర్ 11లోని 1360 ఎకరాల భూమికి హద్దులు తేల్చేందుకు 12 సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. భూ నిర్వాసితుల నుంచి ప్రతిఘటనను అడ్డుకునేందుకు దాదాపు 250 మంది పోలీసులతో మల్లవల్లి పారిశ్రామికవాడను మోహరించారు. భారీ పోలీసు బందోబస్తుతో అధికార యంత్రాంగం భూములు స్వాధీనం చేసుకొని హద్దులు నిర్ధారణ చేపట్టారు.

ఆటో డ్రైవర్‌ను సత్కరించిన ఎక్సైజ్ పోలీసులు



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను చూసి ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతోపాటు బాధితుడిని హాస్పటల్‌లో చేర్చేందుకు సహకరించిన ఆటో డ్రైవర్ షేక్ నాగూర్‌ను ఎక్సైజ్ పోలీస్ అధికారులు సత్కరించారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొన్న భవానీపురం ఎక్సైజ్ కానిస్టేబుల్ మోరు నాగరాజు విధులు ముగించుకుని అర్ధరాత్రి దాటిన తరువాత గన్నవరంలోని తన నివాసానికి వెళుతుండగా నిడమానూరులో రోడ్ ప్రమాదానికి గురయ్యి అచేతనంగా పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ షేక్ నాగూర్ గమనించి అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజు వివరాలు తెలుసుకుని హాస్పటల్‌లో చేర్పించటంతోపాటు ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం అందించాడు. హాస్పటల్‌లో చికిత్స పొందిన మోరు నాగరాజు ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నారు. ఈ క్రమంలో భవానీపురంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం సీఐగా చార్జ్ తీసుకున్న టి.గోపాలకృష్ణ, ఇప్పటి వరకు విధులు నిర్వర్తించిన సీఐ వీవీవీఎస్ఎన్ వర్మ, ఇటీవల పదోన్నతి పొందిన సీఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ షేక్ నాగూర్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రోడ్‌పై ఏం జరుగుతున్నా పట్టించుకోకుండా ఎవరి దారిని వారు వెళుతున్న తరుణంలో నాగూర్ స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. ఎక్సైజ్ కానిస్టేబుల్ మోరు నాగరాజును సకాలంలో హాస్పటల్‌లో చేర్పించడం వలనే ఈ రోజు ఆయన పెద్ద ప్రమాదం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఆటో డ్రైవర్ నాగూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

పటమట(విజయవాడతూర్పు): పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆటోనగర్ 6 వ లైన్, డంపింగ్ యార్డ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడుకి సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని, చామన ఛాయా, బ్లూ రంగు టీ షర్ట్, బ్లూ రంగు షార్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడిని గుర్తుపట్టిన వారు పటమట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలో కొత్తగా నిర్మించిన హైవేపై గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని కొత్తపేట పోలీసులు గుర్తించారు. సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శరీరంపై గాయాలు ఉండటంతో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే యువకుడి వంటిపై ఉన్న గాయాలు ఒకటి, రెండు రోజులు పాతవిగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. యువకుడు ఎక్కడో చనిపోతే హైవేపైకి తీసుకొచ్చి పడేసి ఉంటారని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఘరానా దొంగలు అరెస్ట్

రూ.10 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా ఆగడాలకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం చెక్ పెట్టింది. ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో 16 నేరాలకు పాల్పడిన తొమ్మిది మందిని విజయవాడ శివారులోని డిస్నీ ల్యాండ్ వద్ద అరెస్ట్ చేశారు. ఈ ముఠా నుంచి రూ. 10 లక్షల విలువ చేసే 232 గ్రాముల బంగారు, 1.729 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఎన్టీఆర్ జిల్లా క్రైం ఏడీసీపీ ఎం.రాజారావు, నార్త్ ఏసీపీ డాక్టర్ కె.స్రవంతిరాయ్ వన్‌టౌన్‌లోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం వెల్లడించారు. విజయవాడలోని సింగ్‌నగర్, నున్న, గుణదల ప్రాంతాలకు చెందిన తొమ్మిది మంది వ్యక్తులు (ఏడుగురు మేజర్లు, ఇద్దరు మైనర్లు) కలిసి గ్రూపుగా ఏర్పడ్డారని, తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని రాత్రి సమయాల్లో చోరీలు చేసే వారని, ఇప్పటి వరకు నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, కృష్ణా జిల్లా చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని మూడు ఇళ్లలో ఈ ముఠా దొంగతనాలకు పాల్పడినట్లు ఏడీసీపీ, ఏసీపీ తెలిపారు. మద్యం, సిగరెట్లు, ఇతర దుర్వసనాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించేందుకు వీరంతా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో దొంగిలించిన సొత్తును డిస్నీ ల్యాండ్‌లో పంచుకుంటున్న ఈ ముఠాను సీసీఎస్ సీఐలు పి.శ్రీనివాసరావు, ఎస్.వి.వి.లక్ష్మీనారాయణ, నున్న, సింగ్‌నగర్, గుణదల స్టేషన్ల సిబ్బందితో కలిసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఘరానా దొంగలను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ప్రత్యేకంగా అభినందించారు.

ఆరోగ్యకర హృదయంతో జీవితంలో ఆనందం

- కార్డియలాజికల్ సొసైటీ ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో 5కె వాకథాన్
- వాకథాన్ ప్రారంభించిన డీసీపీ ఎం. కృష్ణమూర్తి నాయుడు

గాంధీనగర్/లబ్బీపేట: ఆరోగ్యకరమైన హృదయంతో ఆనందకరమైన జీవితం సాధ్యమవుతుందని డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఏపీ చాప్టర్ నిర్వహించిన వాక్ ఫర్ హార్ట్.. లవ్ యూ ఆంధ్రప్రదేశ్.. 5కె వాకథాన్ నిర్వహించారు. బీఆర్‌టీఎస్ రోడ్డు శారదా కళాశాల వద్ద ఆయన జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గుండె సంబంధ వ్యాధులు, గుండె ఆరోగ్య పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమం ఏర్పాటు చేసిన కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వారికి అభినందనలు తెలియజేశారు. డాక్టర్ పి. రమేష్ బాబు మాట్లాడుతూ గుండె సంరక్షణ కోసం సమతుల ఆహారం, సక్రమమైన జీవన విధానం, తగినంత శారీరక శ్రమ తప్పనిసరి అని చెప్పారు. మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలున్న వారు, వాటిని అదుపులో ఉంచుకోవాలని సూచించారు. గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే వైద్య పరిజ్ఞానం అందుబాటులో వచ్చిందని, గుండెపోటు వచ్చిన తొలి గంటలోనే చికిత్స అందిస్తే ప్రాణాపాయాన్ని తప్పించవచ్చని డాక్టర్ రమేష్ బాబు వివరించారు. కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ ట్రెజరర్ డాక్టర్ ఎ. పూర్ణానంద్ మాట్లాడుతూ, హృద్రోగాల బారిన పడకుండా ఉండాలంటే.. మానసిక ఒత్తిడికి గురికాకుండా, ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపాలని స్పష్టం చేశారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. 40 ఏళ్ల వయసు దాటిన ప్రతి ఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గుండె సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ బీఆర్టీఎస్ రోడ్డులో కోలాహలంగా ర్యాలీ సాగింది. కార్డియలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌టీఎస్ శారదా కళాశాల వద్ద వాక్‌థాన్ ప్రారంభిస్తున్న డీసీపీ కృష్ణమూర్తి నాయుడు

వైభవం.. తెలుగు ప్రాభవం



రచయిత్రికి పురస్కారం అందించి, సత్కరిస్తున్న జస్టిస్ శంకరనారాయణ, యార్లగడ్డ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు

అవనిగడ్డ: జిల్లా రచయితల 16వ మహాసభను ఆదివారం వైభవంగా నిర్వహించారు. నలు మూలల నుంచి కవులు, రచయితలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహాసభను ప్రారంభించిన హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకరనారాయణ మాట్లాడుతూ.. 1975లో తొలి ప్రపంచ మహాసభల రూపకర్త మండలి వెంకట కృష్ణారావు (ఎంవీకేఆర్) ఖ్యాతి చిరస్మరణీయమన్నారు. తెలుగు భాష ఉన్నంత వరకూ ఆయనకు గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.

తెలుగు సంఘాల ఏర్పాటుకు బాటలు..

మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. మండలి వెంకట కృష్ణారావు నిర్వహించిన తొలి ప్రపంచ మహాసభలు ప్రపంచ దేశాల్లో విస్తృతంగా తెలుగు సంఘాల ఏర్పాటుకు బాటలు వేశాయన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా రయితల సంఘం పేరుతో దేశ విదేశాల్లో తెలుగు భాషాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వంగల నారాయణరావు మాట్లాడుతూ.. ఉన్నతమైన భావాలు కలిగిన పండితులు, కవులు, రచయితల త్రివేణి సంగమం కృష్ణాజిల్లా రయితల సంఘం అని కొనియాడారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జి.వి. పూర్ణచంద్ మాట్లాడుతూ సంఘం ఆవశ్యకతను విశదీకరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ రచించిన కృష్ణం వందే జీవనాధారం పుస్తకాన్ని మాజీ న్యాయమూర్తి జస్టిస్ శంకర నారాయణ ఆవిష్కరించారు.

పలువురికి పురస్కారాల ప్రదానం..

మహాసభ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు భాషా సేవా పురస్కారాన్ని ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకు, ఆలూరి భైరాగి కవితా పురస్కారాన్ని బండ్ల మాధవరావుకు, గుత్తికొండ సాహితీసేవా పురస్కారాన్ని పెనుగొండ లక్ష్మీనారాయణకు, పోలవరపు కోటేశ్వరరావు కథాసాహిత్య పురస్కారాన్ని రావుల పాటి సీతారామ్, మారుతీ పౌరహితంలకు, ముక్కామల నాగభూషణం పాత్రికేయ పురస్కారాన్ని కేఎస్‌వీ రమణమ్మకు, వేములపల్లి కేశవరావు విశాల అనువాద సాహితీ స్వాతి శ్రీపాదకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అంబటి శంకర నారాయణ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. తొలుత తెలుగుతల్లి విగ్రహం, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి అతిథులు పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రముఖ రచయితలు అక్కినేని భవానీ ప్రసాద్, ఎస్వీ భారతి, చింతపల్లి వెంకటనారాయణ, సరికొండ నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులందరికీ పరిహారం అందిస్తాం

జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరద ముంపు ప్రాంతాల్లో నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని, ఇప్పటికే 90 శాతం మేర లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 10 శాతం కూడా బ్యాంకు ఖాతాల్లో సమస్యల వల్ల పెండింగ్‌లో ఉందని చెప్పారు. వరద ముంపునకు గురైన ఇళ్లకు సంబంధించి 75,427 కుటుంబాల ఖాతాల్లో రూ. 160.47 కోట్ల మేర నగదు జమచేశామని పేర్కొన్నారు. 4,315 కుటుంబాలకు సంబంధించి బ్యాంకు ఖాతాల సమస్యలు ఉత్పన్నమయ్యాయని.. మరో 8 వేల కుటుంబాలకు సోమవారం డీబీటీ ద్వారా ఖాతాల్లో ఆర్థిక సహాయం జమకానుందని వెల్లడించారు. త్రిచక్ర వాహనాలకు సంబంధించి 3,149 మందికి, ద్విచక్రవాహనాలకు 30,722 మందికి, తోపుడుబళ్లకు 431 మందికి వారి ఖాతాల్లో పరిహారం జమచేసినట్లు తెలిపారు. మొత్తం మీద ఇప్పటివరకు 1,09,729 ఖాతాలకు దాదాపు రూ. 173.69 కోట్ల మేర సొమ్ము జమ చేసినట్లు వివరించారు. బ్యాంకు ఖాతాల సమస్యలున్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతాల్లో సమస్యలు ఉన్నవారు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలని, సత్వరం బ్యాంకును సంప్రదించి ఆధార్‌తో బ్యాంకు ఖాతాను లింక్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు సహాయం అందిస్తారని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు సరైన విధంగా నమోదు చేసుకుంటే.. సోమవారం సాయంత్రంలోగానే జమ చేస్తామన్నారు. ఏ ఒక్కరూ ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.

వైద్య రంగం అత్యంత వేగంగా అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి పి.చంద్రశేఖర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందుబాటులోకి వస్తున్న అధునాతన వైద్య విధానాలతో రోగులకు వ్యాధి నుంచి ఉపశమనం లభిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఊపిరితిత్తుల వ్యాధుల్లో ముఖ్యంగా కోవిడ్ 19 తర్వాత తలెత్తిన సమస్యలపై మణిపాల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్లో లంగ్ మ్యాట్రిక్స్ పేరుతో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 400 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ లోకేష్, పల్మనాలజిస్ట్ డాక్టర్ జి.ఉదయకిరణ్ అధునాతన వైద్య పద్ధతులను వివరించారు. పల్మనాలజీ, రుమటాలజీ, అంటువ్యాధుల రంగాల్లో పరిశోధన, విద్య, సంరక్షణ వంటి వాటిపై ప్రసంగాలు, విశ్లేషణలు జరిగాయి. ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ భానుప్రవీణ్‌నాయుడు, ఇన్‌ఫెక్షన్ డిసీజ్ స్పెషలిస్టు డాక్టర్ నేహా మిశ్రా, క్రిటికల్‌కేర్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, రుమటాలజిస్ట్ డాక్టర్ కావ్యదేవి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభిస్తున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర వైద్యులు

చురుగ్గా దసరా ఏర్పాట్లు






ఇంద్రకీలాద్రిపై వచ్చే నెల 3నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు సేదదీరడానికి చలువపందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి వద్ద రక్షణగా ఇనుప మెష్ ఏర్పాటు చేశారు. కనకదుర్గనగర్‌లో అవసరమైన ఏర్పాట్లను సిబ్బంది చేస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ




క్లుప్తంగా

'బెస్ట్ టీచర్ అవార్డు'కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరల్డ్ టీచర్స్ డే పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన అత్యుత్తమ క్రమశిక్షణతో ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గుర్తించి బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డ్– 2024తో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులను వచ్చేనెల 13వ తేదీన హైదరాబాద్‌లో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు వచ్చేనెల 5వ తేదీలోపు వారు చేసిన సేవలను తెలియజేస్తూ ఆల్‌ది బెస్ట్ సంస్థకు పంపాలని, ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

మహాకవి జాషువా అందరికీ ఆదర్శం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాకవి గుర్రం జాషువాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రంథాలయాధికారి కె.రమాదేవి సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం, గుర్రం జాషువా జయంతి కార్యక్రమం జరిగింది. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సామాజిక పరిస్థితులపై జాషువా గొప్ప రచనలు చేశారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయన్నారు. జాషువా రచనలను విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చారని తెలిపారు. ఆయన రచనలు చదివి అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



విజయవాడస్పోర్ట్స్: మేకల విజయసారథి మెమోరియల్ రెండో జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వడోక్కై కరాటే డో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త మేకల లక్ష్మీప్రసాద్ విచ్చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోలా ప్రతాప్, జి.ఆనందబాబు తెలిపారు. పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సతీష్ వ్యవరిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

ముగిసిన లక్ష్మీగణపతి హోమం



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి, ఉత్తరాధికారి విధుశేఖర భారతి స్వామి ఆదేశంతో 25 రోజులుగా నిర్వహిస్తున్న లక్షమోదక లక్ష్మీగణపతి హోమం ఆదివారం ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పండితులు హవన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం మహాగణపతికి వేదోక్తంగా గణపతిపూజ, గణపతి అధర్వశీర్షోపనిషత్ పారాయణం, సహస్ర నామార్చన నిర్వహించారు. మోదక పూజ అనంతరం గురువందనం మంత్రపుష్పం, 129 సుగంధ ద్రవ్యాలతో పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, గందూరి చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

వించిపేట(విజయవాడపశ్చిమ): ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని 49వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తు నగరపాలక సంస్థ ఆధ్వర్యాన చిట్టినగర్, ప్రైజర్‌పేటలో కళాజాత ప్రదర్శన జరిగింది. ప్లాస్టిక్ సంచులు, బాటిళ్ల వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే ప్రమాదం, వాటితో వ్యాపించే వ్యాధులపై కళాకారులు తమ ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోవడంతో ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం, నగరపాలకసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నూకరాజుకు ఘననివాళి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): క్రమశిక్షణ, నిబద్ధత కలిగి నాయకుడు పందిరి నూకరాజు అని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. సీపీఐ విజయవాడ నగర కౌన్సిల్ సభ్యుడు పందిరి నూకరాజు సంస్మరణ సభను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో డివిజన్ అభివృద్ధికి నూకరాజు ఎంతో సహకారం అందించాడని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కొండ ప్రాంత ప్రజల సమస్యలపై పోరాటాలతోపాటుగా భాలభాస్కర్ నగర్ కొండపై మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి ఆయన సహకారం అందించారని వివరించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సీపీఐని స్థానికంగా అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ చేపట్టిన కార్యక్రమాల్లో నూకరాజు ఎంతో చురుకుగా పాల్గొనేవాడని గుర్తుచేశారు. సీపీఐ నాయకులు నార్ల వెంకటేశ్వరరావు, వీరభద్రరరావు, తాడి పైడియ్య, అప్పరబోతు రాము, పి.దుర్గాంబ తదితరులు పాల్గొని నూకరాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

వరద బాధితుల సంఖ్యను కుదించడం సరికాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరదల్లో అపారనష్టం సంభవించిందని, ప్రభుత్వం బాధితుల సంఖ్యను కుదించి పరిమితంగా పరిహారం అందించడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు హితవు పలికారు. బాధితుల గుర్తింపులో లోపభూయిష్టంగా ఉన్న నిబంధనలు మార్చాలన్నారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అజిత్‌సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో పర్యటించారు. వరదలో మృతి చెందిన ముఠా కార్మికుడు పోలినాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల పేరుతో యంత్రాంగం వరద బాధితులను నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పండుగకు ముందే బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ కేంద్రంగా ప్రజల ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. వరదలు సంభవించి 29 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వరద సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. వరద బాధితుల సహాయంపై ప్రత్యేకంగా యంత్రాంగాన్ని కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి.. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష చేయాలని కోరారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, బాధితులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం, విధివిధానాల్లో మార్పులు చేయాలని, ప్రస్తుత ప్రకటించిన సాయం రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. పర్యటనలో సీపీఎం నేతలు బీ.రమణారావు, టి శ్రీనివాస్, రాము, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

నిత్య వ్యాయామంతో ఆరోగ్యానికి మేలు



పటమట(విజయవాడతూర్పు): ప్రతిఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని, సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులకు దూరంగా ఉండవచ్చని లీవ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ నరసింహారావు పేర్కొన్నారు. పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమం, హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్య అవగాహన కల్పించారు. వారికి ఆరోగ్యం పైన అవగాహన కల్పించి మందులు పంపిణీ చేశారు. డయాబెటిస్ సంబంధించి షుగర్ పేషంట్లకు రక్త పరీక్షలు చేశారు. కండరాల నొప్పులకు ఫిజియో థెరపీ డాక్టర్లు రోగులను పరీక్షించి తగిన సూచనలు ఇచ్చారు.

రీ ఎన్యూమరేషన్ చేయండి



అలంకార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఇఫ్టూ, సీఐటీయూ నేతలు

- వరదతో మునిగిపోయిన ఇంటికి రూ.50వేలు, ఆటోలకు రూ.25వేలు ఇవ్వాలి
- ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ధర్నా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వ నామమాత్రపు పరిహారం ప్రకటించిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. అది కూడా సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ఆధ్వర్యంలో వరద పరిహారం రెట్టింపు చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే 2.87లక్షల ఇళ్లు వరదలో మునిగిపోయాయని, వరద నష్టం రూ.6,800కోట్లుగా అంచనా వేసిందన్నారు. కానీ పరిహారం చెల్లింపులో కేవలం రూ. 600కోట్లతో సరిపుచ్చడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అందులోనూ దాతలే రూ. 400 కోట్లు ఇచ్చారని చెప్పారు. దాతలు ఇచ్చిన విరాళాలకు ప్రభుత్వం నామమాత్రంగా జోడించి చేతులు దులుపుకుంటున్నారు.ఇది అత్యంత దుర్మార్గమని విమర్శించారు. ఎన్యూమరేషన్‌కు ఇతర జిల్లాల అధికారులను కేటాయించి పథకం ప్రకారం లబ్ధిదారులను కుదించిందన్నారు. ఇళ్లు, ఆటోలు మునిగిపోయి కార్మికులు జీవనాధారం కోల్పోయారన్నారు. ఆటోలను అన్నింటిని నమోదు చేయలేదని, చేసినా నో రిపేర్ అని రాసి పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే తిరిగి వరద బాధితుల గణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ పరిహారం పెంచి ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సీహెచ్ శ్రీనివాస్, ఏ ఐసీటీయూ నాయకులు ఎస్ డీ. సలీం మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఆటోకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడమేరు వరదల్లో మునిగిపోయిన ఇళ్లకు రూ.50వేలు, ఆటోలకు రూ.25వేలు పరిహారం ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) డిమాండ్ చేసింది. ధర్నాలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ముని శంకర్, ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆటో సంఘం నాయకులు కె.దుర్గారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా




నలంద లిటిల్ ఛాంప్స్ ఒలింపియాడ్‌లో చిన్నారుల ప్రదర్శనలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నలంద విద్యానికేతన్‌లో ఆదివారం లిటిల్ ఛాంప్స్ ఒలింపియాడ్ కాంపిటీషన్స్, సండే కార్నీవాల్ ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగాయి. రెండేళ్ల చిన్నారులకు హెల్దీ బేబీ షో, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సుగల చిన్నారులకు వేర్వేరుగా టాలెంట్ హంట్ అండ్ స్టేజ్ షో, టాలెంట్ షో, నాలెడ్జ్ హంట్ వంటి పోటీలు నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాలకు చెందిన రెండేళ్ల నుంచి ఆరేళ్లలోపు వయస్సు గల 200మంది చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్నీవాల్‌లో చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొని ఆటలతోపాటు, వివిధ రకాల ఆహార పదార్థాల రుచులను ఆస్వాదించారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా సునీత, బబిత, సీజల్, డాక్టర్ ఉష, కరంబీర్ కౌర్, సురేఖారెడ్డి వ్యవహరించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో గ్లోబ్ టాడ్లర్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్ నీలిమ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ పోటీలను స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ పర్యవేక్షించగా, హెడ్‌మిస్ట్రెస్ ఉషారాణి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యానికి 'సుంకర' కృషి

సీపీఎం మాజీ రాష్ట్రకార్యదర్శి పి.మధు

లబ్బీపేట,పటమట(విజయవాడతూర్పు): వామపక్ష, సంఘ సంస్కరణ భావాలు కలిగిన సుంకర రమేష్‌బాబు లాంటి వ్యక్తులు ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ, ప్రజల్లో సామాజిక చైతన్యానికి చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ ప్రధానకార్యదర్శి, మోటార్ ట్రాన్స్‌పోర్టు మాసపత్రిక మాజీ ప్రధాన సంపాదకులుగా వ్యవహరించిన సుంకర రమేష్‌బాబు సంస్మరణ సభ ఆదివారం బెంజిసర్కిల్ సమీపంలోని అసోసియేషన్ హాలులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పి.మధు మాట్లాడుతూ విజయవాడ నగరాభివృద్ధిలో లారీ యజమానులు, ఆటోనగర్ పారిశ్రామిక వాడ పాత్ర మరువలేనిదన్నారు. సీపీఎం నాయకుడు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ద్వారా రమేష్‌బాబు విద్యార్థి ఉద్యమాన్ని నడిపించారని, తర్వాత లారీ యజమానులను సంఘటితం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంబీ భవన్ కార్యదర్శి మురళీకృష్ణ, సీపీఎం నాయకుడు మురహరి, రాష్ట్ర రైతు సమాఖ్య అధ్యక్షుడు వై కేశవరావు, వైవీ ఈశ్వరరావు, నాయకులు వైవి రావు, దోనేపూడి కాశీనాథ్, కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా, సొసైటీ అధ్యక్షులు కె.వి. రమేష్, ఫౌండేషన్ అధ్యక్షులు రావి గోపాలరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామశేషయ్య, కేశవరావు, మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నుపాటి వజీర్ తదితరులు పాల్గొని రమేష్‌బాబుకు ఘనంగా నివాళులర్పించారు.



సుంకర రమేష్‌బాబు సంస్మరణసభలో మాట్లాడుతున్న సీపీఎం నేత పి.మధు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు




సిద్ధార్థ ఆర్ట్ కాలేజీలో నృత్య ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు జంగం సిస్టర్స్ పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. సంప్రదాయ కీర్తనల్లో భాగంగా చలమేల, సతులారా చూడరే, చక్కని తల్లికి చాంగుభళా, ఇదిగో భద్రాద్రి తదితర కీర్తనలను ఆలపించారు. ముఖ్యఅతిథి ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ప్రేక్షక ఆదరణ ఉన్నప్పుడే కళారూపాలు జీవం పోసుకుంటాయని వివరించారు. చిన్నారులను నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్న జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి కృషిని అభినందించారు. కార్యక్రమంలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం అధికారులు వేంకటేశ్వర్లు, వెంపటి శ్రీసాయి.ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కమ్ముల శేషుకుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు జంగం విజయకుమార్, జంగం చక్రవర్తిలు చిన్నాలకు జ్ఞాపికలను అందజేశారు.



దుర్గగుడి ఘాట్‌రోడ్డులో పాము

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డులో ఆదివారం మధ్యాహ్నం పాము కనిపించడంతో పనులు చేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. మంత్రి రామనారాయణరెడ్డి దసరా ఏర్పాట్లను పర్యవేక్షించే సమయంలో పాము కనిపించడంతో ఆలయసిబ్బంది అప్రమత్తమయ్యారు. కొంతకాలంగా ఘాట్‌రోడ్డులో రాకపోకలు నిలిపివేయడంతో కొండపై నుంచి వచ్చి ఉంటుందని ఆలయ అధికారులు పేఉర్కొన్నారు.

వరద బాధితులకు అండగా ఉండాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): వరద బాధిత కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని కరూర్ వైశ్యా బ్యాంక్ వన్‌టౌన్ శాఖ మేనేజర్ పీవీబీ రావు గుప్తా అన్నారు. విజయవాడ హోల్‌సేల్ అండ్ రిటైల్ పూజా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు వివిధ వస్తువులతో కూడిన కిట్ల పంపిణీని ఆదివారం మెయిన్‌బజార్‌లోని సంఘ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపార వర్గాలకు కేవలం తమ లాభాపేక్ష వ్యాపారాలకు పరిమితం కాకుండా సామాజిక సేవల్లోనూ భాగస్వాములు కావటం చాలా ఆనందంగా ఉందన్నారు. అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు శీరం బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి మసునం కృష్ణారావు మాట్లాడుతూ తమ సంఘం సామాజిక సేవల్లోనూ చురుకుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి దుర్గాసత్యనారాయణ, కోశాధికారి పువ్వాడ తాండవ కిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు తిరుమల లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ వివాదం మీద దాఖలైన పటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం విచారించనుంది. తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలిపారన్న సీఎం చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలు నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో కమిటీ ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నేత సుబ్రమణియన్‌స్వామి, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సహా పలువురు పిటిషన్లు వేశారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అభ్యర్థించారు. ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదికపై ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని విన్నవించారు. ఈ కేసులో సుబ్రమణియన్‌స్వామి స్వయంగా వాదనలు వినిపించనున్నారు. తిరస్కరించిన నెయ్యిని ప్రసాదంలో వాడలేదని స్వయంగా ఈవో చెప్పిన విషయాలను సుప్రీంకోర్టు దృష్టికి పిటిషనర్లు తీసుకెళ్లారు. తిరస్కరించిన నెయ్యిని వాడనప్పుడు లడ్డూ అపవిత్రత ఎందుకైంది, ల్యాబ్ రిపోర్టు తయారీ వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయా? అనేది కూడా తేల్చాలని పిటిషన్‌లో విన్నవించారు. నిరాధారమైన తప్పుడు ఆరోపణలతో శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని వివరించారు. ఎస్‌వోపీ ప్రకారం పరీక్షల్లో ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న నెయ్యిని మాత్రమే తిరుమల ప్రసాదానికి వినియోగించే విధానం దశాబ్దాలుగా కొనసాగుతోందని, ఏదో ఒక చిన్న రిపోర్టును ఆధారంగా చేసుకుని భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. అందుకే సుప్రీంకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని పిటిషనర్లు అభ్యర్థించారు.

నడి సంద్రంలో చేపల బోటు దగ్ధం

సురక్షితంగా బయటపడ్డ ఏడుగురు మత్స్యకారులు




పూడిమడక సముద్ర తీరంలో అగ్నికి ఆహుతవుతున్న చేపల బోటు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీరంలో ఆదివారం తెల్లవారుజామున చేపల బోటు అగ్నికి ఆహుతి కాగా, ఈ ప్రమాదం నుంచి ఏడుగురు మత్స్యకారులు ప్రాణాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి మెరైన్ పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. వారి కథనం మేరకు వివరాలు.. విశాఖకు చెందిన ఫిషింగ్ హార్బర్ నుంచి ఏడుగురు మత్స్యకారులు బడే సూర్యనారాయణకు చెందిన బోటుపై చేపల వేటకు బయలుదేరారు. దీనిలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున పూడిమడక సముద్ర తీరం సమీపంలోకి వచ్చేసరికి బోటు ప్రమాదవశాత్తూ మంటల్లో కాలిపోయింది. గమనించిన మత్స్యకారులు గరికిన యల్లోడు, చల్లపల్లి నల్లోడు, రాగతి యర్రయ్య, పాలిపోలు వీరాస్వామి, గనగళ్ల రాము, గరికిన యల్లాజీ, బద్రి ధనరాజులు బోటు నుంచి సముద్రంలోకి దూకేశారు. వారికి సమీపంలో ఉన్న పూడిమడకకు చెందిన మత్స్యకారుల బోట్ల సాయంతో వారిని తీరానికి తీసుకొచ్చారు.

'లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయించాలి'



కర్నూలు కల్చరల్ : తిరుమల లడ్డూ వివాదాన్ని సిట్ కంటే సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేయిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదంపై అనేక ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ చేయించకుంటే వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనాన్ని తొలగించాలని కోరారు. హిందూ ఆలయాల్లో జరుగుతున్న అనేక దోషాలు తొలగిపోవాలని కోరుతూ అక్టోబర్ 1న కర్నూలు కొండారెడ్డి బురుజు నుంచి కలెక్టరేట్ వరకు మహా ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



వరద బాధితుల సహాయార్థం సీఎంఆర్ఎఫ్‌కు రూ.50 లక్షల చెక్కును విరాళంగా అందజేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

అతీగతీలేని 'వినతి'



ఏమీ చేయకుండానే పరిష్కారమైనట్లు నమోదు

- రెవెన్యూ సమస్యలపై కుప్పలుతెప్పలుగా విజ్ఞాపనలు
- వాటిని తీసుకుని వెంటనే పరిష్కరించేసినట్లు మెసేజ్‌లు
- వీటిని చూసి బిత్తరపోతున్న జనం
- ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండానే మ్యుటేషన్ చేసిన దానిపై ఫిర్యాదు
- కోర్టులో ఉందని అబద్ధం చెప్పి వినతిని మూసేసిన అధికారులు
- సాక్షాత్తు సీఎంను కలిసినా దక్కని ఊరట
- ప్రజా సమస్యల పరిష్కార వేదిక తీరిదీ..

సాక్షి, అమరావతి : ప్రజల నుంచి భారీఎత్తున విజ్ఞాపనలు తీసుకుంటున్నట్లు గొప్పగా ప్రచారం చేసుకుంటున్న టీడీపీ ప్రభుత్వం వాటి పరిష్కారానికి మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పార్టీ ఆఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలకు జనం వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. ప్రతి శనివారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కార్యాలయానికి వెళ్లి మరీ వినతులు స్వీకరిస్తున్నారు. ప్రతిరోజూ కొందరు మంత్రులు కూడా అక్కడ విజ్ఞాపనలు తీసుకుంటున్నారు. టీడీపీ నేతలను చూసి జనసేన, బీజేపీ ఆఫీసుల్లోనూ ఈ తంతు సాగిస్తున్నారు. అలాగే, ప్రతి సోమవారం ఎప్పటిమాదిరిగానే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ వినతులు స్వీకరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పందన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రజా సమస్యల పరిష్కార వేదికగా టీడీపీ ప్రభుత్వం మార్చింది. జనం గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలోనూ పెద్దఎత్తున తమ సమస్యలను మొర పెట్టుకుంటున్నా వాటికి పరిష్కారం మాత్రం దొరకడంలేదు. సీఎం చంద్రబాబును కలిసి తమ సమస్యలు విన్నవించుకున్న వారికి సైతం ఎటువంటి ఊరట లభించడంలేదు. ఉదా.. నెలరోజుల క్రితం కృష్ణాజిల్లా మచిలీపట్నానికి చెందిన నబీల్ అనే వ్యక్తి కుటుంబంతో కలిసి టీడీపీ ఆఫీసులో తన సమస్యపై సీఎంకు వినతిపత్రం ఇచ్చాడు. కానీ, ఇప్పటివరకు దానిపై ఎలాంటి పురోగతిలేదు. ఎక్కువగా భూములకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు వస్తుండడంతో వాటిపై ఏంచేయాలో తెలీడంలేదని అధికారులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఇబ్బందుల గురించే ఎక్కువ మంది ఫిర్యాదుల చేస్తున్నారని టీడీపీ నేతలు ప్రచారం చేస్తున్నా అవి ఎప్పుడూ రొటీన్‌గా వచ్చే రెవెన్యూ సమస్యలేనని అధికారులు చెబుతున్నారు. వచ్చిన విజ్ఞాపనలను పరిష్కరించే పరిస్థితి లేకపోవడంతో అధికారులు కిందా మీదా పడుతున్నారు. దీంతో చేసేదిలేక 60 రోజుల్లో వినతిని పరిష్కరించాలి కాబట్టి ఈలోపే ఏదో ఒక కారణంతో దాన్ని మూసేసి అది పరిష్కారమైపోయినట్లు నమోదు చేస్తున్నారు. మరోవైపు.. అసలేమీ జరగకుండానే వినతిపత్రం ఇచ్చిన వారికి అది క్లియర్ అయిపోయినట్లు ఎస్ఎంఎస్‌లు వస్తుండడంతో వారు బిత్తరపోతున్నారు.

కోర్టు కేసు లేకుండా ఉన్నట్లు చెప్పి మూసేశారు..

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం, అల్లవరం గ్రామానికి చెందిన భీమవరపు కటుమస్వామి జులై 15న ఆర్డీఓ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) లేకుండానే తమ కుటుంబానికి చెందిన భూమిని మ్యుటేషన్ చేశారని విజ్ఞాపన ఇచ్చాడు. తన అమ్మమ్మ నూకాలమ్మ 2016లో చనిపోయిందని, ఆమెకు వారసత్వంగా ఉన్న భూమిని ఆమె చనిపోయిన తర్వాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లేకుండా రెవెన్యూ అధికారులు వేరే కొందరికి మ్యుటేషన్ చేసినట్లు అందులో పేర్కొన్నారు. అడుగుతుంటే పట్టించుకోవడంలేదని ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ ఈ వినతిని తీసుకుని ఎఫ్ఎంసీ లేకుండా మ్యుటేషన్ ఎలా చేస్తారని ఫిర్యాదు తీసుకున్నారు. ఆ తర్వాత దీనిపై వీఆర్ఓ విచారణకు వెళ్లాడు. కానీ, కొద్దిరోజులకు మీ సమస్య పరిష్కారమైందంటూ కటుమస్వామికి ఎస్ఎంఎస్ రావడంతో అతను విస్తుపోయాడు. ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అడిగితే కోర్టులో కేసు ఉందని తహశీల్దార్ రిపోర్టు ఇవ్వడంతో సమస్య పరిష్కారమైందని ఫిర్యాదును మూసివేసినట్లు చెప్పారు. అతను ఈ కేసు కోర్టు పరిధిలో లేదని అన్ని ఆధారాలు చూపడంతో నిజమేనని ఒప్పుకున్నా తాము చేసేదేంలేదని ఆర్డీఓ చేతులెత్తేశారు. 60 రోజుల్లోపు వినతిని పరిష్కరించాల్సి వుండడంతో కోర్టు వంకతో వినతిని తహశీల్దార్ క్లియర్ చేసినట్లు తేలింది.

65 వేల సమస్యలు పరిష్కారమయ్యాయట

ఇలా ఇప్పటివరకు 65,211 సమస్యలను పరిష్కరించినట్లు ప్రభుత్వం చెబుతోంది. పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) వెబ్‌సైట్‌లో జూన్ 15 నుంచి ఇప్పటివరకు 88,761 విజ్ఞాపనలు అందగా, 65,211 విజ్ఞాపనలను పరిష్కరించినట్లు ప్రభుత్వం అందులో పేర్కొంది. అయితే, ఇవన్నీ గోకవరం కేసు మాదిరిగానే ఏమీ అవకుండానే కాగితాల్లోనే పరిష్కారమైనట్లు రాసుకున్నారని బాధితులు వాపోతున్నారు.

పేదల ప్రాణాలంటే 'లెక్క'లేదా?

108, 104 పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి

- బిల్లులు కూడా అప్‌లోడ్ చేయని దుస్థితి
- ఏప్రిల్ నుంచి బిల్లుల పెండింగ్
- నిర్వహణ సంస్థకు రూ.140 కోట్ల బకాయి



సాక్షి, అమరావతి: పేద ప్రజల ప్రాణాలతో చంద్రబాబు ప్రభుత్వం చెలగాటమాడుతోంది. రోడ్ యాక్సిడెంట్లు, ఇతర ప్రమాదాలు సంభవించిన ఆపద సమయంలో క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించడంతో పాటు, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు తరలించే 108 అంబులెన్స్ వ్యవస్థ పట్ల పూర్తి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోంది. అదే విధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంలో గ్రామాల్లోని పేదలకు వైద్య సేవలందించే 104 మొబైల్ మెడికల్ యూనిట్ (ఎంఎంయూ)పైనా చిన్న చూపు చూస్తోంది. 2014–19 మధ్య ఈ రెండు వ్యవస్థలను అంపశయ్య ఎక్కించిన బాబు.. మరోసారి అదే పంథాను అనుసరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిర్వహణ సంస్థ అరబిందోకు పైసా విదల్చక పోవడమే ఇందుకు నిదర్శనం. దీంతో 108, 104 సేవలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి .

రూ.140 కోట్లపైనే బకాయి..

సాధారణంగా ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. కాగా, ఏప్రిల్, మే, జూన్ నెలల బిల్లులను జూలై నెలలో చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు కనీసం బిల్లులను వెరిఫై చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కూడా చేయలేదని తెలిసింది. మరోవైపు జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల బిల్లులు వచ్చే నెలలో చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన పరిశీలించినట్‌లైతే ఆరు నెలల బిల్లులు బకాయి పడినట్లవుతోంది. మొత్తంగా రూ.140 కోట్ల మేర ప్రభుత్వం బకాయి పడడంతో ఉద్యోగులకు వేతనాలు చెల్లించేందుకు సంస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

నిలిచిపోయిన ఆగస్టు నెల వేతనాలు..

ప్రభుత్వం పెద్ద ఎత్తున బకాయిలు పెట్టడంతో నిర్వహణ సంస్థ 104, 108 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఈఎంటీలకు వేతనాలు సరిగా చెల్లించడం లేదు. సెప్టెంబర్ నెల ముగుస్తున్నా.. ఆగస్టు నెల వేతనాలు చెల్లించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై నెలల వేతనాలను సైతం సంస్థ ఆలస్యంగా చెల్లించిందని చెబుతున్నారు. 2019కు ముందు రాష్ట్రంలో 108 అంబులెన్స్‌లు 336 మాత్రమే ఉండేవి. వీటిని 768కి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెంచారు. అదే విధంగా 104 ఎంఎంయూలను 936 ప్రవేశపెట్టారు. డ్రైవర్లు, ఈఎంటీలకు వేతనాలను సైతం పెంచి జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది.

మెదలైన సిట్ విచారణ

తిరుపతి, తిరుమలలో పర్యటన ● మూడు బృందాల ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ అయ్యిందని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేసి..ఆ తర్వాత ఆయనే ఏర్పాటు చేసిన సిట్ బృందం విచారణ చేపట్టింది. సిట్ సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడ్డారు. డీఐజీ గోపీనాథ్‌జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలోని మూడు బృందాలు తిరుపతి, తిరుమల, తమిళనాడులోని ఏఆర్ ఫుడ్స్ సంస్థలో విచారణ చేపట్టనున్నారు. ఈ మూడు బృందాలకు ఒక్కో బాధ్యతను అప్పగించారు. లడ్డూ ఎక్కడ తయారవుతుంది, ఎక్కడ ప్యాకింగ్ చేస్తారు, నెయ్యి కొనుగోలు, ఒప్పందాలు, నెయ్యి సరఫరా వంటి అంశాలపై విచారణ చేయనున్నారు.

కల్తీకి బాధ్యులైన అందర్నీ విచారిస్తాం

నెయ్యి కల్తీకి బాధ్యులైన వారందరినీ విచారిస్తామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ తిపాఠి వెల్లడించారు. నెయ్యిపై లోతైన విచారణ జరుపుతామన్నారు. తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు సిట్‌కు బదిలీ అయ్యిందని చెప్పారు. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ సంస్థపైనా విచారణ చేస్తామన్నారు.

ఫిర్యాదు చేసిన జీఎం నేడు పదవీ విరమణ

నెయ్యిలో కల్తీ జరిగిందని నాలుగు రోజుల క్రితం తిరుపతి తూర్పు పోలీసులకు ఫిర్యాదు చేసిన టీటీడీ మార్కెటింగ్ జీఎం మురళీకృష్ణ సోమవారం పదవీ విరమణ చేయనున్నారు. నెయ్యిలో కల్తీ జరిగి ఉంటే ఎందుకు ఫిర్యాదు చేయలేదని పలువురు ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కూడా ఇదే విషయంపై పలువురు టీటీడీ, కూటమి ప్రభుత్వాన్ని ట్రోల్ చేశారు. ఆ తరువాత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని టీటీడీ నిర్ణయించింది. అయితే, ఎవరు ఫిర్యాదు చేయాలనే అంశంపై టీటీడీ అధికారులు సమాలోచన చేసినట్టు తెలిసింది. ఫిర్యాదు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో రిటైర్ అవుతున్న ఉద్యోగి చేత ఫిర్యాదు చేయించటం వెనుక కుట్ర దాగి ఉందనే ప్రచారం జరుగుతోంది.

కల్తీ నెయ్యిపై ఆధారాలుంటే కేసు పెట్టొచ్చు కదా?

- 'సిట్' పేరుతో హడావిడి ఎందుకు?
- సనాతన ధర్మం పేరుతో పవన్‌కళ్యాణ్ రాజకీయం
- ఆ ధర్మాన్ని ఆయనే కనుగొన్నట్లు బిల్డప్
- మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: టీటీడీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించిన సీఎం చంద్రబాబు, దానిపై ఆధారాలుంటే కేసు పెట్టాలిగానీ, ఇలా 'సిట్' పేరుతో ఎందుకు హడావుడి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. అతి పవిత్రమైన తిరుమల లడ్డూపై చంద్రబాబు దుష్ప్రచారం చేశారని, అందుకాయన ఎప్పటికైనా పరిహారం చెల్లించక తప్పదని ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. చంద్రబాబుకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తన ఆరోపణలపై అత్యున్నత స్థాయి విచారణ కోరాలన్న వెలంపల్లి ఒకవేళ అవి తప్పుడు ఆరోపణలని తేలితే చంద్రబాబు ప్రాయశ్చిత్త దీక్షకు సిద్ధంగా ఉండాలన్నారు. చంద్రబాబు ఆరోపిస్తున్నట్లు టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగినా, పరీక్షల్లో ఆ విషయం తేలినా.. అదంతా టీడీపీ ప్రభుత్వం వచ్చాకే అన్న విషయాన్ని బాబు మర్చిపోయారన్నారు.

దీక్షలో ఉన్న వారు పాదరక్షలు ధరిస్తారా?

డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హిందూ సనాతన ధర్మాన్ని తాను కనుగొన్నట్లుగా మాట్లాడుతున్నారని వెలంపల్లి ఎద్దేవా చేశారు. అసలు దీక్షలో ఉన్న వారు ఎవరైనా పాదరక్షలు ధరిస్తారా? సినిమాలు చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. టీటీడీ లడ్డూల తయారీపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేశారు కాబట్టే, పవన్ ప్రాయశ్చిత్త దీక్ష చేస్తున్నారన్నారు. ఇక విజయవాడ వరదల్లో వందల కోట్ల చందాలు వసూలు చేశారని.. కానీ, బాధితులను ప్రభుత్వం ఏ విధంగానూ ఆదుకోలేదని చెప్పారు. నష్ట పరిహారం కోరుతూ బాధితులు రోడ్డెక్కితే ప్రభుత్వం పోలీసులతో కొట్టించిందని వెలంపల్లి మండిపడ్డారు.

ఎమ్మెల్యేలా? వీధి రౌడీలా?

- వారి అరాచకాలు కనబడటంలేదా చంద్రబాబు?
- మాజీమంత్రి మేరుగు నాగార్జున ఫైర్




సాక్షి, అమరావతి : అరాచకాలకు రాష్ట్రం అడ్డాగా మారిందని, రాష్ట్రంలో ప్రభుత్వ పాలన పూర్తిగా గతి తప్పిందని మాజీమంత్రి మేరుగు నాగార్జున ఫైర్ అయ్యారు. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ఎమ్మెల్యేలు రౌడీల్లా వ్యవహరిస్తున్నారని.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు సాగుతున్నాయని విమర్శించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన పేరుతో యథేచ్ఛగా దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యేల అకృత్యాలు, వేధింపులు సీఎం చంద్రబాబుకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దమ్ముంటే వారి మక్కెలు విరగ్గొట్టాలని సీఎంకు నాగార్జున సవాల్ చేశారు. ఎన్నికల్లో చెప్పిన మాటలు నమ్మి కూటమిని భారీ మెజారిటీతో గెలిపిస్తే హామీలు అమలుచేయకపోగా అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఏకంగా సీఎం నోటి నుంచే మక్కెలు విరగ్గొడతామంటున్న మాటలు కూటమి ఎమ్మెల్యేలను మరింత రెచ్చగొడుతున్నాయని, దీంతో వారు వీధిరౌడీల్లా ప్రవర్తిస్తూ దాడులకు తెగబడుతున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ నేతలు కదిలినా మెదిలినా కేసులంటూ వేధిస్తున్నారని, ఫిర్యాదు చేయడానికి వెళ్తున్న బాధితులపైనే తిరిగి కేసులు నమోదు చేసే స్థాయికి పోలీస్ వ్యవస్థ దిగజారిపోయిందని నాగార్జున విమర్శించారు. తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ లాంటి వారివల్ల సొంత పార్టీ నాయకులు సైతం బెంబేలెత్తిపోయేలా బాబు పాలన ఉందని నాగార్జున చెప్పారు. ఇక కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బొజ్జల సుధీర్‌రెడ్డి, రఘురామకృష్ణరాజు, సుందరపు విజయ్‌కుమార్, పంతం నానాజీ, మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, గుంటూరు వెస్ట్ టీడీపీ ఎమ్మెల్యే భర్త, భూమా అఖిలప్రియ, జేసీ అస్మిత్‌రెడ్డి.. తదితరులు 100 రోజుల్లో చేసిన అరాచకాలు చాలా ఉన్నాయని, దమ్ముంటే చంద్రబాబు వారిపై చర్యలు తీసుకోవాలని మేరుగు నాగార్జున సవాల్ చేశారు.

కునుకు కరువు

పిల్లలు, యువత, మధ్య వయస్కుల వారిని వేధిస్తున్న నిద్ర లేమి

స్మార్ట్‌ఫోన్ అతి వినియోగమే కారణమంటున్న వైద్యులు



'అర్ధరాత్రి దాటినా.. నిద్రరావడం లేదు' అంటూ చాలామంది తరచూ చెబుతుంటారు. చీకటి పడి గడియారంలో ముల్లు నిద్ర సమయం చూపుతున్నా... కంటికి కునుకు రాక ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఒకప్పుడు వయసు మీదపడిన వారిని వేధించే నిద్రలేమి... ఇప్పుడు పిల్లలు, యువత, మధ్య వయస్కుల వారిని సైతం ఇబ్బందులకు గురిచేస్తోంది. రోజూ మాదిరి రాత్రి తొమ్మిది గంటలకు ఠంచన్‌గా పడకెక్కినా... రెప్పవాల్చడానికి మాత్రం అర్ధరాత్రి దాటిపోతోంది. ఏజీవెల్ ఫౌండేషన్ గతేడాది 20 రాష్ట్రాల్లో 5 వేల మందికిపైగా నిర్వహించిన ఓ అధ్యయనంలో సగం మందికిపైగా గాఢ నిద్ర లేక ఇబ్బందిపడుతున్నట్టు వెల్లడైంది. 69.8 శాతం మంది రోజుకు ఆరు గంటలకంటే తక్కువ సమయం నిద్రపోతున్నట్టు గుర్తించారు.

స్మార్ట్‌ఫోన్ ఎఫెక్ట్

ఈ నిద్రలేమికి ప్రధాన కారణం స్మార్ట్ ఫోన్ వినియోగమేనని వైద్యులు, పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 4.37 గంటలు స్మార్ట్ ఫోన్, ల్యాప్‌ట్యాప్ స్క్రీన్ వీక్షణకు వ్యక్తులు కేటాయిస్తున్నారు. భారత్‌లో 4.30 గంటల మేర ఆ సమయం ఉంటోంది. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూరేస్ నిద్ర పట్టకుండా చేస్తాయని అనేక అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఈ క్రమంలో పడుకునే గంట ముందు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వినియోగించకూడదని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో తప్పనిసరిగా స్క్రీన్ చూడాల్సి వస్తే బ్రైట్‌నెస్ తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. చిన్నారులు, టీనేజ్ పిల్లల బెడ్‌రూమ్‌ల్లోకి స్మార్ట్‌ఫోన్‌లను రాత్రి వేళల్లో అనుమతించకపోవడం ఉత్తమం అని అమెరికన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ సూచిస్తోంది.

-సాక్షి, అమరావతి

అనారోగ్యంతో అవస్థలు

సర్వరోగ సర్వావస్థలకూ నిద్ర లేమి మూలం అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యానికి పెద్దల్లో రోజుకు 7 నుంచి 8 గంటల నిద్ర అవసరం అని నిపుణులు సూచిస్తున్నారు. కాగా, ప్రస్తుతం రోజుకు 5 గంటల్లోపు నిద్రకు ఉపక్రమిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఇందులోనూ శరీరానికి అవసరమైన గాఢ నిద్ర చాలా అరుదుగానే ఉంటోంది. రాత్రిళ్లు సరిగా నిద్రలేక ఉదయం లేవగానే రోజువారీ కార్యకలాపాలను ప్రారంభించడానికి శరీరం, మెదడు సహకరించక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాతికేళ్లకే బీపీ, సుగర్, ఊబకాయం వంటి సమస్యల బారినపడుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది.

నిద్రలేమి సమస్యలివే..

- గుండె, నరాల సంబంధిత వ్యాధుల బారినపడే అవకాశం.
- చిరాకు, కోపం ఎక్కువ కావడం, ఒత్తిడికి లోనయ్యే ప్రమాదం.
- సరిపడా నిద్ర లేకపోతే పిల్లలకు అలర్జీలు, చికాకు వంటి సమస్యలొస్తాయి.
- శ్వాస సమస్యతో కొందరు అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియాతో బాధపడుతుంటారు. ఇది ప్రమాదకరమైనది. సకాలంలో చికిత్స చేయించుకోవాలి.
- సెల్‌ఫోన్ వల్ల కూడా స్లీప్ అప్నియా వస్తుంది. దీన్ని నియంత్రించకపోతే హైపర్ టెన్షన్, గుండెపోటు, జ్ఞాపక శక్తి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇలా చేస్తే ఉత్తమం
- నిద్రకు ఉపక్రమించే 4 గంటల ముందు కాఫీ, టీ తాగకూడదు. ధూమపానం, మద్యపానం చేయకూడదు. టీవీ, సెల్‌ఫోన్ చూడకూడదు. వేడి పాలు తాగాలి.
- పగటిపూట నిద్ర మానుకోవాలి.
- పడక గదిలో స్లీప్‌ఫ్రెండ్లీ వాతావరణం ఉండాలి.
- ఆందోళన, ఒత్తిడి, నిరాశ నిద్రకు పెద్ద అవరోధం. వాటిని అధిగమించాలి.

స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీగా ఏకే సక్సేనా



ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీగా మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ (మొయిల్) సీఎండీ, స్టీల్ ప్లాంట్ మాజీ డైరెక్టర్ (ఆపరేషన్స్) అజిత్‌కుమార్ సక్సేనాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదివారం ఉత్తర్వులిచ్చింది. ఇంతకు ముందు సీఎండీగా బాధ్యతలు నిర్వర్తించిన అతుల్ భట్‌ను కేంద్ర ఉక్కు మంత్రత్వశాఖ దీర్ఘకాలిక సెలవుపై పంపింది. ఆ స్థానంలో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), డైరెక్టర్ (ఆపరేషన్స్)ఇన్‌చార్జ్ అరుణ్ కాంతి బాగ్చీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులిచ్చింది. తాజాగా ఏకే సక్సేనాకు ఈ బాధ్యతలు అప్పగించింది.

వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ తొలగింపు

సాక్షి, అమరావతి: గ్రామీణాభివృద్ధి శాఖలో వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి.వి.ఆర్.ఎం.రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఆయన తిరిగి తిరుపతిలోని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో సాయిల్ సైన్స్ ప్రిన్సిపల్ సైంటిస్టు విధుల్లో చేరాలంటూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంటి సంపులో సలసల మరిగే నీళ్లు

తెలంగాణ

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండకి చెందిన కర్ల జైపాల్‌రెడ్డి ఇంటిలోని మిషన్ భగీరథ తాగునీటి నల్లా సంపులో నీరు సలసలా మరుగుతోంది. 20 రోజులపాటు ఊరెళ్లిన జైపాల్‌రెడ్డి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చారు. ఆవరణ శుభ్రం చేసేందుకు సంపు మూత తీయగా.. లోపలి నుంచి పొగ బయటకు వచ్చింది. దీంతో సంపులో చేయి పెట్టి చూడగా నీళ్లు కాలుతున్నాయి. ఆందోళన చెందిన అతను చుట్టు పక్కల వారితో చెప్పగా వారంతా వచ్చి ఆసక్తిగా చూశారు.



మంచిమాట

జీవితంలో ఎదురయ్యే వివిధ పరిస్థితులకు మనం ఏ విధంగా స్పందిస్తాం... వాటిని ఏ కోణంలో చూస్తామనే విషయం మీదే మన అభివృద్ధి, ఎదుగుదల ఆధారపడి ఉంటుంది.. మనసు బాగోలేనపుడు చాలా విషయాలను మనం సమస్యలుగా చూస్తాం.. ప్రశాంతంగా ఉన్నపుడు అవే పరిస్థితులను సవాళ్లుగా భావిస్తాం. అందువల్ల మన అభివృద్ధి ఏదైనా అది మనం ఆయా సమస్యలను స్వీకరించే స్థితి మీదే ఆధార పడి ఉంటుంది..

మార్పు మనుగడ కోసమే...

మనిషి జీవితం పూల పాన్పు కాదు.. అదేవిధంగా ముళ్ళ కిరీటం కూడా కాదు.. ఈ ప్రాథమిక సూత్రాన్ని అవలోకనం చేసుకుని మన జీవితంలో వచ్చే ప్రతి మార్పును ఆహ్వానించినపుడే మన జన్మకు సార్థకత లభిస్తుంది.. బతుకూ పండుతుంది. మన జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలకు వెరుస్తూ, మార్పును ఆహ్వానించకపోతే అది మనలో ఆత్మన్యూనతను పెంచుతుంది. ఒక పనిలో విఫలమైనపుడు దానిలో ఎందుకు విఫలమయ్యామా... అని బుర్ర బద్దలు కొట్టుకుని మనసు పాడు చేసుకునే కన్నా, ఏం జరిగినా అది మన మంచికోసమేనని ఆత్మను సంతృప్తి చేసుకుంటే మనసు కుదుట పడుతుంది. ఆనందం సొంతమవుతుంది. జీవితంలో ఎదురయ్యే మార్పును ఎప్పటికప్పుడు ఆహ్వానించి, దానిని మన జీవితానికి సోపానాలుగా మార్చుకోవాలి తప్ప, ఆత్మ న్యూనతతో కుంగిపోకూడదు.

కనుక మార్పు అన్నది ఈ సృష్టిలో నిరంతరం జరిగే ఒకానొక సహజమైన ప్రక్రియ... పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకూ మనలో శారీరకంగా, మానసికంగా, బుద్ధి పరంగా సంఘపరంగా, ఆత్మ పరంగా ఇంకా అనేకానేక కోణాలలో, అనేకానేక స్థితులలో మార్పులు నిరంతరం జరుగుతూనే ఉంటాయి... అనివార్యంగా ఇలా మనలో జరిగే ప్రతి ఒక్క మార్పునూ మనం అంగీకరించాలి.

కురుక్షేత్ర సంగ్రామంలో తాను అస్త్ర సన్యాసం చేస్తానని అర్జునుడు చింతించినపుడు, శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి గీతోపదేశం చేశాడు. మార్పును ప్రతి ఒక్కరూ అంగీకరించాలని, ఇది సృష్టి ధర్మమని, మార్పును అంగీకరించినపుడే భవిష్యత్ నిర్దేశం కలుగుతుందని బోధించాడు. అలా శ్రీ కృష్ణభగవానుడి స్ఫూర్తితో అర్జునుడు యుద్ధం చేసి ధర్మ సంరక్షణలో తన వంతు పాత్ర పోషించాడు.


ప్రతి ఒక్కరూ మార్పును అంగీకరించాలి. ఆధునిక పోకడలకు అనుగుణంగా వేగంగా దూసుకువెళ్లాలి. ఉన్నతంగా ఎదగాలనే వారు.. మనతో మనం పోటీ పడాలని మానసిక నిపుణులు సైతం సూచిస్తున్నారు. మార్పును అంగీకరించకపోతే, మన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా వుంటుంది.

కనుక మొదట్నుంచీ తల్లిదండ్రులు మార్పుకు అనుగుణంగా జీవితాలను మలచుకోవాలనే దృక్పథాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వర్తమాన ప్రపంచానికి, పరిస్థితులకనుగుణంగా వారికి వారు నైపుణ్యాలు పెంచుకునే విధంగా ప్రోత్సహించాలి. ఈ క్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు వారు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే హక్కును కూడా ఇవ్వాలి అలాగే, వారి వ్యక్తిత్వాలు, ప్రాధాన్యతలు, పరిమితులను అర్థం చేసుకోవడంలో వారికి సహాయపడాలి. కుటుంబాలు, పాఠశాలలు పిల్లల సామర్థ్యం, ఉత్సుకత, సృజనాత్మకత, అలవాట్లను పిల్లల భావి జీవితానికనుగుణంగా తీర్చి దిద్దినపుడు జీవితంలో వస్తున్న మార్పులను అంగీకరించే సామర్థ్యాన్ని పొంది, పిల్లలు ఉన్నతంగా ఎదుగుతారన్న వాస్తవాన్ని గుర్తించి మసలుకోవాలి.

– దాసరి దుర్గాప్రసాద్

ఆధ్యాత్మికత

అన్నదాతా సుఖీభవ!



మహాలయ పక్షాలు జరుగుతున్నాయి. ఈ పక్షం రోజులూ మరణించిన పెద్దల పేరు మీద అన్నదానం చేయడం చాలా మంచిదని శాస్త్రోక్తి. ఎందుకంటే ఎన్ని దానాలు చేసినా... ఏ దానం చేసినా అన్నదానానికి సరిసాటి కాదు అవి. అందుకు ఉదాహరణగా ఒక ఇతివృత్తాన్ని చెబుతారు పెద్దవాళ్లు. అదేమంటే.. మహాభారత యుద్ధంలో కర్ణుడు వీరమరణం పొందుతాడు కదా... ఆ తరువాత ఆయన స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ ఆయనకు సకల సౌకర్యాలూ ఉన్నాయి. ఘనమైన స్వాగత సత్కారాలు లభించాయి. ఏది కావాలంటే అది అందుబాటులో ఉంది. అయితే ఏంలాభం? కర్ణుడికి ఏదో అసంతృప్తి. ఏదో వెలితి. ఎంత తిన్నా కడుపు నిండినట్టు అనిపించడం లేదు. సౌకర్యాలు ఎన్ని ఉన్నా సంతృప్తి కలగడం లేదు. ఆ విధంగా ఎందుకు అనిపిస్తోందో అర్థం కాలేదు. అందుకే అదే మాటను స్వర్గలోకాధిపతి అయిన సురేంద్రుని అడిగాడు కర్ణుడు.

అందుకు సురపతి చిరునవ్వుతో, ''ఓయీ కర్ణా... నీవు జీవించిన కాలంలో అడిగినవాడికి లేదనకుండా ఇచ్చి దానకర్ణుడివని పేరు తెచ్చుకున్నావు కదా.. ఎవరికైనా ఎప్పుడైనా అన్నదానం చేసావా... ఒకసారి గుర్తు తెచ్చుకో'' అన్నాడు.

ఆ మాటకు ఆశ్చర్యపోయిన కర్ణుడు అన్నదానం గురించి గుర్తు తెచ్చుకుందామని ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు. అయితే ఓ నిరుపేద తన దగ్గరకు వచ్చి అన్నం పెట్టించమని అడిగినప్పుడు తానేదో పరధ్యానలో ఉండి ఇప్పుడు అన్నం పెట్టేవారెవరూ లేరు కానీ, ఫలానా చోటికి వెళితే నీకు కడుపు నిండా తిండి దొరుకుతుందని ఓ ఇల్లు చూపించిన సంగతి గుర్తు వచ్చింది. అదే ఇంద్రుడికి చెప్పాడు. ఆ మాటకు ఆనందించిన దేవేంద్రుడు ''అలా అయితే నీవు అన్నదానం దొరుకుతుందని చెప్పిన ఇంటిని చూపించిన వేలిని నోట్లో పెట్టుకో'' అని చెప్పాడు.

ఆ విధంగా చేయడానికి చిన్నతనంగా అనిపించినప్పటికీ, ఆ చెప్పిన వాడు దేవేంద్రుడు కాబట్టి తాను ఆ పేదవాడికి ఇల్లు చూపించిన వేలిని నోట్లో పెట్టుకున్నాడు కర్ణుడు. ఆశ్చర్యం... అప్పటివరకూ అతడిని పీడించిన వేదన, వెలితి మాయమై కడుపు నిండిన భావన కలిగింది. అంతవరకూ ఉన్న అసంతృప్తి మటుమాయమైంది.


ఇప్పుడు అర్థం అయింది కదా.. అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఎందుకంటారో, ఆకలి అని పొట్ట చేతపట్టుకుని ఇంటి ముంగిటికొచ్చిన అన్నార్తులకు కుల మత లింగ ప్రాంతీయ భాషాభేదాలు లేకుండా.. అడిగినవాడు తన శత్రువా మిత్రుడా అని కూడా ఆలోచించకుండా అన్నం పెట్టాలని. ఎందుకంటే ఏది దానంగా ఇచ్చినా... ఎంత ఇచ్చినా కూడా దాన గ్రహీతకు మరికొంత ఇస్తే బాగుండుననిపిస్తుంది లేదంటే మరేదో కావాలనిపిస్తుంది. అయితే ఆప్యాయంగా అన్నం పెట్టినప్పుడు మాత్రం తిన్నవాళ్లు కడుపునిండింది, ఇంక చాలు అని చెప్పి సంతృప్తిగా లేస్తారు. అందుకే అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి నిరంతరం అన్నదానం చేసేవారు ఇప్పుడు కూడా ఉన్నారు. ఇకవేళ మనం అన్నదానం చేయలేకపోయినా అన్నం పెట్టే ఇంటిని చూపించినా పుణ్యమని పెద్దలు చెప్తారు.

మహాలయ పక్షాలలో ఇప్పటికే పదిరోజులకు పైగా గడిచిపోయింది. మరికొద్దిరోజులే ఉంది. ఈ కొద్దిరోజులలో అయినా సరే, మన నమ్మకాలు, విశ్వాసాలు, పూజా పురస్కారాలతో పని లేకుండా ఆకలితో ఉన్న వారికి అన్నం పెడితే వారికి కడుపు, మనకు గుండే నిండుతాయి. అన్నదాతా సుఖీభవ!

– డి.వి.ఆర్. భాస్కర్

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అంతరాత్మ చెప్పింది విను...



ధర్మం చెప్పడానికి ప్రమాణాలుగా శృతి, స్మృతి, పురాణం, శిష్టాచారమ్ కాగా చిట్టచివరిది– అంతరాత్మ ప్రబోధమ్. లోపలి నుంచి భగవంతుడు చెబుతుంటాడు... ఇది తప్పు.. అని చేయకు. ఇది సరైనదే..చెయ్..అన్నప్పుడు చేసేయ్. ఏది చేయమని అంతరాత్మ ప్రబోధించిందో అది ధర్మం. ఏది వద్దని హెచ్చరించిందో అది అధర్మం. అందువల్ల అంతరాత్మ ప్రబోధమ్ చివరి, అథమ ప్రమాణం. కర్తవ్యమ్... నేను చేయవలసినదేది? అక్కడ మొదలు కావాలని చెబుతుంది శాస్త్రం. నేనేమి చేయాలో నాకు తెలియడానికి చదువుకోవాలి.. ఇది దేనికోసం.. భగవంతుని అనుగ్రహం కోసం. భక్తి రెండుగా మొదలవుతుంది. భగవంతుడు వేరు, నేను వేరు అని... నా కర్తవ్యాన్ని నేను నిర్వహించడం మొదలుపెడితే.. పోయి పోయి నది సముద్రంలో కలిసిపోయినట్టు.. అది ఒకటవుతుంది.. అప్పుడు ఇక తానెవరో తెలిసిపోతుంది. అంటే కర్తవ్యాన్ని నిర్వహిస్తూపోతే ఒక సత్యం తెలుస్తుంది. అదేమిటి? ఇది నేను కాదు –అని. నోటితో చెబితే అది తెలిసిపోయిందని కాదు... అనుభవంలోకి రావాలి. ఇది.. ఈ శరీరం.. నేను కాదు, లోపల ఒకటి ఉంది. అది నేను. అదే సత్యం. అది కత్తిచేత నరకబడదు, అగ్నిచేత కాల్చబడదు, నీటిచేత తడపబడదు, వాయువు చేత కొట్టబడదు.... అదే నేను. అంతే తప్ప ఇది.. అంటే ఈ శరీరం నేను కాదు. .. అని తెలుసుకోవడం. అలా తెలుసుకున్నట్టు గుర్తు ఏమిటంటే... ఇది .. ఈ శరీరం పడిపోతున్నా... ఇది 'నేను' కాదు అని లోపల ఉన్న 'నేను' చూస్తూ సాక్షీభూతంగా ఉండడం. ఆ అనుభవంలోకి మారడం దగ్గర ఈశ్వర కృప కావాలి. ఈశ్వర కృప ఎవరికిస్తారు? ''శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరఃసంయతేంద్రియః/ జ్ఞానం లబ్ధ్వా పరాం శాంతిమచిరేణాధిగచ్ఛతి'' ... శ్రద్ధావాన్ లభతే జ్ఞానం... గురువుగారు చెప్పిన మాట, శాస్త్రాలు చెప్పిన సూత్రం సత్యం అనిముందు నమ్మకం ఉండాలి. ఆ విశ్వాసంతో, శ్రద్ధతో ప్రారంభం అయినప్పుడు వారికి ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. చదువుకున్న దాని మీద శ్రద్ధ ఉంది కాబట్టి ఇంద్రియాలను కట్టడి చేస్తాడు. అక్కడ 'ధర్మేచ అర్థేచ కామేచ ఏషా నాతి చరితవ్యా... అక్కడ తనను తాను ధర్మచట్రంలో ఇముడ్చుకోగలుగుతాడు. ధర్మాన్ని అతిక్రమించని అర్థకామాలు పొందుతాడు. అప్పుడు ధర్మకామార్థసిద్ధయేత్... గృహస్థాశ్రమానికి ఆశీర్వచనం అయిపోయింది. 'నీకు ధర్మార్థ కామములు సిద్ధించుగాక. ధర్మము నుండి విడివడిపోకుండు గాక!.. మనుష్య జన్మను సద్వినియోగం చేసుకోవడానికి పరమ తేలిక మార్గం–గృహస్థాశ్రమం. అంటే నీ కర్తవ్యం తెలియడం దగ్గర మొదలయింది. కర్తవ్యం తెలియకుండా నేనెవరో తెలుసుకుంటాననటే ... అది సాధ్యం కాదు. దానికది మార్గం కాదు. భగవాన్ రమణులలాగా గోచి పెట్టుకుని... నేనెవరో నాకు తెలిసిపోతుంది .. అంటాననంటే కుదరదు. మీరు జ్ఞానిని అనుకరించలేరు. సాధన పండితేనే జ్ఞానం కలుగుతుంది. సాధనకు అర్హత.. అధ్యాపనం బ్రహ్మయజ్ఞః.ఏవి నీకోసం రుషులు ఇచ్చారో వాటిని చదువు. వేదాలన్నీ చదవనక్కరలేదు. రామాయణం, భాగవతం చదువు. భారతం పంచమ వేదం. అది సమస్త పురాణ సారాంశం. అవి చదువు. ఇవి లోకం కోసం ఇస్తున్నా.. అన్నాడు వ్యాసుడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

మా బిల్డింగ్ గురించి రెండు నెలల్లో ప్రకటిస్తాం

– మంచు విష్ణు



''మేం ఏం అనుకుని వచ్చామో ఆ పనులన్నీ పూర్తి చేశాం. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) బిల్డింగ్ ఒక్కటే బాకీ ఉంది. ఈ అంశంపై కూడా రాబోయే రెండు నెలల్లో ఓ అద్భుతమైన ప్రకటన చేయబోతున్నాం'' అని 'మా'అధ్యక్షుడు విష్ణు మంచు అన్నారు. జీవీకే హెల్త్ హబ్ అసోసియేషన్‌తో 'మా' ఆధ్వర్యంలో సభ్యులకు ఫ్రీ హెల్త్ చెకప్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. అధ్యక్షుడు మంచు విష్ణు, ఉపాధ్యక్షుడు మాదాల రవి ఈ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ హెల్త్ క్యాంప్‌లో 'మా' సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంచు విష్ణు మాట్లాడుతూ– ''జీవీకే హెల్త్ హబ్ యాజమాన్యానికి, డాక్టర్ శాస్త్రిగారితో పాటు టీమ్ అందరికీ ధన్యవాదాలు. 'మా' సభ్యులందరికీ ఉచితంగా హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు'' అని అన్నారు. ''ఆదివారం వరల్డ్ హార్ట్ డే. ఆర్టిస్టులు ఎంతో ఒత్తిడితో ఉంటారు. అందుకే వీరి కోసం మాస్టర్ చెకప్ చేశాం'' అన్నారు డా. శాస్త్రి. 'మా'లోని సభ్యుల్లో దాదాపు నాలుగు వందల మంది ఈ హెల్త్ క్యాంప్‌లో పాల్గొని, చెకప్ చేయించుకున్నారని సమాచారం.

తుస్సాడ్స్‌లో ఆర్‌ఆర్



రైమ్‌తో రామ్‌చరణ్

హీరో రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. సింగపూర్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహం ఏర్పాటు కానుంది. ఈ విగ్రహానికి కావాల్సిన కొలతలు పూర్తయ్యాయని, త్వరలోనే ఆయన మైనపు బొమ్మ ఆవిష్కరణ వేడుక ఉంటుందని ఓ అవార్డు ఫంక్షన్‌లో మేడమ్ తుస్సాడ్స్ ప్రతినిధులు వెల్లడించారు. అలాగే చరణ్ మైనపు విగ్రహంలో ఆయన పెంపుడు కుక్క రైమ్ కూడా కనిపించనుండటం ఓ విశేషం. మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లుగా రామ్‌చరణ్ వెల్లడించారు. మరి... ఆర్ (రామ్‌చరణ్) అండ్ ఆర్ (రైమ్) మైనపు బొమ్మలు ఎలా ఉంటాయో చూడాలంటే మరికొంత సమయం పడుతుంది. మరోవైపు ప్రస్తుతం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందనున్న సినిమాలోని పాత్రకు సంబంధించిన మేకోవర్‌తో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. అలాగే రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'గేమ్ చేంజర్' సినిమా క్రిస్మస్ సందర్భంగా విడుదలయ్యే అవకాశం ఉంది.

అక్టోబరులో ఆరంభం



విజయ్ దేవరకొండ

'టాక్సీవాలా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. 19వ శతాబ్దపు నేపథ్యంలో 1854 – 1878 టైమ్ పీరియడ్‌లో ఈ సినిమా తెరకెక్కనుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా కథ ఉంటుందని, ఇందులో తండ్రీకొడుకులుగా విజయ్ ద్విపాత్రాభినయం చేస్తారనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. కాగా ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది అక్టోబరు చివర్లో లేదా నవంబరు మొదటివారంలో ప్రారంభమయ్యేలా యూనిట్ సన్నాహాలు చేస్తోందని టాక్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు.

ప్రభాస్ అద్భుతమైన నటుడు

– అర్షద్ వార్సీ



ప్రభాస్ అద్భుతమైన నటుడని బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ కితాబులిచ్చారు. కాగా ప్రభాస్ హీరోగా నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా విడుదలైన తర్వాత, ఆ సినిమాలో ప్రభాస్ జోకర్‌లా కనిపించాడంటూ ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై ఓ వేడుకలో అర్షద్ స్పందించారు. ''ఏ విషయంపైన అయినా ప్రతి ఒక్కరికీ ఒక అభిప్రాయం ఉంటుంది. ప్రభాస్ అద్భుతమైన నటుడు. దీన్ని ఆయన ఇప్పటికే ఎన్నోసార్లు నిరూపించుకున్నారు. నేను ఆ మధ్య చేసిన వ్యాఖ్యలు ఆ సినిమా ('కల్కి 2898 ఏడీ'లోని ప్రభాస్ పాత్ర భైరవను ఉద్దేశించి)లోని పాత్రను ఉద్దేశించినవి మాత్రమే. వ్యక్తి గురించి కాదు... అయితే గొప్ప నటులు ఈ తరహా పాత్రలు చేస్తే వారి అభిమానులు బాధపడతారు. ప్రస్తుతం భారతీయ సినిమాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తోంది. వివిధ భాషలకు చెందిన నటీనటులు ఒక సినిమాలో భాగస్వామ్యం అవుతుండటం సంతోషంగా ఉంది'' అంటూ అర్షద్ మాట్లాడారు. ఇక ప్రభాస్ హీరోగా అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా ఈ ఏడాది జూన్ 27న రిలీజైన సంగతి తెలిసిందే. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించినట్లు బాక్సాఫీస్ లెక్కలు స్పష్టం చేశాయి.

నీడల్లే నేను తోడు ఉండనా...



ఆలియా భట్, వేదాంగ్

'అంకుర్ నువ్వు ఏమన్నా చేశావా? నువ్వు ఏదన్నా టచ్ చేశావా? ఏదన్నా తిన్నావా ఓకే... కబీర్ నీ ఫోన్‌తో ఏమైనా కాల్స్ చేశాడా? లేదుగా? బ్లడ్ శాంపిల్స్ తీస్తే క్లీన్ వస్తుంది కదా... నువ్వేం భయపడకు... నీకేం కానివ్వను' అని ఆలియా భట్ పలికే సంభాషణలతో 'జిగ్రా' సినిమా తెలుగు ట్రైలర్ విడుదల అయింది. ఆలియా భట్, వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'జిగ్రా'. అక్కాతమ్ముళ్ల సెంటిమెంట్‌తో వాసన్ బాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. ఈ చిత్రంలో సత్య పాత్రలో ఆలియా, అంకుర్ పాత్రలో వేదాంగ్ నటించారు. కరణ్ జోహార్, అపూర్వా మెహతా, ఆలియా భట్, షాహిన్ భట్, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 11న విడుదల కానుంది. 'జిగ్రా' చిత్రాన్ని తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ద్వారా హీరో రానా విడుదల చేస్తున్నారు. ఆదివారం ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ షేర్ చేశారు. ఇంకా ఈ ట్రైలర్‌లో 'దారే లేకున్నా... నీ వెంట నీడల్లే నేను తోడు ఉండనా... ఏమైనా కానీ... ఏ పిడుగే రానీ నేను తోడు ఉండనా...' అనే పాట కూడా వినిపిస్తుంది.

ఇడియట్ రోజులు గుర్తొచ్చాయి

– దర్శకుడు ప్రశాంత్ వర్మ



గౌరి, సిమ్రాన్ శర్మ, మాధవ్, అనూప్, ప్రశాంత్ వర్మ

హీరో రవితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. ఇందులో సిమ్రాన్ శర్మ హీరోయిన్. గౌరీ రోణంకి దర్శకత్వంలో యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మించిన ఈ సినిమా నవంబరులో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ– ''రవితేజగారు ఎందరినో ప్రోత్సహించారు. నన్నూ ప్రోత్సహించారు. ఈ వేడుకకు పిలిచినప్పుడు మాధవ్‌ను సపోర్ట్ చేయడం నా బాధ్యతగా భావించి, వచ్చాను. రవితేజగారి స్థాయికి మాధవ్ చేరుకోవాలి. టైటిల్ 'మిస్టర్ ఇడియట్' అని చెప్పగానే నాకు 'ఇడియట్' సినిమా చూసిన రోజులు గుర్తొచ్చాయి. ఈ సినిమా యూనిట్‌కు ఆల్ ది బెస్ట్'' అని అన్నారు. ''మా పెదనాన్న రవితేజగారు నాకు సపోర్ట్ చేస్తుంటారు'' అన్నారు మాధవ్. ''ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో ఈ సినిమా అందర్నీ మెప్పిస్తుంది'' అన్నారు గౌరి. ''రవితేజలో ఉన్న ఫీచర్స్‌లో కొన్ని మాధవ్‌లో కూడా ఉన్నాయి'' అన్నారు జేజేఆర్ రవిచంద్. నిర్మాత బెక్కెం వేణుగోపాల్ ఓ అతిథిగా పాల్గొన్నారు.

రహస్య మలుపులతో...

రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతల, హిరణ్య రావినూతల నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబరు 8న విడుదల కానుంది. అమెరికాలోని డల్లాస్‌లోగల యూనివర్శిటీ ఆఫ్ టెక్సాస్‌లోని క్యాంపస్ మూవీ థియేటర్‌లో ఈ చిత్రం టీజర్ ఆవిష్కరణ జరిగింది. ''ఓ తెలుగు చిత్రం టీజర్‌ని అమెరికాలో విడుదల చేయడం ఇదే తొలిసారి'' అని నిర్మాతలు పేర్కొన్నారు. ''మన పురాణాలు, ఇతిహాసాల్లోని ఆసక్తికరమైన పాయింట్‌ను తీసుకొని సైన్స్ ఫిక్షన్, మైథలాజికల్ అంశాలకు పలు మలుపులు జోడించి ఈ చిత్రం రూపొందించాం. ముఖ్యంగా మన శ్రీ చక్రం, శ్రీ యంత్రం, మన చరిత్ర గురించి చెప్పినవి ఆసక్తికరంగా ఉంటాయి. ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'' అని కోమల్ ఆర్. భరద్వాజ్ అన్నారు.



'రహస్యం ఇదం జగత్' పోస్టర్

టైటిల్ గురించి సినిమాలో తెలుస్తుంది



గరీమా సింగ్, నోయెల్, రిషిత

నోయెల్, రిషిత నెల్లూరు హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'బహిర్భూమి'. రాంప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 4న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ – ''సెట్ బాయ్ నుంచి హీరో వరకూ మా సినిమా బాగా రావడానికి అందరూ కృషి చేశారు. అక్టోబరు 4న తెలుగులో విడుదల చేసిన కొన్ని రోజులకు ఇతర భాషల్లోనూ రిలీజ్ చేస్తాం. ఈ రోజు సాయంత్రం న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్ బిల్ బోర్డ్ పై మా మూవీ ట్రైలర్‌ని ప్రదర్శిస్తాం. హాష్ ట్యాగ్ 'బహిర్భూమి' అని సోషల్ మీడియా పోస్టులు చేసిన వారిలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతి అందిస్తాం'' అన్నారు. ''అప్పట్లో రెండు ఊర్ల మధ్యలో బహిర్భూమి ప్లేస్ కోసం గొడవలు జరిగేవి. 'బహిర్భూమి' టైటిల్ ఎందుకు పెట్టామో సినిమా చూస్తే తెలుస్తుంది'' అని రాంప్రసాద్ కొండూరు చెప్పారు. ''ఈ సినిమా అందరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. రాంప్రసాద్‌కి ఇది ఫస్ట్ మూవీ అయినా చక్కగా తెరకెక్కించారు. అలాగే మంచి కాన్సెప్ట్‌తో 'బహిర్భూమి'ని నిర్మించిన వేణు మాధవ్‌గారు వంద సినిమాలు చేయాలి'' అని నోయెల్ తెలిపారు. నటుడు చిత్రం శ్రీను, మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ పట్నాయక్, ఛాయాగ్రాహకుడు ప్రవీణ్ కోమరి తదితరులు పాల్గొన్నారు.



మహిళల టి20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 ప్రపంచకప్ తొలి వార్మప్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించింది. ఆదివారం జరిగిన పోరులో భారత అమ్మాయిల జట్టు 20 పరుగుల తేడాతో వెస్టిండీస్ మహిళల జట్టుపై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 141 పరుగులు చేసింది. జెమీమా రోడ్రిగ్స్(40 బంతుల్లో 52 ; 5 ఫోర్లు) అర్ధ శతకంతో ఆకట్టుకోగా... యస్తిక భాటియా (24 ; ఒక ఫోర్, ఒక సిక్సర్) ఫర్వాలేదనిపించింది. వెస్టిండీస్ బౌలర్లలో హేలీ మాథ్యూస్ నాలుగు వికెట్లు పడగొట్టింది. అనంతరం లక్ష్య ఛేదనలో వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 121 పరుగులు చేసింది. చీనిల్ హెన్రీ(48 బంతుల్లో 59 ; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) హాఫ్ సెంచరీ సాధించింది. భారత బౌలర్లలో పూజ వస్త్రకర్ 3, దీప్తి శర్మ రెండు వికెట్లు పడగొట్టారు. రెండో వార్మప్ మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికా మహిళల జట్టుతో భారత జట్టు తలపడనుంది. గురువారం నుంచి మహిళల ప్రపంచకప్ ప్రధాన టోర్నీ ప్రారంభం కానుంది.



ఒక్క చుక్క వాన పడకున్నా..


- మూడో రోజూ ఆట రద్దు
- భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

కాన్పూర్: సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం కనబరుస్తున్న టీమిండియా... బంగ్లాదేశ్‌పై సిరీస్ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమే అనుకుంటే... వర్షం, వెలుతురులేమి, మైదానం సిద్ధంగా లేకపోవడం వంటి కారణాల వల్ల అది సాధ్యపడేలా కనిపించడం లేదు. భారత్, బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టు మూడో రోజు ఆట కూడా ఒక్క బంతి పడకుండానే రద్దు అయింది. శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో తొలి రోజు 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్య పడగా... వరుసగా రెండు రోజులు తుడిచిపెట్టుకుపోయాయి. ఆదివారం వర్షం అంతరాయం కలిగించకపోయినా... క్రితం రోజు కురిసిన వానతో మైదానం చిత్తడిగా మారడం వల్ల ఆట సాధ్యపడలేదు. దీంతో వరుసగా రెండో రోజు ఇరు జట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌లకే పరిమితమయ్యారు. పలుమార్లు సమీక్షలు నిర్వహించిన అంపైర్లు టీ విరామ సమయంలో మూడో రోజు ఆటను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది.

సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక...

కాన్పూర్‌లో ఇప్పటికే మూడు రోజుల ఆట ముగియగా.. అందులో ఎనిమిది సెషన్‌లు తుడిచిపెట్టుకుపోయాయి. ఇది రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మున్సిపల్ గ్రౌండ్ కాగా... ఇక్కడ మ్యాచ్ నిర్వహించిన ప్రతిసారి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంటుంది. దీంతో తాత్కాలిక ఏర్పాట్లే తప్ప పూర్తిస్థాయి ఏర్పాట్లపై బోర్డు కూడా దృష్టి పెట్టలేదు. మ్యాచ్‌కు ముందే స్టాండ్స్ నాణ్యత విషయంలో పెద్ద చర్చ జరగగా... 'సి' బ్లాకు నాణ్యత సరిగ్గా లేని కారణంగా అందులోకి ప్రేక్షకులను అనుమతించలేదు. దేశంలో ఎన్నో మైదానాలు ఉన్నప్పటికీ బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సొంత మైదానం కావడం వల్లే కాన్పూర్‌కు టెస్టు మ్యాచ్ కేటాయించారు. సౌకర్యాల విషయంలో ప్రధాన వేదికల దరిదాపుల్లో కూడా లేని కాన్పూర్‌లో... డ్రైనేజీ వ్యవస్థతో పాటు కనీస వసతులు లేకపోవడంతోనే ఆదివారం ఒక్క చుక్క వర్షం పడకపోయినా మ్యాచ్‌ను నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది.

గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా చాముండేశ్వరనాథ్



బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఆంధ్ర మాజీ క్రికెటర్ వి.చాముండేశ్వరనాథ్ ఎంపికయ్యారు. ఈ కౌన్సిల్‌లో అరుణ్ ధుమాల్, అవిషేక్ దాల్మియా ఇతర సభ్యులు కాగా... ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) తరఫున చాముండి ప్రాతినిధ్యం వహిస్తారు. 65 ఏళ్ల చాముండి ఆంధ్ర జట్టు 44 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడారు. ఆదివారం జరిగిన బీసీసీఐ ఏజీఎంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పద్దులతో పాటు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌కు కూడా ఈ ఏజీఎంలో ఆమోదముద్ర వేశారు. మరో వైపు వచ్చే సీజన్ కోసం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చేసిన కొత్త ప్రతిపాదనలను కూడా బోర్డు ఆమోదించింది.

భారత క్రికెట్‌లో 'కొత్త' కళ

దాదాపు ఇరవై నాలుగేళ్ల క్రితం భారత వర్ధమాన క్రికెటర్లను తీర్చిదిద్దేందుకు, అత్యుత్తమ సౌకర్యాలతో శిక్షణ ఇచ్చేందుకు బీసీసీఐ బెంగళూరులో జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ని ఏర్పాటు చేసింది... నగరం నడిబొడ్డున చిన్నస్వామి స్టేడియం ఆవరణలోనే ఇంతకాలం అది కొనసాగింది... క్రికెట్‌లో వస్తూ వచ్చిన మార్పుల నేపథ్యంలో మరింత అధునాతన సౌకర్యాలతో దానిని విస్తరించాలని భావించిన బోర్డు నగర శివార్లలో 2008లోనే భూమిని కొనుగోలు చేసింది. కానీ వేర్వేరు కారణాలతో దాని ఏర్పాటు ఆలస్యం కాగా... ఎట్టకేలకు ఇన్నేళ్ల తర్వాత అద్భుత సౌకర్యాలతో అది సిద్ధమైంది. జాతీయ క్రికెట్ అకాడమీనుంచి పేరు మార్చుకొని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' గా క్రికెటర్లకు అందుబాటులోకి వచ్చింది.



- బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం
- జాతీయ క్రికెట్ అకాడమీ పేరు మార్పు
- అద్భుతాలు చేస్తామన్న వీవీఎస్ లక్ష్మణ్

బెంగళూరు: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (బీసీఈ)ని అధికారికంగా ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు. భారత సీనియర్ జట్టుకు వివిధ సిరీస్‌లకు ముందు క్యాంప్‌లు, యువ ఆటగాళ్లకు శిక్షణ, గాయపడిన క్రికెటర్లకు చికిత్స, స్పోర్ట్స్ సైన్స్, రీహాబిలిటేషన్... ఇలా అన్నింటి కోసం ఇక్కడ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయి. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో, ఇంగ్లండ్‌లోని లాఫ్‌బారోలో ఇలాంటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు ఉన్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుంటూనే భారత్‌లో అలాంటి కేంద్రం కావాలని భావించిన బోర్డు దీనిని సిద్ధం చేసింది. 16 ఏళ్ల క్రితమే భూమిని తీసుకున్నా...వివిధ అడ్డంకులతో పని సాగలేదు. తుది అనుమతులు 2020 చివర్లో రాగా, కోవిడ్ కారణంగా అంతా ఆగిపోయింది. ఎట్టకేలకు ఫిబ్రవరి 2022లో పని మొదలు పెట్టి ఇప్పుడు పూర్తి చేశారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌సీఏను దశలవారీగా ఇక్కడకు తరలిస్తారు. 2021 డిసెంబర్ నుంచి ఎన్‌సీఏ హెడ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరిస్తున్నారు.

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విశేషాలు...

- మొత్తం 40 ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రం ఉంది. తాజా నిర్మాణంలో 33 ఎకరాలను వాడుకున్నారు. తర్వాతి స్థాయిలో విస్తరణ కోసం మరో 7 ఎకరాలను ఖాళీగా ఉంచారు.
- ఐసీసీ ప్రమాణాలకు అనుగుణంగా ఫస్ట్ క్లాస్ స్థాయి మ్యాచ్‌లు నిర్వహించగలిగే మూడు పెద్ద మైదానాలు అందుబాటులో ఉన్నాయి. మూడు భిన్న స్వభావం ఉన్న పిచ్‌లు మన ఆటగాళ్ల అన్ని రకాలుగా సన్నద్ధమయ్యేందుకు పనికొస్తాయి.
- ప్రధాన గ్రౌండ్‌లో ఆధునిక తరహా ఫ్లడ్‌లైట్లతో పాటు సబ్ ఎయిర్ డ్రైనేజ్ వ్యవస్థ, మ్యాచ్‌ల ప్రసారానికి ఏర్పాట్లు, మొత్తం 13 పిచ్‌లు ఉన్నాయి. ముంబై నుంచి తెప్పించిన ఎర్ర మట్టితో ఈ పిచ్‌లు రూపొందించారు. ఇక్కడి బౌండరీ 85 గజాల దూరంలో ఉండటం విశేషం.
- మిగతా రెండు గ్రౌండ్‌లను ప్రధానంగా ప్రాక్టీస్ కోసం వినియోగిస్తారు. దక్షిణ కర్ణాటకలోని మాండ్యానుంచి, ఒడిషా నుంచి తెప్పించిన నల్లరేగడి మట్టితో మొత్తం 20 పిచ్‌లు తయారు చేశారు. ఇక్కడ బౌండరీ 75 గజాలుగా ఉంది.
- మొత్తం 9 వేర్వేరు భాగాలుగా విభజించి 45 అవుట్‌డోర్ నెట్ ప్రాక్టీస్ పిచ్‌లు అందుబాటులో ఉంచారు. ఫీల్డింగ్ ప్రాక్టీస్ ఏరియా దీనికి అదనం.



నేను ప్రపంచంలో ఇలాంటి ఎన్నో సెంటర్లకు వెళ్లాను. కానీ ఇంత మంచి సౌకర్యాలు ఎక్కడా లేవు. భారత క్రికెటర్లందరి కోసం ప్రపంచంలో అత్యంత ఆధునిక సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. తాము అన్ని రకాలుగా అత్యుత్తమ ఆటగాళ్లగా ఎదిగేందుకు ఇక్కడ అవకాశం ఉంది. ఈ క్రమంలో మన జట్టు అన్ని ఫార్మాట్‌లలో బెస్ట్ టీమ్‌గా ఎదుగుతుంది. ఇకపై అండర్–15 స్థాయి ఆటగాళ్ల మొదలు సీనియర్ వరకు ఏడాది పాటు నిరంతరాయంగా ఇక్కడ కార్యకలాపాలు కొనసాగుతాయి. అన్నింటి కంటే ముఖ్యమైంది మూడు భిన్నమైన పిచ్‌లు ఉండటం. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ క్రికెట్ ఆడినా దాని కోసం ఒకే వేదికపై సిద్ధమయ్యే అవకాశం ఇది కల్పిస్తుంది.

–వీవీఎస్ లక్ష్మణ్, బీసీఈ హెడ్

- ఇండోర్ ప్రాక్టీస్ మైదానంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లను పోలిన ఎనిమిది ప్రాక్టీస్ పిచ్‌లు ఉన్నాయి.
- నాలుగు ప్రత్యేక అథ్లెటిక్ ట్రాక్‌లు ఈ ప్రాంగణంలో ఉన్నాయి. బీసీఈలోని ఉన్న సౌకర్యాలను మునుమ్మందు క్రికెటేతర ఆటగాళ్లు కూడా వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామని...ముఖ్యంగా ఒలింపియన్లు ఇక్కడ సిద్ధమయ్యేందుకు అన్ని సౌకర్యాలు ఉన్నాయని జై షా వెల్లడించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-ఈస్ట్రన్ రైల్వేలో 3,115 యాక్ట్ అప్రెంటిస్‌లు

కోల్‌కతాలోని ఈస్ట్రన్ రైల్వే-రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ) ఈస్ట్రన్ రైల్వే పరిధిలోని వర్క్‌షాప్‌లు, డివిజన్‌లలో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 3,115.
» **వర్క్‌షాప్/డివిజన్‌లు:** హౌరా డివిజన్, లిలుహ్ వర్క్‌షాప్, సీల్దా డివిజన్, కంచరపరా వర్క్‌షాప్, మాల్డా డివిజన్, అసన్‌సోల్ డివిజన్, జమాల్‌పూర్ వర్క్‌షాప్.
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెకానిక్, మెషినిస్ట్, కార్పెంటర్, పెయింటర్, లైన్‌మ్యాన్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రీషియన్, ఎంఎంటీఎం, సివిల్ ఇంజనీర్, టర్నర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 23.10.2024
» వెబ్‌సైట్: https://rrcrecruit.co.in

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో 31 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్(ఏవీఎన్ఎల్) యూనిట్‌లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో ఫిక్స్‌డ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **విభాగాలు:** మెకానికల్,ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్, క్యాడ్ స్పెషలిస్ట్, మెటలర్జీ,కెమికల్,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ.
» **అర్హత:**సంబంధిత విభాగంలో డిప్లొమా,బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.**వయసు:**21నుంచి 40ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డిప్యూటీ జనరల్ మేనేజర్/హెచ్ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** నోటిఫికేషన్ వెలువడిన 21 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://avnl.co.in

అనంతపురం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో 84 అంగన్‌వాడీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 84.
» **పోస్టుల వివరాలు:** అంగన్‌వాడీ వర్కర్/మినీ అంగన్‌వాడీ వర్కర్/అంగన్‌వాడీ హెల్పర్.
» **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 21–35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు అంగన్‌వాడీ వర్కర్ పోస్టులకు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.7000, అంగన్‌వాడీ హెల్పర్‌కు రూ.7000.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.10.2024.
» **వెబ్‌సైట్:** https://ananthapuramu.ap.gov.in

అనంతపురం జిల్లా చిల్డ్రన్ హోమ్‌లో వివిధ ఉద్యోగాలు

అనంతపురం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ హోం(బాల సదనం)లో ఒప్పంద/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07(పోస్టుల వివరాలు: స్టోర్ కీపర్ కమ్ అకౌంటెంట్-01, హౌస్ కీపర్-01, ఎడ్యుకేటర్(పార్ట్ టైమ్)-02, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కమ్ మ్యూజిక్ టీచర్(పార్ట్ టైమ్)-02, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కమ్ యోగా టీచర్(పార్ట్ టైమ్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, బీఈడీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అనంతపురం జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో వ్యక్తిగతంగా అందజేయాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.10.2024.
» **వెబ్‌సైట్:** https://ananthapuramu.ap.gov.in

» నర్సింగ్‌లో విస్తృత కెరీర్ అవకాశాలు
» ఇంటర్మీడియెట్ అర్హతతోనే నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశం
» నర్సింగ్ ప్రొఫెషనల్స్‌కు పెరుగుతున్న డిమాండ్
» కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పలు శాఖల్లో నియామకాలు
» ప్రారంభంలోనే నెలకు రూ.44 వేల వరకు మూల వేతనం

నర్సింగ్.. కెరీర్ షైనింగ్

నర్సింగ్.. వైద్య రంగంలో ఎంతో కీలకమైన సేవాతత్పరతతో కూడిన వృత్తి! వైద్యులు చికిత్సలు చేసినా.. రోగులకు సేవలు అందించేది మాత్రం నర్సులే! అందుకే.. నర్సింగ్ వృత్తికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది! నర్సింగ్ సేవలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది! ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. ఈ కొలువులో చేరిన వారికి వేతనాలు సైతం భారీ స్థాయిలో అందుతున్నాయి! ఈ నేపథ్యంలో.. నర్సింగ్ సేవలకు ప్రాధాన్యం, ఈ రంగంలో కెరీర్ అవకాశాలు, అకడమిక్ మార్గాలు తదితర వివరాలు..


కెరీర్ గైడెన్స్

ప్రస్తుతం ఇంటర్మీడియెట్ మొదలు బ్యాచిలర్, పీజీ అర్హతతో పలు స్థాయిల్లో నర్సింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా బీఎస్సీ నర్సింగ్‌లో చేరేందుకు బైపీసీ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వైద్యకోర్సులకు ప్రత్యామ్నాయంగానూ నర్సింగ్ కోర్సులను ఎంచుకుంటున్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్ఎం

ఇంటర్మీడియెట్ అర్హతతోనే నర్సింగ్ వృత్తిలోకి అడుగు పెట్టేందుకు మార్గం.. మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్/ఆగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫ్. ఈ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇంటర్మీడియెట్‌లోని అన్ని గ్రూప్‌ల విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. విద్యార్థులు చేరాలనుకుంటున్న విద్యా సంవత్సరంలో డిసెంబర్ 31 నాటికి 17 ఏళ్లలోపు వయసుండాలి. వీటి ప్రవేశాలను రాష్ట్రాల స్థాయిలో కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో మెరిట్ జాబితా రూపొందించి సీటు కేటాయిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో కొలువులు లభిస్తాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ అవకాశాలు అందుకోవచ్చు.

జీఎన్ఎం

నర్సింగ్ వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి ఇంటర్మీడియెట్ అర్హతతోనే అవకాశం కల్పించే మరో కోర్సు.. జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్ఎం). ఈ కోర్సు వ్యవధి ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌తో కలిపి మొత్తం మూడేళ్లు. రాష్ట్రాల స్థాయిలో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పర్యవేక్షణలో ఆయా జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నేతృత్వంలో సీట్లు భర్తీ చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కుల ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి.. మెరిట్ జాబితా రూపొందించి సీటు కేటాయిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారు ఉన్నత విద్య కోసం పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్‌లో చేరే వీలుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సంక్షేమ గృహాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్

బైపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్ట్‌గా కలిగిన వారు బీఎస్సీ నర్సింగ్‌లో చేరేందుకు అర్హులు. రాష్ట్రాల స్థాయిలో పారా మెడికల్ ఎడ్యుకేషన్ బోర్డ్, స్టేట్ హెల్త్ యూనివర్సిటీలు సంయుక్తంగా నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశ ప్రక్రియ ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. ఇంటర్మీడియెట్‌లో పొందిన మార్కులు, ఈఏపీసెట్ (బైపీసీ స్ట్రీమ్) ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసుకున్న వారికి నేరుగా నర్సులుగా కెరీర్ ప్రారంభించే అవకాశం లభిస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉద్యోగాలు దక్కించుకోవచ్చు. ప్రారంభంలోనే నెలకు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకూ వేతనం అందుతుంది.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ డిప్లొమా

నర్సింగ్‌లో ఉన్నత విద్య, కెరీర్ కోణంలో మంచి అవకాశాలు కల్పించే కోర్సు.. పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ డిప్లొమా. జీఎన్ఎం అండ్ మిడ్‌వైఫరీ కోర్సుల ఉత్తీర్ణులు ఇందులో చేరేందుకు అర్హులు. ఇందులో స్పెషలైజేషన్ సబ్జెక్ట్‌లను ఎంచుకునే అవకాశం కూడా ఉంది. అభ్యర్థులు అంకాలజీ, ఆపరేషన్ రూమ్, ఆర్థోపెడిక్ అండ్ రిహాబిలిటేషన్, క్రిటికల్ కేర్, ఎమర్జెన్సీ అండ్ డిజాస్టర్ తదితర స్పెషలైజేషన్లను అభ్యసించొచ్చు.

పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్

పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సు అందుబాటులో ఉంది. రెండేళ్ల వ్యవధిలోని ఈ కోర్సులో.. మెడికల్ సర్జన్ నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, పిడియాట్రిక్స్, సైకియాట్రిక్ నర్సింగ్, అబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ నర్సింగ్, మెంటల్ హెల్త్ నర్సింగ్ తదితర స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు. వీరికి ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో సూపర్‌వైజర్ల స్థాయిలో ఉద్యోగాలు లభిస్తాయి.

ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో

ప్రస్తుతం నర్సింగ్ కోర్సులను రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని కళాశాలలతో పాటు జాతీయ స్థాయిలోనూ పలు ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో అభ్యసించే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలోని ఎయిమ్స్(ఢిల్లీ, భోపాల్, పాట్నా, భువనేశ్వర్, రాజ్‌పూర్, రిషికేష్ క్యాంపస్‌లు); ఏఎఫ్ఎంసీ–పుణె; జిప్‌మర్ – పుదుచ్చేరి; పీజీఐఎంఈఆర్–చండీగఢ్ క్యాంపస్‌లు నర్సింగ్ బోధనలో పేరొందిన సంస్థలుగా గుర్తింపు పొందాయి.

ఏఎఫ్ఎంసీలో నర్సింగ్.. మిలటరీలో కెరీర్

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ–పుణెలో బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన విద్యార్థినులకు మిలటరీలోనే కొలువు లభిస్తుంది. కోర్సులో చేరే సమయంలోనే 60 శాతం మందికి షార్ట్ సర్వీస్ కమిషన్ హోదా కింద సీటు కేటాయిస్తారు. వారు కోర్సు పూర్తయ్యాక కనీసం అయిదేళ్లు మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో విధులు నిర్వహిస్తామని బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి, ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్ల భర్తీ చేస్తారు.

పీహెచ్‌డీ

నర్సింగ్‌లో పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది. సైకియాట్రిక్ నర్సింగ్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్, అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, మెడికల్ సర్జికల్ నర్సింగ్, పిడియాట్రిక్ నర్సింగ్ స్పెషలైజేషన్స్‌కు పీహెచ్‌డీలో ప్రాధాన్యం నెలకొంది. ఆయా స్పెషలైజేషన్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి నర్సింగ్ ప్రొఫెసర్లుగా, ఫార్మా, హెల్త్‌కేర్ సంస్థల్లో ఆర్ అండ్ డీ విభాగాల్లో పర్యవేక్షణ స్థాయిలో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయి.

ఆకర్షణీయ వేతనాలు

దేశంలో నర్సింగ్ నిపుణులకు ఆకర్షణీయ వేతనాలు లభిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ శాఖల పరిధిలోని ఆసుపత్రుల్లో చేరిన వారికి ప్రస్తుత పే కమిషన్ ప్రకారం–బేసిక్ పే రూ.44,900గా ఉంటోంది. రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో ఆసుపత్రులు, సంక్షేమ వసతి గృహాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో నర్సుల నియామకాలు జరుగుతున్నాయి. వీరికి నెలకు రూ. 25 వేల నుంచి రూ.40 వేల వరకు వేతనం ఉంటోంది.

విదేశీ అవకాశాలు

నర్సింగ్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు పూర్తి చేసిన వారికి విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రధానంగా యూకే, కెనడా, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా దేశాల్లో నర్సులకు డిమాండ్ నెలకొంది. ఈ దేశాల్లో కెరీర్ సొంతం చేసుకోవాలంటే.. ఆయా దేశాలు నిర్వహించే లైసెన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఉదాహరణకు కెనడాలో నర్సుగా ఉపాధి కోరుకునే వారు ఆ దేశం నిర్వహించే కెనడియన్ రిజిస్టర్డ్ నర్సెస్ ఎగ్జామ్‌లో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్ భాష నైపుణ్యం కూడా తప్పనిసరి. టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, పీటీఈ వంటి ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ స్కోర్లు సాధించాల్సి ఉంటుంది. ఇలా విదేశీ కెరీర్ సొంతం చేసుకున్న వారికి నెలకు రూ. 2 లక్షల వరకు వేతనం లభిస్తోంది.

కార్పొరేట్ కొలువులు

కార్పొరేట్ ఆసుపత్రుల విస్తరణతో బ్యాచిలర్, పీజీ స్థాయి నర్సింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పీజీ స్థాయిలో అభ్యర్థులు చదివిన స్పెషలైజేషన్ ఆధారంగా నెలకు రూ.40 వేల వరకు వేతనం ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటున్నాయి. బీఎస్‌సీ నర్సింగ్ చేసిన వారికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం లభిస్తోంది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	264	85,572
నిఫ్టీ ▽	37	26,179

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	18,120	▽	71
డోజోన్స్	42,313	△	138
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,321	△	36
డాక్స్	19,474	△	235
షాంఘై	3,088	△	87
నికాయ్	39,830	△	904

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.87	85.55
£	బ్రిటన్ పౌండ్	109.75	114.65
€	యూరో	91.26	95.73
¥	జపాన్ ఎన్ (100)	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.55	60.40
S$	సింగపూర్ డాలర్	63.06	67.71
SAR	సౌదీ రియాల్	21.42	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	21.90	23.68
¥	చైనా యువాన్	11.06	12.88

వారసులపై వాత్సల్యం



ఉద్యోగంలో చేరిన వెంటనే ప్రతి ఒక్కరూ ముందుగా చేయాల్సిన పని, విశ్రాంత జీవనానికి మెరుగైన ప్రణాళిక రూపొందించుకోవడం. ప్రభుత్వరంగ ఉద్యోగులకు పింఛను భరోసా ఉంటుంది. కానీ, ప్రైవేటు రంగ ఉద్యోగులు, స్వయం ఉపాధిలో ఉన్న వారు తామే స్వయంగా ఇందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. ఉద్యోగం వచ్చిన కొత్తలో రిటైర్మెంట్ గురించి తర్వాత చూద్దాంలే.. అని వాయిదా వేసే వారే ఎక్కువ. వివాహం, తర్వాత సంతానంతో విశ్రాంత జీవనం ప్రాధాన్యలేమిగా మారిపోతుంది. పిల్లలను గొప్పగా చదివించడమే అన్నింటికంటే ముఖ్య లక్ష్యంగా సాగిపోతుంటారు. దీనివల్ల అంతిమంగా విశ్రాంత జీవనంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఈ తరహా నిర్లక్ష్యం రేపు తమ పిల్లలు చేయకూడదని భావించే తల్లిదండ్రులు.. వారి పేరుతో ఇప్పుడే ఓ పింఛను ఖాతా తెరిచేస్తే సరి. అందుకు వీలు కల్పించేదే ఎన్‌పీఎస్ వాత్సల్య. బడ్జెట్లో ప్రకటించిన ఈ కొత్త పథకాన్ని తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభించిన నేపథ్యంలో దీనిపై అవగాహన కల్పించే కథనమిది...

-సాక్షి, బిజినెస్‌డెస్క్



పిల్లలకు 'పింఛను' బహుమానం: పథక ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నుంచి ఖాతా నంబర్‌ను స్వీకరించిన హైదరాబాద్ బాలిక లాంబా కరణం

- కొత్తగా ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం
- రూ.10వేలు.. భవిష్యత్తులో రూ.10 కోట్లు
- కాంపౌండింగ్‌తో భారీ నిధి
- బాల్యంలోనే వృద్ధాప్యానికి భరోసా

తల్లిదండ్రులు ఎవరైనా సరే తమ పిల్లల భవిష్యత్ మెరుగ్గా ఉండాలని కోరుకుంటారు. ఎప్పుడూ వారి గురించే ఆలోచిస్తుంటారు. కానీ, భవిష్యత్‌లో వారు ఎలా స్థిరపడతారో ముందుగా ఊహించడం కష్టం. అందుకని వారి పేరుతో ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తెరవడం ఒక మంచి ఆలోచనే అవుతుంది. ఇది పొదుపు, పెట్టుబడుల ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. ఆర్థిక క్రమశిక్షణను నేర్పుతుంది. 18 ఏళ్లు వచ్చే వరకు తల్లిదండ్రులు చేసిన పెట్టుబడితో ఏర్పడిన నిధిని చూసిన తర్వాత, రిటైర్మెంట్ లక్ష్యాన్ని పిల్లలు సులభంగా అర్థం చేసుకుంటారు. వారు ఉద్యోగంలో చేరిన తర్వాత ఈ ఖాతాను కొనసాగించుకున్నట్టు అయితే, రిటైర్మెంట్ నాటికి భారీ సంపదను పోగు చేసుకోవచ్చు. 50–60 ఏళ్ల కాలం పాటు పెట్టుబడులకు ఉంటుంది కనుక కాంపౌండింగ్ ప్రయోజనంతో ఊహించనంత పెద్ద నిధి సమకూరుతుంది.

వాత్సల్య ఎవరికి?

2024–25 బడ్జెట్‌లో పిల్లల కోసం పింఛను పథకం 'ఎన్‌పీఎస్ వాత్సల్య'ను ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. దీన్ని సెప్టెంబర్ 18 నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. తమ పిల్లల పేరిట పింఛను ఖాతా తెరిచి, ఇన్వెస్ట్ చేసుకునేందుకు ఎన్‌పీఎస్ వాత్సల్య వీలు కల్పిస్తుంది. తాము ఎంతగానో ప్రేమించే తమ పిల్లల భవిష్యత్‌కు బలమైన బాట వేసేందుకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు సహజ సంరక్షకులు (గార్డియన్). వారు లేనప్పుడు చట్టబద్ధ సంరక్షకులు పిల్లల పేరిట ఖాతా ప్రారంభించొచ్చు. పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఎన్‌పీఎస్ టైర్-1 (అందరు పౌరులు)గా ఇది మారిపోతుంది. సాధారణ ఎన్‌పీఎస్ ఖాతాలోని అన్ని ఫీచర్లు అందుబాటులోకి వస్తాయి. మేజర్ అయిన తర్వాత మూడు నెలల్లోపు తిరిగి కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది.



పన్ను ప్రయోజనాలు

పన్ను ప్రయోజనాల గురించి ప్రత్యేకంగా పేర్కొనలేదు. కానీ, ఎన్‌పీఎస్‌కు ప్రస్తుతం ఉన్న పలు రకాల పన్ను ప్రయోజనాలను వాటి గరిష్ఠ పరిమితికి మించకుండా తమ పేరు, తమ పిల్లల పేరుపై పెట్టుబడులకు ఉపయోగించుకోవచ్చు.

సంరక్షకుల హక్కు

ఖాతాదారు (మైనర్) మరణించిన సందర్భంలో అప్పటి వరకు సమకూరిన నిధిని తిరిగి తల్లిదండ్రి లేదా సంరక్షకులకు ఇచ్చేస్తారు. తల్లిదండ్రుల్లో ఒకరు మరణించిన సందర్భంలో మరొకరు కేవైసీ పూర్తి చేసి పెట్టుబడి కొనసాగించొచ్చు. తల్లిదండ్రులు ఇద్దరూ మరణించిన సందర్భంలో మైనర్‌కు 18 ఏళ్లు నిండేంత వరకు చట్టబద్ధమైన సంరక్షకులు ఎలాంటి చందా చెల్లించకుండానే ఖాతాని కొనసాగించొచ్చు.

ఉపసంహరణ

వాత్సల్యకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ అమలవుతుంది. అంటే ప్రారంభించిన మూడేళ్లలోపు పెట్టుబడులు ఉపసంహరించుకోవడానికి అనుమతించరు. ఆ తర్వాత నుంచి సమకూరిన నిధిలో 25 శాతాన్ని విద్య, అనారోగ్యం తదితర నిర్దేశిత అవసరాలకు వెనక్కి తీసుకోవచ్చు.

ఎక్కడ ప్రారంభించాలి?

ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతాను నేరుగా ఈ-ఎన్‌పీఎస్ పోర్టల్ ద్వారా ప్రారంభించుకోవచ్చు. లేదా పోస్టాఫీస్, ప్రముఖ బ్యాంక్ శాఖలకు వెళ్లి తెరవొచ్చు. ప్రభుత్వరంగంలోని కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పీఎన్‌బీ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు ఎన్‌పీఎస్ వాత్సల్యను ఆఫర్ చేస్తున్నాయి. అలాగే ఆన్‌లైన్‌లో ప్రొటీన్ ఈ-గవ్ టెక్నాలజీస్, కేఫిన్‌టెక్, క్యామ్స్ ఎన్‌పీఎస్ ప్లాట్‌ఫామ్‌ల సాయంతోనూ ప్రారంభించొచ్చు.

వైదొలగడం

పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాత ఈ పథకం కొనసాగించుకోవచ్చు. లేదా వైదొలిగే అవకాశం కూడా ఉంది. ఒకవేళ తప్పుకోవాలని భావించేట్టు అయితే ఇక్కడ రెండు రకాల ఆప్షన్లు ఉన్నాయి. అప్పటి వరకు సమకూరిన నిధి రూ.2.5 లక్షలకు మించకపోతే, మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. రూ.2.5 లక్షలకు మించి ఉంటే అందులో 20 శాతమే వెనక్కి తీసుకోగలరు. మిగిలిన 80 శాతంతో యాన్యుటీ ప్లాన్ తీసుకోవాల్సి ఉంటుంది.

డాక్యుమెంట్లు

ఎన్‌పీఎస్ వాత్సల్య ప్రారంభానికి వీలుగా పిల్లలకు సంబంధించి పుట్టిన తేదీ ధ్రువపత్రం అది లేకపోతే స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్/ఎస్ఎస్‌సీ/పాన్ వీటిల్లో ఏదో ఒకటి ఇవ్వాలి. ప్రారంభించే పేరెంట్ (తల్లి లేదా తండ్రి) లేదా గార్డియన్‌కు సంబంధించి ఆధార్, పాన్ కాపీ, బ్యాంక్ ఖాతా వివరాలు అవసరం అవుతాయి. ఎన్ఆర్ఐ/ఓసీఐ అయితే ఖాతా తెరిచే పిల్లల పేరిట ఎన్ఆర్ఈ లేదా ఎన్ఆర్ఓ ఖాతా కలిగి ఉండాలి. ఎన్ఆర్ఐ పాస్‌పోర్ట్ కాపీ, ఓసీఐ విదేశీ చిరునామా కాపీలను సమర్పించాలి.

అర్హతలు

18 ఏళ్లలోపు పిల్లల పేరిట భారత పౌరులు లేదా నాన్ రెసిడెంట్ ఇండియన్ (ఎన్ఆర్ఐ), ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) ఈ ఖాతా తెరిచేందుకు అర్హులు. ఏటా కనీసం రూ.1,000 ఇన్వెస్ట్ చేయాలి. గరిష్ఠ పరిమితి లేదు. సంరక్షకులు ఇన్వెస్ట్ చేసినప్పటికీ ఈ ఖాతా లబ్ధిదారు మైనరే అవుతారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నియంత్రణలో ఈ పథకం కొనసాగుతుంది. మైనర్ పేరిట పెన్షన్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్ (పీఆర్ఏఎన్/ప్రాన్)ను పీఎఫ్ఆర్‌డీఏ కేటాయిస్తుంది.

పెట్టుబడుల ఆప్షన్లు

యాక్టివ్ చాయిస్: ఈ విధానంలో 50 ఏళ్ల వయసు వరకు ఈక్విటీలకు గరిష్ఠంగా 75 శాతం కేటాయింపులు చేసుకోవచ్చు. కార్పొరేట్ డెట్‌కు 100 శాతం, ప్రభుత్వ సెక్యూరిటీలకు 100 శాతం, ఆల్టర్నేట్ అసెట్ క్లాస్‌కు 5 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. 75 శాతాన్ని ఈక్విటీలకు కేటాయించుకుంటే.. 50 ఏళ్ల వయసు దాటిన క్రమంగా 60 ఏళ్ల నాటికి ఈక్విటీ కేటాయింపులు 50 శాతానికి తగ్గి, డెట్ కేటాయింపులు 50 శాతంగా మారుతాయి.

ఆటో చాయిస్: ఏ విభాగానికి ఎంత మేర కేటాయింపులు చేసుకోవాలన్న అవగాహన లేకపోతే ఆటో చాయిస్ ఎంపిక చేసుకోవచ్చు. ఈ విధానంలో లైఫ్ సైకిల్ ఫండ్ (ఎల్‌సీ)–75, ఎల్‌సీ–50, ఎల్‌సీ–25 అని మూడు ఆప్షన్లు ఉన్నాయి. ఎల్‌సీ–75లో 35 ఏళ్ల వయసు వరకే 75 శాతం ఈక్విటీలకు కేటాయింపులు వెళతాయి. ఆ తర్వాత నుంచి ఏటా ఈక్విటీలకు తగ్గుతూ, డెట్‌కు పెరుగుతాయి. ఎల్‌సీ–50 కింద ఈక్విటీలకు 35 ఏళ్ల వయసు వచ్చే వరకే 50 శాతం కేటాయింపులు చేసుకోగలరు. ఆ తర్వాత క్రమంగా ఈక్విటీలకు కేటాయింపులు తగ్గుతూ వెళతాయి. ఎల్‌సీ–25లో 35 ఏళ్ల వరకే ఈక్విటీలకు 25 శాతం కేటాయింపులు వెళతాయి. ఆ తర్వాత నుంచి క్రమంగా డెట్‌కు కేటాయింపులు పెరుగుతాయి.

డిఫాల్ట్ చాయిస్: పైన చెప్పుకున్న ఎల్‌సీ–50 ప్రకారం ఈ విధానంలో పెట్టుబడుల కేటాయింపులు చేస్తారు.

ఆన్‌లైన్‌లో ఎలా ప్రారంభించుకోవచ్చు?

- ఈఎన్‌పీఎస్ పోర్టల్‌కు వెళ్లాలి. హోమ్‌పేజీ పైన మెనూలో కనిపించే ఆప్షన్లలో 'ఎన్‌పీఎస్ వాత్సల్య (మైనర్స్) రిజిస్ట్రేషన్'ను ఎంపిక చేసుకోవాలి.
- మొదట గార్డియన్ పుట్టిన తేదీ వివరాలు, పాన్ నంబర్, మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీ వివరాలు ఇచ్చి, 'బిగిన్ రిజిస్ట్రేషన్'ను క్లిక్ చేయాలి.
- మొబైల్, ఈమెయిల్‌కు వచ్చే ఓటీపీని నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది. అప్పుడు 'కంటిన్యూ' ఆప్షన్‌ను క్లిక్ చేయాలి.
- ఇక్కడ మైనర్, గార్డియన్ వివరాలు అన్నింటినీ నమోదు చేయాలి. కావాల్సిన డాక్యుమెంట్ కాపీలను అప్‌లోడ్ చేసి 'కన్ఫర్మ్' చేయాలి.



- ఆన్‌లైన్‌లో ఖాతా తెరిచే వారు (తల్లి/తండ్రి/సంరక్షకులు) తెల్ల పేపర్‌పై సంతకం చేసి దాన్ని స్కాన్ చేసి పెట్టుకోవాలి. దీన్ని ఇతర డాక్యుమెంట్లతోపాటు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఆరంభ చందా రూ.1,000 చెల్లించాలి. దీంతో ప్రాన్ జారీ అవుతుంది. మైనర్ పేరిట ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా ప్రారంభం అవుతుంది.

చిన్న మొత్తమే అయినా..

పెట్టుబడులకు ఎంత ఎక్కువ కాల వ్యవధి ఉంటే, అంత గొప్పగా కాంపౌండింగ్ అవుతుంది. వడ్డీపై, వడ్డీ (చక్రవడ్డీ) తోడవుతుంది. ఒక ఉదాహరణ ప్రకారం.. శిశువు జన్మించిన వెంటనే ఖాతా తెరిచి ఏటా రూ.10,000 చొప్పున 18 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేశారనుకుందాం. మొత్తం పెట్టుబడి రూ.1.8 లక్షలు అవుతుంది. 10 శాతం రాబడుల రేటు ఆధారంగా 18 ఏళ్లు పూర్తయ్యే నాటికి ఈ మొత్తం రూ.5లక్షలుగా మారుతుంది. ఇదే నిధి ఏటా 10 శాతం చొప్పున కాంపౌండ్ అవుతూ వెళితే 60 ఏళ్లు ముగిసే నాటికి రూ.2.75 కోట్లు సమకూరుతుంది. ఒకవేళ రాబడుల రేటు 11.59 శాతం మేర ఉంటే రూ.5.97 కోట్లు, 12.86 శాతం రాబడులు వస్తే రూ.11.05 కోట్లు సమకూరుతుంది. కేవలం రూ.10వేల వార్షిక పొదుపు రూ.కోట్లుగా మారుతుంది. ఈ ఉదాహరణను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, చండీగఢ్ జారీ చేసింది. మరొక ఉదాహరణ చూద్దాం. ప్రతి నెలా రూ.5,000 చొప్పున శిశువు జన్మించిన నాటి నుంచి ఇన్వెస్ట్ చేస్తూ.. వారు ఉద్యోగంలో చేరేంత వరకు.. ఆ తర్వాత పిల్లలు కూడా అంతే మొత్తాన్ని ఇన్వెస్ట్ చేస్తూ వెళితే 10 శాతం రాబడి అంచనా ప్రకారం 60ఏళ్లకు (రిటైర్మెంట్ నాటికి) సుమారు రూ.19 కోట్లు సమకూరుతుంది. ఇదే రూ.5,000 పెట్టుబడిని మొదటి నుంచి ఏటా 10 శాతం చొప్పున పెంచుతూ వెళితే 60 ఏళ్లకు రూ.100 కోట్ల నిధి ఏర్పడుతుంది. ఇది కాంపౌండింగ్ మహిమ. ఈ తరహా దీర్ఘకాలిక పెట్టుబడుల పథకాన్ని, పిల్లలకు పింఛను బహుమానాన్ని ఇవ్వడం మంచి నిర్ణయమే అవుతుంది. "ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ విభాగం 14 శాతం, కార్పొరేట్ డెట్ విభాగం 9.1 శాతం, జీ–సెక్ విభాగం 8.8 శాతం చొప్పున వార్షిక రాబడులు అందించింది. ఎన్‌పీఎస్ వాత్సల్య దీర్ఘకాల పెట్టుబడి. కనుక క్రమశిక్షణతో కూడిన విధానాన్ని అనుసరించాలి. మీ పిల్లల భవిష్యత్ ఆర్థిక భద్రతపై దృష్టి సారించాలి"అని స్వయానా ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారు. దీర్ఘకాలంలో ఈక్విటీలకు గరిష్ఠ కేటాయింపులతో కూడిన ఆప్షన్‌లో రాబడి 10 శాతం ఉంటుందని ఆశించొచ్చు.

టాటా ఏఐఏ నుంచి నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్

యులిప్స్‌లో భాగంగా టాటా ఏఐఏ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సెప్టెంబర్ 30తో ముగుస్తుంది. ఎన్ఎఫ్ఓ వ్యవధిలో యూనిట్ ధర రూ. 10గా ఉంటుంది.



ఇటు జీవిత బీమా భద్రతను అందిస్తూనే అటు పెట్టుబడుల వృద్ధికి కూడా దోహదపడేలా ఇది ఉంటుందని టాటా ఏఐఏ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ హర్షద్ పాటిల్ తెలిపారు. టాటా ఏఐఏ పరమ్ రక్షక్ సిరీస్, టాటా ఏఐఏ ప్రో-ఫిట్ ప్లాన్ కింద అందిస్తున్న వినూత్న యూలిప్స్ ద్వారా ఈ ఇండెక్స్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చని ఆయన వివరించారు. ఇది వివిధ మార్కెట్ క్యాపిటలైజేషన్ విభాగాలవ్యాప్తంగా అత్యంత మెరుగైన పనితీరు కనపరుస్తున్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే మల్టీక్యాప్ ఫండ్‌గా ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఎఫ్‌డీఐలపై ఇక మరింత పర్యవేక్షణ	గ్లోబల్ ట్రెండ్, గణాంకాలపై మార్కెట్ కన్ను

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-9-2024	
విశాఖ	535-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

స్టాక్ వ్యూ

ఏబీ క్యాపిటల్ | బ్రోకరేజ్: ఎస్‌బీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 237 టార్గెట్: రూ. 280

ఎందుకంటే: డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసుల గ్రూప్ ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్(ఏబీసీఎల్) విభిన్న బిజినెస్‌లలో కార్యకలాపాలు కలిగి ఉంది. ఈ జాబితాలో బ్యాంకింగేతర ఫైనాన్స్(ఎన్‌బీఎఫ్), గృహ రుణాలు, జీవిత బీమా, స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్‌మెంట్, స్టాక్ అండ్ సెక్యూరిటీస్ బ్రోకింగ్, వెల్త్ సర్వీసులు, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ తదితరాలున్నాయి. ఈ ఏడాది జులై 22 నుంచి జరిగిన యాజమాన్య మార్పులలో భాగంగా విశాఖ మూల్యే కంపెనీ ఎండీ, సీఈవోగా బాధ్యతలు చేపట్టారు. వీటిలో భాగంగా వ్యాపార విభాగాలలో సరికొత్త ప్రణాళికలకు తెరతీశారు. గ్రూప్ స్థాయిలో 3.5 కోట్లమంది కస్టమర్ల బేస్, 2 లక్షల చానల్ పార్ట్‌నర్లు గల సంస్థలో టెక్నాలజీ పరివర్తన దిశగా చర్యలు ప్రారంభించారు. లెండింగ్ బిజినెస్‌లకు సంబంధించి 202-23తో పోలిస్తే.. 2025–26కల్లా ఆదిత్య బిర్లా ఫైనాన్స్, ఆదిత్య బిర్లా హౌసింగ్ నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం)ను రెట్టింపునకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది(2023–24)కల్లా ఏబీ ఫైనాన్స్ ఏయూఎం రూ. 1,05,639 కోట్లను తాకింది. ఏబీ హౌసింగ్ ఫైనాన్స్ ఏయూఎం రూ. 18,420 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది(2024–25) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో ఏబీ ఫైనాన్స్ ఏయూఎం 25 శాతం పురోభివృద్ధిని చూపింది. రూ. 1,07,306 కోట్లకు చేరింది. హౌసింగ్ ఫైనాన్స్ ఏయూఎం మరింత అధికంగా 33 శాతం జంప్‌చేసి రూ. 20,399 కోట్లయ్యింది. వెరసి ఏబీ హౌసింగ్ ఫైనాన్స్, ఏబీ ఏఎంసీ, ఏబీ లైఫ్ ఇన్సూరెన్స్, ఏబీ హెల్త్ ఇన్సూరెన్స్ వృద్ధి అవకాశాలపై అంచనాలతో టార్గెట్ ధరను నిర్ణయించాం.



గెయిల్ ఇండియా | బ్రోకరేజ్: ఇన్‌క్రెడ్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 236 టార్గెట్: రూ. 266

ఎందుకంటే: ఎనర్జీ మిక్స్‌లో నేచులర్ గ్యాస్ వాటాను ప్రస్తుత 5.7 శాతం నుంచి 2030–31కల్లా 15 శాతానికి పెంచాలని కేంద్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు వేసింది. తద్వారా గ్యాస్ ట్రాన్స్‌మిషన్ బిజినెస్‌లో అత్యధిక అవకాశాలకు తెరతీసింది. జాతీయ గ్యాస్ గ్రిడ్ ప్రణాళికలు, దేశమంతా ఒకే ధరల విధానం(యూనిఫైడ్ టారిఫ్ రిజైమ్) అమలుతో గ్యాస్‌ను సులభంగా పొందేందుకు మరింత వీలును కల్పించింది. అంతేకాకుండా దీంతో విభిన్న ప్రాంతాలలోనూ ఒకేరీతి రవాణా వ్యయాలకు దారి ఏర్పడింది. వీటికితోడు పీఎస్‌యూ దిగ్గజం గెయిల్ ఇండియా ఒక్కో ప్రామాణిక ఘనపు మీటర్(ఎస్‌సీఎం) గ్యాస్‌పై రూ. 8–10 టారిఫ్ పెంపుతో లబ్ధిని పొందనుంది. కంప్రెషన్ గ్యాస్ వ్యయాలలో అంతరాల కారణంగా గెయిల్‌కు అధిక టారిఫ్ నిర్ణయానికి అవకాశం ఏర్పడింది. మరోవైపు వ్యూహాత్మకంగా ఎల్ఎన్‌జీ దీర్ఘకాలిక సరఫరా కాంట్రాక్టులను కుదుర్చుకుంది. ఏడీఎన్ఓసీ, విటోల్‌తో ఒప్పందాలుసహా 20ఏళ్ల సరఫరాకు ఖతార్ ఎనర్జీతో అంగీకారానికి వచ్చింది. తద్వారా ఒక్కో ఎంఎంబీటీయూపై 0.8 డాలర్లు చొప్పున ఆదా చేసుకోనుంది. వెరసి ఈ ఏడాది(2024–25) నుంచి 2030వరకూ కంపెనీ గ్యాస్ ట్రాన్స్‌మిషన్ పరిమాణం సగటున వార్షికంగా 8.4 శాతం పుంజుకోనుంది. ఫలితంగా గ్యాస్ ట్రాన్స్‌మిషన్ విభాగంలో నాయకత్వ లబ్ధిని కొనసాగించనుంది. ఈ నేపథ్యంలో కంపెనీ లాభార్జన మెరుగుపడనుంది. అయితే ఎల్ఎన్‌జీ ధరల అనూహ్య పెరుగుదల, గ్యాస్ రంగంలో ప్రభుత్వ విధానాల్లో అనుకోని మార్పులు వంటి ప్రధానంగా సిటీ గ్యాస్ పంపిణీ(సీజీడీ) కంపెనీలపై ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫండ్స్ కంటే పీఎంఎస్ నయమా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



మ్యూచువల్ ఫండ్స్‌లో నాకున్న పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసేసుకుని, తమ పీఎంఎస్‌లో ఇన్వెస్ట్ చేయాలని ఓ ఫిన్‌టెక్ యాప్ అడుగుతోంది. నేను రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నాను. కనుక పీఎంఎస్ సేవలు వినియోగించుకోవడం సరైనదేనా?

– విష్ణు నివాస్

పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) అయినా, మ్యూచువల్ ఫండ్స్ అయినా పోర్ట్‌ఫోలియో రక్షణ బాధ్యతలను ఫండ్ మేనేజర్ తీసుకుంటారు. పీఎంఎస్ అయితే ఇన్వెస్టర్ అవసరాలకు అనుగుణమైన సేవలను అందించగలదు. కాకపోతే పీఎంఎస్‌లో పెట్టుబడులకు కనీసం రూ.50 లక్షలు ఉండాలి. అదే మ్యూచువల్ ఫండ్‌లో అయితే రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పైగా మ్యూచువల్ ఫండ్స్‌లో కొనసాగడం వల్ల పన్ను ప్రయోజనాలు పొందొచ్చు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ అయితే, ఫండ్ మేనేజర్ పోర్ట్‌ఫోలియో పరంగా ఎన్నో లావాదేవీలు నిర్వహిస్తుంటారు. వీటిపై ఇన్వెస్టర్ ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం ఏర్పడదు. కేవలం పెట్టుబడిని వెనక్కి తీసుకున్నప్పుడే లాభంపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. అదే పీఎంఎస్ అనుకోండి.. మీ డీమ్యాట్ ఖాతా నుంచే స్టాక్స్‌లో లావాదేవీలు నిర్వహిస్తుంది. కనుక లావాదేవీల చార్జీలు, స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాలపై పన్నులు చెల్లించాల్సి వస్తుంది. ఇది అధిక వ్యయాలకు, పన్నులకు దారితీస్తుంది. ఫలితంగా రాబడులపై ప్రభావం పడుతుంది. ఏ పెట్టుబడి సాధనం అయినా పారదర్శకత కీలకం. మ్యూచువల్ ఫండ్స్ రోజువారీ యూనిట్ ఎన్ఏవీలను ప్రకటించాల్సిందే. నెలవారీగా తమ పోర్ట్‌ఫోలియో వివరాలను సైతం వెల్లడించాలి. దీంతో తాము ఇన్వెస్ట్ చేసిన ఫండ్ పెట్టుబడుల విధానం, పనితీరు ఇన్వెస్టర్లకు స్పష్టంగా తెలిసిపోతుంది. పీఎంఎస్ ఖాతాల్లో ఇదే స్థాయి పారదర్శకత ఉండదు.



నాకు గడిచిన మూడేళ్లలో ఈక్విటీ పెట్టుబడులపై గణనీయమైన రాబడులు వచ్చాయి. కనుక ఇప్పుడు వీటిని విక్రయించి, లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?

– అద్వైత్

మీ నిధుల అవసరాలపైనే పెట్టుబడులను లిక్విడ్ ఫండ్స్‌లోకి మళ్లించడం ఆధారపడి ఉంటుంది. సమీప కాలంలో (6–12 నెలలు) మీకు డబ్బులతో పని ఉంటే, ఈక్విటీ ఫండ్స్ నుంచి కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకుని లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అలాగే, మీ ఆర్థిక లక్ష్యానికి చేరువ అయినప్పుడు కూడా ఈక్విటీ పెట్టుబడులు వెనక్కి తీసుకుని, డెట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన ఈక్విటీ పథకం పోటీ పథకాలతో వరుసగా మూడేళ్ల పాటు రాబడుల విషయంలో వెనుకబడి ఉంటే, అప్పుడు కూడా ఆ పథకం నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకోవచ్చు. ఏడాది, రెండేళ్ల పనితీరు ఆధారంగా ఈ నిర్ణయానికి రావద్దు. మరో ఐదేళ్ల వరకు మీకు నిధుల అవసరం లేకపోతే ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించడమే సరైనది. ఎందుకంటే ఇప్పుడే వాటిని వెనక్కి తీసుకుంటే మిగిలిన ఐదేళ్ల కాలంలో మరింత రాబడులు పొందే అవకాశం కోల్పోతారు. అస్సెట్ అలోకేషన్ (డెట్-ఈక్విటీ తదితర సాధనాల మధ్య పెట్టుబడుల కేటాయింపుల ప్రణాళిక)కు అనుగుణంగా మీ పెట్టుబడుల్లో క్రమానుగతంగా మార్పులు చేసుకోవడంపై దృష్టి సారించండి.

క్లుప్తంగా...

రెండో విడతలో 274 కన్వీనర్ సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: 2024–25 విద్యా సంవత్సరానికి రెండో దశ కౌన్సెలింగ్‌లో భాగంగా ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్లను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం ప్రకటించింది. విద్యార్థులకు 274 సీట్లు కేటాయించింది. భారత్ స్కౌట్స్ విభాగంలో ఒక సీట్ ఖాళీగా మిగిలిపోయింది. దివ్యాంగ, ఎన్‌సీసీ, క్యాప్ విభాగాలకు సంబంధించి ఇంకా 271 సీట్లు కేటాయించాల్సి ఉంది. కోర్టు కేసుల కారణంగా ఆ సీట్ల కేటాయింపు ఆలస్యం అవుతోంది. ఇక రెండో దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు వచ్చే నెల 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. 14వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఇప్పటికే విశ్వవిద్యాలయం ప్రకటించింది.

పిడుగుపాటుకు దంపతుల మృతి

- కుమారుడి పరిస్థితి విషమం
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన



పిడుగు పాటుకు గురై మృతి చెందిన దశరథనాయక్, ఆయన భార్య దేవిబాయి

గోరంట్ల: శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం దిగువ గంగంపల్లి తండాలో ఆదివారం పిడుగుపడి దశరథ నాయక్(48), ఆయన భార్య దేవిబాయి(45)లు మృతి చెందారు. కుమారుడు జగదీష్ నాయక్ పరిస్థితి విషమంగా ఉంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. దశరథ నాయక్, ఆయన భార్య దేవిబాయి ఉదయం ఆరు గంటల సమయంలో ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఆవుల పాలు పితకడానికి వెళ్లారు. అదే సమయంలో పశువుల పాక పక్కనే గల చింతకాయ చెట్టుపై పిడుగు పడింది. ఘటనలో దశరథ నాయక్, భార్య దేవిబాయిలు పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందారు. రెండు ఆవులు సైతం మృత్యువాత పడ్డాయి. పశువుల పాకకు కొంత దూరంలో ఉన్న కుమారుడు జగదీష్‌నాయక్ తీవ్ర గాయాలతో స్పృహ కోల్పోయాడు. అతని పరిస్థితి విషమించడంతో స్థానికులు పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ స్పందించి వెంటనే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, గోరంట్ల తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, పశుసంవర్ధక శాఖ అధికారులు గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించి.. కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. మృతులిద్దరికీ రూ.4 లక్షల చొప్పున, గాయపడిన జగదీష్‌కు రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నట్లు కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

విశాఖలో సమీకృత క్రీడల ప్రాంగణం

- శాప్ వైస్‌చైర్మన్ గిరీషా

విశాఖ స్పోర్ట్స్: అన్ని క్రీడలు ఒకే చోట నిర్వహించేందుకు వీలుగా విశాఖలో సమీకృత క్రీడల ప్రాంగణం ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్, ఎండీ గిరీషా అన్నారు. విశాఖలోని కొమ్మాదిలో మల్టీగేమ్స్ ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఆదివారం విశాఖలో ఆయన పర్యటించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్‌తో కలిసి విభిన్న ప్రతిభావంతులకు క్రీడామైదానం కోసం స్థలం గుర్తింపు, గంభీరం, రుషికొండ వేదికగా వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధితో పాటు విశాఖను క్రీడాహబ్‌గా తీర్చిదిద్దే చర్యలపై చర్చించారు.

ఆచార్య ప్రసన్నకుమార్ జీవితం ఎందరికో ఆదర్శం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



ప్రసన్న కుమార్‌ను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు, హరిబాబు

మహారాణిపేట (విశాఖ): ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ అయ్యగారి ప్రసన్నకుమార్ జీవితం ఎందరికో ఆదర్శమని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కొనియాడారు. ఆదివారం విశాఖలోని అంకోసా ఫంక్షన్ హాల్లో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ప్రసన్నకుమార్ 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 'నవతి ప్రసన్నం' కార్యక్రమానికి వెంకయ్య హాజరయ్యారు. అనంతరం ప్రొఫెసర్ ప్రసన్నకుమార్ జీవిత విశేషాల పుస్తకం 'ఫెస్ట్ స్క్రిప్ట్'ను వెంకయ్య ఆవిష్కరించారు. మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పెరుగుతున్న అమ్మాయిలు



ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,032 మంది అమ్మాయిలు


- 1,138 మంది అమ్మాయిలతో టాప్‌లో కేరళ
- 11 రాష్ట్రాల్లో అబ్బాయిల కన్నా అమ్మాయిల సంఖ్య ఎక్కువ
- కేంద్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అమ్మాయిల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఏపీలోని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా అబ్బాయిల కన్నా అమ్మాయిలే అధికమని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ వెల్లడించింది. ఈ మేరకు లేబర్ ఫోర్స్ సర్వే నివేదికను కేంద్రం విడుదల చేసింది. 2023 జూలై నుంచి 2024 జూన్ వరకు ఈ సర్వే నిర్వహించినట్లు నివేదికలో తెలిపింది. దేశంలో అబ్బాయిల కన్నా అమ్మాయిలు అధికంగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో నిలవగా.. ఆ తర్వాతి స్థానాల్లో మేఘాలయ, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయని పేర్కొంది. కేరళలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,138 మంది అమ్మాయిలుండగా.. ఆంధ్రప్రదేశ్‌లో 1,032 మంది అమ్మాయిలున్నారని వెల్లడించింది. 2019–20లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,021 మంది అమ్మాయిలుండగా.. 2023–24లో ఆ సంఖ్య 1,032కు పెరిగిందని పేర్కొంది. అలాగే ఏపీలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 1,019 మంది అమ్మాయిలుండగా.. పట్టణ ప్రాంతాల్లో 1,064 మంది అమ్మాయిలున్నట్లు తెలిపింది. దేశం మొత్తం మీద 11 రాష్ట్రాల్లోనే అబ్బాయిల కన్నా అమ్మాయిల సంఖ్య ఎక్కువగా ఉందని వెల్లడించింది.

జాతీయ స్థాయిలోనూ పురోగతి..



దేశం మొత్తం మీద చూస్తే అబ్బాయిల సంఖ్యే ఎక్కువగా ఉన్నప్పటికీ.. అమ్మాయిల సంఖ్య గతంలో కంటే పెరిగిందని నివేదిక వెల్లడించింది. దేశంలో 2019–20లో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 963 మంది అమ్మాయిలుండగా.. 2023–24లో ఆ సంఖ్య 981కి పెరిగిందని తెలిపింది. ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు వస్తోందని నివేదిక పేర్కొంది. అమ్మాయైనా, అబ్బాయైనా.. ఒక్కరు చాలనుకునే వారి సంఖ్య పెరిగిందని వెల్లడించింది. ఇక హరియాణాలో ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 867 మంది అమ్మాయిలు, ఢిల్లీలో 837 మంది, దాద్రా–నగర్–హవేలీ–డామన్–డయ్యూలో 818 అమ్మాయిలు మాత్రమే ఉన్నట్లు పేర్కొంది.




బీచ్ శాండ్ పరిశ్రమలో అవకాశాలు అపారం

'సాక్షి'తో కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, పీఎన్‌జీ మాజీ జేఎస్ ప్రొ.పద్మనాభయ్య

సాక్షి ఇంటర్వ్యూ

- ఏపీలోనూ పుష్కలంగా తీర ప్రాంత ఖనిజ సంపద
- ఖనిజాల వెలికితీతతో దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుంది
- అవసరమైన మేరకే ఖనిజాలు వెలికితీస్తే మంచిది
- అదే సమయంలో అక్రమ మైనింగ్ నియంత్రించాలి



సాక్షి, విశాఖపట్నం: బీచ్ శాండ్ ఇండస్ట్రీలో అపారమైన అవకాశాలున్నాయని.. దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిగతులను మార్చేఖనిజాలు బీచ్ సొంతమని కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, కేంద్ర పెట్రోలియం నేచురల్ గ్యాస్ మాజీ జాయింట్ సెక్రటరీ, ఆస్కి చైర్మన్ పద్మభూషణ్ ప్రొ.పద్మనాభయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ తీరంలోనూ అపారమైన తీర ప్రాంత ఖనిజ సంపద ఉందని పలు అధ్యయనాలు వెల్లడించాయన్నారు. అవసరమైన మేరకే ఖనిజాలు వెలికితీస్తే మంచిదని.. అదే సమయంలో అక్రమ మైనింగ్ నియంత్రించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. లేదంటే పర్యావరణ విఘాతం తప్పదని హెచ్చరించారు. కేంద్ర మైనింగ్ మంత్రిత్వ శాఖ, ఏపీ మినరల్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) ఆధ్వర్యంలో కరెంట్ ట్రెండ్స్ ఇన్ మైనింగ్, బీచ్ శాండ్ ఇండస్ట్రీలో ఉన్న అవకాశాలు అనే అంశంపై శుక్రవారం ఏయూలో జాతీయస్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. పద్మనాభయ్య 'సాక్షి'తో పలు అంశాలు మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

దేశంలో 130 బీచ్ మైనింగ్ డిపాజిట్స్..

దేశంలోని తీర ప్రాంతాల్లో 130 మైనింగ్ డిపాజిట్స్ ఉన్నాయి. ఒడిశాలోని ఛత్రపూర్, తమిళనాడులోని మనవల్లకురిచి, కేరళలోని చేవరాలో మాత్రమే పనులు నడుస్తున్నాయి. అన్ని మైనింగ్ బ్లాక్స్‌ను ప్రారంభిస్తే అద్భుతంగా ఉంటుంది. నిజానికి.. బీచ్ శాండ్ మైనింగ్ ఇండస్ట్రీలో మేజర్ గ్లోబల్ ప్లేయర్‌గా భారత్ మారేందుకు పుష్కలమైన అవకాశాలున్నాయి. ఎందుకంటే ప్రపంచంలోనే ఎక్కడాలేని అత్యంత విలువైన నాణ్యమైన అరుదైన ఖనిజ సంపద భారత సాగర తీరంలో ఉంది. అద్భుతమైన ఎలిమినైట్ ఖనిజం నిల్వలున్న దేశంగా మూడో స్థానంలో ఉంది. అదేవిధంగా.. మన దేశ తీర ప్రాంతంలో మోనోజైట్ ఖనిజం కూడా అత్యధికంగా లభ్యమవుతుంది. ఇవన్నీ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ వెలికితీసే ప్రక్రియ ప్రారంభిస్తే.. భారత్ ప్రపంచంలోనే మంచి స్థానంలో ఉంటుంది. ప్రభుత్వాలే ఖనిజ సంపదను వెలికితీసే బాధ్యతని భుజానికెత్తుకోవాలి. ముఖ్యంగా పీపీపీ విధానాన్ని ఇందులో అవకాశాలు కల్పించాలి. అప్పుడే అక్రమ మైనింగ్‌ని నిరోధించవచ్చు. అలాగే, బీచ్ శాండ్ అక్రమ తవ్వకాలపై నమోదవుతున్న కేసుల విచారణ ఆలస్యమవుతుండటం విచారకరం. వీలైనంత త్వరగా.. ఈ తరహా అక్రమ కేసుల విచారణ వేగవంతమైతే వీటిని నియంత్రించే అవకాశం ఉంటుంది.

బీహెచ్‌ఈఎల్ టు విజయవాడ

వయా గచ్చిబౌలి, ఓఆర్ఆర్

- నేటి నుంచి ప్రయోగాత్మకంగా కొన్ని బస్సు సర్వీసుల మళ్లింపు
- సిటీలో పెరిగిన ట్రాఫిక్..ఎల్‌బీనగర్ రూట్‌కు ప్రత్యామ్నాయంగా
- 36 కిలోమీటర్లు పెరిగినా, పాతచార్జీలే ఉంటాయంటున్న టీఎస్ ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: సిటీ ట్రాఫిక్ మరింతగా పెరిగిన నేపథ్యంలో హైదరాబాద్ దాటేందుకు ఆర్టీసీ బస్సులు ఎక్కువ సమయం తీసుకుంటున్నాయి. దీంతో ప్రయాణ సమయం పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఔటర్ రింగురోడ్డు మీదుగా బస్సులను నగరాన్ని దాటించే ప్రత్యామ్నాయ మార్గంపై టీఎస్‌ఆర్టీసీ దృష్టి సారించింది. ప్రయోగాత్మకంగా సోమవారం నుంచి కొన్ని బస్సులను తిప్పుతోంది. బీహెచ్‌ఈఎల్, మియాపూర్ ప్రాంతాల నుంచి నిత్యం విజయవాడ వైపు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. ఇవి కచ్చితంగా ఇమ్లీబన్ బస్‌స్టేషన్ మీదుగా వెళుతున్నవే. ఆయా స్టాప్ లలో ఆపుతూ చివరగా, బస్టాండ్‌లోని ప్రయాణికులను ఎక్కించుకుని ఎల్‌బీనగర్ పాయింట్‌కు చేరుకొని ముందుకు సాగాల్సి వస్తోంది. ఈ మార్గంలో నగర శివారు ప్రాంతమైన పెద్ద అంబర్‌పేట వరకు అడుగడుగునా బస్సులు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. బీహెచ్‌ఈఎల్‌లో బయలుదేరే బస్సులు పెద్ద అంబర్‌పేట వరకు చేరుకోవటానికి దాదాపు రెండున్నర గంటల సమయం తీసుకుంటున్నాయి. ఫలితంగా విజయవాడకు చేరుకునేందుకు ఆ బస్సులను బయలు దేరే సమయం నుంచి పరిశీలిస్తే దాదాపు ఎనిమిదిన్నర గంటలకుపైగా పడుతోంది. దీంతో ట్రాఫిక్ చిక్కులను ఎంత అధిగమిస్తే, అంత మేర ప్రయాణ సమయం తగ్గుతుంది. దీనిపై పరిష్కార మార్గాల కోసం ఇటీవల ఆర్టీసీ ఎండీ అధికా రులతో కసరత్తు చేయించారు. ఆమేరకు ఔటర్ రింగురోడ్డును ప్రత్యామ్నాయ మార్గంగా అధికారులు తేల్చి నివేదిక సమర్పించారు. దానికి ఆమోదం తెలిపిన ఆయన, ప్రయోగాత్మకంగా కొన్ని బస్సులను కొన్ని రోజులు తిప్పాలని అధికారులను ఆదేశించా రు. ప్రయాణికులనుంచి ఆదరణ కనిపిస్తే.. మరిన్ని సర్వీసులను ఆ మార్గంలో నడపాలని పేర్కొన్నారు. దీంతో ప్రయోగాత్మక సర్వీసులను సోమవారం రాత్రి నుంచి తిప్పాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం తొలుత బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి విజయవాడ మార్గంలో నడుస్తున్న ఈ–గరుడ (ఎలక్ట్రిక్ సర్వీసు) బస్సులను ఇందుకు ఎంపిక చేశారు.

దూరం పెరిగినా.. గంటన్నరకుపైగా సమయం ఆదా....

బీహెచ్‌ఈఎల్ డిపో నుంచి బయలుదేరే ఈ–గరుడ బస్సులు రామచంద్రాపురం–బీరంగూడ–చందానగర్–మియాపూర్–నిజాంపేట క్రాస్‌రోడ్డు– కూకట్ పల్లి హౌసింగ్‌బోర్డు–జేఎన్‌టీయూ రైతుబజార్– మలేషియాటౌన్‌షిప్–శిల్పారామం–సైబర్‌టవర్స్–మైహోమ్ భుజా–సైబరాబాద్ పోలీసు కమిషన రేట్–టెలికాంనగర్ మీదుగా గచ్చిబౌలి ఔటర్ రింగురోడ్డు మీదకు చేరుకుంటాయి. అక్కడి నుంచి నేరుగా హయత్‌నగర్ దాటిన తర్వాత ఉండే పెద్ద అంబర్‌పేట తర్వాత విజయవాడ హైవే మీదకు చేరుకుంటాయి.

నమ్మకం ఖండాలు దాటివచ్చేలా చేసింది

- చికిత్స కోసం చిన్నారిని మస్కట్ నుంచి హిందూపురం తీసుకొచ్చిన తల్లిదండ్రులు



హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో చిన్నారిని పరీక్షిస్తున్న డాక్టర్ శివకుమార్

హిందూపురం: వైద్యం కోసం మస్కట్ నుంచి రాగా.. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ వైద్యంతో చిన్నారి రికవరీ అయ్యిందని తల్లిదండ్రులు సంతోషంగా చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఆర్టీసీ కాలనీకి చెందిన అయిషా, రిజ్వాన్ దంపతులు బతుకుదెరువు నిమిత్తం మస్కట్ దేశంలో ఉంటున్నారు. వీరి ఏడేళ్ల చిన్నారి అయిజాఫాతిమాకు తీవ్ర తలనొప్పి, జ్వరం, వాంతులు కావడంతో ఈ నెల 21న మస్కట్ దేశంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం అందించాల్సి ఉందంటూ అక్కడి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మస్కట్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు చేసి పాప ఆరోగ్యం ప్రమాదంలో ఉందని, తలలో బ్లడ్ క్లాట్ అయ్యిందని చెప్పారు. వారం రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచాలన్నారు. దీంతో చిన్నారి తల్లిదండ్రులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శివకుమార్‌ను ఫోన్‌లో సంప్రదించారు. ఆయన చిన్నారి రిపోర్టులు తెప్పించుకుని చూసి..అంత ప్రమాదమేమీ లేదని, రక్తం ఎక్కించి అవసరమైన చికిత్స అందిస్తే సరిపోతుందని చెప్పారు. ఇదే విషయాన్ని అక్కడి డాక్టర్లకు ఫోన్‌లో వివరించినా వారు ఒప్పుకోలేదు. దీంతో తల్లిదండ్రులు చిన్నారిని తీసుకుని మస్కట్ నుంచి హిందూపురం వచ్చేశారు. ఈ నెల 27న డాక్టర్ శివకుమార్‌ను సంప్రదించారు. ఆయన చిన్నారికి అవసరమైన పరీక్షలు చేయించి.. రక్తం తక్కువగా (4.4 శాతం) ఉన్నట్లు గుర్తించారు. ఏ పాజిటివ్ రక్తాన్ని ఎక్కించి.. అవసరమైన వైద్యం అందించారు. మూడు గంటల్లోనే చిన్నారి లేచి కూర్చుంది. రక్తహీనత వల్ల చిన్నారికి ఆరోగ్య సమస్య కలుగుతోందని, బలమైన ఆహారం అందించాలని తల్లిదండ్రులకు సూచించి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

తెలంగాణ

బాలికపై అత్యాచారం.. నిందితుడి ఇంటికి నిప్పు

కొమురవెల్లి (సిద్దిపేట): బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. కోపోద్రిక్తులైన బాధితురాలి కుటుంబ సభ్యులు నిందితుడి ఇంటికి నిప్పు పెట్టారు. సిద్దిపేట జిల్లా గురువన్నపేటకు చెందిన యువకుడు తన పక్కింట్లో నివాసం ఉండే ఏడో తరగతి చదివే చిన్నారిపై శుక్రవారం అత్యాచారానికి పాల్పడ్డాడు. శనివారం పాఠశాల నుంచి తిరిగి వస్తుండగా తీవ్రంగా రక్తస్రావం కావడంతో తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వెంటనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని అతనిపై పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం ఈ విషయం బయటికి తెలియడంతో స్థానికులు, బంధువులు నిందితుడి ఇంటిపై దాడి చేసి అతనికి సంబంధించిన కారు, జేసీబీ, బైక్‌లను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీపీ అనూరాధ తెలిపారు.


ఉత్తరాది.. తగ్గేదే లే

- జనాభా పెరుగుదలలో ఉత్తరప్రదేశ్, బిహార్ వాటా 33 శాతం
- ఉత్తర, తూర్పు భారత్‌లోనే 52 శాతం జనాభా
- దక్షిణాదిలో తగ్గిన జనాభా వృద్ధి రేటు
- ఎస్‌బీఐ ఎకనామిక్స్ రీసెర్చ్ వింగ్ నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలోని దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు తగ్గుతుండగా.. ఉత్తరాది రాష్ట్రాలు మాత్రం తగ్గేదే లేదంటున్నాయి. ఈ విషయాన్ని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఎకనామిక్స్ రీసెర్చ్ వింగ్ నివేదిక వెల్లడించింది. త్వరలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న జనాభా లెక్కలకు ముందస్తుగా.. 'ద ఫైన్ ప్రింట్స్ ఆఫ్ రేపిడ్లీ ఛేంజింగ్ నేషన్' పేరుతో నివేదికను విడుదల చేసింది. ఆ వివరాల ప్రకారం.. 2001–2011 మధ్య దేశ జనాభా వృద్ధి రేటు 1.63 శాతం ఉండగా.. 2011–24లో 1.2 శాతానికి తగ్గే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. అలాగే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధి రేటు 4.3 శాతం నుంచి 4.2 శాతానికి తగ్గనుండగా.. ఉత్తరాది రాష్ట్రాల్లో మాత్రం 6.4 శాతం నుంచి 7.2 శాతానికి పెరుగుతోందని వెల్లడించింది. పెరిగిన జనాభాలో 33 శాతం కేవలం ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. అలాగే దేశంలో 52 శాతం జనాభా ఉత్తర, తూర్పు భారత రాష్ట్రాల్లోనే ఉందని నివేదిక తెలిపింది. దేశంలో 64.4 శాతం మంది పనిచేసే వయసులో ఉన్నారని.. 2031 నాటికి 65.2 శాతానికి పెరిగే అవకాశముందని పేర్కొంది.

దేశంలో జనాభా శాతం ప్రాంతాల వారీగా..



1951 నుంచి దేశంలో జనాభా వృద్ధిరేటు శాతాల్లో..

1951	1961	1971	1981	1991	2001	2011	2024 (అంచనా)
1.3	2.0	2.2	2.2	2.1	2.0	1.6	1.2

ఇక రయ్..రయ్




కోదాడ - ఖమ్మం మధ్యలో పూర్తయిన జాతీయ రహదారి 356ఏ

కోదాడ: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణాన్ని ఖమ్మం నగరాన్ని కలుపుతూ నిర్మిస్తున్న జాతీయ రహదారి 356ఏపై ఈనెల 25 నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. రూ.1,039 కోట్లతో కోదాడ –ఖమ్మం మధ్య 31.8 కిలోమీటర్ల మేర రహదారిని 4 లేన్లుగా నిర్మించారు. కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం నుంచి అనంతగిరి మండలం బొజ్జగూడెంతండా వరకు బైపాస్‌రోడ్డు నిర్మించారు. దుర్గాపురం వద్ద జాతీయ రహదారి–65ను కలుపుతూ ఇంటర్‌చేంజ్ నిర్మించారు. దీంతో విజయవాడ నుంచి ఖమ్మం వైపు, ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఎలాంటి ఆటంకం ఉండదు. ఖమ్మం జిల్లా పైనంపల్లి శివారులో టోల్‌ప్లాజా ఏర్పాటు చేశారు. కోదాడ నుండి ఖమ్మం చేరుకోవడానికి గంటన్నర సమయం పట్టేది. ప్రస్తుతం 30 నిమిషాల్లో చేరుకుంటున్నట్లు వాహనదారులు చెబుతున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

నిశీధిలో ఉషోదయం



చీకట్లను చీల్చుతూ భానుని తొలికిరణం నేలను ముద్దాడుతుంటే.. ఆ మగ్ధ మనోహర దృశ్యం వర్ణనాతీతం. అనంతపురం పరిసరాల్లో ఆదివారం ఉదయం సాక్షి కెమెరాకు చిక్కిన సూర్యోదయ దృశ్యం

ఆత్మవిశ్వాసమే తోడుగా..



కేన్సర్‌ను జయించింది, వైకల్యాన్ని అధిగమించింది. ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా ఈత కొలనులో బంగారు చేపలా నిలుస్తోంది. విశాఖ నగరం మధురవాడకు చెందిన నిధి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్విమ్మింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించింది. విశాఖలో నిర్వహిస్తున్న పారా స్విమ్మింగ్ పోటీల సందర్భంగా తీసిన చిత్రం

సమరానికి సై



విశాఖ కళాభారతి ఆడిటోరియంలో వైశాఖి నృత్యోత్సవాల్లో భాగంగా ఆదివారం పైకా జానపద నృత్యం ప్రదర్శిస్తున్న ఒడిశాకు చెందిన కళింగ పైకా క్రియేషన్ బృందం

క్లుప్తంగా...

ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాలి: ఆర్జేయూపీ

సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలలకు సంబంధించి కరువు భత్యం ప్రకటించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్(ఆర్జేయూపీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిర్ణీత గడువు దాటి మూడు నెలలు పూర్తయినా ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదని పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ఎం.వీరబ్రహ్మం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పీఆర్సీ గతేడాది జూలై నుంచి అమలు చేయాలని, ఉద్యోగులకు నష్టం లేకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ అభివృద్ధికి సహకరించాలి

సాక్షి, అమరావతి: ఆంధ్రాలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు రోజర్ బిన్నీ, జైషాలకు విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఆదివారం బెంగళూరులో బీసీసీఐ నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి శివనాథ్ హాజరయ్యారు. దేశీయ క్రికెట్ బలోపేతం కోసం బీసీసీఐ తీసుకుంటున్న చర్యలపై అభినందనలు తెలిపారు. ఏపీలో ప్రతిభగల క్రీడాకారులను వెలికితీయడంతో పాటు కొత్త క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి సహకరించాలని కోరారు.

షెడ్యూల్డ్ ప్రాంతంలో సర్వాధికారాలు ఆదివాసీలకే

దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారు చెందా కేశ్వరరావు

చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకే ఉండాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారు డాక్టర్ చెందా కేశ్వరరావు అన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దండకారణ్య ఉద్యోగుల సమితి (డీఈవో) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐదు, ఆరు షెడ్యూళ్లు పొందుపర్చడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశ గిరిజన ప్రాంతాలు ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయన్నారు. ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు, చట్టాలు షెడ్యూల్ ప్రాంతాల్లో పాలకులు, అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రధానంగా భూ బదలాయింపు 1/70 చట్టం గిరిజన ప్రాంతంలో భూములపై సర్వాధికారాలు ఆదివాసీలకు మాత్రమే ఉంటాయన్నారు. మాజీ అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్వపరిపాలన ఉండాలన్నారు.

నిస్తేజంలో ఏపీపీఎస్సీ..

నైరాశ్యంలో అభ్యర్థులు!

ఏపీపీఎస్సీని నిరర్థకంగా మార్చిన చంద్రబాబు ప్రభుత్వం

ఉన్న చైర్మన్, సభ్యులు కుట్రపూరితంగా తొలగింపు

- 3 నెలలుగా కమిషన్ చైర్మన్‌ను నియమించకుండా నిర్లక్ష్యం
- నిలిచిపోయిన ఉద్యోగ నియామకాలు... పెండింగ్‌లో 21 నోటిఫికేషన్లు
- పరీక్షల తేదీలు ప్రకటించని సర్వీస్ కమిషన్
- దీర్ఘకాలం శిక్షణతో ఆర్థికంగా నష్టపోతున్నామని అభ్యర్థుల ఆందోళన
- వాయిదా అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్న శిక్షణ సంస్థలు



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. సీఎం చంద్రబాబు తన రాజయకీయాలకు నిరుద్యోగ యువతను బలిచేస్తున్నారు. బాబు ప్రభుత్వ నిర్వాకంతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిరర్థకంగా మారిపోయింది. కమిషన్‌కు చైర్మన్ కూడా లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షల నిర్వహణ, ఎంపికలు గందరగోళంలో పడ్డాయి. గతంలోనే ప్రకటించిన నోటిఫికేషన్లకు ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారో తెలియక నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. మరోపక్క ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యి, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి, ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉన్నా.. అదీ చేయడం లేదు. లక్షల్లో ఉద్యోగాలిస్తాం, జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సీఎం, మంత్రుల ప్రకటనలే తప్ప ఒక్క ఉద్యోగమూ ఇచ్చే ప్రయత్నం కూడా చేయడంలేదు. ఏపీపీఎస్సీ ద్వారా ఇవ్వాల్సిన నోటిఫికేషన్లు, పరీక్షల తేదీలపైనా స్పష్టత ఇవ్వడంలేదు. దీనిని అవకాశంగా మార్చుకుంటున్న శిక్షణ సంస్థలు 'వచ్చే నెలలో పరీక్షలు.. స్పెషల్ బ్యాచ్ శిక్షణ' పేరుతో నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి.

మూడు నెలలుగా చైర్మన్ పదవి ఖాళీ

సర్వీస్ కమిషన్ నిబంధనల ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షల తేదీల ప్రకటన, పోస్టింగ్స్.. ఇలా దేనికైనా చైర్మన్ అనుమతి తప్పనిసరి. అయితే, ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సర్వీస్ కమిషన్ చైర్మన్‌పై కుట్రకు తెరతీసింది. 2025 జూలై వరకు పదవిలో ఉండాల్సిన చైర్మన్‌పైన, సభ్యులపైన వేధింపులకు దిగి, చివరికి తొలగించింది. నిబంధనల ప్రకారం సర్వీస్ కమిషన్ చైర్మన్ ఏదైనా కారణాలతో అందుబాటులో లేకున్నా, లేదా ఆ పోస్టు ఖాళీ అయినా ఆ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి కొత్త చైర్మన్ వచ్చే వరకు ఆ బాధ్యతలను సభ్యుల్లో ఒకరికి అప్పగించాలి. కానీ ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత మూడు నెలలుగా చైర్మన్‌ను నియమించకుండా కమిషన్‌ను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఏపీపీఎస్సీకి ఇన్ని రోజులు చైర్మన్ లేకపోవడం ఇదే తొలిసారని అధికారవర్గాలు చెబుతున్నాయి. చైర్మన్ లేకపోవడంతో గతంలో ఇచ్చిన 21 నోటిఫికేషన్లకు పరీక్షల తేదీలను ప్రకటించలేదు. కీలకమైన గ్రూప్–1, 2 పోస్టులకు నిర్వహించాల్సిన మెయిన్స్ వాయిదా వేశారు. దీంతో 8 లక్షల మందికి పైగా యువత భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

వైఎస్ జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధి బాబు సర్కారుకేదీ?

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఏపీపీఎస్సీ ద్వారా క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు ఇచ్చి, ఉద్యోగాలు భర్తీ చేసింది. ఆ చిత్తశుద్ధి ప్రస్తుత చంద్రబాబు సర్కారులో కనిపించడంలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సర్వీస్ కమిషన్ నుంచి వచ్చిన అన్ని నోటిఫికేషన్లకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరిగాయి, ఉద్యోగాల భర్తీ పక్కాగా పూర్తి చేశారు. గత ఐదేళ్లలో కమిషన్ ద్వారా అన్ని శాఖల్లోను 78 నోటిఫికేషన్లు ఇచ్చి అర్హత గల ఏ నిరుద్యోగికీ అన్యాయం జరగకుండా 6,296 ఉద్యోగాలను వివాద రహితంగా భర్తీ చేశారు. బాబు ప్రభుత్వం వచ్చాక ఉన్న చైర్మన్‌ను కుట్రపూరితంగా తొలగించడమే కాకుండా, కొత్త చైర్మన్‌ను నియమించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోందని యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదాలతో అభ్యర్థుల భవిష్యత్‌తో ఆటలు

గతంలో ఇచ్చిన 21 నోటిఫికేషన్లకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి డిసెంబర్ నాటికి నియామక ప్రక్రియ పూర్తికావాలి. ఇందులో గ్రూప్–2, గ్రూప్–1, డీవైఈవో, డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వంటి కీలకమైనవి 19 నోటిఫికేషన్లు ఉన్నాయి. వీటిలో గ్రూప్–2, గ్రూప్–1తో పాటు డీవైఈవో పోస్టులకు గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ ప్రకారం ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి చేసి ఫలితాలను సైతం విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రూప్–2 మెయిన్స్ జూలైలో జరగాల్సి ఉండగా, వాయిదా వేశారు. ఈ నెలలో జరగాల్సిన గ్రూప్–1 మెయిన్స్ కూడా వాయిదా వేశారు. డీవైఈవో మెయిన్స్ పరిస్థితీ అంతే. ఈ మూడు పరీక్షల మెయిన్స్‌కు అర్హత సాధించిన దాదాపు 1.15 లక్షల మంది అభ్యర్థుల జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా మారిపోయాయి. వీటితోపాటు డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్లతో పాటు వివిధ శాఖల్లో దాదాపు 1,475 పోస్టులకు పరీక్షల షెడ్యూల్ కూడా ఇవ్వలేదు. ఆయుష్ విభాగంలో హోమియో మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు జూలైలనే సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయినా, చైర్మన్ లేకపోవడంతో ఇప్పటికీ నియామకపత్రాలు ఇవ్వలేదు.

కాంట్రాక్ట్ కార్మికుల జోలికొస్తే సహించం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటాం
- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

పెదగంట్యాడ (విశాఖ): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికొస్తే సహించేది లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు వరకూ పాదయాత్ర జరిగింది. అనంతరం బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ, యాజమాన్యాల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేరాన్ని కాంట్రాక్ట్ కార్మికులపై నెట్టడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులలో విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండి కొట్టేందుకు ప్రభుత్వం, యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచి బీజేపీ ప్రభుత్వానికి వంత పాడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వంపై అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలు గళం విప్పాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, జిల్లా నాయకుడు జగన్ మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు చేసిన పోరాటాన్ని నమ్మి ఇక్కడి ప్రజానీకం వారికి రాష్ట్రంలోనే మంచి మెజార్టీ ఇచ్చారని వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ప్రస్తుత పరిణామాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇకనైనా గళం విప్పి కేంద్ర ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్య వైఖరిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడం చేతకాని యాజమాన్యం కార్మికుల సంఖ్యపైన, వారి హక్కులపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం, యాజమాన్యం తమ వైఖరిని మార్చుకుని స్టీల్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, నమ్మి రమణ, ఓపీ రావు, సత్యవతి, పీపీ రమణ, నారాయణరావు, ఆదిరెడ్డి శ్రీను, మసేను, సోమేష్, సుబ్రహ్మణ్యం, శోభభూషణ్, నర్సింగరావు ప్రసంగించారు.

ఆంధ్ర రంజీ కెప్టెన్‌గా రికీబుయ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీలో ఆడే ఆంధ్ర జట్టుకు రికీబుయ్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. గత రంజీలో టాప్ స్కోరర్‌గా నిలిచిన రికీబుయ్ ఇటీవలే ముగిసిన దులీప్‌ట్రోఫీలో సైతం టాప్ స్కోరర్‌గా నలవడమే కాకుండా రెండు సెంచరీలతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. రంజీ ట్రోఫీలో పాల్గొనే 32 జట్లలో ఎలైట్‌లో నాలుగు గ్రూప్‌లు, ప్లేట్‌లో ఒక గ్రూప్ తలపడనున్నాయి. ఆంధ్ర జట్టు ఎలైట్ బి గ్రూప్‌లో పోటీ పడుతోంది. హైదరాబాద్ జట్టు సైతం ఇదే గ్రూప్‌లో పోటీపడుతోంది. ఈ టోర్నీలో సత్తాచాటిన ఆటగాళ్లను ఇరానీ కప్‌లో ఆడేందుకు అర్హత కల్పించనున్నారు. అక్టోబర్ 11న తొలి మ్యాచ్‌లో విదర్భతో ఆంధ్ర జట్టు ఆడటంతో ట్రోఫీ మొదలవుతుంది. 18న గుజరాత్‌తోనూ, 26న హిమాచల్‌ప్రదేశ్‌తోనూ ఆంధ్ర జట్టు ఆడనుంది. హిమాచల్‌ప్రదేశ్‌తో మ్యాచ్ విశాఖ వేదికగా జరగనుండగా రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లు విజయనగరం వేదికగా జరగనున్నాయి. ఆంధ్ర జట్టు నవంబర్ 6న ఉత్తరాఖండ్‌తోనూ, 19న హైదరాబాద్‌తోనూ ఆడనుంది. అనంతరం సయిద్‌ముస్తక్ ఆలీ, విజయ్ హాజారే ట్రోఫీల్లో ఆడనున్న ఆంధ్ర జట్టు తిరిగి.. రంజీ మ్యాచ్‌ల్లో జనవరి 23వ తేదీన పుదుచ్చేరితోనూ, లీగ్ దశలో చివరిదైన మ్యాచ్ 30న రాజస్థాన్‌తోనూ తలపడనుంది.

ఆంధ్రకు ఎంపికైంది వీరే..

ఆంధ్ర జట్టుకు రికీబుయ్ నాయకత్వం వహించనుండగా వైస్ కెప్టెన్‌గా షేక్ రషీద్, వికెట్ కీపర్‌గా కె.ఎస్.భరత్, హనుమ విహారి, నితీష్‌కుమార్, అశ్విన్ హెబ్బర్, లలిత్‌కుమార్, హేమంత్‌రెడ్డి, మహీప్‌కుమార్, సత్యనారాయణ, అభిషేక్ రెడ్డి, స్టీఫెన్, వంశీకృష్ణ, విజయ్ ఎంపికయ్యారు.

గంజాయి చాకెట్లు అమ్ముతున్న వ్యాపారి అరెస్ట్

అల్లిపురం(విశాఖ): గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న పాన్‌షాప్ యజమానిని విశాఖ టూటౌన్ పోలీసులు, టాస్క్ ఫోర్సు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 133 చాక్లెట్లను(660 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్ప్రింగ్‌రోడ్డులో ఒక పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్సు పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిందితుడు మనోజ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్సు ఎస్ఐ భరత్, టూటౌన్ ఎస్ఐ శంకర్‌లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 71,133 మంది స్వామి వారిని దర్శించుకోగా 34,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.28 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అట్టహాసంగా దుర్యోధన వధ

తవణంపల్లె: చిత్తూరు జిల్లా తవణంపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో 119వ మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం మట్టితో తయారుచేసిన దుర్యోధనుడి బొమ్మ దగ్గరకి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మడుగులో దాగివున్న దురోధ్యనుడిని బయటకు లాక్కొచ్చి వధించే ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దుర్యోధన వధ అనంతరం మట్టి కోసం భక్తులు పోటీ పడ్డారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సేవలందించి, ఉత్సవాలను విజయవంతం చేయడంలో మీడియా సహకారం అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మీడియా ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఆదివారం డీసీపీ గౌతమీశాలి, దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామరావు తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసి ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు అభిషేకాలు చేపట్టారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పుత్తూరు: తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాల కుంటలో వేంచేసి ఉన్న శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

వైభవంగా శాంతి కల్యాణం



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో బహుళ ద్వాదశి సందర్భంగా స్వామి వారి శాంతి కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి


అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం వేలాదిగా భక్తులు విచ్చేశారు. భక్తులంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 1,500 నిర్వహించారు.

ఉత్సాహంగా 5కే వాక్‌థాన్



వాక్‌థాన్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుపతిలో ఓ ప్రవేటు హాస్పిటల్ వారు నిర్వహించిన 5కే వాకథాన్‌లో 300 మంది వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు సమాజ సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



6 నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు



చిత్తూరు కలెక్టరేట్ : విజయనగరంలో అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగల్‌రాయ మందడి తెలిపారు. ఆదివారం బాపు బాల భవన్ లో రాష్ట్ర మహా సభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభకు పెద్దసంఖ్యలో టీచర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని సాలే నాగయ్య నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్జీటీ ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను యధావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పద్ధతిలోనే కొనసాగించాలన్నారు.

సాక్షి ప్లస్
సోమవారం । 30-9-2024

అది 'వర'ద కాలువ!

లక్ష ఎకరాల్లో పసిడి పంటలు

- రైతులకు కలిసొస్తున్న వరద కాలువ నీరు
- ఎస్సారెస్పీ నుంచి 122 కిలోమీటర్ల మేర వరద కాలువ
- 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


బోయినపల్లి(చొప్పదండి)

ఒక్క వరద కాలువ లక్ష ఎకరాల్లోని పంటలకు జీవం పోస్తోంది. నాలుగు జిల్లాల్లో 122 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తున్న వరదకాలువ కింద దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా వరద కాలువ నిర్మించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ల మేర వరద కాలువ విస్తరించి ఉంది. నాలుగు జిల్లాల పరిధిలోని భూములకు జీవధారగా నిలుస్తోంది. వరద కాలువ నీటితో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 70 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుండగా.. అత్యధికంగా జగిత్యాల జిల్లా పరిధిలో 50 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

వరద కాలువ స్వరూపం

పొడవు:	122 కిలోమీటర్లు
విస్తరించిన జిల్లాలు:	నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల
డివిజన్లు :	5
నీటి నిల్వ సామర్థ్యం:	1.7 టీఎంసీ
పర్యవేక్షణాధికారులు:	ఇద్దరు ఎస్ఈలు, నలుగురు ఈఈలు
ప్రవహించే నీరు:	19 వేల క్యూసెక్కులు


రైతులు వేసిన వరి పంట


బోయినపల్లి మండలం మీదుగా వరద కాలువ

సిరుల సాగు

నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ల వరకు వరద కాలువ నిర్మించారు. వరద కాలువలో సుమారు 18 మీటర్ల లోతు నీరు నిలిచి ఉంటుంది. కాలువ అడుగు భాగాన 43 మీటర్ల వెడల్పు ఉంటుంది. వరద కాలువలో నిల్వ ఉన్న నీరు ఆధారంగా మోటార్లతో నిజామాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి కరీంనగర్‌లోని జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల మేర వరి సాగు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, కోరుట్ల, మేడిపెల్లి మల్యాల మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలు, కరీంనగర్ జిల్లా పరిధిలోని గంగాధర, రామడుగు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలు, రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో 7వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. రైతులు వరద కాలువకు ఇరువైపులా మోటార్లు అమర్చుకుని వ్యవసాయ భూములకు పైపులైన్ల ద్వారా నీరు అందిస్తున్నారు.

ఐదు డివిజన్లుగా వరద కాలువ

నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమై 122 కిలోమీటర్ల మేర విస్తరించిన వరద కాలువను ఐదు డివిజన్లుగా విభజించారు. ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి 28 కిలోమీటర్ల వరకు ఒక డివిజన్. 28 కిలోమీటర్ల నుంచి 44 కిలోమీటర్లు, 44 కిలోమీటర్ల నుంచి 73 కిలోమీటర్లు, 73 కిలోమీటర్ల నుంచి 102 కిలోమీటర్లు, 102 కిలోమీటర్ల నుంచి 122 కిలోమీటర్లు.. ఇలా ఐదు డివిజన్లను ఏర్పాటు చేశారు. ఐదు డివిజన్ల పరిధిలో వరద కాలువను ఐదుగురు ఈఈలు, ఇద్దరు ఎస్ఈలు పర్యవేక్షిస్తారు.

వర ప్రదాయిని



వరద కాలువ రైతులకు వర ప్రదాయినిగా మారింది. వర్షాకాలం ఆరంభంలో ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోతల ద్వారా వరద కాలువ మీదుగా మిడ్ మానేరుకు విడుదల చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ జలాలతో వరద కాలువ కళకళలాడుతోంది. ఈ ప్రాంత రైతులు కాలువ నీరు ఆధారంగా భారీగా వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు.

– మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే, చొప్పదండి

కోత దశలో ఉంది



విలాసాగర్ వరద కాలువ పరిసరాల్లో 5 ఎకరాల మేర వరి పంట వేసిన. కాలువ నీరు ఆధారంగా వరి సాగు చేస్తున్నాను. వర్షాకాలం ఆరంభంలో వరద కాలువలో నీరు లేదు. పంటలు ఎలా వేయాలోనని రంది పడ్డా. ఇప్పుడు నీరు పుష్కలంగా ఉంది. పంటలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– గంగాధర సురేందర్, విలాసాగర్, రైతు, బోయినపల్లి మండలం

భూములు సస్యశ్యామలం



నిజామాబాద్ ఎస్సారెస్పీ వరద కాలువ జీరో పాయింట్ నుంచి బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ వరకు వరద కాలువ విస్తరించి ఉంది. ట్యాంకులు నింపడంతోపాటు మోటార్ల ద్వారా సాగునీరు అందుతోంది. వరద కాలువ ఆధారంగా సుమారు లక్ష ఎకరాల మేర వరి సాగవుతోంది. రైతుల పంటలు సస్యశ్యామలం అవుతున్నాయి.

– అశోక్‌కుమార్, వరద కాలువ, ఎస్ఈ, జగిత్యాల

'హైబ్రిడ్ వర్క్'కే జై

భారత్ ఉద్యోగుల సంతృప్తి

- ఈ విధానంలో వారానికి రెండు, మూడు రోజులు ఆఫీస్ లేదా ఇంటినుంచి పని
- విదేశాలతో పోల్చితే భారత్‌లోనే ఇది అధికం
- గతంకన్నా కార్యాలయానికి వెళ్లి పనిచేసే గంటల పెరుగుదల
- 'ఫ్రం రిస్ట్రిక్షన్స్ టు రిసైలెన్స్'యూనీస్పేస్ గ్లోబల్ వర్క్‌ప్లేస్ ఇన్‌సైట్స్ 2024–25 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారత ఉద్యోగుల్లో అత్యధిక శాతం మంది 'హైబ్రిడ్ పని విధానం'పై అత్యంత సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హైబ్రిడ్ వర్క్ విధానంలో వారానికి రెండు, మూడురోజులు ఆఫీస్ లేదా ఇంటి నుంచి పనిచేసేందుకు అనువైన పద్ధతిని ఎంచుకునే అవకాశం సంస్థలు, యాజమాన్యాలు తమకే కల్పించడంపై వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కార్యాలయానికి వెళ్లి పనిచేసినపుడు లేదా ఇంటి నుంచి పనిచేస్తున్నపుడు వారానికి చేసే పనిగంటలు ఎంచుకునే స్వేచ్ఛ కూడా తమకు ఉండడంపై వారిలో సానుకూల దృక్పథం వ్యక్తమౌతోంది. ఇది 'ఫ్రం రిస్ట్రిక్షన్స్ టు రిసైలెన్స్'పేరిట యూనీస్పేస్ నిర్వహించిన గ్లోబల్ వర్క్‌ప్లేస్ ఇన్‌సైట్స్ 2024–25 నివేదికలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లోని 10,700 మంది ఎంప్లాయీస్, ఎంప్లాయర్స్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను సిద్ధం చేశారు. భారత్‌లోని 97 శాతం ఉద్యోగులు, 98 శాతం యాజమాన్యాలు హైబ్రిడ్ వర్కింగ్ అరేంజ్‌మెంట్‌పై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశాయి. అదే గ్లోబల్ యావరేజ్ చూస్తే.. 87 శాతం ఉద్యోగులు, 95 శాతం ఎంప్లాయర్స్‌గా ఉండటంతో.. విదేశాల్లో కంటే కూడా భారత్‌లోనే ఈ పనివిధానానికి అత్యధిక సంఖ్యలో సై అంటున్నట్టు స్పష్టమైంది. గతేడాది గణాంకాలతో పోల్చి చూస్తే ఈ విషయంలో గణనీయమైన మార్పు నమోదైనట్టు తెలుస్తోంది. గతేడాది.. ఇంటి నుంచే పనిచేయాలని భావించినప్పుడు వచ్చే వేతనంలో కోత పడినా పరవాలేదనే అభిప్రాయాన్ని 31 శాతం భారతీయులు వ్యక్తం చేశారు (ఇది ప్రపంచదేశాల స్థాయితో పోల్చితే రెండింతలుగా ఉంది). హైబ్రిడ్ వర్క్ విధానంతో గతంతో పోల్చితే.. కార్యాలయానికి వారంలో వెళ్లి పనిచేసే గంటల పెరుగుదల నమోదైనట్టు గుర్తించారు. కార్యాలయాలకు వచ్చేందుకు మొదట్లో అంతగా ఉత్సాహం చూపనివారు సైతం.. ఇప్పుడు ఉత్సుకతను వ్యక్తం చేస్తున్నట్టు తేలింది. కొత్త ఆలోచనలు పంచుకోవడానికి, ఉత్పాదకతను పెంచడానికి కార్యాలయాలకు వెళ్లి పనిచేయడం ఉపకరిస్తున్నట్టుగా ఈ అధ్యయనంలో వెల్లడైంది. దీంతో మూడు, నాలుగేళ్లలో 'వర్క్ ఫ్రం హోం'విధానంలోనే పనిచేయాలనే మొండి పట్టుదలతో ఉన్న వారు సైతం హైబ్రిడ్ పద్ధతిని ఎంచుకునేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది.



కార్యాలయానికి వస్తే..

- వారంలో మూడు రోజులు కార్యాలయానికి వచ్చి పని చేస్తే.. మిత్రులు, సహోద్యోగులను ముఖాముఖి కలుసుకోవడం, పనికి సంబంధించి ఏవైనా ఆలోచనలు పరస్పరం పంచుకోవడం వంటి వాటిలో మార్పు కనిపిస్తున్నట్టు గుర్తించారు
- కార్యాలయాల్లో నిశ్శబ్ద వాతావరణం కొనసాగేలా, అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా (డెడ్ లైన్) అనువైన వాతావరణం కల్పించాలని యాజమాన్యాలు భావిస్తున్నాయి
- కార్యాలయాలకు వచ్చి పనిచేసేలా రవాణా చార్జీల చెల్లింపు వంటి పారితోషికాలు ఉపయోగపడుతున్నాయి
- ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు, డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఉచితంగా పానీయాలు, కాఫీ, స్నాక్స్ వంటివి దోహదపడుతున్నాయి.
- ఒత్తిళ్ల నుంచి ఉపశమనానికి చర్యలు, ఆరోగ్యవంతమైన వాతావరణం, సాంకేతికంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన వంటివి కార్యాలయాలకు ఉద్యోగులను ఆకర్షించేందుకు సహాయపడుతున్నాయి.

నివేదికలో ఇంకా ఏముందంటే..

- తమ ఉత్పాదకతను, కమ్యూనికేషన్స్ పెంచడానికి వర్క్‌ప్లేస్ టెక్నాలజీ, సౌకర్యాలు ఉపయోగపడుతున్నట్టు 87 శాతం ఉద్యోగులు, 80 శాతం ఎంప్లాయర్స్ అభిప్రాయపడ్డారు
- ఇంటి నుంచి కార్యాలయం తక్కువ దూరంలో ఉండాలని, ఈ ప్రయాణం సాఫీగా సాగాలని కోరుకుంటున్నవారు 91 శాతం మంది
- ఉచిత స్నాక్స్, కాఫీ, తినుబండారాలు, ఉచిత పానీయాలు వంటి వాటిపై 94 శాతం ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు
- కోరుకున్న సమయాల్లో పనిచేసేందుకు అనుమతించాలని 48 శాతం ఉద్యోగులు కోరుతున్నారు.

యాదాద్రిలో భక్తుల రదీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, పుష్కరిణి, కల్యాణ కట్ట ప్రాంతాలు కిటకిటలాడాయి. ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.23,91,215 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


ఆలయ క్యూకాంప్లెక్స్‌లో భక్తులు

తగ్గేదేలే..!

- గంటల వ్యవధిలోనే పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి యత్నం
- ఉనికి చాటేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు
- రాకెట్ లాంచర్లతో కవ్వింపు చర్యలపై భద్రతా బలగాల్లో చర్చ

మావోయిస్టుల ఉనికి లేదన్న డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో మావోయిస్టుల ప్రభావం లేదు. పోలీసుల పట్టు కొనసాగుతోంది. మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు కొన్నిసార్లు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చినా.. పోలీసు బలగాలు గట్టిగా తిప్పికొడుతున్నాయి'.. ఈనెల 24న విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్ చేసిన వ్యాఖ్యలివి. డీజీపీ ఆ ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే.. మావోయిస్టులు తమ ఉనికి చాటుకునే ప్రయత్నం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై బుధవారం రాత్రి 7 గంటల నుంచి మావోయిస్టులు దాడికి ప్రయత్నించారు. రాకెట్ లాంచర్లు విసురుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాదాపు 200 మందికి పైగా మావోయిస్టులు ఈ ఘటనల్లో పాల్గొనడం, ఏకంగా బేస్‌క్యాంపుపైనే రాకెట్ లాంచర్లు విసురుతూ రెచ్చగొట్టడం భద్రతా బలగాల్లోనూ చర్చకు దారి తీసింది. తమవైపు ఎలాంటి ప్రాణ నష్టం లేకపోయినా.. మావోయిస్టుల చర్యల్ని తీవ్రంగా పరిగణించిన పోలీసు బలగాలు.. వారి కోసం గాలింపు ముమ్మరం చేశాయి. కాగా, ఇటీవల వరుస ఎదురు దెబ్బలతో తెలంగాణలో వెనక్కి తగ్గిన మావోయిస్టులు.. తిరిగి పట్టు సాధించేందుకు విఫల యత్నాలు చేస్తున్నారన్న సంకేతాలు ఈ దాడి ద్వారా పంపినట్లయింది.

కొనసాగుతున్న ఏరివేత

మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతున్నారు. అదే సమయంలో మావోయిస్టుల కీలక ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల ఆధ్వర్యంలో మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 100 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటి వరకు సుమారు 300 మంది వరకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. సుమారు 250 మంది వరకు మావోయిస్టుల్ని పోలీసులు అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ సరిహద్దుల్లోనూ ఇటీవలే పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది. కర్కగూడెం గ్రామానికి అతి సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బృందాలకు.. తారసపడిన బీఏ-ఏఎస్ఆర్ డివిజన్ కమిటీకి చెందిన ఆరుగురిని హతమార్చారు. మరోవైపు మావోయిస్టులకు అత్యంత పట్టున్న కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లోనూ వరుస ఎన్‌కౌంటర్లలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు మావోయిస్టులపై పట్టు సాధిస్తూ వస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ వైపు ఒత్తిడి పెరగడంతో తెలంగాణలోకి ప్రవేశించేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ ప్రయత్నాలను తెలంగాణ గ్రేహౌండ్స్, టీజీఎస్పీ, స్థానిక పోలీసు బలగాలు తిప్పికొడుతున్నాయి. ఈ సమయంలో ఒకేసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీస్ బేస్ క్యాంపును లక్ష్యంగా చేసుకోవడాన్ని పోలీస్ ఉన్నతాధికారులు సైతం సవాల్‌గా తీసుకున్నట్టు తెలిసింది. తెలంగాణలో మావోయిస్టుల కదలికల్లేకుండా చేయడంలో ఇప్పటి వరకు తమకున్న పట్టు నిలుపుకొనేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు.

ఇంకా 'మీన'మేషాలే ?

- చేపపిల్లల ఉచిత పంపిణీకి ఎదురుచూస్తున్న మత్స్యకారులు
- ఇప్పటివరకు 17 జిల్లాల టెండర్లే ఖరారు



సాక్షి,హైదరాబాద్ : చేపపిల్లల ఉచిత పంపిణీకి ఇంకా గ్రహణం వీడడం లేదు. ఈ ఏడాది భారీవర్షాలతో దాదాపు అన్ని చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, కుంటలు నిండాయి. చేపపిల్లల పంపిణీపై ప్రభుత్వం ముందస్తుగా టెండర్లు వేయకపోవడం, దానిపై ప్రణాళిక లేకపోవడంతో చేపపిల్లలు లేక జలాశయాలు కళతప్పాయి. వర్షాలు కురుస్తున్న సమయంలోనే పోస్తేనే చేపపిల్లలు ఆరోగ్యంగా, ఇప్పటివరకు ఒక సైజుకు వచ్చేవే. ఆలస్యంగా వదిలే చేప పిల్లలు సోమిడిపట్టి (బక్కచిక్కి) ఉంటాయి. వాటికి సరైన ధర రాకపోగా, మత్స్య ప్రియులు ఇష్టపడరు. ఇలాంటి చేపలకు మార్కెట్‌లో అనుకున్న ధర కూడా రాదు. మార్కెట్‌కు తీసుకెళ్లిన మత్స్యకారులు ఆశించిన ధర రాకపోవడంతో చేపలు పట్టే కూలీ, ఇతర ఖర్చులు, రావాల్సిన లాభం రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈ ఏడాది 85 కోట్ల చేప పిల్లలు పోయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా టెండర్లు ఆహ్వానించింది. అయితే సకాలంలో టెండర్లు వేయకపోవడం, మరోవైపు కాంట్రాక్టర్లు అంతా ఏకమై ధర పెంచాలని డిమాండ్ చేయడం, కాంట్రాక్టర్ల డిమాండ్, చేపపిల్లల పంపిణీపై ఒక అడుగు ముందుకు పడే సరికి ఆగస్టు మూడోవారం అయ్యింది. సెప్టెంబర్ చివరివారం దగ్గర పడుతున్నా... ప్రభుత్వ అలసత్వం చూస్తుంటే ఈ ఏడాది ఉచితంగా చేప పిల్లలు ఇస్తారా లేదా అన్న సందేహంలో మత్స్యకారులు ఉన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఉచిత చేపపిల్లలు ఇవ్వకుంటే గతంలో మాదిరిగా ఆయా సొసైటీలే చేప పిల్లలను సమకూర్చుకొని, ఇష్టం వచ్చిన రకాలు పోసుకుంటామని మత్స్యకారులు అంటున్నారు.

ఆగస్టులో టెండర్ల ప్రక్రియ పూర్తయినా..

ఆగస్టు 3న టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. అయితే వాటి వెరిఫికేషన్‌లో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు కేవలం 17 జిల్లాలకు మాత్రమే టెండర్లు ఖరారు అయినట్టు తెలిసింది. ఇక మిగతా జిల్లాలకు ఎప్పటివరకు పూర్తి చేస్తారు ? టెండర్‌దారులు చేపపిల్లలను ఎప్పటిలోగా సమకూర్చుకుంటారు? ఎప్పటిలోగా చెరువుల్లో వదులుతారనేది మాత్రం పెద్ద ప్రశ్నగా మారింది.







రిషికేశ్ కంప్లీట్ టూర్

అక్టోబర్ వస్తోంది. దసరా సెలవులు వస్తాయి. కాలేజ్, ఉద్యోగం స్ట్రెస్ నుంచి రిలీఫ్ కోసం ఎటైనా టూర్‌కెళ్తే బావుణ్ననిపిస్తుంది. ఈ సీజన్‌లో మనదేశంలో ఏ ప్లేస్ బెస్ట్ అంటే ముందు రిషికేశ్‌ని గుర్తు చేసుకోవాలి.

రిషికేశ్ టూర్ అంటే అట్లా ఇట్లా ఉండదు. ఒక అడ్వెంచరస్ టూర్, ఒక తీర్థయాత్ర, ఒక హనీమూన్ వెకేషన్, ఓ తథాత్మ్యత... అన్నీ కలిపిన తీర్థం, క్షేత్రం ఇది. గంగోత్రి నుంచి గంగానది కొండ వాలుల మధ్య ప్రవహిస్తూ నేల మీదకు వచ్చే వరకు ప్రవాహం చాలా ఉధృతంగా ఉంటుంది. గంగోత్రి నుంచి రిషికేశ్‌కు 250 కిమీల దూరం ఉంటుంది. రిషికేశ్ పట్టణం సముద్రమట్టానికి పదకొండు వందల నుంచి పదిహేడు వందల అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది. రిషికేశ్ వరకు గంగానది ఎక్కువ వెడల్పు లేకుండా పాయలాగ వేగంగా ప్రవహిస్తూ ఆకాశం నుంచి దూకుతున్నట్లే ఉంటుంది. అక్కడి నుంచి పాతిక కిలోమీటర్ల దూరాన ఉన్న హరిద్వార్ వరకు ప్రవాహం విశాలమవుతూ, పరుగు వేగం తగ్గుతుంటుంది. గంగానది కలుషితం కావడం హరిద్వార్ దగ్గర నుంచే మొదలవుతుంది. కాబట్టి అంతకంటే పైన రిషికేశ్ దగ్గర గంగా స్నానం చేయాలనుకుంటారు ఎక్కువ మంది. యువత అయితే గంగానదితోపాటు ఒక్క ఉదుటున భూమ్మీదకు దూకడం కోసం రిషికేశ్‌కు ఇరవై కిలోమీటర్ల పైకి వెళ్లి అక్కడి నుంచి రాఫ్టింగ్ మొదలు పెడతారు. రిషికేశ్‌లో రివర్‌రాఫ్టింగ్ నిర్వహించే సంస్థలు ప్రతి వీధిలోనూ కనిపిస్తాయి. బంగీ జంప్, ఫ్లయింగ్ ఫాక్స్ కూడా చేయవచ్చు. నగరం ఎంత ఇరుకుగా ఉంటుందో నది తీరాన గుడారాల్లో క్యాంపింగ్ కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో కనిపిస్తాయి.

లక్ష్మణ్ ఝూలా

గంగానది ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు చేరడానికి సస్పెన్షన్ బ్రిడ్జి ఉంది. దాని పేరు లక్ష్మణ్ ఝూలా. రామాయణ కాలంలో రాముడు, లక్ష్మణుడు, సీత కొంతకాలం ఇక్కడ నివసించారని చెబుతారు. సీత నది దాటడం కోసం లక్ష్మణుడు అడవి చెట్ల తీగలతో వంతెనను అల్లాడని, దాని పేరే లక్ష్మణ్ ఝూలా అని చెబుతారు. రిషికేశ్‌కు మరికొంత దూరంలో రామ్ ఝూలా ఉంది. అది రాముడు అల్లిన తీగల వంతెన. ఈ రెండు వంతెనలు నది దాటడానికి అనువుగా ఉండేవి. కాలక్రమంలో ఆ వంతెనల స్థానంలోనే ఇనుప వంతెనలు నిర్మాణం జరిగింది. పర్యాటకులు లక్ష్మణ్ ఝూలా మీద నుంచి అవతలి తీరానికి చేరి అక్కడి నుంచి పడవలో విహరిస్తూ ఇవతలి ఒడ్డుకు రావచ్చు. పడవలో మెల్లగా సాగుతూ ఒక ఒడ్డున మనుషులను, మరో ఒడ్డునున్న ఎత్తైన కొండలను, కొండవాలులో, నది తీరాన ఉన్న నిర్మాణాలను చూస్తూ ఉంటే ఒక్కసారిగా తుళ్లింతలతో యువకులు రివర్ రాఫ్టింగ్ చేస్తూ దూసుకొస్తారు. నదిలో బోట్ షికార్ టికెట్‌ల మీద ప్రభుత్వ నిఘా పెద్దగా ఉండదు. ప్రైవేట్ బోట్‌ల వాళ్లు ఒక్క ట్రిప్‌కి వేలల్లో అడుగుతారు. పెద్ద బోట్‌లలో వెళ్లడమే శ్రేయస్కరం. గంగ పరవళ్లు తొక్కుతుంటుంది. చిన్న పిల్లలతో వెళ్లిన వాళ్లు చాలా జాగ్రత్తగా ఉండాలి.

యోగా క్యాపిటల్

రిషికేశ్, హరిద్వార్ రెండూ నేషనల్ హెరిటేజ్ సిటీలు. కేరళలో ఉన్నట్లే ఆయుర్వేద వైద్యం, పంచకర్మ చికిత్స కేంద్రాలుంటాయి. హిమాలయాల నుంచి సేకరించిన ఔషధ మొక్కలతో వైద్యం చేస్తారు. రిషికేశ్‌లో ఏటా యోగా, మెడిటేషన్ సెషన్‌లు జరుగుతాయి. భారత ప్రధాని కూడా రిషికేశ్ పర్యటన సందర్భంగా పట్టణంలోని ఒక గుహలో ధ్యానం చేశారు. భవబంధాలను వదిలి మోక్షసాధన కోసం జీవితంలో అంత్యకాలాన్ని ఇక్కడ గడపడానికి వచ్చేవాళ్లు కూడా ఉంటారు. రోజూ సాయంత్రం గంగాహారతి కనువిందు చేస్తుంది. నది మధ్యలో ధ్యానముద్రలో ఉన్న ఈశ్వరుని విగ్రహాన్ని చూడడానికి దగ్గరకు వెళ్లడం కంటే ఒడ్డున ఘాట్ నుంచి చూస్తేనే శిల్పసౌందర్యాన్ని ఆస్వాదించగలుగుతాం. ఉత్తరాఖండ్ వర్షాకాలం వరదల బారిన పడుతుంటుంది. కానీ ఆ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరు టూరిజమే. కాబట్టి సీజన్ వచ్చే సరికి టూరిస్టుల కోసం సిద్ధమైపోతుంది. అన్నట్లు ఈ టూర్ గుర్తుగా రుద్రాక్ష తెచ్చుకోవడం మర్చిపోవద్దు. మన దగ్గర జామచెట్లు ఉన్నట్లు ఎక్కడ చూసినా రుద్రాక్ష చెట్లే.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బాపూజీ ఇంటిని చూద్దాం

ఈ ఏడాది దసరా వెకేషన్‌కి స్కూల్‌కెళ్లే పిల్లల పేరెంట్స్ హాయిగా పోర్‌బందర్ బాట పట్టవచ్చు. గాంధీజీ పుట్టిన నెలలో గాంధీజీ పుట్టిన నేల మీద విహరించడంలోని సంతృప్తిని ఆస్వాదించవచ్చు. జాతిపితకు నివాళులర్పించనూ వచ్చు. పిల్లలకు ఇది మరిచిపోలేని పర్యటనగా మిగిలిపోతుంది.




ఈ టూర్‌లో బాపూ పుట్టిన ఇంటిని, ఆయన స్మారకార్థం నిర్మించిన కీర్తిమందిర్, అందులో ఆయన జీవితంలోని ముఖ్యఘట్టాలతో ఉన్న ఫొటో ఎగ్జిబిషన్, గాంధీజీ నూలు వడికిన రాట్నం... వీటన్నింటినీ చూసిన తర్వాత గాంధీజీకి చేతులెత్తి మొక్కుతాం. పిల్లల మనసులు గౌరవంతో నిండిపోతాయి. గాంధీజీ పుట్టిన ఇంటి నిర్మాణం ఆసక్తికరంగా ఉంటుంది. ఉడెన్ కార్వింగ్, రాతి కిటికీలను పోలిన డిజైనర్ విండోలతో అక్కడక్కడా పర్షియన్ నిర్మాణశైలితో ఎగువ మధ్యతరగతి కుటుంబాన్ని పోలి ఉంటుంది. ఇంటి లోపల ఏర్పాట్లను గమనిస్తే నిరాడంబర జీవనశైలి అనిపిస్తుంది. గోడల మీద ఆయిల్ పెయింటింగ్స్ కళాత్మకతను ప్రతిబింబిస్తాయి. ఇంట్లో గాంధీ పుట్టిన ప్రదేశం ప్రత్యేకంగా మార్క్ చేసి ఉంటుంది. బాపూజీ ఇంటి వెనుక వైపునున్న కస్తూర్బా గాంధీ ఇంటిని మర్చిపోకూడదు.





బాపూ మందిర్, కీర్తిమందిర్‌లను చూసిన తరవాత బయటకు వస్తే చౌరాస్తాలో గాంధీజీ విగ్రహం ఉంటుంది. ఆ సెంటర్‌ని గాంధీ చౌక్ అంటారు. ఈ టూర్‌లో గాంధీ స్మారకాలతోపాటు చూడాల్సినవి చాలా ఉన్నాయి.

శ్రీకృష్ణుడి స్నేహితుడు సుధాముని మందిరం, వాళ్ల గురువు సాందీపుని మందిరం, హుజూర్ ప్యాలెస్, బర్డ్ సాంక్చురీ, తారామందిర్ (ప్లానిటేరియం), భారత్ మందిర్(జామెట్రికల్ మాథ్స్ ప్రదర్శనాలయం), రామకృష్ణ మిషన్ ఉన్నాయి. చక్కటి ఎయిర్‌పోర్టు కూడా ఉంది. అరేబియా తీరంలో సూర్యాస్తమయం ఈ టూర్‌లో బోనస్.



భువనగిరి దుర్గం

హైదరాబాద్ నుంచి ఉదయం బయలుదేరి సాయంత్రం తిరిగి ఇల్లు చేరాలంటే భువనగిరి కోట ఒక చక్కటి టూరిస్ట్ ప్లేస్. ఐదు వందల అడుగుల ఎత్తులో, నలభై ఎకరాల్లో విస్తరించిన నిర్మాణం ఇది. భువనగిరి కోటను నిర్మించిన రాజు పేరు త్రిభువన మల్ల విక్రమాదిత్య. ఈ కోట 11వ శతాబ్దం నాటిది. చరిత్ర పుటల్లో అతడి పేరుతోనే త్రిభువనగిరిగా ఉంటుంది. వ్యవహారంలో భువనగిరి, బోన్‌గిర్ అయిపోయింది. ఈ కోట ముందు సర్దార్ సర్వాయపాపన్న విగ్రహం ఉంటుంది. గూగుల్ మ్యాప్ డైరెక్షన్ కోట సమీపం వరకు మాత్రమే. ఎంట్రన్స్ ఎటు వైపు ఉందో తెలియక తిరిగిన రోడ్లలోనే చుట్టు తిరగాల్సి వస్తుంది. కాబట్టి స్థానికుల సహాయంతో ముందుకెళ్లాలి. టూరిస్ట్ ప్లేస్‌గా ఇప్పుడిప్పుడే ఆదరణ పొందుతోంది. ఎంట్రీ టికెట్, కెమెరాకి టికెట్ తీసుకోవాలి. వాటర్ బాటిళ్లు, తినుబండారాలు తగినన్ని వెంట తీసుకువెళ్లాలి. కోట సమీపంలో కూడా పర్యాటకులకు సౌకర్యాలు పెద్దగా లేవు. వాహనం పార్కింగ్‌కి కోట ముందు విశాలమైన ప్రాంగణం ఉంది. కానీ నీడ కోసం ఎటువంటి ఏర్పాటూ లేదు. తగినన్ని ఏర్పాట్లు లేవనే అసౌకర్యం నిజమే. కానీ వాహనాల హారన్‌ల మోతలు లేకుండా, పిన్ డ్రాప్ సైలెన్స్‌తో కూడిన వాతావరణం హైదరాబాద్ నగరవాసికి స్వర్గమనే చెప్పాలి. స్వచ్ఛమైన చల్లటి గాలి ఒంటిని తాకుతుంటే కలిగే హాయిని ఫీల్ అవ్వాల్సిందే, మాటల్లో వర్ణించలేం. పదిహేనేళ్ల పిల్లల నుంచి అరవై ఏళ్ల వాళ్లు కూడా ఈ ట్రెకింగ్ టూర్‌ను చక్కగా ఆస్వాదించగలుగుతారు.



ఈ టూర్‌కి వెళ్లేటప్పుడు షూస్ చక్కగా ట్రెకింగ్‌కి అనువుగా ఉండాలి. అలాగే హైదరాబాద్- వరంగల్ హైవే మీద ఉన్న హోటళ్లలో తినేసి వెళ్లాలి. తిరుగు ప్రయాణంలోనూ ఆకలి తీర్చేది కూడా హైవే మీదున్న హోటళ్లే. ట్రెకింగ్ పూర్తయిన తర్వాత తిరుగుప్రయాణంలో చేసే భోజనంలో థాలి రుచి కూడా అంతే అద్భుతం.



అగ్రి ఆర్ట్

వరి పైరుతో చిత్రకళ

కొన్ని కళలను కళ్లారా చూడాల్సిందే తప్ప వాటికి కొత్త అర్థాలు చెప్పలేం.
కానీ, తన కళతో యువతకు ఏది ముఖ్యమో వివరిస్తున్నారు కేరళలోని వాయనాడ్‌కు చెందిన ప్రసీత్‌కుమార్ తయ్యిల్ అనే వ్యక్తి.
ఇంతకీ ఏం చేశాడా అంటారా.. ఫొటో చూడండి... ఇంకా అర్థం కాలేదు
విషయమేంటో స్వయంగా తెలుసుకోండి.

వాయనాడ్‌లోని సుల్తాన్ బతేరీకి చెందిన ఒక రైతు తన వరి పొలాన్ని కాన్వాస్‌గా మార్చేశాడు. వివిధ రకాలైన వరి రకాల నారు ఉపయోగించి క్లిష్టమైన శివుని రూపాన్ని ఆవిష్కరించాడు. యువతను వ్యవసాయం వైపు మళ్లించేందుకు ఈ కళను సృష్టించాను అని చెబుతున్నాడు. ఆ రైతు పేరు ప్రసీద్ కుమార్ తయ్యిల్. వరిపొలంలో వరి కళకు ప్రాణం పోసిన ఈ రైతును అభినందించకుండా ఉండలేం.



పంట పొలాలతో కళను సృష్టించడాన్ని పాడీ ఆర్ట్ అంటారు. ఇన్‌స్టాలేషన్‌లో టాన్బో ఆర్ట్ లేదా రైస్ ప్యాడీ ఆర్ట్ అని పిలువబడే జపనీస్ కళారూపం ఇది. దీనిని వ్యూహాత్మక పద్ధతిలో నాటిన వేలాది వరి నారు పెరిగి, ఆ తర్వాత రెమ్మల ద్వారా ఓ రూపం కనిపిస్తుంది.

అరుదైన వరి వంగడాలను సంరక్షించడమే ధ్యేయంగా!

ఈ కళాత్మక వెంచర్ కోసం తన 10 ఎకరాల వరి పొలంలో 30 సెంట్ల భూమిని అంకితం చేశాడు శ్రీ కుమార్. తన ప్రయత్నం కేవలం సౌందర్యానికి సంబంధించినది కాదని చెబుతున్నాడు. 'అరుదైన స్థానిక వరి జాతులను సంరక్షించడం, వాటిని ప్రచారం చేస్తూనే, వ్యవసాయం ఒక ఆచరణీయ వృత్తిగా యువతకు అవగాహన కల్పించడం లక్ష్యం' అంటున్నాడు.



ఆర్ట్‌కి నాలుగు రకాల వంగడాలు

వరి కళతో పాటు కుమార్ వ్యవసాయంలో ఎన్నో అద్భుతాలను పండిస్తుంటాడు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి సేకరించిన ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందిన 100 రకాల వరి వంగడాలతో పంటలు పండించాడు. ఈ కళాకృతి కోసం మాత్రం నాలుగు విభిన్న వరి రకాలను ఉపయోగించాడు: నాజర్ బాత్ రకానికి ఊదా ఆకులతో, రక్తశాలి, చిన్నార్, జీరకసాల, ముదురు- లేత ఆకుపచ్చ ఆకులతో ఉంటాయి.

పర్యాటకులకు ఆకర్షణ మంత్ర

కుమార్ మాట్లాడుతూ- 'ఆధునిక తరం వ్యవసాయం నుండి డిస్కనెక్ట్ అయినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా వరి సాగులో తరచుగా అధిక ఖర్చులతో తక్కువ రాబడి వచ్చేదిగా భావిస్తుంటారు. అయితే, మూడు దశాబ్దాలుగా జపాన్, చైనాలోని రైతులు వరి కళ వంటి వినూత్న పద్ధతులను అవలంబిస్తూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారు. సాంప్రదాయ వ్యవసాయ రాబడితో పాటు గణనీయమైన అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. సహజ సౌందర్యంతో వయనాడ్ దేశంలోనే ప్రముఖ టూరిజం హాట్‌స్పాట్‌గా మారుతోంది. జిల్లాలోని రైతులు తమ వరి పొలాలకు పర్యాటకులను ఆకర్షించగలిగితే, వారు మరిన్ని మెరుగైన ఆర్థిక ఫలితాలను సాధిస్తారు'అని ఆయన చెప్పారు.

కిందటేడాది విద్యార్థులు, రైతులు, పర్యాటకులతో సహా 10,000 కంటే ఎక్కువ మంది సందర్శకులు తన సైట్‌ను సందర్శించారని శ్రీ కుమార్ చెబుతున్నాడు. అంతే కాదు, ఈ వంగడాల ద్వారా ఆకర్షణీయమైన అదనపు ఆదాయాన్ని కూడా సంపాదిస్తున్నాడు. ఇప్పటికి పది సార్లు కుమార్ తన పొలాల్లో వరి కళాకృతిని రూపొందించాడు. ఈ ప్రాజెక్ట్ దాదాపు రూ.20,000 ఖర్చుతో కూడుకున్నది. ప్రారంభ రూపురేఖలను ముందుగా నేల పైన గీసుకుని, ఆ తర్వాత 36 మంది కార్మికులతో కూడిన బృందంతో ఈ ఆర్ట్‌ను సాధించడానికి కుమార్.

ఏరియల్ ఆర్ట్

కళ - అథ్లెటిసిజం కలగలసి వైమానిక విన్యాసాలుగా రూపుదిద్దుకుంటున్నాయి.
చూడటానికి జిమ్నాస్ట్‌గా అనిపిస్తూనే ఆకాశంలో హరివిల్లులా మారే నృత్యప్రదర్శన ఓ అద్భుత ప్రక్రియగా అందరి మనసులను ఆకట్టుకుంటోంది.

ఆకాశమే హద్దు

మహారాష్ట్ర ప్రభుత్వ క్రీడా అవార్డును గెలుచుకున్న తర్వాత, అదితి దేశ్‌పాండే ప్రజలకు వైమానిక విన్యాసాలలో శిక్షణ ఇస్తోంది. ముంబైలోని తన అకాడమీ ఫ్లై హై ఏరియల్ ఆర్ట్ గురించి దేశ్‌పాండే మాట్లాడుతూ, 'ఒక వ్యక్తి జిమ్‌కి వెళ్లినట్లుగానే, చాలామంది ఏరియల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని.. ఆఫీసులు, స్కూళ్ల టైమ్ తర్వాత శిక్షణ కోసం క్లాసులకు రావాలని కోరుకుంటున్నారని' చెబుతోంది.

శరీర బరువులో సమతుల్యత

సిల్క్ ఫ్యాబ్రిక్, హూప్స్, తాళ్లు లేదా ట్రాపెజెస్‌ని ఉపయోగించి గాలిలో నృత్యం చేసిన వ్యక్తులు ఉన్నారు. ఈ డ్యాన్స్ సంగీతంతో సెట్ చేసి ఉంటుంది. ప్రదర్శనలు చేయడానికి వ్యక్తుల బలం, సౌలభ్యాన్ని మిళితం చేసి దృశ్యంగా మార్చే అద్భుతమైన ప్రక్రియ ఇది. ఒక సాధారణ వ్యక్తి ఈ విన్యాసాలను చాలావరకు గురుత్వాకర్షణకు వ్యతిరేకంగా చేయడానికి తన పూర్తి బలాన్ని ఉపయోగిస్తాడు. వైమానిక స్కిల్స్ ప్రదర్శించే సమయంలో వెనుక కండరాలను ఉపయోగిస్తాడు. దీనికి శరీర బరువులో ఒక సమతుల్యతను తీసుకురావాల్సి ఉంటుంది'అని వివరిస్తుంది దేశ్‌పాండే.



ఎలా చేస్తారంటే...

ఈ వైమానిక ప్రదర్శనలో డ్రాప్స్, పోజులు, స్పిన్‌లను అమలు చేయడానికి ముందు వ్యక్తులు తమను తాము ఫాబ్రిక్‌లో చుట్టుకుంటారు. ఏరియల్ రోప్ అనేది లైక్రాతో తయారు చేయబడిన వృత్తాకార ఉపకరణం. దీనిని కళాకారులు విన్యాసాలను ప్రదర్శించడానికి ఉపయోగిస్తారు. ట్రాపెజ్ అనేది తాళ్లు, తీగలతో చేసేది. ఇక్కడ ప్రదర్శనకారులు గాలిలో ఊగుతూ విన్యాసాలు చేస్తారు. స్ట్రాప్స్‌లో కళాకారులు సీలింగ్‌కు జోడించిన పట్టీలపై ప్రదర్శనలు చేస్తారు.



అక్టోబర్‌లో ఢిల్లీలోని స్విస్ దగ్గర ప్రదర్శన

స్విస్ కళాకారుడు జాసన్ బ్రూగర్, భారతీయ హులా హూప్ ప్రాక్టీషనర్ ఎష్నా కుట్టి అక్టోబర్ 2024లో న్యూ ఢిల్లీలోని స్విస్ రాయబార కార్యాలయంలో రెండు దేశాలు 75 సంవత్సరాల స్నేహాన్ని జరుపుకుంటున్న సందర్భంగా ప్రదర్శన ఇవ్వనున్నారు. వైమానిక కళలకు 'ఉన్నత స్థాయి సాంకేతికత అవసరం కాబట్టి ఇది కచ్చితంగా జిమ్నాస్టిక్స్ వంటి క్రీడలతో పోల్చవచ్చు. కానీ కదలిక, సంగీతం, కోర్సు సాంకేతికత ద్వారా కళ సృష్టించడం' అని బ్రూగర్ చెప్పారు. 'వేదికపై ఉన్నప్పుడు నా వ్యక్తిగత లక్ష్యం నా శరీరం ఏమి చేయగలదో చూపించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోవడం' అంటారు.

వైమానిక కళ అందరికీ అందుబాటులో ఉందా?

అహ్మదాబాద్‌లోని ఏరియల్ ఆర్ట్స్ ఇండియా అకాడమీ వ్యవస్థాపకుడు మాస్టర్ ట్రైనర్ అయిన జీల్ సోనీ- 'మా దగ్గర 55 ఏళ్ల వ్యక్తి నుండి 12 ఏళ్ల అమ్మాయి వరకు ప్రతి ఒక్కరూ ఈ ఏరియల్ ఆర్ట్ నేర్చుకోవాలనుకుంటున్నారు. ప్రజలు కొంచెం సాహసం చేయాలని చూస్తున్నందున జిమ్‌కి వెళ్లకుండా ఏరియల్ ఆర్ట్‌లను ఎంచుకుంటారు. పరికరాలు, మౌలిక సదుపాయాల విషయానికొస్తే క్రాష్ మ్యాట్‌లు, ప్రథమ చికిత్స, సేఫ్టీ గ్రిప్ ఎయిడ్ నుండి అన్నింటినీ అందిస్తాం' అని చెబుతోంది.

ఖర్చు ఎంతంటే..!

సోని ఎనిమిది వైమానిక కళల శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించింది. ఇది పూర్తి చేయడానికి రెండు సంవత్సరాల టైమ్ పడుతుంది. ఒకటి నుండి నాలుగు స్థాయిలు వైమానిక కళలను పరిచయం చేస్తాయి. ఐదు నుండి ఎనిమిది ఋత్తిపరమైన స్థాయిలు. ప్రతి పరిచయ స్థాయి శిక్షణకు ఒకటిన్నర నెలలకు సుమారు రూ. 6,500, ప్రతి ఉన్నత స్థాయికి మూడు నెలలకు రూ. 13,500 ఖర్చు అవుతుంది. సృజనాత్మకత, శిక్షణ, కఠినమైన మనస్తత్వం కూడా ఈ కళకు చాలా ముఖ్యమైనవి. మంచి కోచ్‌తో పని చేస్తే సరైన శిక్షణ లభిస్తుంది. సర్కస్‌లు, డ్యాన్స్ షోలు లేదా థియేటర్‌లలో ప్రదర్శించే ఏరియల్ ఆర్టిస్టులకు రూ.లక్ష నుండి రూ. 5 లక్షల వరకు చెల్లిస్తారు. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, పూణేలోని స్టూడియోలు సెషన్‌ల సంఖ్య ఆధారంగా తరచుగా ప్యాకేజీలుగా ఉండే తరగతులను అందిస్తాయి. ప్లేస్, శిక్షణ రకం, కోచ్, కోర్సు వ్యవధి ఆధారంగా ట్రెయినింగ్ ఫీజు ఉంటుంది.

వారసత్వంగా అగ్ని ఆరాధన

మణిపూర్‌లోని ఆండ్రో గ్రామం. ఈ యేడాది ఉత్తమ వారసత్వ పర్యాటక గ్రామంగా ఎంపికైంది.
అంతటి ప్రత్యేకత ఆ గ్రామానికి ఏముందో తప్పక తెలుసుకోవాల్సిందే!

మణిపూర్ పర్యాటక మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తమ పర్యాటక గ్రామాల పోటీని నిర్వహించింది. దీనిలో ఆండ్రో విలేజీకు వారసత్వ విభాగంలో అత్యుత్తమ పర్యాటక గ్రామంగా ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం 2024 వేడుకల సందర్భంగా న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లోని ప్లీనరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మణిపూర్ టూరిజం అధికారులు ఆండ్రో విలేజ్ ప్రతినిధులకు మంత్రిత్వ శాఖ ఈ అవార్డును అందజేసింది.



* ఉత్తమ గ్రామం



ఆండ్రో గ్రామం ప్రత్యేక సాంస్కృతిక వారసత్వం, సాంప్రదాయ పద్ధతులు ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపిక కావడానికి ప్రధాన కారకంగా నిలిచాయి.

ఎన్నో వారసత్వ ప్రత్యేకతలు : ఆండ్రో గ్రామంలో గొప్ప సాంస్కృతిక, చారిత్రక వారసత్వానికి నిదర్శనంగా స్థానిక జానపద కథలను కళ్లకు కట్టే ఒక ఆలయం ఉంది. ఈ ఆలయంలో శతాబ్దాల నాటి నుంచి వారసత్వంగా అగ్ని ఆరాధనను కొనసాగిస్తూ వస్తున్నారు. వేల ఏళ్లుగా అఖండదీపం ఆరకుండా వెలుగుతూనే ఉండటం ఈ గ్రామం ప్రత్యేకత. ఇది ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుండి పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడ ప్రకృతి అందాలతో పాటు మటువా బహదూర్ మ్యూజియం, వివిధ గిరిజన తెగలకు సంబంధించిన కుటీరాలు, కుండల తయారీ.. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పర్యాటకుల ద్వారా స్థానిక ప్రజలకు ఆదాయం, ఉపాధి కల్పనకు దోహదం చేస్తుంది.

ఆండ్రో గ్రామస్తులు తమ వారసత్వాన్ని కొనసాగించడంలోనూ, నిలబెట్టుకోవడంలో స్థానికులను నిమగ్నం చేయడానికి అనేక వ్యూహాలను అనుసరిస్తున్నారు. అదే సమయంలో వారిని పర్యాటక కార్యకలాపాలలో కూడా భాగస్వాములను చేస్తున్నారు. ఈ విశేషాలతోనే ఈ గ్రామం ఉత్తమ వారసత్వ పర్యాటక గ్రామంగా మొదటి ప్లేస్‌లో నిలిచింది.



పురోగతిపై ఆలోచించకుండా ఉండలేని యోచనను అమల్లో పెట్టడమే మంచిది..

- జోష్ జేమ్స్, ఓమ్నిచర్ సీఈఓ, సహ వ్యవస్థాపకులు

బిజినెస్ రీల్


మార్కెట్లోకి రోల్స్ రాయిస్ కలినాన్ సిరీస్ టూ..

- ధర రూ. 10.5 కోట్ల నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్ రాయిస్ మోటర్ కార్స్ తాజాగా కలినాన్ సిరీస్ టూ ఎస్‌యూవీని భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 10.5 కోట్ల నుంచి ప్రారంభమవుతుంది. బ్లాక్ బ్యాడ్జ్ కలినాన్ సిరీస్ టూ రేటు రూ. 12.25 కోట్ల నుంచి ఉంటుంది. డెలివరీలు ఈ ఏడాది నాలుగో త్రైమాసికంలో ప్రారంభమవుతాయని సంస్థ రీజనల్ డైరెక్టర్ (ఆసియా పసిఫిక్) ఐరీన్ తెలిపారు. ఇందులో కొత్త టెక్నాలజీలు, కొత్త మెటీరియల్స్ ఉంటాయని, అప్‌డేటెడ్ డిజైన్‌తో దీన్ని రూపొందించామని వివరించారు. క్లయింట్ స్పెసిఫికేషన్‌ను బట్టి ధర ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఏడాది మేలో అంతర్జాతీయంగా దీన్ని ప్రవేశపెట్టారు.

ఐఫోన్16పై ఐసీఐసీఐ బ్యాంక్ ప్రత్యేక ఆఫర్లు



ముంబై: టెక్ దిగ్గజం యాపిల్ ఐఫోన్ 16పై ఐసీఐసీఐ బ్యాంక్ ప్రత్యేక ఆఫర్లు అందిస్తోంది. బ్యాంకు క్రెడిట్, డెబిట్ కార్డులతో ఈ ఫోన్లను కొనుగోలు చేసే కస్టమర్లకు రూ. 5,000 వరకు క్యాష్‌బ్యాక్ అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే ఆయా కార్డులపై 'ఐఫోన్ ఫర్ లైఫ్ ప్రోగ్రాం' కింద అత్యంత తక్కువగా నెలకు రూ. 2,497 ఈఎంఐ చొప్పున 24 నెలల వ్యవధికి కొనుగోలు చేయొచ్చు. కొత్త ఐఫోన్‌కి అప్‌గ్రేడ్ అయ్యే వారికి ప్రస్తుత ఫోన్‌పై గ్యారంటీడ్ బైబ్యాక్ ఆప్షన్ ఉంటుంది. ఇతరత్రా యాపిల్ వాచ్‌పై రూ. 2,500, ఎయిర్‌పాడ్స్‌పై రూ. 1,500 క్యాష్‌బ్యాక్ పొందవచ్చు.

అక్టోబర్‌లో ఏఐ ఎక్స్‌ప్రెస్ - ఏఐఎక్స్ విలీనం



న్యూఢిల్లీ: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం అక్టోబర్ తొలి వారంలో అమల్లోకి రానుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయని సంస్థ అధికారి ఒకరు తెలిపారు. గతంలో ఎయిరేషియా ఇండియాగా కార్యకలాపాలు నిర్వహించిన ఏఐఎక్స్ కనెక్ట్ పేరిట ఉన్న ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు బదలాయిస్తారని చెప్పారు. దీంతో ఏఐఎక్స్ కనెక్ట్, అలాగే ఎయిర్‌లైన్ గుర్తింపు కోడ్ 'ఐ5' కనుమరుగు కానున్నాయి. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ నిత్యం 400 ఫ్లయిట్స్ నిర్వహిస్తున్నాయి. ఇరు సంస్థలకు 88 విమానాలున్నాయి. చట్టబద్ధంగా విలీనం అమల్లోకి రావడంతో ఏఐఎక్స్ కనెక్ట్‌కి చెందిన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కి చెందిన డెజిగ్నేటర్ కోడ్ 'ఐఎక్స్' కిందికి వస్తాయి. మరోవైపు, టాటా గ్రూప్‌లోనే భాగమైన మరో విమానయాన సంస్థ విస్తారాను ఎయిరిండియాలో విలీనం నవంబర్‌లో ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

గ్లోబల్ ట్రెండ్, గణాంకాలపై కన్ను

ఈ వారం ట్రేడింగ్ 4 రోజులే • ఫెడ్ ఛైర్మన్ ప్రసంగానికి ప్రాధాన్యం

భౌగోళిక అనిశ్చితుల ప్రభావం • దేశీ స్టాక్ మార్కెట్ల తీరుపై విశ్లేషకుల అంచనాలు



ముంబై: ప్రపంచ పరిణామాలు, ఆర్థిక గణాంకాలు తదితర అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం(అక్టోబర్ 2న) మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు, ఆటోరంగ అమ్మకాలు సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు మార్కెట్ నిపుణులు తెలియజేశారు. ఇవికాకుండా అంతర్జాతీయంగా రాజకీయ, భౌగోళిక అనిశ్చితులకు ఇన్వెస్టర్లు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా పేర్కొన్నారు. త్రైమాసికవారీగా కంపెనీలు వెల్లడించే తాజా వార్తలు వివిధ కౌంటర్లలో యాక్టివిటీకి కారణంకానున్నట్లు తెలియజేశారు. బ్లూచిప్ కంపెనీలలో నెలకొన్న సానుకూల పరిస్థితులు మార్కెట్లను మరింత ముందుకు నడిపించనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ్ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.

దేశీ గణాంకాలు

ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబించే తయారీ, సర్వీసుల రంగాలకు చెందిన హెచ్‌ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ ఇండెక్స్ గణాంకాలు వెలువడనున్నాయి. వీటితోపాటు విదేశీ ఇన్వెస్టర్ల తీరును ఇన్వెస్టర్లు నిశితంగా పరిశీలిస్తారని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా వివరించారు. అయితే దేశీయంగా ప్రభావిత అంశాలు కొరవడిన నేపథ్యంలో ప్రపంచ పరిణామాలే మార్కెట్లకు కీలకం కానున్నట్లు మిశ్రా పేర్కొన్నారు. కాగా.. ఇకపై రెండో త్రైమాసిక(జులై-సెప్టెంబర్) కార్పొరేట్ ఫలితాలవైపు ఇన్వెస్టర్లు దృష్టిపెట్టనున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ తెలియజేశారు. ఇన్వెస్టర్లలో కంపెనీల లాభార్జన మెరుగుపడనున్న అంచనాలున్నట్లు తెలియజేశారు.

విదేశీ అంశాలు

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ 0.5 శాతం వడ్డీ రేటు తగ్గింపు కారణంగా గత వారం మార్కెట్లు బలపడ్డాయి. ఆర్థిక గణాంకాలలో స్థిరత్వం, విదేశీ పెట్టుబడులు దేశీయంగా స్టాక్ మార్కెట్లకు జోష్‌నిస్తున్నట్లు నాయిర్ వివరించారు. చైనా ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటన సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిచ్చినట్లు పేర్కొన్నారు. ఇది ఆసియా మార్కెట్లలో మరిన్ని పెట్టుబడులకు దారి చూపవచ్చని అంచనా వేశారు. కమోడిటీల ధరలు, యూఎస్ డాలర్ ఇండెక్స్, కీలక గణాంకాలు మార్కెట్లలో ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2020 మార్చి తదుపరి యూఎస్ ఫెడ్ తొలిసారి వడ్డీ రేటును తగ్గించింది. దీంతో ఫండ్స్ రేట్లు 4.75-5 శాతానికి చేరాయి. సోమవారం (30న) ఫెడ్ చీఫ్ జెరోమీ పావెల్ ప్రసంగించనున్నారు.

పెట్టుబడులు @ 9 నెలల గరిష్టం

- సెప్టెంబర్‌లో ఎఫ్‌పీఐల స్పీడ్

ఇటీవల దేశీ ఈక్విటీలలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ నెలలో ఇప్పటి(27)వరకూ నికరంగా రూ. 57,359 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. ఇది గత 9 నెలల్లో అత్యధికంకాగా.. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఇందుకు ప్రధాన కారణమైంది. దీంతో 2024లో దేశీ స్టాక్స్‌లో ఎఫ్‌పీఐల పెట్టుబడులు రూ. లక్ష కోట్ల మార్క్‌ను అధిగమించాయి. ఇంతక్రితం 2023 డిసెంబర్‌లో ఎఫ్‌పీఐలు రూ. 66,135 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఈ జూన్ నుంచి చూస్తే ఎఫ్‌పీఐలు నెలవారీగా నికర పెట్టుబడిదారులుగా నిలుస్తున్నారు.

గత వారం రికార్డ్స్

గత వారం బీఎస్‌ఈ సెన్సెక్స్ నికరంగా 1,028 పాయింట్లు ఎగసింది. 85,572 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో గరిష్టంగా 85,978కు చేరింది. నిఫ్టీ 388 పాయింట్లు జమ చేసుకుని 26,179 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో గరిష్టంగా 26,277ను తాకింది. వెరసి సెన్సెక్స్, నిఫ్టీ ఇంట్రాడేలో సరికొత్త గరిష్ట రికార్డులను సాధించాయి. మార్కెట్ విలువరీత్యా బీఎస్‌ఈలో టాప్-10 కంపెనీలలో 8 కౌంటర్లు లాభపడ్డాయి. దీంతో టాప్-10 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) ఉమ్మడిగా రూ.1.21 లక్షల కోట్లకుపైగా బలపడింది. వీటిలో ప్రధానంగా ఆర్‌ఐఎల్ మార్కెట్ విలువ రూ.53,653 కోట్లు పెరిగి రూ. 20,65,198 కోట్లయ్యింది. ఎస్‌బీఐ విలువ రూ.18,519 కోట్లు పుంజుకుని రూ. 7,16,334 కోట్లను తాకింది. ఎయిర్‌టెల్ విలువ రూ. 13,095 కోట్లు బలపడి రూ.9,87,905 కోట్లకు, ఐటీసీ విలువకు రూ.9,927 కోట్లు జమయ్యి రూ. 6,53,835 కోట్లకు చేరింది. ఈ బాటలో టీసీఎస్ విలువ రూ. 8,593 కోట్ల వృద్ధితో రూ. 15,59,052 కోట్లుగా నమోదైంది.

ఎఫ్‌డీఐలపై మరింత పర్యవేక్షణ

పరిశీలనలో నియంత్రణ యంత్రాంగం ఏర్పాటు



న్యూఢిల్లీ: విదేశీ పెట్టుబడులకు సంబంధించి నియంత్రణ యంత్రాంగం ఏర్పాటు ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. విదేశీ పెట్టుబడులు వచ్చిన తర్వాత వాటి వినియోగం సమీక్ష, పర్యవేక్షణ ఇందులో భాగంగా ఉండనుంది. ఈ వివరాలను విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఇది చర్చల దశలో ఉన్నట్టు తెలిపాయి. "తమ దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై (ఎఫ్‌డీఐ) దాదాపు అన్ని దేశాల్లోనూ పర్యవేక్షణ ఉంది. భారత్‌లోనూ ఇది ఉండాలన్న సూచనలు వచ్చాయి" అని ఆ వర్గాలు వెల్లడించాయి. దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడులు మన ఆర్థిక వ్యవస్థకు చేదోడుగా ఉంటున్నాయా? అవి చట్టబద్ధమైన మార్గాల ద్వారానే వస్తున్నాయా? అన్నది పర్యవేక్షించేందుకు ఈ యంత్రాంగం ఏర్పాటు వీలు కల్పిస్తుందని తెలిపాయి. 140 కోట్ల జనాభాతో కూడిన భారత్, స్థిరమైన విధానాలు, యువతరం, నైపుణ్య మానవ వనరుల లభ్యత ఇవన్నీ కలసి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా ఉండడం గమనార్హం. నిబంధనల అమలు భారాన్ని తగ్గించడం, విధానాలను సరళీకరించడం, వ్యాపార సులభతర నిర్వహణకు వీలుగా పలు చర్యలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం తీసుకోవడం తెలిసిందే. అంతరిక్షం, ఈ-కామర్స్, ఫార్మా, పౌర విమానయానం, కాంట్రాక్ట్ తయారీ, డిజిటల్ మీడియా, కోల్ మైనింగ్, రక్షణ తదితర రంగాల్లో ఎఫ్‌డీఐలకు సంబంధించి నిబంధనలను సైతం సడలించింది.

బీమాపై ఈ అపోహలొద్దు..

ఆర్థిక భద్రతను సాధించడానికి, అనూహ్య రిస్కుల నుంచి రక్షణ పొందడానికి బీమా అనేది చాలా కీలకం. అయినప్పటికీ బోలెడన్ని అపోహల కారణంగా బీమా తీసుకోవడం గురించి చాలా మంది పెద్దగా పట్టించుకోరు. ఇక కొందరు తాము బీమా పాలసీనే తీసుకుంటున్నామనే ఉద్దేశంతో యులిప్స్ లేదా ఎండోమెంట్ ప్లాన్లను తీసుకుంటూ ఉంటారు. నిజానికి ఇవి పెట్టుబడి సాధనాలు. మరికొందరు తమ అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, అయితే అవసరానికి మించినంత కవరేజీ లేకపోతే దేనికీ సరిపోనంత తక్కువ కవరేజీని కూడా తీసుకుంటూ ఉంటారు. బీమా అవసరాలు ఒక్కొక్కరికీ ఒక్కో రకంగా ఉంటాయి. ఒకరికి అనువైనది మరొకరికి అనువుగా ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలోనే కొన్ని అపోహలను తొలగించి బీమా కొనుగోలుపై తగిన నిర్ణయం తీసుకోవడంలో సహాయకరంగా ఉండటమే ఈ కథనం ఉద్దేశం.



కవిత సుబ్రమణియన్

కో-ఫౌండర్, అప్‌స్టాక్స్



అపోహ 1: జీవితాంతం జీవిత బీమా అవసరం

జీవిత బీమా అంటే మనకు 85 ఏళ్లు వచ్చినా కూడా అవసరమవుతుందనేది సాధారణంగా ఉన్న అపోహ. అయితే, ఈ అభిప్రాయం సరైనది కాదు. వాస్తవానికి, పాలసీదారు అకస్మాత్తుగా మరణించిన పక్షంలో వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు ఆర్థికంగా మద్దతునివ్వడమనేదే జీవిత బీమా ప్రధానోద్దేశం. మీ పిల్లలు లేదా మీపై ఆధారపడిన వారు నిలదొక్కుకున్న తర్వాత భారీ కవరేజీ పాలసీ అవసరం తగ్గుతుంది. కాబట్టి మీ ప్రస్తుత జీవిత దశకు తగినంత కవరేజీ ఉండేలా చూసుకునేందుకు మధ్యమధ్యలో మీ కుటుంబ ఆర్థిక అవసరాలను సమీక్షించుకుంటూ ఉండాలి.

అపోహ 2: పొగతాగే వారు అధిక ప్రీమియం చెల్లించాలి

స్మోకింగ్ వల్ల ప్రీమియం భారం పెరగడమనేది వాస్తవమే అయినప్పటికీ ఇందులోనూ ఒక చిన్న వెసులుబాటు ఉంది. స్మోకింగ్ మానేసి ఒక ఏడాది పాటు అలాగే ఉండగలిగితే, నాన్-స్మోకర్స్ స్థాయిలో ప్రీమియంలకు అర్హత పొందే అవకాశం ఉంటుంది. ఆరోగ్యకరమైన జీవన విధానాలను పాటించే వారికి బీమా సంస్థలు తగు ప్రోత్సాహకాలిస్తాయి.

అపోహ 3: ఆరోగ్య సమస్యలు లేదా స్మోకింగ్‌ను దాచి పెడితే ప్రీమియం భారాన్ని తగ్గించుకోవచ్చు

ఆరోగ్య సమస్యలు లేదా స్మోకింగ్ అలవాట్ల వివరాలను దాచిపెట్టడం ద్వారా ప్రీమియంలను తగ్గించుకోవచ్చని కొందరు భావిస్తుంటారు. అయితే, ఇది చాలా ప్రమాదకరమైన అపోహ. ప్రతీ బీమా పాలసీకి నిర్దిష్ట వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. ఆ తర్వాతే నిర్దిష్ట ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. ప్రీమియంలను తగ్గించుకోవడానికి ఆరోగ్య సమస్యను దాచిపెట్టి, ఆ తర్వాత అది తీవ్రమైతే, ఇన్సూరెన్స్ పాలసీ నుంచి ప్రయోజనం పొందలేరు. అవసరమైనప్పుడు పూర్తి కవరేజీ లభించేలా చూసుకునేందుకు పాలసీ తీసుకునేటప్పుడే పూర్తి వివరాలను వెల్లడించడం శ్రేయస్కరం.

అపోహ 4: ఆరోగ్యంగా, యవ్వనంలోనే ఉన్నాం కాబట్టి, ముందుగా బీమా తీసుకోవాల్సిన అవసరం ఉండదు

ఇది కూడా చాలా రిస్కుతో కూడుకున్న అపోహ. జీవితం అనూహ్యమైనది. కాబట్టి అన్నివేళలా ఆర్థిక భద్రత ఉండేలా చూసుకోవడమనేది శ్రేయస్కరం. బీమా అనేది ఆరోగ్యంగా ఉన్న యువతకు కూడా రక్షణ కవచంగా ఉపయోగపడుతుంది. ఆర్థికంగా అనూహ్యమైన ఎదురుదెబ్బలు తలెత్తినప్పుడు మద్దతుగా నిలుస్తుంది. అంతేగాకుండా చిన్న వయస్సులోనే బీమా పాలసీ తీసుకోవడం వల్ల కట్టాల్సిన ప్రీమియం తగ్గుతుంది. సుదీర్ఘకాలం పాటు రక్షణ లభిస్తుంది. వీలైనంత త్వరగా బీమాను తీసుకోవడం వల్ల జీవితంలో వివిధ దశల్లో కవరేజీ కొనసాగుతూనే ఉంటుంది.

అపోహ 5: బీమా పాలసీ కొంటే పర్సుకు చిల్లు పడుతుంది

చాలా మంది బీమా అనేది అనవసర ఖర్చు అనుకుంటూ ఉంటారు. అయితే, బీమా అనేది విలాసవంతమైన సాధనం కాదు. అవసరం. మీరు ఎంత ముందుగా కొనుక్కుంటే, ఖరీదు అంత తగ్గుతుంది. జీవిత బీమా పేరిట సాధారణంగా తప్పుగా విక్రయించే యులిప్‌లు లేదా ఎండోమెంట్ ప్లాన్ల వంటి సంక్లిష్టమైన ప్రోడక్టుల జోలికి వెళ్లకండి. దానికి బదులుగా సరళమైన టర్మ్ లైఫ్ ప్లాన్ తీసుకుంటే తక్కువ ఖర్చులతో మెరుగైన కవరేజీ పొందవచ్చు. ప్రీమియంలపై భారీగా వెచ్చించనక్కర్లేదు.

అపోహ 6: ఎంప్లాయర్ ఇచ్చే బీమా కవరేజీ సరిపోతుంది.

మనం పని చేసే సంస్థ (ఎంప్లాయర్) ఇచ్చే బీమా పథకంపైనే పూర్తిగా ఆధారపడితే సరిపోకపోవచ్చు. సాధారణంగా ఎంప్లాయర్ ఇచ్చే ఇన్సూరెన్స్ అనేది ప్రామాణిక కవరేజీకి మాత్రమే పరిమితమై ఉంటుంది. మన అవసరాలన్నింటికీ కవరేజీ ఉండకపోవచ్చు. అదనంగా వ్యక్తిగత బీమా తీసుకుంటే ఉద్యోగం మారినా లేక ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం నుంచి తప్పుకున్నా కూడా సమగ్రమైన కవరేజీ, ఆర్థిక భద్రత ఉంటుంది. వ్యక్తిగత పాలసీలు మన ఆర్థిక పరిస్థితి, భవిష్యత్ అవసరాలకు తగిన కవరేజీనిచ్చేలా విధంగా ఉంటాయి.

అపోహ 7: జీవిత బీమా అనేది ఓ పెట్టుబడి సాధనం

అందరూ భావించే దానికి భిన్నంగా, జీవిత బీమా అనేది పెట్టుబడి సాధనం కాదు. ఇది పాలసీదారు మరణించిన పక్షంలో కుటుంబం మరియు పాలసీదారుపై ఆధారపడిన వారు ఆర్థికంగా ఇక్కట్లు పడకుండా రక్షణ కవచంలాగా ఉపయోగపడేందుకు ఉద్దేశించిన సాధనం. మన కుటుంబం ఆర్థికంగా భద్రంగా ఉందనే నమ్మకాన్ని, నిశ్చింతను కలిగించడమే జీవిత బీమా ప్రాథమిక ఉద్దేశం. అంతే తప్ప పెట్టుబడులపై రాబడులను అందించడం కాదు.

బీమా గురించి సాధారణంగా నెలకొన్న అపోహల్లో ఇవి కొన్నే. ఇవే కాకుండా బీమాను కొనుగోలు చేయకుండా అడ్డుపడే అపోహలు మార్కెట్లో మరెన్నో కూడా ఉన్నాయి. బీమా అనేది జీవితాన్ని సులభతరం చేసుకునేందుకు, ఆర్థిక భద్రత పొందేందుకు, భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకునేందుకు ఉద్దేశించినదని గుర్తుంచుకోవాలి.

బలమైన రాబడుల చరిత్ర

స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్ విభాగంలో రిస్క్ ఎక్కువ. కానీ, దీర్ఘకాలం పాటు (పదేళ్లు అంతకుమించి) సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకుంటే బలమైన రాబడులు సొంతం చేసుకోవచ్చు. దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేస్తుంటారు కనుక మధ్యలో మార్కెట్ల పతనంతో కలత చెందాల్సిన పని ఉండదు. అప్పుడు మీ పెట్టుబడితో ఎక్కువ యూనిట్లు సమకూరుతాయి. కేవలం దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారికే ఇవి అనుకూలం. స్వల్పకాలం కోసం ఇవి అనుకూలం కాదు. వీటిల్లో అస్థిరతలు, రిస్క్ ఎక్కువ. కనుక రాబడుల కోసం రిస్క్ తీసుకునే ధోరణి ఉన్న వారు తమ పోర్ట్‌ఫోలియోలో వీటిని చేర్చుకోవచ్చు. స్మాల్‌క్యాప్ విభాగంలో దీర్ఘకాలంలో నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ పథకానికి మంచి ట్రాక్ రికార్డు ఉంది.

నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్





రాబడులు

నిప్పన్ ఇండియా స్మాల్‌క్యాప్ డైరెక్ట్ ప్లాన్‌లో గడిచిన ఏడాది కాలంలో రాబడి 50 శాతంగా ఉంది. అంటే పెట్టుబడిని ఏడాదిలోనే 50 శాతం వృద్ధి చేసింది. మూడేళ్ల కాలంలోనూ ఏటా 32 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. ఇక ఐదేళ్లలో చూసుకుంటే ఏటా 38 శాతం, ఏడేళ్లలో 26 శాతం, పదేళ్లలో 25 శాతం చొప్పున వార్షిక రాబడులను ఇన్వెస్టర్లకు తెచ్చి పెట్టింది. ఈ పథకంలో డైరెక్ట్ ప్లాన్ 2013 జనవరిలో ప్రారంభమైంది. రెగ్యులర్ ప్లాన్ అయితే 2010లోనే మొదలైంది. రెగ్యులర్ ప్లాన్‌లోనూ ఆరంభం నుంచి ఇప్పటి వరకు ఏటా 23 శాతం మేర రాబడి వచ్చింది. ఈ పథకంలో సిప్ ద్వారా ప్రతీ నెలా రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అంతేకాదు, ఇన్వెస్ట్ చేసిన తర్వాత కనీసం రూ.100 నుంచి (ఎస్‌డబ్ల్యూపీ) వెనక్కి తీసుకోవచ్చు.

పెట్టుబడుల విధానం..

స్మాల్ క్యాప్ పథకం కనుక పెట్టుబడుల్లో ఎక్కువ భాగాన్ని చిన్న కంపెనీలకే కేటాయిస్తుంది. కానీ, పోర్ట్‌ఫోలియో చూస్తే అలా అనిపించదు. మొత్తం పెట్టుబడుల్లో 32 శాతమే స్మాల్‌క్యాప్‌లో కనిపిస్తాయి. రిస్క్‌ను తగ్గించడం కోసం ఫండ్ మేనేజర్లు ఈ విధానం అనుసరిస్తున్నారు. పైగా ఈ పథకం ఎంపిక చేసుకునే స్టాక్స్ అన్నీ దాదాపుగా భవిష్యత్తులో మిడ్, లార్జ్‌క్యాప్‌గా అవతరించే సామర్థ్యాలున్నవే. ఈ పథకం పెట్టుబడుల చరిత్రను గమనిస్తే ఇలాంటివి పదుల సంఖ్యలో కనిపిస్తాయి. భవిష్యత్తులో మల్టీబ్యాగర్ కాగల కంపెనీలను గుర్తించడంలో ఈ పథకానికి మంచి ట్రాక్ రికార్డు ఉంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1.78
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్	1.65
ఎంసీఎక్స్	1.57
వోల్టాంప్ ట్రాన్స్‌ఫార్మర్స్	1.50
అపార్ ఇండస్ట్రీస్	1.43
కిర్లోస్కర్ బ్రదర్స్	1.32
బీహెచ్‌ఈఎల్	1.31
తేజాస్ నెట్‌వర్క్స్	1.25
ఎన్‌ఎల్‌సీ ఇండియా	1.23
ఎస్‌బీఐ	1.22

పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.61,000 కోట్లున్నాయి. ఇందులో 95.99 శాతం మేర ఈక్విటీలకు కేటాయించింది. మార్కెట్ల కరెక్షన్‌లో పెట్టుబడుల కోసం 4 శాతం నగదు నిల్వలు కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లో లార్జ్‌క్యాప్ కంపెనీల్లో 17 శాతం మిడ్‌క్యాప్ కంపెనీల్లో 50.57 శాతం చొప్పున కేటాయింపులు ఉన్నాయి. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 32.56 శాతం ఇన్వెస్ట్ చేసింది. ఇండస్ట్రియల్స్ కంపెనీలకు అత్యధికంగా 25 శాతం కేటాయించింది. ఆ తర్వాత బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 15 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 14.47 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 13.74 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.

వివాద్ సే విశ్వాస్ పథకం 2024



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి

కె.వి.ఎన్ లావణ్య

ట్యాక్సేషన్ నిపుణులు

గతంలో ఇటువంటి స్కీములు వచ్చాయి. ప్రత్యక్ష పన్ను మదింపులో హెచ్చుతగ్గులు సహజం. మనం లెక్కించిన దానికన్నా పన్ను భారం పెరిగితే మనం అప్పీలుకు వెళ్లవచ్చు. అలాగే డిపార్టుమెంటు వారు కూడ అప్పీలుకు వెళ్లవచ్చు. అప్పీలుకు వెళ్లడం అంటే వివాదమే. ఈ వివాదాలు ఒక కొలిక్కి వచ్చేసరికి సమయం ఎంత వృథా అవుతుంది. కాలయాపనతో పాటు మనశ్శాంతి లేకపోవటం, అశాంతి, అనారోగ్యం మొదలైనవి ఏర్పడతాయి. అటువంటి వివాదాల జోలికి పోకుండా పన్ను భారాన్ని వీలున్నంత వరకు తగ్గించి కట్టేలా చేసే స్కీమ్ ఇది. ఇది 2024 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తుంది. వివాదాలు పోయి ఒకరి విశ్వాసాన్ని మరొకరు పొందడమే దీని పరమావధి. ఈ స్కీమ్‌ని నోటిఫై చేశారు.

ముఖ్యాంశాలు

1. 2024 జూలై వరకు ఏర్పడ్డ వివాదాలకు ఇందులో అవకాశం కల్పించారు.
2. సుప్రీం కోర్టు ముందు, హైకోర్టులు ముందు, ట్రిబ్యునల్స్ ముందు పెండింగ్‌లో ఉన్న వివాదాల విషయంలో మీరు డిక్లేర్ చేయొచ్చు.
3. సెర్చ్‌లో, సీజర్‌లో, ప్రాసిక్యూషన్‌లో ఉన్నవి, విదేశాల్లో ఉన్న ఆస్తులు, ఆదాయం తెలియచేయని వారికి ఇతర చట్టాల ప్రకారం ఏర్పడ్డ ప్రొసీడింగ్స్‌కి ఈ స్కీమ్ వర్తించదు.
4. 2020లో అమల్లోకి వచ్చిన స్కీములోలాగే ఉదాహరణల వర్తింపు, విధివిధానాలు, సెటిల్మెంట్ పద్ధతి మొదలైనవి ఉన్నాయి.
5. పన్ను, వడ్డీ, పెనాల్టీ, రుసుము మొదలైన విషయాల్లో వివాదం.. అంటే తేడా ఉంటే, ఈ స్కీమ్‌లో ప్రయోజనం పొందవచ్చు.
6. అప్పీలు ఏ స్థాయిలో ఉన్నా ఈ స్కీమ్‌లోకి రావచ్చు.
7. కమిషనర్ ముందు రివిజన్‌కి వెళ్లినప్పుడు, ఆ విషయం పెండింగ్‌లో ఉంటే ఇందులో ప్రయోజనం పొందవచ్చు.
8. సకాలంలో డిక్లరేషన్స్ ఇచ్చి ఈ స్కీమ్‌లో చేరితే పన్నుల భారం తగ్గుతుంది. వివాదం సమసిపోతుంది. డిపార్ట్‌మెంట్ దృష్టిలో ఒక రకమైన సుహృద్భావ వాతావరణం ఏర్పడుతుంది.

ఇందులో నాలుగు ఫారాలు ఉన్నాయి. మొదటి ఫారం ఒక డిక్లరేషన్. ప్రతి వివాదానికొక ఫారం ప్రత్యేకంగా దాఖలు చేయాలి. రెండో ఫారం, అంటే నిర్ధారిత అధికారి జారీ చేసే ధృవపత్రానికి సంబంధించినది. మూడో ఫారంలో పన్ను చెల్లింపు వివరాలుంటాయి. నాలుగో ఫారంలో స్కీము ఉత్తర్వులు ఉంటాయి. ముందుగా ఫారం 1 ఆన్‌లైన్‌లో దాఖలు చేయాలి. దీనితో పాటు ఫారం 3 కూడా వేయాలి. అయితే, ఫారం 3 అప్పీల్ విత్‌డ్రా చేసినట్లు వివరాలు ఇవ్వాలి. మనం విత్‌డ్రా చేసినట్లయితేనే ఈ స్కీమ్‌కి అర్హత సంపాదిస్తాము. విత్‌డ్రా చేసే నాటికి అప్పీలు ఆర్డర్లు పూర్తయినట్లుగా ఉండకూడదు. అంటే, ఇప్పటికి ఆర్డర్లు అయినట్లు ఉండేవారు ఈ స్కీమ్‌లో చేరకూడదు. ముందు ముందు ఎటువంటి ప్రాసిక్యూషన్స్ ఉండవు. ఇలాంటి స్కీమ్‌ల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. ఖర్చులు తగ్గుతాయి. సమయం తగ్గుతుంది. అనిశ్చిత పరిస్థితి ఉండదు. అప్పీలు తీరేవరకు టెన్షన్ మొదలైనవి ఉండవు. సంవత్సరాల తరబడి పేరుకుపోయిన పెండింగ్ వివాదాలు మాయం అవుతాయి. మీ దగ్గర ఏవైనా పెండింగ్‌లో ఉంటే ఈ స్కీమ్‌లో చేరడం మంచిది.

ఆసీస్‌దే సిరీస్

చివరి వన్డేలో ఇంగ్లండ్‌పై ఘన విజయం

- ట్రావిస్ హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు



బ్రిస్టల్: టాపార్డర్ రాణించడంతో ఆస్ట్రేలియా జట్టు ఇంగ్లండ్‌పై వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన చివరి వన్డేలో ఆస్ట్రేలియా డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 49 పరుగుల తేడాతో గెలిచి 3–2తో సిరీస్ కైవసం చేసుకుంది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 49.2 ఓవర్లలో 309 పరుగులకు ఆలౌటైంది. బెన్ డకెట్ (91 బంతుల్లో 107; 13 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ హ్యారీ బ్రూక్ (52 బంతుల్లో 72; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. ఫిల్ సాల్ట్ (27 బంతుల్లో 45; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) కూడా వేగంగా ఆడాడు. విల్ జాక్స్ (0), జెమీ స్మిత్ (6), లియామ్ లివింగ్‌స్టోన్ (0), జాకబ్ బెథెల్ (13) విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 4, మ్యాక్స్‌వెల్, ఆడమ్ జంపా, ఆరోన్ హార్డీ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 20.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. ఈ దశలో మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించగా.. ఆ తర్వాత ఆట సాధ్యపడలేదు. దీంతో ఆసీస్ లక్ష్యాన్ని 117 పరుగులుగా నిర్ణయించారు. అప్పటికే ఆస్ట్రేలియా 49 పరుగుల ముందు ఉండటంతో కంగారూలకు సిరీస్ దక్కింది. మాథ్యూ షార్ట్ (30 బంతుల్లో 58; 7 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... ట్రావిస్ హెడ్ (31; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), స్టీవ్ స్మిత్ (36 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్సర్), జోష్ ఇంగ్లిస్ (28 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. ట్రావిస్ హెడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.



శ్రీలంక క్లీన్‌స్వీప్

- 2–0తో సిరీస్ కైవసం
- ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో న్యూజిలాండ్ చిత్తు
- కమిందు మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'
- ప్రభాత్ జయసూర్యకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'

గాలే: సొంతగడ్డపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన శ్రీలంక జట్టు... న్యూజిలాండ్‌పై టెస్టు సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. రెండో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో విజయం సాధించిన శ్రీలంక 2–0తో సిరీస్ కైవసం చేసుకుంది. గత పదిహేనేళ్లలో న్యూజిలాండ్‌పై శ్రీలంకకు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం కావడం విశేషం. ఓవర్‌నైట్ స్కోరు 199/5తో ఆదివారం నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ చివరకు 360 పరుగులకు ఆలౌటైంది. టామ్ బ్లండెల్ (64 బంతుల్లో 60; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (99 బంతుల్లో 78; 6 ఫోర్లు, 3 సిక్సర్లు), మిషెల్ సాన్‌ట్నర్ (115 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధ శతకాలు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఘోరంగా విఫలమైన కివీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లో కాస్త పోరాడారు. లంక బౌలర్లలో అరంగేట్ర మ్యాచ్ ఆడిన నిషాన్ 6 వికెట్లతో అదరగొట్టగా... ప్రభాత్ జయసూర్య మూడు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు శ్రీలంక 602/5 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 88 పరుగులకే ఆలౌటైంది. అనంతరం ఫాలోఆన్‌లో కాస్త పోరాడినా... న్యూజిలాండ్ గట్టెక్కలేకపోయింది. గాలే మైదానంలో శ్రీలంక చేతిలో న్యూజిలాండ్‌కు ఇది వరసగా ఆరో పరాజయం కావడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఆరో టెస్టు మ్యాచ్ గెలిచిన శ్రీలంక... ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లింది. 2023–25 డబ్ల్యూటీసీ సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన శ్రీలంక ఐదింట నెగ్గి నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి 55.56 విజయాల శాతంతో పట్టిక మూడో స్థానానికి చేరింది. వచ్చే ఏడాది జరగనున్న ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడమే లక్ష్యంగా లంక ముందుకు సాగుతున్నది. మరోవైపు ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లాడిన న్యూజిలాండ్ 3 విజయాలు, 5 పరాజయాలతో 37.50 విజయ శాతంతో పట్టికలో ఏడో స్థానానికి పడిపోయింది. తొలి ఇన్నింగ్స్‌లో రికార్డు సెంచరీతో చెలరేగిన శ్రీలంక మిడిలార్డర్ ప్లేయర్ కమిందు మెండిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', రెండు మ్యాచ్‌ల్లో కలిపి 18 వికెట్లు పడగొట్టిన లంక లెఫ్టార్మ్ స్పిన్నర్ ప్రభాత్ జయసూర్యకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

6 గాలేలో న్యూజిలాండ్‌తో జరిగిన ఆరు మ్యాచ్‌ల్లోనూ శ్రీలంక గెలిచింది. ఒకే వేదికపై, ఒకే ప్రత్యర్థిపై అత్యధిక విజయాలు సాధించిన జట్టుగా లంక రికార్డుల్లోకెక్కింది. పెర్త్ స్టేడియంలో పాకిస్తాన్‌తో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఆస్ట్రేలియా, సెంచూరియన్ పార్క్‌లో శ్రీలంకతో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన దక్షిణాఫ్రికా ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాయి.

9 టెస్టు క్రికెట్‌లో తొమ్మిది వేర్వేరు జట్లపై 600 ఫైచిలుకు పరుగులు చేసిన తొలి జట్టుగా శ్రీలంక నిలిచింది. ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్ మినహా మిగిలిన టెస్టు క్రికెట్ ఆడే అన్ని దేశాలపై శ్రీలంక ఈ ఫీట్ నమోదు చేసింది.

భారత యువ షూటర్ల పసిడి గురి

- పురుషుల, మహిళల జట్లకు స్వర్ణాలు
- ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు పతకాలతో మెరిశారు. పెరూ వేదికగా జరిగిన మెగాటోర్నీ పురుషుల, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగాల్లో భారత షూటర్లు రెండు పసిడి పతకాలు సాధించగా, వ్యక్తిగత విభాగంలో ఒక కాంస్యం లభించింది. బాలుర విభాగంలో ఉమేశ్ చౌదరి, ప్రద్యుమ్న సింగ్, ముకేశ్‌తో కూడిన భారత జట్టు ఆదివారం జరిగిన ఫైనల్లో 1726 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. రొమేనియా (1716 పాయింట్లు), ఇటలీ (1707 పాయింట్లు) వరసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నాయి. బాలికల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కనిష్క, డాగర్, లక్షిత, అంజలి చౌదరితో కూడిన భారత బృందం 1708 పాయింట్లతో బంగారు పతకం ఖాతాలో వేసుకుంది. అజర్ బైజాన్ జట్టు 1707 పాయింట్లతో రజతం గెలుచుకోగా.. ఉక్రెయిన్ షూటర్లు 1704 పాయింట్లతో కాంస్యం నెగ్గింది. బాలికల 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో కనక్ కాంస్య పతకం గెలుచుకుంది. మొత్తం 217.6 పాయింట్లతో ఆమె మూడో స్థానంలో నిలిచింది.

ఉమేశ్‌కు చుక్కెదురు

టీమ్ విభాగంలో స్వర్ణం గెలిచి జోరు మీదున్న భారత యువ షూటర్ ఉమేశ్ చౌదరి వ్యక్తిగత విభాగంలోనూ ఫైనల్‌కు అర్హత సాధించి భేష్ అనిపించుకున్నాడు. అయితే తుది పోటీలకు నిర్ణీత సమయం కంటే కాస్త ఆలస్యంగా వచ్చిన కారణంగా ఉమేశ్‌కు నిర్వాహకులు జరిమానా వేశారు. రెండు పాయింట్లు కోత విధించడంతో అతడు ఫైనల్లో పతకానికి దూరమై... ఆరో స్థానానికి పరిమితమయ్యాడు. నిర్ణీత సమయంలో నిర్దేశించి ప్రాంతానికి చేరుకోవడంలో విఫలం కావడంతో అంతర్జాతీయ షూటింగ్ సమాఖ్య నిబంధనావళి ప్రకారం ఈ జరిమానా విధించారు. అంతకుముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఉమేశ్ మూడో స్థానంలో, ప్రద్యుమ్న నాలుగో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.



గోల్ కొడుతున్న నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఆటగాడు అలాద్దీన్

కేరళ, నార్త్‌ఈస్ట్ మ్యాచ్ 'డ్రా'

ఇండియన్ సూపర్ లీగ్

గువాహటి: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో భాగంగా ఆదివారం కేరళ బ్లాస్టర్స్, నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. నార్త్ ఈస్ట్ యునైటెడ్ తరఫున అలాద్దీన్ అజారై (58వ నిమిషంలో) ఒక గోల్ సాధించగా... కేరళ బ్లాస్టర్స్ తరఫున నోహ్ సాదావు (67వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. ద్వితీయార్ధం ఆరంభంలో లభించిన ఫ్రీకిక్‌ను అలాద్దీన్ గోల్‌గా మలిచి నార్త్ ఈస్ట్ జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లగా... కాసేపటికే నోహ్ చక్కటి గోల్‌తో స్కోరు సమం చేశాడు. లీగ్‌లో భాగంగా ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడిన కేరళ బ్లాస్టర్స్ జట్టు ఒక విజయం, ఒక ఓటమి, ఒక 'డ్రా'తో 4 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానంలో నిలిచింది. అన్నే మ్యాచ్‌లు ఆడిన నార్త్ ఈస్ట్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ కూడా మూడు మ్యాచ్‌లు ఆడి ఒక విజయం, ఒక ఓటమి, ఒక 'డ్రా'తో నాలుగు పాయింట్లు సాధించి పట్టిక ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (9 పాయింట్లు) టాప్‌ప్లేస్‌లో ఉండగా... రెండు మ్యాచ్‌లు ఆడి రెండింట ఓడిన హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ పట్టిక అట్టడుగున ఉంది. మంగళవారం జరగనున్న మ్యాచ్‌లో చెన్నయిన్ ఫుట్‌బాల్ క్లబ్‌తో హైదరాబాద్ తలపడనుంది.

కోలుకుంటున్న ముషీర్ ఖాన్



న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ముంబై క్రికెటర్ ముషీర్ ఖాన్ వేగంగా కోలుకుంటున్నాడు. ఇరానీ కప్‌లో పాల్గొనేందుకు తండ్రి నౌషాద్ ఖాన్‌తో కలిసి కారులో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదానికి గురైన 19 ఏళ్ల ముషీర్ ఖాన్ మెడ భాగంలో గాయాలయ్యాయి. ఇది తనకు పునర్జన్మ వంటిదని ముషీర్ పేర్కొన్నాడు. 'నా ఆరోగ్యం మెరుగవ్వాలని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ప్రస్తుతం పరిస్థితి మెరుగ్గా ఉంది. ఇది కొత్త జీవితంలాగా భావిస్తున్నా. కష్టకాలంలో అండగా నిలిచిన ముంబై క్రికెట్ సంఘం (ఎమ్‌సీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ప్రత్యేక కృతజ్ఞతలు' అని ముషీర్ ఆదివారం పేర్కొన్నాడు. టీమిండియా ప్లేయర్ సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడైన ముషీర్ ఖాన్ దేశవాళీల్లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఇటీవల జరిగిన దులీప్ ట్రోఫీలో ముషీర్ భారీ సెంచరీతో మెరిశాడు. ఈ ప్రమాదం కారణంగా అతడు అక్టోబర్ 1 నుంచి రెస్ట్ ఆఫ్ ఇండియా, రంజీ చాంపియన్ ముంబై జట్ల మధ్య లక్నోలో ప్రారంభం కానున్న ఇరానీ కప్ మ్యాచ్‌తో పాటు... ఆ తర్వాత జరగనున్న ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలోని ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. గాయం నుంచి పూర్తి స్థాయిలో కోలుకొని ముషీర్ తిరిగి మైదానంలో అడుగు పెట్టేందుకు సుమారు మూడు నెలల సమయం పట్టే అవకాశాలున్నాయి.

వుషూలో ఏడు పతకాలు

జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: వుషూ జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ ఏడు పతకాలతో సత్తాచాటింది. బ్రూనై వేదికగా ఆదివారం ముగిసిన పోటీల్లో భారత వుషూ ప్లేయర్లు రెండు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్యాలు కైవసం చేసుకున్నారు. బాలుర 48 కేజీల విభాగంలో భారత ప్లేయర్ ఆర్యన్... చైనా ప్లేయర్‌ను చిత్తు చేసి పసిడి పతకం సాధించాడు. మరో మ్యాచ్‌లో ఇరాన్ ప్లేయర్‌పై విజయం సాధించిన శౌర్య బంగారు పతకంతో మెరిశాడు. నంగ్ మింగ్‌బి బోర్ఫఖన్ రజత పతకం సాధించాడు. తనీశ్ నాగర్ (56 కేజీలు), అభిజీత్ (60 కేజీలు), యువరాజ్ (42 కేజీలు) బాలుర విభాగంలో కాంస్య పతకాలు గెలవగా... బాలికల విభాగంలో దివ్యాని (60 కేజీలు) కాంస్యం సాధించింది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ నుంచి 24 మంది ప్లేయర్లు బరిలోకి దిగగా... అందులో ఏడుగురు పతకాలతో తిరిగి రావడం ఆనందంగా ఉందని భారత వుషూ సంఘం వెల్లడించింది.

సెలక్టర్ పదవికి యూసుఫ్ రాజీనామా

లాహోర్: పాకిస్తాన్ క్రికెట్ జట్టు సెలక్టర్లలో ఒకడైన మాజీ ఆటగాడు మొహమ్మద్ యూసుఫ్ తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. వ్యక్తిగత కారణాలతోనే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అతను వెల్లడించాడు. కెప్టెన్లు, కోచ్‌లు, ఒక విశ్లేషకుడు కూడా సభ్యుడిగా ఉన్న సెలక్షన్ కమిటీలో యూసుఫ్‌తో పాటు మరో మాజీ ఆటగాడు అసద్ షఫీక్ కూడా భాగంగా ఉన్నాడు. ఇటీవల పాకిస్తాన్ జట్టు ఘోర వైఫల్యాలపై సెలక్టర్ యూసుఫ్‌పై కూడా తీవ్ర విమర్శలు వచ్చాయి. వీటిని అతను తట్టుకోలేకపోయాడని అతని సన్నిహితులు చెప్పారు. అయితే తనకు ఇష్టమైన కోచింగ్ బాధ్యతలకు మాత్రం యూసుఫ్ దూరం కావడం లేదని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు పేర్కొంది. పాక్ నేషనల్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో యూసుఫ్ బ్యాటింగ్ కోచ్‌గా పని చేస్తున్నాడు. 50 ఏళ్ల యూసుఫ్ పాక్ తరఫున 90 టెస్టులు, 288 వన్డేలు ఆడి దాదాపు 17 వేలకు పైగా పరుగులు సాధించాడు.



మెయిన్ 'డ్రా'కు అడుగు దూరంలో లక్ష్మి

జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: తెలంగాణ యువ టెన్నిస్ క్రీడాకారిణి దండు లక్ష్మి ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ మెయిన్ 'డ్రా'కు అడుగు దూరంలో నిలిచింది. ఆదివారం జరిగిన అర్హత టోర్నీ మహిళల సింగిల్స్ పోరులో లక్ష్మి 6–2, 6–0తో గుజరాత్‌కు చెందిన మహి త్రివేదిపై విజయం సాధించింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో వేలుమణి (తమిళనాడు)తో లక్ష్మి తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ నెగ్గితే లక్ష్మి ప్రధాన 'డ్రా'కు అర్హత సాధించనుంది. పురుషుల విభాగంలో ధీరజ్ 6–3, 3–6, 10–8తో ప్రణవ్ కొరాడే నెగ్గాడు. బాలికల అండర్–18 విభాగంలో ధాత్రి దేవ్, పాల్ ఉపాధ్యాయ్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు.

లావోస్‌పై భారత్ ఘనవిజయం

ఏఎఫ్‌సీ అండర్–20 ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీ



వీన్‌టీన్ (లావోస్): ఏఎఫ్‌సీ అండర్–20 ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ 2–0తో లావోస్‌పై విజయం సాధించింది. ఆదివారం గ్రూప్ 'జి'లో భాగంగా జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. మన జట్టు తరఫున గగమ్‌సర్ గొయెరీ (69వ నిమిషంలో), థంగ్లాసాన్ గాంగ్టె (84వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోగా... ద్వితీయార్ధంలో మనవాళ్లు చెలరేగి ఆడి రెండు గోల్స్‌తో ఆతిథ్య జట్టును చిత్తుచేశారు. గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట గెలిచిన భారత్ 6 పాయింట్లతో పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఇరాన్ 9 పాయింట్లు ఖాతాలో వేసుకుని అగ్రస్థానం సాధించింది. మొత్తం పది గ్రూప్‌లు పాల్గొన్న ఈ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో ఒక్కో గ్రూప్‌లో టాపర్‌గా నిలిచిన పది జట్లతో పాటు... ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఐదు టీమ్‌లు వచ్చే ఏడాది చైనా వేదికగా జరగనున్న ఏఎఫ్‌సీ అండర్–20 ఆసియా చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నాయి.

నేడు 'శాఫ్' అండర్–17 చాంపియన్‌షిప్ ఫైనల్

భారత్ VS బంగ్లాదేశ్

థింపు: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్–17 చాంపియన్‌షిప్ ఫైనల్లో భారత జట్టు బంగ్లాదేశ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. లీగ్ ఆరంభ పోరులో బంగ్లాదేశ్‌పైనే విజయం సాధించిన భారత్... సోమవారం ఫైనల్లో మరోసారి బంగ్లాతో తలపడనుంది. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్... స్థాయికి తగ్గ ఆటతీరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, మాల్దీవులుపై విజయాలు సాధించిన భారత్ శనివారం జరిగిన సెమీఫైనల్లో నేపాల్‌ను మట్టికరిపించింది. ఇప్పటి వరకు వేర్వేరు ఏజ్ గ్రూప్స్‌లో నిర్వహించిన శాఫ్ కప్ ఫైనల్స్‌లో నాలుగు సార్లు భారత్, బంగ్లాదేశ్ తలపడగా అందులో మూడు సార్లు (2019 అండర్–18; 2022 అండర్–20; 2023 అండర్–16లో) భారత్ చాంపియన్‌గా నిలవగా.. బంగ్లాదేశ్ ఒకసారి (2015 అండర్–16) టైటిల్ సాధించింది. బంగ్లాదేశ్‌పై విజయం సాధించి మరోసారి టైటిల్ చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తామని భారత హెడ్ కోచ్ ఇషాఖ్ అహ్మద్ పేర్కొన్నాడు.

మెట్రోలో పీతలాటకం!



మహానగరాల్లో మెట్రో రైళ్లలో ప్రయాణికులు చాలావరకు మోత బరువులు లేకుండా, నీటుగా తయారై వెళ్తుంటారు. చెవుల్లో హెడ్‌ఫోన్లు, చేతుల్లో స్మార్ట్‌ఫోన్లతో ఎవరి లోకంలో వాళ్లు బిజీగా ఉంటారు. అలాంటి మెట్రోలో ఒక్కసారిగా డజను దాకా పీతలు ప్రత్యక్షమయ్యాయి. ఆకాశంలోంచి కాక పోయినా ఒక ప్రయాణికురాలి ప్లాస్టిక్ సంచి నుంచి కింద పడ్డాయి. స్వేచ్ఛ దొరికిందే తడవుగా తలోవైపు చకచకా పరుగులు తీశాయి. దాంతో సదరు మహిళకు గాభరాతో మెట్రో రైలు తలుపు వైపు పరుగెత్తింది. సాయం కోసం అటు ఇటూ చూసింది. చిరిగిన సంచినే వాటిపై గట్టిగా అదిమిపెడుతూ ఆపసోపాలు పడింది. ఇదంతా చూస్తున్న సూటు బూటు వేసుకున్న ఓ పెద్దాయన ఆమెకు సాయంగా రంగంలోకి దిగాడు. ఎడమ చేత్తో ఫోను చూస్తూనే కుడి చేత్తో పీతల వేట మొదలు పెట్టాడు. ఆయనకు మరో 'హెడ్‌ఫోన్' ప్రయాణికుడు, మరో వ్యక్తి తోడయ్యారు. ఇంకొకరు పెద్ద ఖాళీ సంచి అందించారు. అంతా కలిసి ఒక్కో పీతను ఒడుపుగా ఒడిసిపట్టి సంచిలో వేశారు. అయినా పీతలు పట్టుకున్న వాళ్లను కొండీలతో కరుస్తూ పారిపోయేందుకు ప్రయత్నించాయి. చివరికి అంతా కలిసి అన్ని పీతలనూ విజయవంతంగా సంచీలో వేశారు. మెట్రోలో ఈ పీతల హడావిడిని ఒక ప్రయాణికుడు వీడియో తీసి ఇన్‌స్టాలో పెడితే ఏకంగా కోటీ 15 లక్షల మందికి పైగా చూశారు. లెక్కలేనన్నిసార్లు షేర్ చేశారు. ఈ వీడియో నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. కుప్పలు తెప్పలుగా లైక్‌లు, కామెంట్లూ వస్తున్నాయి. 'సూటూ బూటు నీటుగాళ్లు తిరిగే మెట్రోలో జనం సాయానికి ఇంతగా జనం ముందుకురావడం గ్రేట్' అని ఒకరు, 'పీతలు భలే తాజాగా ఉన్నాయి. వండుకు తింటే నా సామిరంగా..' అని ఇంకొకరు కామెంట్ పెట్టారు. ఇంతకీ ఇదెక్కడ జరిగిందన్నది మాత్రం తెలియదు!

- సాక్షి, నేషనల్ డెస్క్

పాక్ మనతో స్నేహంగా ఉంటే.. ఐఎంఎఫ్‌కు మించి ఆదుకునేవాళ్లం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు



పొరుగు దేశం పాకిస్తాన్ ఆర్థిక ఇబ్బందులపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాక్ మనతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తే అది ఐఎంఎఫ్‌ను కోరుతున్న సాయానికి మించిన బెయిలౌట్ ప్యాకేజీ ఇచ్చి ఉండేవాళ్లమని పేర్కొన్నారు. కశ్మీర్‌లోని బందిపార జిల్లా గురెజ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన మాట్లాడారు. 'జమ్మూకశ్మీర్ ఆర్థికాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ 2014–15లో ప్రకటించిన ప్యాకేజీ ఇప్పుడు రూ.90 వేల కోట్లకు చేరింది. ఇది ఐఎంఎఫ్‌ను పాక్ కోరుతున్న బెయిలౌట్ ప్యాకేజీ కంటే ఎంతో ఎక్కువ'' అన్నారు. ''పాక్ మిత్రులారా! ఇరుగుపొరుగు దేశాలైన మన మధ్య విభేదాలెందుకు? మన మధ్య సత్సంబంధాలుంటే మీకు ఐఎంఎఫ్ కంటే ఎక్కువే ఇచ్చి ఉండే వాళ్లం'' అని మంత్రి రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ''అంతర్జాతీయ సంస్థలు, ఇతర దేశాల నుంచి తెచ్చుకున్న అప్పులను పాక్ దుర్వినియోగం చేస్తోంది. ఉగ్రవాద ఫ్యాక్టరీని నడపటానికి వాడుతోంది. వారిని మనపైకి పంపుతోంది. అందుకే అంతర్జాతీయ వేదికలపై పాక్ ఒంటరైంది. మిత్ర దేశాలు సైతం దాన్ని దూరంగా పెట్టాయి'' అని విమర్శించారు.

- శ్రీనగర్

200 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి...!

ప్రపంచంలో నాలుగో అత్యంత ధనవంతుడిగా జుకర్‌బర్గ్ రికార్డు



సామాజిక మాధ్యమం 'ఫేస్‌బుక్' సృష్టికర్తల్లో ఒకరిగా వెలుగులోకి వచ్చి దాని మాతృసంస్థ 'మెటా ప్లాట్‌ఫామ్స్' లాభాల పంటతో వేలకోట్లకు పడగలెత్తిన ఔత్సాహిక యువ వ్యాపారవేత్త మార్క్ జుకర్‌బర్గ్ మరో ఘనత సాధించారు. కేవలం 40 ఏళ్ల వయసులోనే 200 బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరి ప్రపంచంలో నాలుగో అత్యంత ధనవంతుడిగా రికార్డ్ నెలకొల్పారు. ప్రస్తుత ఆయన సంపద విలువ 201 బిలియన్ డాలర్లు చేరిందని బ్లూమ్‌బర్గ్ తన బిలియనీర్ ఇండెక్స్‌లో పేర్కొంది. ఈ ఒక్క ఏడాదే ఆయన సంపద ఏకంగా 73.4 బిలియన్ డాలర్లు పెరగడం విశేషం. షేర్‌మార్కెట్లో ఈ ఏడాది 'మెటా' షేర్ల విలువ 64 శాతం పెరగడమే ఇతని సంపద వృద్ధికి అసలు కారణమని తెలుస్తోంది. 'మెటా' చేతిలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, థ్రెడ్స్ సోషల్‌మీడియాలతోపాటు ఇన్‌స్టంట్ మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' ఉంది. మెటా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అనేది త్వరలో ప్రపంచంలోనే అత్యంత అధికంగా వాడే 'ఏఐ అసిస్టెంట్'గా ఎదగబోతోందని గతవారం 'మెటా కనెక్ట్ 2024' కార్యక్రమంలో జుకర్‌బర్గ్ ధీమా వ్యక్తంచేయడం తెల్సిందే. చరిత్రలో ఇప్పటిదాకా 200 బిలియన్ డాలర్ల సంపద గల కుబేరులు ముగ్గురే ఉండగా వారికి ఇప్పుడు జుకర్‌బర్గ్ జతయ్యాడు. ఇన్నాళ్లూ 200 బిలియన్ డాలర్లకు మించి సంపదతో ఎలాన్‌మస్క్(272 బిలియన్ డాలర్లు), జెఫ్ బెజోస్(211 బిలియన్ డాలర్లు), బెర్నార్డ్ ఆర్నాల్ట్‌లు మాత్రమే ఈ జాబితాలో ఉన్నారు. మస్క్.. టెస్లా, 'ఎక్స్'కు సీఈవోగా కొనసాగుతున్నారు. జెఫ్ బెజోస్ అమెజాన్ సంస్థకు అధిపతిగా ఉన్నారు. బెర్నార్డ్ ఆర్నాల్ట్‌కు ప్రపంచంలోనే అత్యంత లగ్జరీ వస్తువుల బ్రాండ్ అయిన ఎల్‌వీఎంహెచ్‌సహా భిన్నరంగాల్లో డజన్లకొద్దీ వ్యాపారాలున్నాయి.

- వాషింగ్టన్

నేపాల్‌లో వరద బీభత్సం

150కి చేరిన మృతులు

కఠ్మాండు: నేపాల్‌లో వరద బీభత్సం కొనసాగుతోంది. వరదలు, కొండ చరియలు విరిగిపడటంతో మృతుల సంఖ్య 150కి పెరిగింది. 64 మంది గల్లంతవగా 61 మంది గాయపడ్డారు. 322 ఇళ్లు కూలిపోయాయి. కఠ్మాండు లోయలో ఇలాంటి వరదలు గడిచిన 45 ఏళ్లలో ఇదే మొదటిసారని స్థానికులు చెబుతున్నారు. సరిహద్దులోని ధాడింగ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి బస్సు బోల్తా పడటంతో 19 మంది మృతి చెందారు. భక్తాపూర్ నగరంలో కొండచరియలు విరిగిపడటంతో ఓ ఇల్లు కూలి ఐదుగురు మృతి చెందారు. మక్వాన్‌పూర్‌లోని ఆల్ నేపాల్ ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న శిక్షణా కేంద్రంలో కొండచరియలు విరిగిపడి ఆరుగురు క్రీడాకారులు మృతి చెందారు. మరికొందరు వరద నీటిలో కొట్టుకుపోయారు.

బిహార్‌లో వరద హెచ్చరికలు...


బీర్‌పూర్, వాల్మీకినగర్ బ్యారేజీల నుంచి ఆదివారం భారీగా నీటిని విడుదల చేయడంతో రాష్ట్రంలో భారీ వరదలు వచ్చే అవకాశం ఉందని బిహార్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన 13 జిల్లాలు నీటి విడుదలతో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. బీర్‌పూర్ బ్యారేజీ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతో గోపాల్‌పూర్ సమీపంలోని కోసి తూర్పు కరకట్టపై శనివారం రాత్రి లీకేజీ సంభవించింది. దాంతో హుటాహుటిన మరమ్మతులు చేశారు.

దివ్యాంగ చిన్నారులకు శాశ్వత సాయం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న



న్యూఢిల్లీ: దివ్యాంగ చిన్నారులకు జీవితకాలమంతా సాయం అందాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి, సుప్రీంకోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. దివ్యాంగ చిన్నారుల హక్కుల పరిరక్షణపై 9వ వార్షిక జాతీయ సదస్సులో ఆదివారం ఆమె మాట్లాడారు. '' దేశంలో ఎంతమంది దివ్యాంగ చిన్నారులు అనే కచ్చితమైన గణాంకాలే లేకపోవడం దారుణం. దివ్యాంగ చిన్నారులందరికీ శాశ్వతంగా సహాయం, విద్య అందాలి. మనం చొరవ తీసుకుని వారిని పరిరక్షించలేకపోతే దివ్యాంగ చిన్నారులు నిరాదరణకు గురవుతారు. భిన్న ప్రాంతాల్లోని దివ్యాంగ చిన్నారుల సంక్షేమానికి విభిన్న పద్ధతుల్లో కృషి జరగాలి. అందరినీ ఒకే గాటినకడితే వారిపై వివక్ష చూపినట్లే లెక్క. ఇంతటి కీలక పాత్రను సమర్థవంతంగా పోషించేందుకు అంగన్‌వాడీలకు తగు శిక్షణ ఇప్పించి, అక్కడి వనరులను పెంచాలి. నిర్బంధ విద్య అమలు అనే దానిని కేవలం కాగితాలకే పరిమితం చేయకూడదు. కచ్చితంగా దానిని అమలుచేయాలి. తద్వారా ప్రతి ఒక్క దివ్యాంగ విద్యార్థికి విద్య అందించాలి'' అన్నారు. దివ్యాంగ చిన్నారులకు పెన్షన్ శాశ్వతంగా అందేలా చూడాలని కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి అనిల్ మాలిక్‌కు న్యాయమూర్తి సూచించారు.




పని మొదలెట్టిన పరమ్ రుద్ర!

దుమ్ము రేపుతున్న సూపర్ కంప్యూటర్లు

సాంకేతిక రంగంలో భారత వాటా బిట్లు, బైట్లలోకాదు టెరాబైట్లు, పెటా బైట్లలో ఉండాలంటూ ప్రధాని మోదీ ఆవిష్కరించిన పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లు మెరుపు వేగంతో పనిచేస్తున్నాయి. అత్యంత వేగంతో డేటాను ప్రాసెస్‌చేస్తూ అత్యంత క్లిష్టమైన లెక్కలను అలవోకగా చేసేస్తూ మన సత్తా చాటుతున్నాయి. వాతావరణ పరిశోధనల కోసం 850 కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించిన హై–పెర్ఫామెన్స్ కంప్యూటింగ్ (హెచ్‌పీసీ) వ్యవస్థలయిన అర్క, అరుణికలను కూడా ప్రధాని ఆవిష్కరించారు. ఈ సూపర్ కంప్యూటర్ల కథాకమామిషు ఏమిటో చూద్దామా...!

పరమశివుని పేరుతో పరమ్ రుద్ర

పూర్తి దేశీయంగా తయారైన ఈ సూపర్ కంప్యూటర్లకు పరమ్‌రుద్ర అని పేరుపెట్టారు. లయకారుడైన పరమశివుని రౌద్రావతారానికి గుర్తుగా కేంద్రం వీటికి ఇలా నామకరణం చేసింది. జాతీయ సూపర్ కంప్యూటింగ్ విధానంలో భాగంగా రూ.130 కోట్ల ఖర్చుతో వీటిని తయారుచేసి పుణె, ఢిల్లీ, కోల్‌కతాల్లో ఏర్పాటుచేశారు. హెచ్‌పీసీ వ్యవస్థలు సంక్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో శాస్త్రవేత్తలకు ఇవి ఎంతగానో సాయపడతాయి. వందల కంప్యూటర్లు విడిగా ఎంతో శ్రమతో సుదీర్ఘకాలంపాటు చేసే పనిని ఇవి శరవేగంగా చక్కబెట్టేస్తాయి.



నవ్యావిష్కరణకు రాచబాటలు

యువ శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించి, తమ పరిశోధనలకు అన్వయించి కొత్త ఆవిష్కరణలు చేసేందుకు పరమ్‌రుద్ర దోహదపడుతుంది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ రంగాల అభివృద్ధిలో సూపర్‌కంప్యూటర్ల పాత్ర కీలకమైంది. సువిశాల విశ్వంలో కొత్త ప్రదేశాలపై దృష్టిపెట్టడం మొదలు వాతావరణ సూచనలను అత్యంత ఖచ్చితత్వంతో ఇవ్వడందాకా బహుముఖ ప్రయోజనాలు వీటి వల్ల సాధ్యం. వర్షాలు, వరదలు, వడగల్లు, కరువు కాటకాల రాకను ముందస్తుగా అంచనావేయొచ్చు.

అర్క, అరుణిక పనేంటి?

వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించేందుకు, వాతావరణ శాస్త్రంలో పరిశోధనల కోసం రూపొందించిన హెచ్‌పీసీలే వాటికి ఆర్క, అరుణిక. పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటరాలజీ, నోయిడాలోని నేషనల్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్టింగుల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతీ ఆరు కి.మీ. పరిధిలో వాతావరణంలో మార్పులు, వర్షాలు, ఉరుములు, పిడుగులు పడే అవకాశాలు, ఆకస్మిక వరదలనూ వీటి సాయంతో అత్యంత కచ్చితత్వంతో ముందుగానే తెలుసుకోవచ్చు. కేవలం కిలోమీటర్, అంతకన్నా తక్కువ ప్రాంతాలపైనా శోధన చేసి ఆ డేటాను అర్క, అరుణికల ద్వారా పక్కాగా విశ్లేషించవచ్చు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఏఏ పనుల్లో వాడతారు?

- వాతావరణ మార్పులు, పరమాణు జీవశాస్త్రం, జన్యుమార్పిడి విధానాలు, కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, ఇంజనీరింగ్, మెటీరియల్ సైన్స్, రక్షణ, గగనతల, తదితర అధునాతన శాస్త్రసాంకేతిక రంగాల్లో ఈ సూపర్ కంప్యూటర్లను వాడతారు.
- పుణెలో ఏర్పాటుచేసిన పరమ్‌రుద్ర కంప్యూటర్‌ను జెయింట్ మీటర్ రేడియో టెలిస్కోప్ కోసం వినియోగంలోకి తెచ్చారు.
- వేల సీపీయూలు, 90 అత్యంత శక్తివంత ఎన్‌విడియా ఏ100 జీపీయూలు, 35 టెరాబైట్ల మెమరీ, 2 పెటాబైట్ల స్టోరేజీ దీని సొంతం.
- సువిశాల విశ్వంలో అత్యంత శక్తివంత అయస్కాంత క్షేత్రం నుంచి దూసుకొచ్చే రేడియో విస్ఫోటం (ఫస్ట్ రేడియో బరస్ట్) మూలాలను కనుగొనేందుకు టెలిస్కోప్ సేకరించిన డేటాను ఈ కంప్యూటర్‌తో విశ్లేషిస్తారు. తద్వారా విశ్వంపై అవగాహన మరింతగా పెరిగే ఆస్కారముంది.
- ఢిల్లీలోని ఇంటర్ యూనివర్సిటీ యాక్సిలిరేటర్ సెంటర్‌లో మరో పరమ్ రుద్రను ఏర్పాటుచేశారు.
- మెటీరియల్ సైన్స్, అణు భౌతిక శాస్త్రాలపై పరిశోధనలో ఇది సాయపడనుంది. – కోల్‌కతాలోని ఎస్ ఎన్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ కేంద్రంలోనూ పరమ్‌రుద్రను ఏర్పాటుచేశారు.
- దీన్ని భౌతికశాస్త్రం, ఖగోళశాస్త్రం, భూవిజ్ఞానశాస్త్రంలో పరిశోధనలకు వాడనున్నారు.



లేబర్ పార్టీకి షాక్

పార్టీకి ఎంపీ రోజీ డఫీల్డ్ రాజీనామా

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సారథ్యంలోని లేబర్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి ఎంపీ రోజీ డఫీల్డ్ రాజీనామా చేశారు. కెంట్‌లోని కాంటర్‌బరీ నుంచి గెలుపొందిన ఆమె ఇక హౌస్ ఆఫ్ కామన్స్‌లో స్వతంత్ర అభ్యర్థిగా వ్యవహరించనున్నారు. ఖరీదైన కానుకల వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో రోజీ బహిరంగ రాజీనామా లేఖ రాశారు. స్టార్మర్‌ను క్రూరమైన నేతగా అభివర్ణించారు. తన రాజీనామా నిర్ణయానికి దారితీసిన అనేక పరిణామాలున్నా.. ప్రధాన కారణం ప్రభుత్వ ప్రజాదరణ లేని విధానాలేనన్నారు. లక్షలాది మంది నిరుపేదలను ప్రభావితం చేసే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని, ఇది తెలివైన రాజకీయం కూడా కాదని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ''ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన మార్పును అందించడానికి ప్రధానికి నిబద్ధత లేదు. ఆయన ప్రాథమిక రాజకీయాలు కూడా తెలియని వ్యక్తి. పార్టీని దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్నారు'' అని మండిపడ్డారు. ''జూలైలో ప్రభుత్వం మారినప్పటి నుంచి మీ కపటత్వం విస్మయానికి గురిచేస్తోంది. మీ అవగాహనా రాహిత్యంపై నేను, నా సహోద్యోగులు ఎంత కోపంగా ఉన్నామో మాటల్లో చెప్పలేను. ఓటర్ల నమ్మకాన్ని, మా చిరకాల విజయాన్ని తీసి పారేశారు. ఒకప్పుడు గర్వించదగ్గ మా పార్టీని చెడగొట్టడానికి, అవమానించడానికి మీరు, మీ అంతర్గత వర్గం చేసిన పనికి నేను చాలా సిగ్గుపడుతున్నాను'' అని లేఖలో పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఉత్తుత్తి 'ఎస్‌బీఐ' శాఖ

కేటుగాళ్ల నిర్వాకం • ముగ్గురి అరెస్ట్

జంజ్‌గిర్–చంపా(ఛత్తీస్‌గఢ్): ఆన్‌లైన్ మోసాల బారినపడిన బాధితులు మొట్టమొదట న్యాయం కోసం వెళ్లేది బ్యాంక్ బ్రాంచ్ వద్దకే. అలాంటి బ్యాంక్ కార్యాలయం నకిలీ అని తేలితే?. ఛత్తీస్‌గఢ్‌లో ఇలాంటి మోసం ఒకటి తాజాగా వెలుగుచూసింది. ఈ ఉదంతంలో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) పేరిట కొందరు మోసగాళ్లు నకిలీ ఎస్‌బీఐ బ్రాంచ్‌ను తెరచి జనం నుంచి డబ్బులు 'ఫిక్స్‌డ్' డిపాజిట్లు తీసుకోవడం మొదలెట్టారు. శక్తి జిల్లా అదనపు ఎస్పీ రామాపటేల్ తెలిపిన వివరాల ప్రకారం.. శక్తి జిల్లాలోని మల్ఖారౌదా పోలీస్‌స్టేషన్‌పరిధిలోని ఛంపోరా గ్రామంలో సెప్టెంబర్ 18వ తేదీన కొత్తగా నకిలీ ఎస్‌బీఐ బ్రాంచ్ తెరుచుకుంది. అక్కడి దుకాణసముదాయంలో ఒక షాప్‌ను అద్దెకు తీసుకుని కంప్యూటర్లు, ఇతర బ్యాంకింగ్ సామగ్రితో ఎస్‌బీఐ శాఖను కొందరు మొదలుపెట్టారు. అయితే ఈ బ్రాంచ్‌పై అనుమానం వచ్చిన ఒక వ్యక్తి పోలీసులు, బ్యాంక్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదుచేశారు. దీంతో హుతాశులైన పోలీసులు, కొర్బా పట్టణంలోని ఎస్‌బీఐ రీజనల్ ఆఫీస్ బృందంతో కలిసి ఈ నకిలీ బ్రాంచ్‌కు హుటాహుటిన వచ్చారు. అప్పుడు ఆ నకిలీ బ్రాంచ్‌లో ఐదుగురు పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అయితే అక్కడి ఉద్యోగులకు తాము నకిలీ బ్రాంచ్‌లో పనిచేస్తున్నామన్న విషయం కూడా తెలీదని వార్తలొచ్చాయి. బ్యాంక్ మేనేజర్‌గా చెప్పుకునే ఒక వ్యక్తి వీరిని ఇంటర్వ్యూ చేసి నియమించుకున్నాడని సమాచారం. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసి పోలీసులు ప్రశ్నించడం మొదలెట్టారు. బ్రాంచ్‌లోని కంప్యూటర్లు, ఇతర మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ నకిలీ బ్రాంచ్ వల్ల ఎవరైనా మోసపోయారా? ఎంత మంది డిపాజిట్లు చేశారు? ఇతర తరహా లావాదేవీలు జరిగాయా? అనే వివరాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు.

రాజకీయాల్లోకి మహిళలు: రాహుల్

న్యూఢిల్లీ: నిజమైన సమానత్వం, న్యాయం దక్కాలంటే మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మార్పు కోరుకునే మహిళలంతా 'శక్తి అభియాన్'లో జాయినవ్వాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో మహిళలకు సమాన అవకాశం కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ దీనిని ఏర్పాటు చేసింది. 'రాజకీయాల్లో మహిళల వాణిని మరింతగా వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ 'ఇందిరా ఫెలోషిప్'ను ఏర్పాటు చేసింది. ఈ ఉద్యమం మహిళా నాయకత్వం కోసం శక్తివంతమైన ఉద్యమంగా ఎదిగింది'అని రాహుల్ పేర్కొన్నారు.

ఢిల్లీలో ఆటవిక రాజ్యం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో శాంతి భద్రతలు కుప్పకూలాయని, ఆటవిక రాజ్యం నడుస్తోందని ఆప్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేజ్రీవాల్ ఆరోపించారు. వాణిజ్య సంస్థలే లక్ష్యంగా అగ్ని ప్రమాద ఘటనలను ఆయన ఉదహరించారు. ఈ మేరకు కేజ్రీవాల్ ఆదివారం 'ఎక్స్'లో..'శాంతి భద్రతలను కాపాడేందుకు హోం మంత్రి అమిత్ షా గట్టి చర్యలు తీసుకోవాలి. ఇటీవల సెకండ్ హ్యాండ్ కార్ల షోరూం, హోటల్, స్వీట్ షాపు అగ్నికి ఆహుతయ్యాయి. బలవంతపు వసూళ్ల ముఠాలు వీటి వెనుక ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు'అని పేర్కొన్నారు.

డీఎంకేలో వారసుడొచ్చాడు

- ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి బాధ్యతల స్వీకరణ
- కరుణానిధి, స్టాలిన్ తర్వాత మూడో తరం నాయకుడు

తమిళనాడులో అధికార డీఎంకేలో కరుణానిధి, స్టాలిన్ తర్వాత మూడో తరం నాయకత్వానికి రంగం సిద్ధమవుతోంది. కుమారుడు ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెడుతూ సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. 46 ఏళ్ల ఉదయనిధి డిప్యూటీ సీఎంగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఆయనే సారథ్యం వహిస్తారని కూడా స్పష్టమైపోయింది. ఆయన యువజన సంక్షేమం, క్రీడల శాఖలు చూస్తుండటంతో పాటు డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కరుణానిధి కూడా తన కుమారుడు, స్టాలిన్‌ను డిప్యూటీ సీఎంగానే రంగ ప్రవేశం చేయించారు! కాకపోతే ఆయన అప్పటికే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. రాజకీయాల్లో మూడు దశాబ్దాలపాటు క్రియాశీల రాజకీయాల్లో ఉన్నారు. ఉదయనిధి అలా కాదు. దశాబ్దంపాటు నటుడిగా, సినీ నిర్మాతగా కొనసాగారు. 2019లో డీఎంకే యువజన విభాగం బాధ్యతలు చేపట్టారు. 2021లో అనూహ్యంగా ఎమ్మెల్యే అయి మరుసటి ఏడాదే మంత్రి కావడం వెంటవెంటనే జరిగిపోయాయి. ఆ లెక్కన డిప్యూటీ సీఎం పదవి రూపంలో ఉదయనిధికి నాలుగో ప్రమోషన్ దక్కినట్లయింది. ఇప్పటికే ఆయన తండ్రికి బదులుగా చాలా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మంత్రులు కూడా ఆయన్నే కార్యక్రమాలకు ఆహ్వానిస్తున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దూకుడైన ప్రచారంతో ఆకట్టుకున్నారు. పక్కింటబ్బాయిలా మాట్లాడుతూ అందరినీ కలుపుకుపోయారు.

- చెన్నై

యువ ఓట్లు పదిలం

ఉదయనిధికి 46 ఏళ్లు. బీజేపీ తమిళనాడు చీఫ్ అన్నామలై, కొత్తగా పార్టీ పెట్టిన సినీ హీరో విజయ్ కూడా అటూ ఇటుగా అదే వయసు వాళ్లు. అయితే డీఎంకేకున్న పటిష్టమైన పార్టీ నిర్మాణం దన్నుతో స్టాలిన్ వారసునిగా ఉదయనిధి తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటారని భావిస్తున్నారు. పార్టీలోనూ, ప్రభుత్వంలో పెద్దగా అసంతృప్తి లేకపోవడంతో పాటు ఉదయనిధి ఎదుగుదలను అడ్డుకునేవారు కూడా డీఎంకేలో పెద్దగా ఎవరూ లేరు. స్టాలిన్ తన సవతి సోదరి కనిమొళిని డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేతగా నియమించారు. డీఎంకే ఎంపీలంతా ఇప్పటికే ఉదయనిధిపై పొగడ్తలు కురిపిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ముందే ఉదయనిధిని డిప్యూటీ సీఎం చేస్తారనే ప్రచారం జరిగింది. కుటుంబపాలన అంటూ ప్రతిపక్షాలు ప్రచారాస్త్రంగా మలుచుకుంటాయనే భయంతో స్టాలిన్ వెనకాడారంటారు.



ఆదివారం డిప్యూటీ సీఎంగా బాధ్యతల స్వీకరణ సందర్భంగా తాత కరుణానిధి కార్యాలయంలో ఉదయనిధి

సెంథిల్ సహా ముగ్గురు మంత్రుల ప్రమాణం

డీఎంకే నేత వి.సెంథిల్ బాలాజీతో పాటు ఎమ్మెల్యేలు ఆర్.రాజేంద్రన్, గోవి చెజియాన్, ఎస్ఎం నాసర్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవి వారితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి పాల్గొన్నారు.

పోలీసు బైక్‌ను ఢీకొట్టి, ఈడ్చుకెళ్లి..

ఢిల్లీలో కారు డ్రైవర్ అరాచకం

తీవ్ర గాయాలతో కానిస్టేబుల్ మృతి

కారు డ్రైవింగ్ లెక్కలేనితనం, అంతులేని నిర్లక్ష్యం ఢిల్లీలో ఓ కానిస్టేబుల్ నిండు ప్రాణాలు బలిగొంది. నంగ్లోయ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీణా ఎన్‌క్లేవ్ సమీపంలో ఈ దారుణం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున 2.15 గంటల ప్రాంతంలో కానిస్టేబుల్ సందీప్ (30) సివిల్ దుస్తుల్లో విధుల్లో ఉన్నారు. నంగ్లోయ్ పోలీస్ స్టేషన్ నుంచి రైల్వే రోడ్డు వైపు బైక్‌పై వెళ్తుండగా ఓ కారు అతి వేగంతో వెళ్తుండటం గమనించారు. నెమ్మదిగా వెళ్లాల్సిందిగా సూచించారు. అంతే...! వేగం మరింత పెంచిన డ్రైవర్ కానిస్టేబుల్ బైక్‌ను వెనకనుంచి ఢీకొట్టాడు. కింద పడ్డ బైక్‌ను పది మీటర్ల దాకా ఈడ్చుకెళ్లిన కారు మరో కారును ఢీకొట్టింది. అనంతరం కారులోని ఇద్దరు వ్యక్తులు పారిపోయారు. తలకు బలమైన గాయాలైన సందీప్‌ను వెనకాల బైక్‌పైన వచ్చిన ఇద్దరు వ్యక్తులు హాస్పిటల్‌కు తరలించారు. కానీ ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. పోలీసులు నిందితులను పట్టుకుని కారును స్వాధీనం చేసుకున్నారు.

- న్యూఢిల్లీ

వ్యక్తి వికాసానికి కనీస అవసరాలైన శాసనాలు

ప్రభుత్వ గొప్పదనం అనేది అది ప్రజలకు కల్పించే హక్కులపై ఆధారపడి ఉంటుందని ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు హెచ్.జె. లాస్కీ వ్యాఖ్యానించారు. హక్కు అనేది రాజనీతిశాస్త్ర అధ్యయనంలో ఒక ప్రాథమిక రాజకీయ భావన. ప్రజలు కోరుకునే, ప్రభుత్వం గుర్తించిన అధికారాన్నే హక్కుగా పేర్కొనవచ్చు. హక్కు అంటే అవకాశం, అధికారం కలిగి ఉండటం అని కూడా చెప్పవచ్చు. హక్కులు.. ప్రభుత్వ నిరపేక్ష అధికారాలపై పరిమితులు. ఒక వ్యక్తి తన శక్తి, తెలివితేటల ఆధారంగా ఔన్నత్యం, సంపూర్ణ వికాసం పొందడానికి దోహదపడే పరిస్థితులనే హక్కులుగా అభివర్ణించవచ్చు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ



ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడో భాగంలో ప్రకరణలు 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి తెలుపుతాయి. ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని అత్యంత ముఖ్యమైన లక్షణంగా పేర్కొంటారు. వీటిని అమెరికా సంయుక్త రాష్ట్రాల రాజ్యాంగం నుంచి గ్రహించారు. అమెరికా రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను 'బిల్ ఆఫ్ రైట్స్' రూపంలో పొందుపరిచారు. చట్టబద్ధమైన హక్కులకు రాజ్యాంగంలో స్థానం కల్పించి, ప్రత్యేక ప్రతిపత్తితో గుర్తిస్తే వాటిని 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొంటారు. వ్యక్తి వికాసానికి ఇవి కనీస అవసరాలు. దేశ ప్రాథమిక శాసనమైన రాజ్యాంగంలో గుర్తించడం వల్ల వీటిని 'ప్రాథమిక హక్కులు' అని అంటారు.

ప్రాథమిక హక్కుల నేపథ్యం

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు సుదీర్ఘ చారిత్రక నేపథ్యం ఉంది. లోకమాన్య బాలగంగాధర తిలక్ 1895లో 'స్వరాజ్య బిల్లు'లో మొదటి సారిగా ఈ హక్కులను ప్రతిపాదించారు. ఆ తర్వాత..

- 1911లో కలకత్తాలో నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో హక్కులపై తీర్మానాన్ని ఆమోదించారు.
- 1922లో మహాత్మా గాంధీ సాధారణ ప్రజల హక్కుల గురించి 'యంగ్ ఇండియా'లో ప్రస్తావించారు.
- 1925లో అనిబీసెంట్.. కామన్‌వెల్త్ ఆఫ్ ఇండియా బిల్లులో, ఐర్లాండ్ రాజ్యాంగంలో ప్రస్తావించిన విధంగానే భారతీయులకూ ప్రాథమిక హక్కులు ఉండాలని ప్రతిపాదించారు.
- 1927లో మద్రాసులో ఎం.ఎ. అన్సారీ అధ్యక్షతన జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో భావి రాజ్యాంగానికి ప్రాథమిక హక్కులు ప్రాతిపదిక కావాలనే తీర్మానాన్ని ఆమోదించారు.
- 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ వెల్లడించిన నివేదికలో 'ప్రాథమిక హక్కులకు ఆమోదం పొందడం పౌరుల అవసరం'గా పేర్కొన్నారు.
- 1931లో కరాచీలో వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన కొంతమంది ప్రముఖులు ప్రాథమిక హక్కుల గురించి డిమాండ్ చేశారు. మన రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చడానికి వీరి నివేదికే ప్రాతిపదిక అయింది.
- 1931లో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో మహాత్మా గాంధీ భావి భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చాలని కోరారు.
- 1945లో తేజ్ బహదూర్ సప్రూ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ రహిత మేధావుల సంఘం కూడా ప్రాథమిక హక్కులు కావాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగ పరిషత్తు - ప్రాథమిక హక్కులు

హక్కులను రాజ్యాంగంలో చేర్చి, వాటికి ఒక నిర్దిష్ట స్వరూపాన్ని కల్పించడానికి రాజ్యాంగ పరిషత్తు 1947 జనవరి 24న సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన 54 మంది సభ్యులతో ఒక సలహా సంఘాన్ని నియమించింది. ఈ సలహా సంఘం ప్రాథమిక హక్కుల పరిశీలన కోసం 1947 ఫిబ్రవరి 12న ఆచార్య జె.బి. కృపలాని అధ్యక్షతన ఒక ఉప సంఘాన్ని నియమించింది. ఉప సంఘం సూచన మేరకు రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు హక్కులపై ఒక ముసాయిదా తయారు చేశారు. ఈ ముసాయిదాలో హక్కులను.. న్యాయ సంరక్షణ ఉన్న హక్కులు, న్యాయ సంరక్షణ లేని హక్కులుగా వర్గీకరించారు.

ప్రాథమిక హక్కులు - లక్షణాలు

- ప్రవేశికలో పేర్కొన్న న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే తాత్విక ఆదర్శాలకు వాస్తవికతను చేకూర్చే విధంగా ప్రాథమిక హక్కులను పొందుపరిచారు.
- ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ (Justiciable) ఉంది. ఇది అత్యంత ముఖ్యమైన లక్షణం. వీటి రక్షణ, అమలుకు రాజ్యాంగంలో న్యాయపరమైన ఏర్పాట్లు ఉన్నాయి.
- ప్రాథమిక హక్కులు ప్రభుత్వ నిరపేక్ష అధికారాల (Absolute Authority)పై పరిమితులు. ప్రభుత్వాలు తమ అధికారాలను రాజ్యాంగానికి లోబడి, ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా వినియోగించాలి.
- కొన్ని ప్రాథమిక హక్కులు నకారాత్మకమైనవి (Negative). అంటే ఇవి ప్రభుత్వ అధికారితపై పరిమితులు.

ఉదా: నిబంధనలు 14, 15, 16, 20, 21 మొదలైనవి. ఇవి ప్రభుత్వం ఏయే అంశాలను చేయకూడదో సూచిస్తాయి.

- మరికొన్ని హక్కులు సకారాత్మకమైనవి (Positive). ఇవి ప్రభుత్వ బాధ్యతలను సూచిస్తాయి.

ఉదా: నిబంధన 17లోని అస్పృశ్యత నిషేధం, నిబంధన 24లోని బాల కార్మిక వ్యవస్థ నిషేధం.

- ప్రాథమిక హక్కులన్నింటినీ జాతీయ అత్యవసర పరిస్థితుల్లో రద్దు చేయవచ్చు. నిబంధనలు 20, 21 మాత్రం రద్దుకావు.
- ప్రాథమిక హక్కులన్నీ స్వతహాగా అమల్లోకి వస్తాయి. కానీ, నిబంధనలు 17, 23, 24లో ప్రస్తావించిన అంశాలు స్వతహాగా అమల్లోకి రావు (Non self-executory). వీటి అమలు కోసం పార్లమెంటు ప్రత్యేక చట్టాలు చేయాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దీని కోసం రాజ్యాంగ సవరణ అవసరం. కానీ, సవరణ పేరుతో వీటి స్ఫూర్తికి భంగం కలిగించకూడదు.
- కొన్ని ప్రాథమిక హక్కులు కొన్ని వర్గాలు, సాయుధ బలగాలు, పోలీసులు, ఖైదీలు, అత్యవసర సర్వీసుల్లో పనిచేస్తున్నవారికి పరిమితంగా వర్తిస్తాయి.
- కొన్ని ప్రాథమిక హక్కులు పౌరుల చర్యలకు వ్యతిరేకంగా కూడా లభిస్తాయి.

ఉదా: ప్రకరణ 17 – అస్పృశ్యత నివారణ, ప్రకరణ 23 – వెట్టిచాకిరి రద్దు, ప్రకరణ 24 – బాలకార్మిక వ్యవస్థ రద్దు.

- కొన్ని హక్కులను అల్పసంఖ్యాక వర్గాల ప్రయోజనాలు కాపాడి, జాతీయ సమగ్రత నిలపడానికి ఉద్దేశించారు.

ఉదా: మతస్వేచ్ఛ హక్కు, విద్యా సాంస్కృతిక హక్కు.

- ప్రాథమిక హక్కుల్లో పేర్కొన్న నిషేధాలు/విపక్షలు.. ప్రభుత్వాలు, పౌరులకు సమానంగా వర్తిస్తాయి.

ఉదా: జాతి, మత, కుల, లింగ, జన్మ సంబంధ విపక్షలను ఎవరూ పాటించకూడదు.

ప్రాథమిక హక్కుల వర్గీకరణ

భారత రాజ్యాంగంలో 7 రకాల ప్రాథమిక హక్కుల గురించి తెలిపారు.

1. సమానత్వ హక్కు (Right to Equality): ప్రకరణలు 14–18.
2. వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కు (Personal Freedoms): ప్రకరణలు 19–22.
3. పీడనాన్ని నిరోధించే హక్కు (Right against Exploitation): ప్రకరణలు 23, 24.
4. మత స్వాతంత్ర్య హక్కు (Right to Religion): ప్రకరణలు 25–28.
5. సాంస్కృతిక, విద్యా హక్కులు (Cultural & Educational rights): ప్రకరణలు 29, 30.
6. ఆస్తి హక్కు (Right to Property): ప్రకరణ 31.
7. రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies): ప్రకరణ 32.

ప్రత్యేక వివరణ

పైన పేర్కొన్న ప్రాథమిక హక్కుల్లో అత్యంత వివాదాస్పదమైన ఆస్తి హక్కు (ప్రకరణ 31)ను, ఆస్తి సంపాదన విషయంలో వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన 19(1)(f)ను 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. వీటిని 12వ భాగంలోని 300(ఎ)లో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు రాజ్యాంగబద్ధ హక్కు (Constitutional Right) మాత్రమే. దీన్ని ఒక చట్టబద్ధమైన హక్కుగానూ పరిగణిస్తున్నారు.

ప్రకరణ 12 - రాజ్యం నిర్వచనం

ప్రాథమిక హక్కులను మౌలికంగా రాజ్యం నిరపేక్ష అధికారాలకు వ్యతిరేకంగా పొందుపరిచారు. రాజ్యాంగంలో రాజ్యం అనే పదాన్ని చాలా చోట్ల ప్రయోగించారు. అయితే రాజ్యం నిర్వచనాన్ని మాత్రం ప్రకరణ 12లో పేర్కొన్నారు. రాజ్యం అనే పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ప్రాథమిక హక్కులను రాజ్యం లేదా ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా గుర్తించారు. కాబట్టి ఏయే సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయి? అనే అంశాన్ని స్పష్టంగా నిర్వచించకపోతే కొన్ని సంస్థలు ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినా వాటిపై న్యాయస్థానంలో ప్రశ్నించే అవకాశం ఉండదు. అందువల్ల దీనికి విస్తృతమైన నిర్వచనం అవసరం. దీని ప్రకారం రాజ్యం అంటే..

ఎ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు; కేంద్ర, రాష్ట్ర శాసనసభలు

బి. స్థానిక ప్రభుత్వాలు (మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లా బోర్డులు, ట్రస్టులు)

సి. ప్రభుత్వ ఆదేశాల ద్వారా ఏర్పాటైన చట్టబద్ధ, చట్టేతర సంస్థలు (ఎల్.ఐ.సి., ఓ.ఎన్.జి.సి., ఎన్.టి.పి.సి. మొదలైనవి)

డి. న్యాయవ్యవస్థ కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు తన తీర్పుల్లో తెలిపింది. అదేవిధంగా ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న ప్రైవేట్ సంస్థలు కూడా రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయని పేర్కొంది.

పైన పేర్కొన్న సంస్థలతో పాటు ఎలాంటి ఇతర సంస్థలు రాజ్య పరిధిలోకి వస్తాయనే అంశాన్ని సుప్రీంకోర్టు వివిధ కేసుల తీర్పుల సందర్భంగా స్పష్టపరిచింది. అవి:

అజయ్ సహాయ్ వర్సెస్ ఖలీద్ ముజీద్ (1981): సుప్రీంకోర్టు ఈ కేసు తీర్పులో ఒక సంస్థను రాజ్యం అనే నిర్వచనంలోకి చేర్చడానికి కింది ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

- మూలధనంలో ప్రభుత్వ వాటా ఉండాలి.
- ఆ సంస్థ మొత్తం ఖర్చును ప్రభుత్వం భరించాలి.
- ఆ సంస్థపై సంపూర్ణ పరిపాలనా నియంత్రణ ఉండాలి.
- ఆ సంస్థ ఆర్థిక లావాదేవీలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి.

న్యాయస్థానాలు రాజ్య నిర్వచన పరిధిలోకి వస్తాయి - సుప్రీంకోర్టు తీర్పులు

ఎ.ఆర్. అంతులే వర్సెస్ ఆర్.ఎస్. నాయక్ కేసు (1988): న్యాయస్థానాల కొన్ని చర్యలు రాజ్య నిర్వచనంలోకి వస్తాయని ఈ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది. దీనికి రాజ్యాంగంలో స్పష్టమైన ఆధారాలున్నాయి. ప్రకరణ 145, 146 ప్రకారం సుప్రీంకోర్టు సొంత నియమ, నిబంధనలను రూపొందించుకోవచ్చు. అదేవిధంగా తన సిబ్బందిని నియమించుకునే అధికారం కూడా సుప్రీంకోర్టుకు ఉంది. ఈ చర్యలు కార్యనిర్వాహకపరమైనవి. వీటివల్ల పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు వాటిని న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చు.

కాబట్టి న్యాయశాఖ కార్యనిర్వాహక విధులను నిర్వర్తిస్తున్నప్పుడు మాత్రమే రాజ్యమనే పరిధిలోకి వస్తుందని సుప్రీంకోర్టు ప్రకటించింది.

రాజ్యం నిర్వచనం- మినహాయింపులు

సహకార సంఘాలు; బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా; ప్రభుత్వ ధన సహాయం పొందని ప్రైవేట్ విద్యాసంస్థలు; ప్రభుత్వ పరిపాలన, ఆర్థిక నియంత్రణ లేని ఇతర సంస్థలు రాజ్యం నిర్వచనం పరిధిలోకి రావు.

ప్రకరణ 13–చట్టం నిర్వచనం, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన చట్టాలు–న్యాయ సమీక్షాధికారం

ప్రకరణ 13(1) ప్రకారం రాజ్యాంగం అమల్లోకి వచ్చిన వెంటనే అంతవరకు అమల్లో ఉన్న చట్టాలు ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైతే.. అవి చెల్లకుండా పోతాయి. ప్రకరణ 13(2) ప్రకారం ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే చట్టాలు, ఆదేశాలు చెల్లవు.

ప్రకరణ 13(3)లో పేర్కొన్న చట్టం నిర్వచనం కిందకి వచ్చే అంశాలు:

- కేంద్ర, రాష్ట్ర శాసనసభలు రూపొందించిన శాసనాలు.
- రాష్ట్రపతి, గవర్నర్ జారీ చేసిన ఆదేశాలు, ఆర్డినెన్స్‌లు.
- ప్రభుత్వ రూల్స్, రెగ్యులేషన్స్, నోటిఫికేషన్స్, ప్రకటనలు.
- ప్రభుత్వం గుర్తించిన, చట్టబద్ధత ఉన్న ఆచార వ్యవహారాలు.

ప్రత్యేక వివరణ

1971లో 24వ రాజ్యాంగ సవరణ ద్వారా.. నిబంధన 368 ప్రకారం రాజ్యాంగానికి చేసిన సవరణలను నిబంధన 13లో పేర్కొన్న 'చట్టం' నిర్వచన పరిధి నుంచి మినహాయించారు. ఈ అంశాన్ని గోలక్‌నాథ్ కేసు(1967)లో సుప్రీంకోర్టు తీర్పును అధిగమించడానికి చేర్చారు. కానీ, సుప్రీంకోర్టు 1973లో కేశవానందభారతి కేసులో ఈ సవరణ చెల్లదని తీర్పు చెప్పింది. కాబట్టి రాజ్యాంగ సవరణ కూడా చట్టం నిర్వచన పరిధిలోకి వస్తుంది.

ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సైన్స్ మెథడాలజీ

జీవశాస్త్ర మూల్యాంకనం

1. ఉపాధ్యాయుడు తను బోధనా లక్ష్యాలను ఎంతవరకు సాధించగలుగుతున్నాడో తెలుసుకోవడానికి వాడే ప్రక్రియ?
   1) బోధనా పద్ధతి 2) బోధనా ఉద్దేశం
   3) మూల్యాంకనం 4) ఉన్ముఖీకరణ
2. మూల్యాంకనంలో పరస్పరం ఆధారపడిన అంశాల్లో.. అభ్యసనా అనుభవాలు, మూల్యాంకనం సాధనాలతోపాటు ఉండేది?
   1) లక్ష్యాలు
   2) బోధనోపకరణాలు
   3) బోధనా పద్ధతులు 4) పరీక్షలు
3. మూల్యాంకనం అనేది ఒక అవిరళ ప్రక్రియ, మొత్తం విద్యావ్యవస్థలో ఒక సమైక్య భాగమై విద్యకు అన్ని లక్ష్యాల తోనూ దగ్గర సంబంధం ఉంటుంది అని తెలిపినవారు?
   1) కొఠారి కమిషన్
   2) మొదలియార్ కమిషన్
   3) తారాదేవి రిపోర్ట్
   4) రాధాకృష్ణన్ కమిషన్
4. ప్రాచీన పరీక్షా విధానం కేవలం ఏ రంగానికి ప్రాముఖ్యత ఇచ్చింది?
   1) మానసిక చలనాత్మక రంగం
   2) భావావేశ రంగం
   3) క్రీడా రంగం 4) జ్ఞానాత్మక రంగం
5. ఒక విషయాన్ని గురించి లేదా వ్యక్తిని గురించి పరిమాణాత్మకంగా అంచనా కట్టడానికి విద్యాసంబంధమైన వాటిని గురించి మాత్రమే నిర్వహించేది?
   1) మాపనం 2) మూల్యాంకనం
   3) పరీక్ష 4) పైవన్నీ
6. మూల్యాంకనానికి ఒక ఆకారాన్ని ఒక అధికారాన్ని కల్పించి విద్యార్థి వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
   1) పరీక్ష 2) మాపనం
   3) మూల్యాంకనం 4) ఇవేవీకావు
7. నిరంతర ప్రక్రియ విద్యార్థి సమగ్ర మూర్తిమత్వాన్ని తెలియజేస్తూ, భూత, భవిష్యత్, వర్తమాన ప్రగతిని అంచనా వేసేది?
   1) పరీక్ష 2) మాపనం
   3) మూల్యాంకనం 4) స్లిప్‌టెస్ట్
8. బోధనాభ్యసన ప్రక్రియ ప్రారంభించే ముందు విద్యార్థుల సామర్థ్యాలను తెలుసు కోవడానికి ఉపయోగించే మూల్యాంకనం?
   1) సంకలన మూల్యాంకనం
   2) లోపనిర్ధారణ మూల్యాంకనం
   3) నిర్మాణాత్మక, రూపణ మూల్యాంకనం
   4) 1, 2
9. బోధన మధ్యలో విద్యార్థి అభ్యసనాన్ని అంచెలంచెలుగా తెలుసుకొని బోధనా పద్ధతిలో మార్పులు చేసుకునేందుకు ఉపాధ్యాయుడు ఏ మూల్యాంకనం చేస్తాడు?
   1) సంకలన 2) రూపణ, నిర్మాణాత్మక
   3) సంకలన, రూపణ 4) లోపనిర్ధారణ
10. సంకలనాత్మక మూల్యాంకనం ఏ విధంగా జరుగుతుంది?
    1) బోధనకు ముందు 2) బోధన మధ్యలో
    3) బోధన పూర్తైన తర్వాత
    4) బోధనకు ముందు, తర్వాత
11. వార్షిక పరీక్షలను ఏ మూల్యాంకనానికి సాధనాలుగా చెప్పొచ్చు?
    1) నిర్మాణాత్మక 2) సంకలన
    3) లోప నిర్ధారణ 4) పైవన్నీ
12. ఉపాధ్యాయుడు పాఠ్యాంశాన్ని అర్థం చేసుకున్న లక్ష్మీ అనే బాలిక ప్రవర్తనా సరళిని, అదే పాఠ్య విషయాలను అర్థం చేసుకున్న సీతలో ఆశించిన మార్పులకు చేపట్టాల్సిన అభ్యసనానుభవాలను నిర్ణయించే విధానం?
    1) వైషమ్య విధానం 2) గుర్తింపు విధానం
    3) పరీక్ష విధానం 4) విధానమేకానిది
13. 'కణ విభజనలో క్షయకరణ విభజనకు సంబంధించిన దశలను వివరించండి?' పై ప్రశ్న ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది?
    1) పరిపృచ్ఛ 2) మౌఖిక పరీక్ష
    3) లక్ష్యాత్మకపరీక్ష 4) వ్యాసరూప పరీక్ష
14. ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయ భావాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వల్ల విద్యార్థికి ఏ పరీక్షల్లో న్యాయం జరగకపోవచ్చు?
    1) లక్ష్యాత్మక పరీక్ష 2) అభిరుచి శోధిక
    3) వ్యాసరూప పరీక్ష
    4) సహజ సామర్థ్య పరీక్ష
15. 'ఆవరణ వ్యవస్థలో వినియోగదారులు--- పై ఆధారపడే ఉంటాయి?' ఇది ఏ రకమైన పరీక్షల్లో వస్తుంది.
    1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
    3) పరిపృచ్ఛ 4) సహజ సామర్థ్య
16. ఏ పరీక్షల్లో విశ్వసనీయత ఎక్కువ?
    1) ప్రశ్నావళి 2) వ్యాసరూప
    3) పరిపృచ్ఛ 4) లక్ష్యాత్మక
17. లక్ష్యాత్మక పరీక్షల్లో దేనికి అవకాశం లేదు?
    1) మాస్ కాపీయింగ్ 2) జ్ఞానం
    3) ఉపాధ్యాయుడి ఆత్మాశ్రయత
    4) విశ్వసనీయత
18. ముద్రణాయంత్రం కనిపెట్టక ముందు నుంచే ఏ పరీక్షలు ఉన్నాయి?
    1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
    3) ప్రశ్నావళి 4) మౌఖిక
19. డీఎస్సీ పరీక్షలు ఏ రకం పరీక్షలకు ఉదాహరణ?
    1) లక్ష్యాత్మక 2) మౌఖిక
    3) వ్యాసరూప 4) అభిరుచి శోధిక
20. విద్యార్థుల మానసిక ప్రవృత్తి, భావవ్యక్తీకరణ పరీక్షించడానికి తోడ్పడే పరీక్షలు?
    1) వ్యాసరూప 2) లక్ష్యాత్మక
    3) మౌఖిక
    4) ప్రామాణీకరణం చేసిన పరీక్షలు
21. శిక్షణ సామర్థ్యం ఉన్న వ్యక్తులను ఆ సామర్థ్యం లేని వ్యక్తుల నుంచి వేరు చేయడానికి ఉపయోగపడేవి?
    1) సమస్యా విధాన పరీక్షలు
    2) సహజ సామర్థ్య పరీక్షలు
    3) ప్రామాణీకరణ పరీక్షలు
    4) లక్ష్యాత్మక పరీక్షలు
22. విద్యార్థికి జీవశాస్త్ర, ప్రయోగశాల్లో అమీబా నమూనాను చూపి గుర్తించమనడం ఏ పరీక్షకు ఉదాహరణ?
    1) లక్ష్యాత్మక 2) సహజ సామర్థ్య
    3) నిష్పాదన 4) ప్రామాణీకరణ
23. పరిస్థితిని బట్టి సందర్భానుసారంగా ప్రశ్నలను ప్రత్యక్షంగా అడగటం?
    1) అనియత పరిపృచ్ఛ
    2) నియత పరిపృచ్ఛ
    3) సామూహిక పరిపృచ్ఛ
    4) ప్రశ్నావళి
24. ఉపాఖ్యాన రికార్డు అని దేన్ని పిలుస్తారు?
    1) అభిరుచి శోధిక 2) నియత పరిపృచ్ఛ
    3) జీవిత సంఘటన పత్రావళి
    4) ప్రశ్నావళి
25. ఒక విద్యార్థికి చెందిన నాయకత్వ లక్షణాలను అంచనా వేయడానికి ఉపకరించే సాధనం?
    1) అభిరుచి శోధిక 2) చెక్‌లిస్ట్
    3) జీవిత సంఘటన పత్రావళి
    4) అంచనా మాపని
26. ఈ రకం పరీక్షల్లో ప్రశ్నకు ఎదురుగా అవును, కాదు అనేవి మాత్రమే ఉంటాయి. ఇది మూర్తిమత్వ పరీక్ష?
    1) లక్ష్యాత్మక 2) వ్యాసరూప
    3) చెక్‌లిస్ట్ 4) అభిరుచి శోధిక
27. విద్యార్థి గురించిన పూర్తి చిత్రం సంవత్సరం వారీగా అతని వికాసం తెలుసుకునేది?
    1) జీవిత సంఘటన పత్రావళి
    2) అభిరుచి శోధిక 3) చెక్‌లిస్ట్
    4) క్రమాభివృద్ధి, సంచిత పత్రావళి
28. తారాదేవి రిపోర్ట్ పరీక్షల సంస్కరణల్లో సూచించిన ప్రకారం, ప్రశ్నపత్రంలో లక్ష్యాత్మక ప్రశ్నలకు ఇవ్వాల్సిన సమయం?
    1) 1 గంట 2) 2 ½ గంటలు
    3) ½ గంట 4) 3 గంటలు
29. ఎవరైతే బోధిస్తారో వారే పరీక్షించడం ఆవశ్యకం అని వివరించిన వారు?
    1) తారాదేవి రిపోర్ట్
    2) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్
    3) కొఠారి కమిషన్
    4) మొదలియార్ కమిషన్
30. విద్యార్థుల ఫలితాలను చూపే యోగ్యతా పత్రాలు వేర్వేరు సబ్జెక్టుల్లో విద్యార్థుల నిష్పాదనాన్ని తెలిపేవిగా ఉండాలి – కానీ మొత్తం పరీక్షలో పాస్, ఫెయిల్ అని నిర్ణయించేవిగా ఉండొద్దు అని సూచించింది?
    1) కొఠారి కమిషన్ 2) తారాదేవి రిపోర్ట్
    3) యూజీసీ 4) మొదలియార్ కమిషన్
31. ఉత్తమ నికషకు ఉండాల్సిన లక్షణం కానిది?
    1) సప్రమాణత 2) లక్ష్యాత్మకత
    3) ఆచరణాత్మకత 4) ఆత్మాశ్రయత
32. లక్ష్యాత్మక అంటే ఒక పరీక్ష పత్రాన్ని వేర్వేరు ఉపాధ్యాయులు దిద్దినప్పుడు?
    1) వేర్వేరు మార్కులు రావాలి
    2) ఒకే మార్కులు రావాలి
    3) మొదటి ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి.
    4) చివర దిద్దిన ఉపాధ్యాయుడి మార్కులు పరిగణించాలి
33. కింది వాటిలో ఏ పరీక్షలకు విశ్వసనీయత తక్కువగా ఉంటుంది?
    1) నిష్పాదన పరీక్షలు
    2) లక్ష్యాత్మక పరీక్షలు
    3) వ్యాసరూప పరీక్షలు
    4) పైవన్నీ
34. అన్ని పాఠ్యాంశాల్లోని అన్ని విషయాలను పరీక్షించేటట్లు పరీక్షా పత్రం ఇస్తే దానికి ఏ లక్షణం ఉందని అంటారు?
    1) ఆచరణాత్మకత 2) విశ్వసనీయత
    3) లక్ష్యాత్మకత 4) సమగ్రత
35. పాఠ్య విభాగాన్ని బోధించిన తర్వాత రూపొందించుకున్న బోధనా లక్ష్యాలు నెరవేరింది?
    1) వార్షిక పరీక్ష 2) త్రైమాసిక పరీక్ష
    3) యూనిట్ పరీక్ష
    4) అర్ధసంవత్సర పరీక్ష
36. యూనిట్ పరీక్షలో నైపుణ్యానికి ఇచ్చే మార్కుల శాతం?
    1) 24 2) 32 3) 12 4) 18
37. యూనిట్ పరీక్షలో కఠిన స్థాయి ప్రశ్నలకు ఇచ్చే మార్కుల శాతం?
    1) 24 2) 53 3) 14 4) 100
38. యూనిట్ పరీక్షలో ప్రశ్నపత్రం రూపకల్పనలో కింది వాటిలో దేనికి ఎక్కువ మార్కులు కేటాయించాలి?
    1) కఠిన స్థాయి 2) సాధారణ స్థాయి
    3) తేలిక స్థాయి
    4) అన్నింటికీ సమానంగా
39. ఉపాధ్యాయ నిర్మిత పరీక్షల్లో ప్రశ్నపత్రం సప్రమాణత రూపొందించడానికి తోడ్పడేది?
    1) అమోనియా ప్రింట్ 2) న్యూస్ ప్రింట్
    3) జిరాక్స్ ప్రింట్ 4) బ్లూ ప్రింట్
40. బ్లూ ప్రింట్ తయారీలో దేనికి ప్రాముఖ్యత ఉండదు?
    1) లక్ష్యాలు 2) ఉపప్రమాణం
    3) ఉపాధ్యాయుల అభిరుచి
    4) పరీక్షాంశ రకం

సమాధానాలు

1) 3	2) 1	3) 1	4) 4	5) 3
6) 2	7) 3	8) 2	9) 2	10) 3
11) 2	12) 1	13) 4	14) 3	15) 2
16) 4	17) 3	18) 4	19) 1	20) 3
21) 2	22) 3	23) 1	24) 3	25) 4
26) 3	27) 4	28) 3	29) 2	30) 1
31) 4	32) 2	33) 3	34) 4	35) 3
36) 3	37) 1	38) 2	39) 4	40) 3

ఉద్యోగాలు

ఆర్ఆర్‌సీ-నార్త్ సెంట్రల్ రైల్వేలో 1,679 యాక్ట్ అప్రెంటిస్‌లు

ప్రయాగ్‌రాజ్(ఉత్తరప్రదేశ్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)-నార్త్ సెంట్రల్ రైల్వే ఈసీఆర్ పరిధిలోని డివిజన్/ వర్క్‌షాపుల్లో యాక్ట్ అప్రెంటిస్‌ల శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

- **డివిజన్/వర్క్‌షాప్:** ప్రయాగ్‌రాజ్ డివిజన్, ఝాన్సీ డివిజన్, ఆగ్రా డివిజన్.
- **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, మెకానిక్, వైర్‌మ్యాన్, బ్లాక్ స్మిత్, ప్లంబర్, డ్రాఫ్ట్స్‌మ్యాన్, స్టెనోగ్రాఫర్, టర్నర్, సీవోపీఏ తదితరాలు.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 15.10.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.10.2024.
- **వెబ్‌సైట్:** https://www.rrcpryj.org

ఐఎస్ఐ, కోల్‌కతాలో 24 ఫ్యాకల్టీ పోస్టులు

కోల్‌కతాలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–2.
- **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 45 ఏళ్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్–1, గ్రేడ్–2 పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** అప్లికేషన్స్ స్క్రీనింగ్, ప్రజెంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ 203 బి.టి రోడ్, కోల్‌కతా చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 31.10.2024.
- **వెబ్‌సైట్:** https://www.isical.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని గతిజశక్తి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

యాంత్రిక శాస్త్రం

ప్రచోదనం

ఏదైనా ఒక వస్తువుపై అతి స్వల్పకాలంలో అత్యధిక బలాన్ని ప్రయోగిస్తే దాన్ని ప్రచోదనం అంటారు.

ప్రచోదనం (I) = బలం × కాలం

$I = F \times \Delta t$

$I/\Delta t = F$

ప్రకారం ఒక వస్తువుపై అత్యధిక బలాన్ని అతిస్వల్పకాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ప్రమాణాలు: డైన్ సెకన్, న్యూటన్ సెకన్

అనువర్తనాలు:

- జంపింగ్ పోటీలో దూకే స్థలం వద్ద గోతిని తవ్వి దానిలో వరిపొట్టు, రంపం పొట్టు, ఇసుక, స్పాంజ్‌ను ఉంచుతారు. వీటివల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా దూకుతున్న వ్యక్తికి గాయాలు కావు.
- క్రికెట్‌లో బంతిని క్యాచ్ పట్టుకునే సమయంలో ఫీల్డర్ చేతులను ముందుకు చాపి, తర్వాత క్రమంగా వెనక్కి తీసుకుంటాడు. ఇలా చేయడం వల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల ఫీల్డర్ చేతులకు గాయాలు కావు.
- వాహనాల్లో షాక్ అబ్జార్బ్స్ (స్ప్రింగ్‌లు) అమరుస్తారు. దీనివల్ల వాహనాలు గుంతలున్న రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- సున్నితమైన గాజు వస్తువులు, పింగాణీ, మట్టి వస్తువులను రవాణా చేసేటప్పుడు వాటి చుట్టూ దూది, గడ్డి, స్పాంజి, థర్మాకోల్ మొదలైన వాటిని అమరుస్తారు. ఫలితంగా ఆ వస్తువుల రవాణా సమయంలో ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- గమనంలో వున్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశి ఉన్న విరామస్థితిలోని మరో వాహనాన్ని ఢీకొడితే.. కదులుతున్న వాహనం ఆగి ఉన్న వాహనంపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగిస్తుంది. కాబట్టి ఆగి ఉన్న వాహనానికి ఎక్కువ నష్టం జరుగుతుంది.
- కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలంపైకి దూకిన వ్యక్తి తన శరీర బరువు మొత్తాన్నీ స్వల్పకాలంలో ఆ తలంపై ప్రయోగిస్తాడు. దీంతో ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అతడికి గాయాలవుతాయి. కానీ అదే వ్యక్తి సరిపడా నీరున్న బావిలో దూకితే కాలపరిమితి పెరిగి, ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఆ వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- ఒక ఇనుప మేకుపై అత్యధిక బలాన్ని అతిస్వల్ప కాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి, ఆ మేకు గోడలోకి లేదా చెక్కదిమ్మలోకి చొచ్చుకొని వెళ్లగలుగుతుంది.



ప్రక్షేపకం (Projectile)

ఏదైనా ఒక వస్తువును భూమి క్షితిజ సమాంతర దిశకు కొంత కోణంలో (90° తప్ప) పైకి విసిరినప్పుడు అది పరావలయ మార్గంలో ప్రయాణించి భూమిని మరో బిందువు వద్ద తాకుతుంది. ఈ విధంగా విసిరిన వస్తువును ప్రక్షేపకం అంటారు.

ప్రక్షేపకం ఎల్లప్పుడూ పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణిస్తుంది.

ఉదాహరణలు:

1. తుపాకి నుంచి వెలువడిన బుల్లెట్, యుద్ధ ట్యాంకుల నుంచి వెలువడిన విస్ఫోటక పదార్థాలు పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
2. ప్రయోగించిన క్షిపణి, రాకెట్‌లు కూడా పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
3. కదులుతున్న వాహనంలో నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి కింద పడుతుంది.
4. గగనతలంలో ఎగురుతున్న ఒక జెట్ విమానం నుంచి బాంబును జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని తాకుతుంది.

వ్యాప్తి (Range)

ఒక ప్రక్షేపకం భూమి క్షితిజ సమాంతర దిశలో ప్రయాణించిన గరిష్ట దూరాన్ని వ్యాప్తి అంటారు. గరిష్ట వ్యాప్తి పొందాలంటే ప్రక్షేపకాన్ని 45° కోణంతో ప్రయోగించాలి.

యాంత్రికశక్తి

ఒక వస్తువు క్షితిజ శక్తి, గతిజ శక్తిల మొత్తాన్ని యాంత్రిక శక్తి (Mechanical Energy) అంటారు.

యాంత్రిక శక్తి = P.E. + K.E.

స్థితిజ శక్తి:

ఒక వస్తువుకు తన స్థితి లేదా స్థానం లేదా నిర్మాణం వల్ల కలిగే శక్తిని క్షితిజ శక్తి అంటారు.

క్షితిజ శక్తి (P.E.) = mgh

m = వస్తువు ద్రవ్యరాశి

(ఎల్లప్పుడు స్థిరం)

g = గురుత్వ త్వరణం

(ఒక ప్రదేశంలో g విలువ స్థిరం)

h = భూమి ఉపరితలం నుంచి వస్తువు పొందిన ఎత్తు. వస్తువు పొందిన ఎత్తు విలువ పెరిగితే వస్తువు పొందిన క్షితిజ శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- రిజర్వాయర్లలో, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో ఉండే నీటికి స్థితిజశక్తి ఉంటుంది.
- ఒక తీగను స్ప్రింగ్‌లా చుట్టినపుడు దానిలో PE నిల్వ ఉంటుంది.
- ఒక రబ్బరు పట్టీని సాగదీసినప్పుడు కూడా దానిలో స్థితిజశక్తి ఉంటుంది.
- విల్లులో బాణం అమర్చి వెనక్కి లాగినప్పుడు దానిలోనూ PE నిల్వ ఉంటుంది.

గతిజశక్తి:

ఒక వస్తువు తన గమనం వల్ల పొందిన శక్తిని గతిజశక్తి అంటారు.

గతిజ శక్తి = KE = $\frac{1}{2}mv^2$

m = వస్తువు ద్రవ్యరాశి;

v = వేగం

- గమనంలో వున్న రాయి, బంతికి ఈ శక్తి ఉంటుంది.
- పేల్చిన తుపాకీ గుండు, తుఫాన్ గాలులకు, రంపం మిల్లులో వేగంగా తిరిగే రంపానికి గతిజ శక్తి ఉంటుంది.
- వేగం పెరిగితే వస్తువు గతిజశక్తి కూడా పెరుగుతుంది.
- గతిజశక్తి సమీకరణం, రేఖీయ ద్రవ్యవేగాల మధ్య సంబంధం

$K.E. = p^2/2m$

$\Rightarrow K.E. \propto p^2$

- గమనంలో వున్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని x% పెంచినప్పుడు దాని K.E.లో పెరుగుదల శాతం = x(200+x)/100

ప్రశ్న: గమనంలో ఉన్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని 100 శాతం పెంచితే, దాని K.E. లో మార్పు (పెరుగుదల)శాతం ఎంత?

= x(200+x)/100 (∵ x = 100%)

= 100(200+100)/100

= 300

K.E.లో పెరుగుదల = 300%

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని K.E. నాలుగు రెట్లు పెరుగుతుంది.

యాంత్రిక శక్తికి ఉదాహరణలు:

ఒక వస్తువు ఏక కాలంలో క్షితిజ, గతిజ శక్తులను కలిగి ఉంటే వాటికి ఉదాహరణలు.

- గగన తలంలో ఎగురుతున్న విమానం, రాకెట్లు, క్షిపణులు, గాలిపటం, మేఘాలు, పక్షి, బెలూన్ మొదలైన వాటికి యాంత్రిక శక్తి ఉంటుంది.
- గమనంలో ఉన్న వాహనంలోని ప్రయాణికుడు యాంత్రిక శక్తిని కలిగి ఉంటాడు.
- సౌర కుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు లేదా గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు యాంత్రిక శక్తి ఉంటుంది.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్‌కు యాంత్రిక శక్తి ఉంటుంది.

నోట్: బావిలోని నీరు, లోయలో వున్న వస్తువు, గనిలోని కార్మికుడికి క్షితిజ శక్తి ఉంటుంది.

- తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు క్షితిజ శక్తి, భ్రమణ గతిజ శక్తులుంటాయి.

శక్తి రూపాంతరాలు

- రిజర్వాయర్‌లో నిలకడగా ఉన్న నీరు క్షితిజ శక్తిని కలిగి ఉంటుంది. ఈ నీరు జలపాతంలా కిందకి పడుతున్నప్పుడు దాని స్థితిజశక్తి గతిజశక్తిగా మారుతుంది. నీటి ప్రవాహానికి ఎదురుగా విద్యుత్ టర్బైన్‌ను అమరిస్తే జనరేటర్‌లో విద్యుత్‌గా రూపాంతరం చెందుతుంది.
- గడియారంలో చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌లో స్థితిజ శక్తి ఉంటుంది. ఈ స్థితిజ శక్తి గడియారంలోని ముల్లు తిరగడానికి కావాల్సిన K.E.గా మారుతుంది.
- పక్షులను వేటాడటానికి ఉపయోగించే గులేరులోని రబ్బరు పట్టీ మధ్యభాగంలో ఒక చిన్న రాయిని అమర్చి వెనక్కి లాగితే, ఆ రబ్బరు పట్టీలోని స్థితిజశక్తి రాయికి గతిజశక్తిని అందిస్తుంది. ఫలితంగా రాయి ముందుకు దూసుకెళ్తుంది. ఇలాంటి శక్తి రూపాంతరం ధనస్సు, బాణాల్లో కూడా జరుగుతుంది.
- వాహనాల్లో ఇంధనాలను మండించినప్పుడు వెలువడే ఉష్ణశక్తి వాటిని కదిలించడానికి కావల్సిన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- సైకిల్ డైనమోలో యాంత్రికశక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
- పరుగు తీస్తున్న వ్యక్తిలో కండర శక్తి గతిజ శక్తిగా మారుతుంది.
- ఒక వ్యక్తి.. భవనం, పర్వతం, స్తంభం మొదలైన వాటిపై ఎక్కినప్పుడు కండర శక్తి స్థితిజ శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- చెట్టు కొమ్మపై వాలిన పక్షి ఎగరడం ఆరంభించినప్పుడు దాని కండర శక్తి(PE) యాంత్రిక శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు ఉవ్వెత్తున లేచిన సముద్ర కెరటాల స్థితిజశక్తి ఒడకు గతిజశక్తిగా అందుతుంది.
- చిన్న పిల్లలు ఆడుకునే ఆట బొమ్మల్లో అమర్చిన ఘటాల్లోని రసాయనశక్తి విద్యుచ్ఛక్తిగా, తర్వాత బొమ్మలను కదిలించడానికి అవసరమైన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- విద్యుత్ మోటార్‌లో విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.

భ్రమణ చలనం లేదా కోణీయ చలనం

ఒక వస్తువు ఏదైనా స్థిర బిందువు చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తే ఆ చలనాన్ని భ్రమణ చలనం లేదా కోణీయ చలనమంటారు.

ఉదా: తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలు, వాహనం చక్రాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు, ఉపగ్రహాలు భ్రమణ చలనాన్ని కలిగి ఉంటాయి.

- భ్రమణ చలనంలో ఉన్న ప్రతి వస్తువుకు ఏక కాలంలో రేఖీయ, కోణీయ భౌతిక రాశులుంటాయి.

రేఖీయ స్థానభ్రంశం (Linear displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు వృత్త పరిధిపై పొందిన స్థానభ్రంశాన్ని రేఖీయ స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెం.మీ. లేదా మీటర్

కోణీయ స్థానభ్రంశం (Angular displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు ఆ వృత్త కేంద్రం వద్ద పొందిన స్థానభ్రంశాన్ని కోణీయ స్థానభ్రంశం అంటారు.

$\theta = \angle BOA$

ప్రమాణాలు: డిగ్రీ, రేడియన్

(రేడియన్ - అంతర్జాతీయ ప్రమాణం)

- రేఖీయ, కోణీయ స్థానభ్రంశాల మధ్య సంబంధం:

వృత్త చాపం (AB) =

వృత్త వ్యాసార్ధం × కేంద్రం వద్ద కోణం

$\bar{S} = r \times \theta$

రేఖీయ వేగం (V)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త పరిధిపై పొందిన రేఖీయ స్థానభ్రంశాన్ని రేఖీయ వేగం అంటారు.

$V = S/t$

ప్రమాణాలు: సెం.మీ./సెకన్, మీ./సెకన్

కోణీయ వేగం (ω)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త కేంద్రం వద్ద పొందిన కోణీయ స్థానభ్రంశాన్ని కోణీయ వేగం అంటారు.

$\omega = \theta/t$;

ప్రమాణాలు: డిగ్రీ/ సెకన్

లేదా రేడియన్ / సెకన్.

- రేఖీయ, కోణీయ వేగాల మధ్య సంబంధం $v = r\omega$
- భ్రమణ చలనంలో రేఖీయవేగం ఒక కణం నుంచి మరో కణానికి మారుతుంది. కానీ కోణీయ వేగం అన్ని కణాలకు సమానం.

కోణీయ ద్రవ్యవేగం

భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే ద్రవ్యవేగాన్ని కోణీయ ద్రవ్యవేగం అంటారు.

$L = mvr$ లేదా $L = mr^2\omega$

ప్రమాణాలు: గ్రామ్.సెం.మీ.^{2}/సెకన్, కేజీ. సెం.మీ.^{2}/సెకన్

$L = mvr \Rightarrow L/r = mv$

$V \propto 1/r$

(ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు)

- భ్రమణ చలనంలో ఉన్న వస్తువు రేఖీయ వేగం దాని వృత్త వ్యాసార్థానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి కక్ష్యావ్యాసార్థం పెరిగితే రేఖీయ వేగం తగ్గుతుంది.

ఉదా: భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక కృత్రిమ ఉపగ్రహాన్ని అల్పకక్ష్య నుంచి అధిక కక్ష్యలోకి బదిలీ చేస్తే ఆ ఉపగ్రహం రేఖీయ వేగం తగ్గుతుంది. కక్ష్య వ్యాసార్థం పెరగడమే దీనికి కారణం.

- భ్రమణ చలనం చేస్తున్న వస్తువుకు ఏకకాలంలో అభికేంద్ర, అపకేంద్ర బలాలు ఉంటాయి.

What is the code for 'Indians'?

MODEL QUESTIONS

BANK EXAMS

REASONING



Directions (Q.No. 1-5): In these questions, a relationship between different elements is shown in the statement(s). The statements are followed by two conclusions.

Give answer:

1) If only conclusion I follows
2) If only conclusion II follows
3) If either conclusion I or II follows
4) If neither conclusion I nor II follows
5) If both conclusions I and II follow

1. ***Statements:***
$A < M > P, S \le A, X \le P$
Conclusion: I) $M > S$
II) $X < M$

2. ***Statements:*** $A > M \ge P \le S$, $Q \le P, M < D$
Conclusion: I) $D > A$
II) $M \ge Q$

3. ***Statements:*** $K = E \ge L \ge M$, $I > N \ge T, E \le R = T$
Conclusions: I) $I > M$
II) $L \le N$

4. ***Statements:***
$Y < W < L, Z \ge X = L, Y = R$,
$M < S < R$
Conclusions:
I) $M < X$
II) $Z > Y$

5. **Statements:**
$R = X > M, X \le K < S$
$P \le L = M$
Conclusions:
I) $L < S$
II) $K > P$

6. In a certain code'ANEUPLOID' is written as 'UDOLINEPA'. How will 'EDUCATION' be written in that code?
1) UCODINEAT
2) UCODINETA
3) UCOIDNETA
4) UOCDINETA
5) None of these

Directions (Q.No.7-9): In each question given below have five statements. You have to take the given statements to be true even if they seem to be at variance from commonly known facts and then choose the option which suggests one of the statements as a logical valid conclusion from the given statements.

7. ***Statements:***
1) Some stars are suns.
2) Some suns are planets.
3) All planets are satellites.
4) All meteors are satellites.
5) Some suns are satellites.

8. ***Statements:***
1) All fishes are birds.
2) All birds are rats.
3) All rats are cows.
4) Some rats are fishes
5) Somecows aregoats

9. ***Statements:***
1) All curtains are rods
2) Some rods are sheets
3) No curtain is pillow
4) Some sheets are pillows
5) No rod is pillow

Directions (Q. No. 10 - 14): Study the information and answer the following questions:

In a certain code language:
'not many gold items' is written as 'C@16, D+15, D#9, E$11'
'quality and latest things' is written as,
'F$22, C#3,G+19,F@14'
'creativity leads best word' is written as,
'D@4,J+E, E$14, D#25'
'god makes it beauty' is written as,
'F+4,C#9,B@11, E$15

10. What is the code for 'nest' in the given code language?
1) D@16 2) M@16
3) D@4 4) B@4
5) P@22

11. What is the code for 'majesty' in the given code language?
1) Y+5 2) G+15
3) G+25 4) A+15
5) G$15

12. What is the code for 'Indians' in the given code language?
1) G#11 2) R$11
3) G$11 4) G+11
5) W@4

13. What is the code for 'standard' in the given code language?
1) H$21 2) H@21
3) H#194) H#21
5) I#21

14. What is the code for 'fairy tricks' in the given code language?
1) D+13 F$20
2) B+15 F$22
3) E+8 F$22
4) D+15 F$21
5) T+15 F$22

Directions (Q.No. 15-20): Study the information and answer the given questions:

There are eight persons A, B, C, D, E, F, G and H seated in a circle all facing away from the centre but not necessarily in the same order. A is second to the right of B. C is immediate neighbour of neither A nor B. There are three persons between E and G. F is third to the left of D. E is immediate neighbour of B. G is immediate neighbour of D. F is not the neighbour of B.

15. Who is second to the left of B?
1) F 2) E
3) C 4) D
5) None of these

16. Who is between E and H?
1) F 2) B
3) C 4) D
5) None of these

17. If F and G interchange their positions, then who will be second to the right of E?
1) F 2) G
3) C 4) D
5) None of these

18. In which of the following pairs is the second person to the immediate left of first person?
1) CF 2) EG
3) BA 4) GD
5) None of these

19. How many persons are seated between F and H?
1) Three 2) Two
3) One 4) None
5) None of these

20. Which of the following pairs has the first person sitting third to the left of the second person?
1) GB 2) BH
3) GH 4) AF
5) None of these

Key with Explanations

1) 5;
$S \le A < M > P \ge X$. Hence, both the conclusions follow.

2) 2;
$A > M < D$. Hence, A and D cannot be compared. So, conclusion (I) does not follow.
$M \ge P \ge Q$.
Hence, Conclusion (II) follows.

3) 5;
$I > N \ge T = R \ge E = K \ge L \ge M$.
Hence, both the conclusions (I) & (II) follow.

4) 5;
$M < S < R = Y < W < L = X \le Z$.
Hence, both the conclusions (I) & (II) follow.

5) 5;
$P \le L = M < X = R \le K < S$. Hence, both the conclusions (I) & (II) follow.

6) 2;
Vowels and consonants given in the word are arranged alternatively, starting with the vowel - Vowels in the reverse alphabetical order and consonants in the alphabetical order.

7) 5;
Some Suns are planets + All planets are satellites =Some suns are satellites

8) 4;
All fishes are birds + All birds are rats = Some rats are fishes

9) 3;
All curtains are rods + No rod is pillow = No curtain is pillow

(10-14): Each word is coded in the following way.

Each word is coded with alphabet in the first place, symbol in the middle and number in the third place.

The number of letters of the given word is represented by the alphabet based on the value of its position in the alphabet. For example, a three letter word is represented by 'C', four letter word by 'D' and so on.

Symbol represents the last letter of the given word. 'T' is represented by '@', 'Y' is represented by '+', 'D' is represented by '#' and 'S' is represented by '$'

Number represents the sum of value of the first letter, as per the alphabetical order, of the given word and '2'. For example, the value of the first letter in 'not' is 14, and that is added to 2 to get 16.

the value of the first letter in 'many' is 13, and that is added to 2 to get 15

10) 1;
'D' stands for the number of letters of the word 'nest'. @ represents the last letter i.e. 'T'. Number represents the value of the first letter i.e, 14 which when added to 2 becomes 16


11) 2;
G stands for number of letters in the word(7), 'Y' is represented by '+'. M(13) +2 = 15

12) 3;
G stands for number of letters in the word(7), 'S' is represented by '$'. I(9) +2 = 11

13) 4;
H stands for number of letters in the word(8), 'D' is represented by '#'. S(19) +2 = 21

14) 3;
E stands for number of letters in the word 'fairy'(5), 'Y' is represented by '+'. F(6) +2 = 8
F stands for number of letters in the word 'tricks'(6), 'S' is represented by '$'.
T(20) + 2 = 22

(15-20):



15) 4; 16) 2; 17) 2;
18) 1; 19) 1; 20) 1.